# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

RNI No. APTEL/2003/12253

**BHAVA VEENA**

Journal of Arts, Literary, Culture & Language Study

Referred Journal & Peer Reviewed Journals

ప్రత్యేక వ్యాస సంకలనం

Vol : 23 | Spl. Issue 2 | February 2026 | BHAVAVEENA | ISSN No. 2456-4702 | RNI No. APTEL/2003/12253

# శతక సాహిత్య వ్యాస మంజరి




ప్రధాన సంపాదకులు :

ఎం. వేణుగోపాల శర్మ

# శతక సాహిత్య వ్యాస మంజరి


**ప్రధాన సంపాదకులు**

## ఎం. వేణుగోపాల్ శర్మ

అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగము

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్.

**ఉప సంపాదకులు**

## డా॥. హెచ్. వామనమూర్తి

అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగము

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్.

**ఉప సంపాదకులు**

## డా॥. ఎం. దేవేంద్ర

అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగము,

వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.




డా॥. హస్తాలపురం వామనమూర్తి
తెలుగు శాఖాధిపతి,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్.


# ముందుమాట

తెలుగు సాహిత్యంలో శతక సాహిత్యానికి ఉన్న ప్రాధాన్యత ఎంతో విశిష్టమైనది. శతక సాహిత్య ప్రక్రియ పద్య భాగానికి సంబంధించినది. శతేన శతకం ప్రోక్తం, అష్టోత్తర శతం పరం, వందగాని 108 గాని శ్లోకాల లేదా పద్యాలకు కూర్పును శతకం అంటాము. రచయిత ఇష్టానుసారం పద్యముల సంఖ్య ఉంటుంది. శతక రచనా విధానంలో సంఖ్యా నియమం, మకుట నియమం మరియు వృత్త నియమం మొదలైన లక్షణాలు కలిగి ఉండి నీతి, శృంగార, భక్తి, వేదాంత శతకాలు ఎన్నో వచ్చినాయి.

కావ్యం కవితలు చెబుతుంది
శతకం సూక్తులు చెబుతుంది

అన్న పెద్దల మాటలను అనుసరించి శతక సాహిత్యం అందరిని సంతోషపెడుతుంది. శతకం అనేది జీవిత అనుభవసారం. ప్రతి శతక పద్యం వెనుక ఒక జీవిత సారం దాగి ఉంటుంది అనటంలో అతిశయోక్తి లేదు. శతకానికి భక్తి తెలుసు, వైరాగ్యం తెలుసు, నీతి తెలుసు, రక్తి, ముక్తి తెలుసు. ఒక్కో పద్యం ఒక్కొక్క విధమైన సందేశాన్ని ఇస్తుంది. అందమైన జీవిత గమనానికి జీవన సారాన్ని అందించేది శతక ప్రక్రియ. శతకాలన్నీ ఒకే మార్గంలో నడవకుండా ఒక్కో పద్యం ఒక్కో విధమైన ప్రబోధాన్ని చేసింది. శతకాలు చాలావరకు మానవునికి జీవన సరళిని నిర్దేశిస్తాయి. ఒక్కో శతకం ఒక్కో నీతిని చెబుతుంది.

నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు
తళుకు బెలుకు రాళ్లుతట్టెడేలా
చాటుపద్యమిలను చాలదా ఒక్కటి
విశ్వదాభిరామ వినురవేమ

వేమన శతకంలోని పద్యాన్ని అనుసరించి, శతక పద్యము, చాటు పద్యములు ఇలా ఏ పద్యానికి ఆ పద్యము తనదైన భావాన్ని అందించడం లోకనీతి. శతకం నీతిని, మానవీయ విలువలను, ధర్మాచరణ, భక్తి నీతి వైరాగ్యాలను సాంస్కృతిక విలువలను, వేదాంత భావాలను మనిషిలో బహిర్గతం చేస్తుంది. శతక పద్యాలు ఒకటిని మించి మరొకటి ఒక అనర్ఘ రత్నంగా వెలుగుతుంది. మనిషిలోని చీకటిని దూరం చేసి శతక పద్యాలు వెలుగును నింపుతాయి.

మానవ వికాసం కోసం, లౌకిక ధర్మం, సమాజ స్థితులను, ధర్మాచరణను నేటి యువతకి, విద్యార్థులకి పాఠకులకి అందరికీ అందించాలన్న సంకల్పంతో శతక సాహిత్యంపై తనకున్న అధ్యయనాభిలాష మిషగా శతక సాహిత్యంలో వచ్చిన అనేక శతకాలపై వివిధ రచయితల చేత అనేక వ్యాసాలను సేకరించి శతక సాహిత్య వ్యాస మంజరి శీర్షికన వ్యాస సంకలనాన్ని తేవడానికి సంకల్పించిన నా ఆత్మీయుడు, నా సహచరుడు వేణుగోపాల శర్మ అభినందనీయుడు. ఈ సంకలనం పుస్తక రూపంలో రావడానికి ఎంతో శ్రమించి, ఈ క్రతువును కార్యరూపంలోకి తేవడం జరిగింది.

శతక సాహిత్య వ్యాస మంజరి.. పేరున భావవీణ ప్రత్యేక వ్యాస సంకలనాన్ని తీసుకురావడానికి చేసిన ప్రయత్నం ప్రశంసనీయం. వివిధ శతకాలలో చెప్పబడిన అనేక విషయాలను, నీతి, భక్తి, వైరాగ్యాలను మానవ జీవన మార్గదర్శనమును చేసి వ్యాసములను అందించిన రచయితలు అందరూ అభినందనీయులు.

నా సహచరుడు, సోదరుడు వేణుగోపాల శర్మ అందించిన ఈ వ్యాస సంకలనం నేటి యువతకు, విద్యార్థులకు అందరికీ మార్గదర్శనం చేస్తుందని, అందరికీ స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నాను.

వామన మూర్తి.

(డా॥. హస్తాలపురం వామనమూర్తి)



డా॥. ఎం. దేవేంద్ర
తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్
వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం
హైదరాబాద్

# ముందుమాట

## వినదగునెవ్వరు చెప్పిన

వినదగునెవ్వరు చెప్పిన, వినినంతన వేగపడక వివరింపదగున్, అని తెలుగునాట మనం చదివిన పద్యాలు మన యొక్క జీవితాన్ని ఏవిధంగా నిర్మాణం చేసుకోవాలో తెలిపేది తెలుగు పద్యము. అందులో శతక పద్యాలకు ఉన్న ప్రత్యేకత అంతా ఇంతా కాదు. శతకములోని ప్రతీ పద్యము మనకు ఒక్కొక్క నీతిని, జీవిత అనుభవాన్ని ప్రభోదిస్తుంది. భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను ప్రబోధించడానికి శతకమును మించిన ప్రక్రియ లేదు. పారమార్థిక సత్యాలను ప్రకటించడం శతకం ప్రత్యేకత. శతక సాహిత్యాన్ని పరిశీలించినపుడు శతకము యొక్క మూలాలు వైదిక సాహిత్యములో సంస్కృత సాహిత్యములో కనిపిస్తాయి. వేదాల్లో కనిపించే దేవతా స్తుతులలో వర్ణనలో శతక లక్షణాలు కనిపిస్తాయి. ఒకే విధమైన ఛందస్సును ఉపయోగించటం, మకుట నియమాన్ని పాటించడం శతక లక్షణం.

తెలుగులో భక్తి, నీతి, అధిక్షేప, తాత్విక, పారమార్థిక, హాస్య, వేదాంత, సామాజిక శతకాలుగా వెలువడినాయి. శతక ప్రక్రియ ప్రారంభం భక్తి శతకాల రూపంలో జరిగింది. శతకం ఏ రూపంలో వచ్చినా అది సామాజిక మార్పు తేవటం దాని ప్రధాన లక్షణం. శతకము వెలువడిన కాలము ఎప్పుడైననూ సమాజంలో అది అప్పటి స్తితిగతులను సమన్వయం చేస్తుంది. ఇది కేవలం శతక ప్రక్రియకు మాత్రమె సాధ్యపడే అంశము. తెలుగులో వెలువడిన వివధ శతకాల పైన అనేక వ్యాసాలను సేకరించి, పుస్తక రూపంలో వెలువరించడం అభినందనీయము.

మిత్రుడు మరియు నా పరిశోధక విద్యార్థి ఎం. వేణుగోపాల్ శర్మ తలపెట్టిన వ్యాస సంకలనం భావవీణ ప్రచురణ సంస్థ ద్వారా అక్షర రూపములోకి రావటం సంతోషించదగినది. ఈ ప్రయత్నములో సహకరించిన వ్యాస రచయితలందరికీ అభినందనలు.

M.Devendra

(డా॥. ఎం. దేవేంద్ర)




**ఎం. వేణుగోపాల్ శర్మ**
తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్.
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్.


# కృతజ్ఞతలు


నాకు జన్మనిచ్చి అక్షర జ్ఞానాన్ని అందించిన జననీ జనకులు జయలక్ష్మీ హనుమండ్లు శర్మ గార్లకు మరియు, ప్రోత్సహించిన నా అగ్రజుడు మెంగారం పవన్ కుమార్ గారి పాద పద్మములకు నమస్సులు.

తెలుగు సాహిత్య చరిత్ర 11 వ శతాబ్దము నుండి నేటి వరకు ఎన్నో ప్రక్రియలుగా, శాఖోపశాఖలుగా విస్తరించి, తెలుగు భాషా సంస్కృతులను సుసంపన్నము చేసినది. తెలుగు భాషకు పట్టం కట్టి పాశ్చాత్యుల చేత ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని ప్రశంసలు పొంది, మన ఉనికి నలుదిశలా వ్యాప్తి చెందినది. ఇటువంటి ప్రక్రియలలో ఒకటి అయిన శతక సాహిత్యము అనాది నుండి నేటి వరకు పండితుల నుండి పామరుల వరకు అందరినీ అలరించి, పరిపూర్ణమైన వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేసింది. తెలుగునాట శతక పద్యాలను తెలియని వారు ఉండరని అంటే అతిశయోక్తి కాదేమో. అయినను తెలుగులో శతక సాహిత్యము పైన పరిశోధనలు కొంత వరకు మాత్రమే జరిగాయి. ఇంకనూ పరిశోధనలు జరగవలసిన అవసరమున్నది. విద్యార్థుల సంపూర్ణ మానసిక వికాసానికి మూలమైన శతక సాహిత్యముపై వ్యాస సంపుటిని వెలువరించాలని తలచితిని. ఈ వ్యాస సంకలనములో నాకు సలహాలనిచ్చి సహకరించిన నా పిహెచ్.డి. పర్యవేక్షకులు డా॥. ఎం. దేవేంద్ర గారు, మా కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ హుస్సేన్ గారికి, మా కళాశాల తెలుగు శాఖాధిపతి డా॥. హెచ్. వామనమూర్తి గారికి, ఈ సంపుటి వెలువరించడానికి తగిన సలహాల నిచ్చి దిశానిర్దేశం చేసిన సంగారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్ డా॥. జి. శ్రీనివాసరావు గారికి, నాగర్ కర్నూల్ జిల్లా పాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు ఉపన్యాసకులు జి. రమేష్ గారికి మరియు నా మిత్రులు డా॥. శరత్ రెడ్డి గారికి, డా॥. సి. చంద్రశేఖర్ గారికి, డా॥. అరుంధతి గారికి, డా॥. జ్ఞానానందం గారికి, డా॥. సుధాకర్ గారికి ధన్యవాదాలు. వ్యాసాలు అందించిన మిత్రులకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు.

ఈ సంకలనము వెలువరించడానికి అనుమతించి సహకరించిన భావవీణ సంపాదక మండలికి నా యొక్క వినమ్ర పూర్వక ధన్యవాదాలు.




(ఎం. వేణుగోపాల్ శర్మ)

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# భావవీణ

(కళలు - సాహిత్య - సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253



# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522 034.
Mail : bhavaveena2024@gmail.com
Cell : 99499 29674, 79890 88274.

**BHAVAVEENA**
(SPECIAL MAGAZINE)
Journal - Arts, Literature, Culture and Language Study

Reffered Journal & Peer Reviewed Journals
ISSN No. : 2456-4702
RNI No. : APTEL/2003/12253

| | | |
|---|---|---|
| ముద్రణ | : | **ఫిబ్రవరి - 2026** |
| ప్రతులు | : | **500** |
| వెల | : | **రూ. 15/-** |
| కాపీలకు | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| గమనిక | : | **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.** |
| ఎడిటోరియల్ చిరునామా | : | **డి. నెం. 135-14-716, 12వ లైన్, ద్వారకా నగర్, నగరాలు, గుంటూరు - 034.** |
| డి.టి.పి & ప్రింటింగ్ | : | **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్ గుంటూరు జిల్లా, సెల్ : 94 94 660 509.** |

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

***Founder :***
Kolla Sri Krishnarao (Late)

***E-mail :***
bhavaveena2024@gmail.com

7989781963
9949929674
7989088274

# 135-14-716, Dwaraka Nagar,
12th Lane, Nagaralu, Guntur - 522034.

**Vol. 23 - Spl. Issue. 02 - February 2026 - Reffered Journal & Peer Reviewed Journals - Rs. : 15/-**
**| ISSN No. : 2456-4702 | RNI No. : APTEL/2003/12253 |**

**EDITORIAL BOARD**

*Honourable Editor*
**Dr. PITTA SANTHI**
*M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),Ph.D.*

*Chief Editor*
**Dr. PAYARDA NAGAIAH**
*M.A.(Tel), M.A(Pol-Sci).,M.Ed.,Ph.D.*
# 135-14-716, Dwaraka Nagar, 12th Lane, Nagaralu, Guntur - 522034.

**ADVISORY COMMITTEE**

1. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Former Vice Chancellor,
Dravidian University, Kuppam, A.P.

2. **Prof. G. Yohan Babu,** (Rtd.) M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.

3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.

4. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Hyderabad Central University, Hydetabad, Telangana.

5. **Dr. Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.

6. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD, Dept. of Telugu
Sri A.S.N.M. Govt. Degree College,
Palakollu, West Godavari Dist., A.P.

7. **Prof. T. Rama Prasad Reddy**
Dean, Faculty of Arts & Education,
Yogi Vemana University, Kadapa, Andhra Pradesh.

8. **Dr. T. Swarupa Rani,** M.Sc., M.Ed., M. Phil., Ph.D.
Principal,
St.Joseph's College of Education for Women,
Sambasivapet, Guntur, Andhra Pradesh.

**ASSOCIATE EDITORS**

1. **Prof. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.

2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI,
Tamilnadu.

3. **Dr. D. SESHU BABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.

4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.

5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.

6. **Dr. CHINTHAM PRAVEEN KUMAR**
HOD, Dept of Telugu
University Arts & Science College (UASC),
Kakatiya University Subedari - 506001
Hanumakonda,Warangal, Telangna.

7. **Prof. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Prof. N. Eswar Reddy,** M.A., PhD.
Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
University of Hyderabad, Gachibowli - 46,
Hyderabad, Telangana.

11. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu
Central University, Gachibowli, Hyderabad,
Telangana.

12. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Associate Professor, Dept. of Telugu
P.G. Centre, Gadwal,
Palamuru University,
Mahabobnagar, Telangana.

**LEGAL ADVISER**

**Pitta Sundara Babu**, ***M.A., B.L.,***
Advocate, Narasapur.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, Guntur - 2. Cell : 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed and Published by Dr. Pitta Santhi, Rohini Towers, 2/11 Brodipet, Guntur - 522 002,
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963, E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | శ్రీకాకుళ శ్రీహరి శతక వైభవము | - డా॥. నందవరం మృదుల | 1 |
| 2. | ఆంధ్రనాయక శతకము - వస్తు విశ్లేషణ | - డా॥. ఎం.దేవేంద్ర | 6 |
| 3. | గోశిక నరహరి నవయుగ పద్మశాలి శతకం - సామాజిక దృక్పథం | - డా॥. యన్. అరుంధతి | 10 |
| 4. | పరిపూర్ణ గ్రామ చరితం - పాలెం వేంకటేశ శతకం | - డా॥. యస్. మహేందర్ | 15 |
| 5. | ఆరుద్ర వెలికి తీసిన "వేమన" వాదం | - డా॥. రావిరాల లక్ష్మీకాంతం | 19 |
| 6. | శతక సాహిత్యంలో - భక్తి శతకాలలో వస్తు వైవిధ్యం | - డా॥. కే. పద్మారాణి | 28 |
| 7. | వేమన శతక పద్యాలలో వ్యక్తిత్వ వికాసం - పరిశీలన | - డా॥. డి. లక్ష్మి నరసింహం | 32 |
| 8. | శతక సాహిత్యానికి మార్గదర్శి ధర్మపురి శేషప్ప కవి | - డా॥. వామనమూర్తి | 35 |
| 9. | వేమన పద్యాలు - మానవతా విలువలు | - డా॥. ఏ. వెంకట ప్రసాదు | 39 |
| 10. | శతక సాహిత్యంలో పొడుపు కథలు | - ఎం. వేణుగోపాల్ శర్మ | 43 |
| 11. | కుసుమ ధర్మన్న హరిజన శతకము - సామాజిక జీవన చిత్రణ | - డా॥. పేరాల జ్ఞానానందం | 47 |
| 12. | కాళహస్తీశ్వర శతకం - ఒక విశ్లేషణ | - డా॥. బకరం నర్సింహ | 50 |
| 13. | సుమతీ శతకము - సమకాలీన అధ్యయన ఆవశ్యకత | - డా॥. రాఘవేంద్రరావు | 55 |
| 14. | దాశరథి శతకము - భక్తితత్త్వం | - జి. రమేష్ | 61 |
| 15. | శ్రీ వీరభద్ర శతకము - సమకాలీన అంశాలు | - విట్టం ధనంజయ | 65 |
| 16. | దోరవేటి సాంబశివ శరణం శతకం-సామాజిక దృక్పథం | - డి. రాజు | 70 |
| 17. | శతక సాహిత్యంలో - భక్తి శతకాలు | - నీరడి మాధవి | 76 |
| 18. | నాగర్ కర్నూల్ జిల్లా శతక సాహిత్యం - నీతి శతకాల పరిశీలన | - ఆవుల సైదులు | 81 |
| 19. | భాస్కర శతకం బోధనా సంబంధ దృష్టాంత నీతి | - ఎస్. పవిత్ర | 86 |

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# శ్రీకాకుళ శ్రీహరి శతక వైభవము



– డా॥. నందవరం మృదుల
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖాధ్యక్షులు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్), బేగంపేట, హైదరాబాద్.

**ఉపోద్ఘాతం**

భగవత్తత్త్వాన్ని ప్రతిపాదించడానికి తొలి అడుగులు వేసిన 'శతక' ప్రక్రియ కాలక్రమంలో అనేక అంశాలను స్పృశిస్తూ విశ్వరూపాన్ని ప్రదర్శించింది. సుమతీ శతకం, వేమన శతకం, భాస్కర శతకం మొదలైనవి సమాజానికి దర్పణం పడితే, వృషాధిపశతకం, కృష్ణశతకం, నృసింహ శతకం, ఇత్యాదులు భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను అందిస్తూనే సమాజానికి మార్గనిర్దేశం చేసాయి. ఈ కోవకు చెందినదే 'శ్రీకాకుళ శ్రీహరి శతకము'.

ఇది అజ్ఞాత కవి రచన. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తాళపత్ర గ్రంథాలను సేకరించి, పరిశీలించి, పరిష్కరించిన గ్రంథమిది. ఆకృతిలో చిన్నదైనా శ్రీప్రభాకరశాస్త్రి గారి పీఠికతో ఈ శతకానికి ప్రౌఢత్వం అలవడింది. ఆంధ్రాధీశుడు, తెలుగురాయడు అని పేరుగాంచిన శ్రీకాకుళేశుని ప్రాభవాన్ని వర్ణించే దివ్యగ్రంథమిది. కృష్ణానది ఒడ్డున వెలసిన దైవం శ్రీకాకుళాంధ్ర విష్ణువు. ఈ స్వామియే 'ఆంధ్ర విష్ణువు' అని ప్రసిద్ధి. కాసుల పురుషోత్తమ కవి ఆంధ్ర మహావిష్ణువునే నాయకునిగా చేసుకొని ఆంధ్ర నాయక శతకాన్ని రచించారు. విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయలు తమ 'ఆముక్తమాల్యద'లో ఈ శ్రీకాకుళాంధ్రవిష్ణువునే ప్రస్తావించారు.

"తిరుపతికీ దివిసీమలోని శ్రీకాకుళానికీ చాలా పోలికలున్నాయి. రెండూ దివ్యతీర్థక్షేత్రములే. ఒకటి కలియుగ వైకుంఠమైతే, మరొకటి ప్రత్యక్ష పరమ పదము" (పీఠిక-xii) అని ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారు అంటారు.

'భగవద్ధ్యానముక్తావళి' అనే స్తోత్రరాజాన్ని గూర్చి ప్రోలిపెద్ది వేంకటరామశర్మ "ఇది విశిష్టాద్వైత మత ప్రవర్తక ప్రవరులయి ప్రఖ్యాతులయిన వేదాంత దేశికుల వారి కుమారులు వరద దేశికులు శ్రీకాకుళ దివ్యక్షేత్రమునకు విచ్చేసి స్వామిని దర్శించిన సమయాన రచియించిన స్తోత్రరత్నము. వీరిప్పటికి నాఱువందల యఱువది యేండ్లకు బూర్వమున్నవారు" (పీఠిక-xiii) ఈ మాటలను బట్టి ఈ క్షేత్రము క్రీ.శ.13వ శతాబ్దికే బహుళ ప్రాచుర్యములో ఉన్నదని చెప్పవచ్చు.

అంతటి దివ్యక్షేత్రమును, దైవమును కీర్తిస్తూ రచించిన 'శ్రీకాకుళ శ్రీహరిశతకము'ను తిరుమల తిరుపతి దేవస్థానం పక్షాన శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం ముద్రించింది. ప్రభాకరశాస్త్రిగారు పీఠికలో 'శ్రీకాకుళ క్షేత్రము'ను గూర్చి భాషావ్యాకరణ పురాణేతిహాస శాసన పురాతత్త్వ చారిత్రకాధారాలలోని కథనాలను సమీక్షిస్తూ

సాహిత్య సామాజికాంశాలను స్పృశించి సమన్వయం చేసిన తీరు నేటి పరిశోధకులకు చక్కని దిక్సూచి.

13వ శతాబ్దికి చెందిన కేయూరబాహుచరిత్రలో శ్రీకాకుళేశ్వరుని ప్రస్తావన ఉంది. 15వ శతాబ్దికి చెందిన భోజరాజీయం రచించిన అనంతామాత్యుడి తండ్రి ముమ్మడి తిక్కన కాలంలోనూ శ్రీకాకుళేశ్వరుడు గొప్పగా పూజలు అందుకున్నాడు. "శ్రీకృష్ణదేవరాయడు కళింగదేశ విజిగీషను దండు వెడలి విజయవాడలో గొంత కాలముండెను. అప్పుడు శ్రీకాకుళక్షేత్రమునకు వచ్చి యాంధ్రనాయక స్వామి కైంకర్యము జరిపి శాసనమొకటి చెక్కించినాడు. ఆ శాసనమిది - "హరేర్లీలా వరాహస్య దంష్ట్రా దండస్సపాతునః హేమాద్రి కలశాయత్ర ధాత్రీ ఛత్రశ్రియందధౌ॥ స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శకవర్షంబులు 1440 అగు నేటి బహుధాన్య నామ సంవత్సరం ఫాల్గుణ శుద్ధ॥ శుక్రవారం శ్రీకాకుళపు తెలుంగురాయలకు శ్రీమన్మహాధిరాజాధిరాజ రాజ పరమేశ్వర శ్రీవీరప్రతాప కృష్ణదేవరాయలుంగారు దణ్ణం సమర్పించి యిచ్చిన ధర్మశాసనము. స్వామిని కుంభ సంక్రమణ పుణ్యకాలమందున దర్శించి కొండపల్లి సీమ కుంజేరి వచ్చిన దేవరపుంగోట స్థలం లోపలి యేర్లగడ్డ గ్రామం ఒకటిన్ని మేడూరు స్థలం లోపలి లంకపల్లి గ్రామం ఒకటిన్ని శ్రీకాకుళానుస్వామి ప్రతిగ్రహలబ్ధమయిన సత్రాలభూమి తోటలు, నిత్యావసరాలు, శ్రీరామానుజ కూటము, ద్వాదశులు, సహితమయిన భూమిన్ని, కొత్తలంక, చింతల్లంక, ఉండ్రపలంక, పిరాట్లంక, పురుగుడులంక, క్రోసూరు, నంజెల్లి వచ్చిన కంభాల దొడ్డిన్ని, కొండవీటి సీమలోని పెదగాడివట్టున్ను, విని కొండ సీమలోని కారుమంచిన్నీ, స్వామి సన్నిధిని ధారా పూర్వకముగాను స్వామి నిత్యనైవేద్యాలకున్ను అంగరంగ వైభవాలకున్ను యెడమడవక జరుగుటకై శ్రీకాకుళుని తెలుంగు వల్లభునికి సమర్పిస్తిమి గనుక ఆచంద్ర స్థాయి గాను అవధరించేది.... ఈ అయిదు గ్రామదులున్ను శ్రీవల్లభునికి సమర్పించి యీ అయిదు గ్రామాదులలో యిందువల్లను వచ్చిన నిత్యనైవేద్యం కట్టడి దధ్యోజనం పళ్యాలు 4, అలంకార ప్రసాదం పళ్యాలు 4, అప్పాలు 26, పళ్ళెం 1కి అతి రసాలు పళ్ళెం 1 వడల పళ్ళెం 1, ఇడ్డెన కుడుములు, పప్పుకూరలు, నెయ్యి, పచ్చళ్ళు.... ఆరగించే పళ్యాలు 60న్ని అనవ్రాల ప్రసార ప్రసాద పళ్యాలు 2 వెరశి ఆరగించే పళ్యాలు 14 ఇంటికి పళ్ళెం వారి అమృతపడిని" (xix-xx)అని శ్రీకృష్ణదేవ రాయలు శాసనం వేయించారు. ఈ శాసనం స్వామివారి వైభవాన్ని, ప్రాశస్త్యాన్ని తెలియజేస్తుంది.

శ్రీకృష్ణదేవరాయల వారి అస్థాన విద్వాంసుడు, బహుగ్రంథకర్త అయిన లొల్ల లక్ష్మీధర పండితుడు ఒక శాసనములో శ్రీకాకుళాంధ్ర నాయకస్వామిని

శ్లో॥ ఉరసి నిహితలక్ష్మీ బాహువల్లీ యుగేన
స్వకర యుగళమేకీకృత కేళీవినోదే
కువలయదళదామా నద్ధ మందారమాలాం
దధిదివ వితనోతు శ్రీకళాం కాకులేశః అని
వర్ణిస్తాడు. (పీఠిక XX)

ఇప్పటికీ లక్ష్మీధర పండితుని వంశస్తులు కృష్ణానదికి ఆవల తీరంలో ఉన్నారు. శ్రీకృష్ణదేవరాయల కాలం వరకు ఈ శ్రీకాకుళక్షేత్రము మహోన్నత దశను పొందింది. ఆంధ్ర నాయకస్వామి నిత్యకైంకర్యాలకు వార్షికోత్సవాలకు అనేక అనర్ఘరత్నాభరణాలు సమర్పించినట్లు శాసనాల వలన తెలుస్తున్నది.

ఇంతటి ప్రాభవము సంతరించుకున్న శ్రీకాకుళేశ్వరుని స్తుతిస్తూ అజ్ఞాతకవి రచించిన శ్రీకాకుళ శ్రీహరిశతకాన్ని పరిశీలించినట్లయితే రెండు అంశాలు పఠితలను ఆకట్టు కుంటాయి.

1. భక్త్యాదులు
2. భాషాదులు

**1. భక్త్యాదులు :**

భక్తిని ఎన్ని విధాలుగా అనుభవించవచ్చునో అన్ని విధములుగా అనుభవించి పలవరించిన అంశాలు అనేకం, మనకు ఈ శతకంలో కనిపిస్తాయి.

**2. భాషాదులు :**

కావ్యంలో భక్తితోపాటు రచనాశైలిని కూడా కవి ప్రత్యేకంగా ప్రదర్శిస్తారు. ఇది కవిలోని కావ్యభాషా పాండిత్యాన్ని తెలియజేస్తాయి.

**1.1. భక్తితత్త్వం** : భక్తుడు భగవంతుని దేనికోసం ప్రార్థించాలో అత్యంత సులభశైలిలో కవి తెలుపుతాడు.

శా॥ స్వామీ! నీ చరణంబులాన నికిలావస్థాదిశాల ని
స్సమోన్మేష భవత్పదాబ్జయుగళీచింతా సుధాపాన భ
క్త్యామోదంబునకన్న వేఱొకటి మే మాసింప మేనాటికి
న్నేమైన న్నిది మా వ్రతంబు ఫణిశాయీ! కాకుళ శ్రీహరి (ప. 72)

అని భగవంతుని పాదాల ధ్యాస తప్ప మరొక ధ్యాస లేని వానిగా జేయమని శ్రీకాకుళ శ్రీహరిని కవి ప్రార్థిస్తున్నాడు.

**1.2. శివకేశవ అభేదము** : ఎందులోనూ, ఎవరిలోనూ అభేదము పాటించకపోవడమే నిజమైన భగవదారాధన. ఆ బ్రహ్మ పిపీలికము భగదవంతుని తన సృష్టిని కాపాడు కోడానికి తన శక్తినే ఒక్కొక్కప్పుడు, ఒక్కొక్క విధంగా ప్రకటిస్తాడు. 'శ్రీవిష్ణురూపాయ నమశ్శివాయ' - అన్న భావాన్ని తెలుపుతున్నట్లుగా...

మ॥ పరమానంద విశేషకందము మహాభాగ్యైక మూలంబు దు
స్తర సంసార మహానదీతరణి దోషధ్వాంత సంక్రాంతి భా
స్కర భాను ప్రళయంబు దివ్యముని వాచా వైఖరీ వాహినీ
శరధిస్థానము నీ మహామహిమ మీశా! కాకుళ శ్రీహరీ! (ప. 32)

సంసారమనే మహానది దాటడానికి అభేదాత్మకమైన భక్తి ఒక వంతెన వంటిదని పద్యంలో కవి ప్రకటిస్తాడు.

**1.3. నామస్మరణ** : శ్రీహరినామస్మరణ వలన కలిగే ఫలాన్ని కవి తెలియజేస్తూ

మ॥ హరినామస్మరణ ప్రభావమున నెంతైనన్ మహాపాప సం
హరణంబౌనని నమ్మియుండితి దదన్యంబైన సంసారని
స్తరణోపాయము లేదనే నిగమముల్ సత్యంబనే యుంటి నీ
మరుగే చొచ్చితి దోసి లొగ్గితిని రామా! కాకుళ శ్రీహరీ! (ప. 95)

అనే పద్యంలో హరినామాన్ని నిరంతరం స్మరణ చేయడం వల్ల గతములో తెలియక చేసిన పాపములు ప్రక్షాళన అవుతాయని చెపుతూ ఆ నామస్మరణ, పాపకార్యం చేయకుండా మనల్ని కాపాడుతుందనే భావాన్ని కవి నిక్షిప్తం చేసాడు.

**1.4. మంగళాత్మకము** : విష్ణువు యొక్క సర్వసంపద లకు, ఆయన గుణములకు మంగళములు తెలుపుతూ రచించిన పద్యములు అద్భుతము.

శా॥ నీకున్ నీ పరమాయుధ ప్రతతికిన్ నీ వాహన శ్రేణికిన్
నీకాంతామణికిన్ నిజాత్మజులకున్ నిత్యశ్రి పాద్భూతికిన్
నీ కల్యాణగుణ ప్రపంచమునకున్ నీ యేక పాద్భూతికిన్
సాకల్యంబుగ మేలు గోరెదను గృష్ణా! కాకుళ శ్రీహరీ! (ప. 88)

శా॥ నీ కారుణ్యరస ప్రవాహమునకున్ నీ యోగసంపత్తికిన్
నీ కళ్యాణమహోన్నతాకృతికి నీ నిత్యోజ్జ్వల శ్రీకి నీ
ప్రాకారాలయ గోపురాదులకు నీ భక్తవ్రజస్ఫూర్తికిన్
నా కోర్కుల్ ఫలియించి మేల్గలుగు గృష్ణా! కాకుళ శ్రీహరీ! (ప. 89)

అని శ్రీహరి పంచాయుధాలకు, వాహన, కాంత, పుత్రాదులకు మేలు కలగాలని కవి ప్రార్థించాడు. అవన్నీ క్షేమంగా ఉంటేనే కదా! సకల ప్రాణికోటి క్షేమంగా ఉండేది.

**1.5. వందనము** : కావ్యాంతంలో శ్రీకాకుళశ్రీహరికి నమస్కారములు తెలుపుతూ-

శా॥ కారుణ్యార్ణవ! నీ వృషాద్రికి నమస్కారంబు నీ గోపుర

ద్వారాగార విమాన సౌధములకున్ 'దండంబు', పీదసం
చారోద్యాన విశాలభూములకు 'సాష్టాంగంబు', నీ దివ్యతూ
ర్యారావంబులకున్ 'జోహారు' రఘువర్యా! కాకుళశ్రీహరీ! (ప. 101)

ఆయన ఉన్న కొండకు, గోపురానికి, ఆయన తిరుగాడే ఉద్యానవనాలకు, ఆయనకు వినిపించేసే సంగీత వాద్యాలకు సాష్టాంగ నమస్కారములు కవి తెలుపుతాడు. శ్రీనివాసునిపై భక్తితో తరిగొండ వెంగమాంబ రచించిన ముత్యాలహారతిని గుర్తుచేస్తున్నది ఈ పద్యం.

ఈ విధంగా భక్త్యాంశాలను ఎంత అద్భుతంగా కవి తెలియజేస్తాడో భాషావిషయాలలో కూడా తన ప్రతిభను చాటుకుంటాడు.

**2.1. సంబోధనాత్మక పద్యం**

సీ॥ శ్రీరామా! హరి! వాసుదేవ! పరమా! శ్రీనాథ నారాయణా!
కారుణ్యార్ణవ! పుండరీక వరదా! కంజాక్ష! దుర్దోషకాం
తారక్రూరకుఠార! దాసజనసంత్రాణైక సౌశీల్య! దై
త్యారీ! పాండవదూత! కృష్ణ! రఘువర్యా! కాకుళ శ్రీహరీ! (ప. 8)

అని సంబోధనలతో శ్రీహరిని కీర్తిస్తాడు కవి. ఈ పద్యాన్ని ఒక్కటి నిరంతరం చదివినా భగవన్నామ స్మరణ జరుగుతుందని కవి భావించి ఉండవచ్చు. తొలి పద్యాన్నే కవి, మనందరికీ అద్భుతంగా ఇచ్చాడు.

**2.2. సంస్కృత సమాసభూయిష్ఠము :** ఈ కావ్యంలో సంస్కృత సమాసాలతో తనివితీరా రచించిన పద్యములనేకం ఉంటాయి. ఉదాహరణ:

మ॥ దురితాటోపవిపాటనంబు దివిజస్తో మానవాబ్జాత భా
స్కర నిర్వ్యాథకరప్రచారము విపత్కాంతార విచ్ఛేదని
ష్ఠుర నిస్త్రింశకుఠారధార నిగమస్తోత్రైకపాత్రంబు నీ
చరితంబార్తజనైక జీవితము యీశా! కాకుళశ్రీహరీ! (ప. 27)

అని శ్రీకాకుళ శ్రీహరి శతకము యొక్క గొప్పదనాన్ని సుదీర్ఘ సమాసాలతో కవి వర్ణిస్తాడు.

**2.3. తెలుగు నుడికారము :** తెలుగుదనం ఉట్టిపడే రచన చేయడం కవి ప్రత్యేకత.

శా॥ స్వామీ! సర్వదయాపరుండవట నీసౌలభ్య మేమయ్యెనో?
నా మాటల్ చెవి నాటవో వివిధ నానా మౌని బృందారక
స్తోమ స్తోత్ర మహార్భటిన్ వినవొ నా దుష్కర్మమో కాకని
న్నేమందున్ జగదేకరక్షకుని దండ్రీ! కాకుళ శ్రీహరీ! (ప. 11)

అని స్వామితో మాట్లాడుతున్నట్లుగానే, వ్యంగ్యార్థములతోను, ఆత్మనిందతోనూ కవి రచన చేయడం, వ్యావహారిక నుడికి దగ్గరగా ఉన్నది. స్తోత్రం అంటే భక్తుడు భగవంతునితో మాట్లాడడమేనన్న మూలభావాన్ని కవి మనకు గుర్తుచేస్తున్నాడు.

**2.4. కరుణము :** భక్తుని బాధను తన బాధగా చేసుకొని కవి కరుణరసముప్పొంగే విధంగా రచించాడు.

శా॥ బ్రారబ్ధానుభవంబు తప్పదని యిబ్బంగిన్ దురంతవ్యధా
వారాశిన్ మునిగింప జెల్లునె దయవారాశివౌ నీకు నీ
కారుణ్యంబును దాసభూతులయెడన్ గాఢ ప్రతిజ్ఞాభయ
శ్రీరూఢోన్నతియున్ దలంపువుగ తండ్రీ! కాకుళ శ్రీహరీ! (ప. 90)

'ప్రారబ్ధకర్మలు అనుభవించవలసిందేనని భక్తుని బాధలతోనే ఉంచడం తగునా? నీవు దయ అనే సముద్రుడివికదా! ఆ సముద్ర జలాలతో భక్తుని బాధను తొలగింపజేయవచ్చుకదా!' అనే భావనను కరుణ రసాత్మకంగా కవి రచిస్తాడు.

**2.5. ఛందస్సు :** ఈ శతకంలోని కవి శార్దూల మత్తేభ ఛందస్సులను మాత్రమే ప్రయోగించాడు. శ్రీహరి ధనుస్సు శార్ఙ్గమును స్ఫురింపజేసే విధంగా శార్దూల వృత్తము, శ్రీహరి కరుణను పొందిన గజేంద్రుని స్ఫురింపజేసే విధంగా మత్తేభ వృత్తమును ప్రయోగించాడు కవి.

ఈ రెండు ఛందస్సులో కవి నిర్మించిన పద్యాలు నామ సవర్థక్యం చెందాయని చెప్పవచ్చు.

ఈ విధంగా శ్రీకాకుళ శ్రీహరిశతకము ఎంత భక్తి భావన ఉన్నదో అంతకు సమతూకంగా భాషావైభవం కూడా కనిపిస్తుంది. ప్రత్యేక ఛందస్సులు, తెలుగు నుడికారము, సంస్కృత సమాసాలు, వ్యంగ్యము, చమత్కారము రసము, ధ్వని మొదలైనవన్నీ ఒక్కొక్క పద్యమూ ప్రేమతో పఠించే కొలదీ మనకు స్ఫురిస్తాయి.

అజ్ఞాతకవి కలమునుండి వెలువడిన ఈ శతకము శతపత్ర పుష్పమై భక్తిపరిమళాలను వెదజల్లుతూ పఠితలను భక్తి భ్రమరాలుగా చేస్తుంది.

**ఉపయుక్త గ్రంథసూచి :**


1. ప్రభాకరశాస్త్రి, వేటూరి (పరిష్కర్త). శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయ పీఠం; తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి - 2016
2. గోపాలకృష్ణారావు, కె. ఆంధ్ర శతక వాఙ్మయము, ప్రపంచ తెలుగు మహాసభ ప్రచురణ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్-1975
3. ప్రభాకరరావు, కడియాల (సంకలనం). శతకషట్కము (తాత్పర్యసహితము), ఉదయ్ ప్రింటర్స్, హైదరాబాదు-2024
4. ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం - 12వ సంపుటం - తెలుగు అకాడమీ, హైదరాబాద్ - 1998
5. శ్రీరంగాచార్య, తెలుగు చాటువులు, ప్రపంచ తెలుగు మహాసభలు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు-2012


❖❖❖

Vol. 23 | Spl. Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study



# ఆంధ్రనాయక శతకము - వస్తు విశ్లేషణ

- డా॥. ఎం. దేవేంద్ర

తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**పరిచయం :**

తెలుగు శతక సాహిత్య చరిత్రలో విశిష్టమైన పేరు కలిగిన వారిలో కాసుల పురుషోత్తమ కవిఒకరు. క్రీస్తుశకం 1800 ప్రాంతానికి చెందిన వాడు. వీరు 1791లో కృష్ణా జిల్లా దేవరకోట రాజైన అంకినీడు బహదూర్ వారి వద్ద ఆస్థాన కవిగా పనిచేశారు. విజయనగర సామ్రాజ్య కాలంలో ఒక వెలుగు వెలిగిన శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు ఆలయం విజయనగర సామ్రాజ్యపరిపాలనానంతరం ఆలయ శోభ క్రమంగా తగ్గ సాగింది. ఈ ఆలయము పూజా పునస్కారాలు శూన్యమైపోయి, దీనమైన పరిస్థితులలో ఉండడం చూసి సాక్షాత్ భగవత్ స్వరూపుడికే ఈ విపరీతమైన పరిస్థితి చూసి తట్టుకోలేక పోయారుకాసుల పురుషోత్తమ కవి. ఈ ఆలయ నిత్యోత్సవాల కోసం శ్రీకృష్ణ దేవరాయలు ఐదు గ్రామాలను బహుకరించారట. అంతటి వైభవం కోల్పోవటం రచయితను బాధించింది.

ఆలయ ప్రభావం తగ్గడం చూసి మనసు చలించిన కాసుల పురుషోత్తమ కవి శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువుతో మొరపెట్టుకుంటూ, వ్యాజస్తుతిగా ఆంధ్ర నాయక శతకాన్ని రచించారట. ఇది విన్న అప్పటి జమీందారు మళ్లీ ఆలయాన్ని పునరుద్ధరించారని చెప్పుకుంటారు. ఈ శతకము సీస పద్యాలతో రచింపబడింది. కవి అత్యంత ప్రతిభా సంపన్నుడు కనుక శతక రచనలో అద్భుతమైన ధార కనిపిస్తుంది. ఈ శతకంలోని 108 పద్యాలను శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు ఆలయ ప్రాంగణంలో శిలాశాసన రూపంలో భద్రపరిచారట.

**ఆలయ ప్రశస్తి :**

ఒకనాటి ఆంధ్రుల తొలి రాజధాని, ఇప్పటి కృష్ణా జిల్లాలో ఉన్న శ్రీకాకుళంలో ఉన్న ఈ ఆలయం చారిత్రక నేపథ్యాన్ని కలిగి ఉన్నది. శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు తెలుగు రాయుడిగా, శ్రీకాకుళాంధ్ర దేవునిగా పిలవ బడుతున్నాడు. ఈ విధంగా ఒక జాతి పేరుతో దైవం ఉన్నట్టు మరెక్కడా కనిపించదు వినిపించదు. శ్రీకృష్ణదేవ రాయలు ఒక యుద్ధానికి వెళుతూ ఈ ఆలయంలో బస చేసినట్టు కథ ఉంది. అదే రోజు రాత్రి కలలో శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు రాయలవారితో ఆముక్త మాల్యద కావ్యాన్ని రచించమని కోరినట్టు రాయలు చెప్పుకున్నారు. ఈ కారణంతోనే ఆముక్తమాల్యద రాయల వారు రచించారు. ఇంతటి చారిత్రక నేపథ్యాన్ని కలిగి యున్న శ్రీకాకుళాంధ్ర మహా విష్ణువు యొక్క ఆలయం ప్రభావం తగ్గటం చూసిన కాసుల పురుషోత్తమ కవి స్వామివారితో ఆలయాన్ని పునరుద్ధరించమని మొర పెట్టుకుంటూ నిందాస్తుతితో ఈ శతక రచన కొన సాగించిరి. తెలుగు సాహిత్య చరిత్రలో నిందాస్తుతి శతకముగా ఒక ప్రత్యేకతను సంతరించుకొని ఉంది.

ఈ వ్యాసములో శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువుతో కాసుల పురుషోత్తమ కవి ఆలయాన్ని పునరుద్ధరించమని

వేడుకొన్న కొన్ని పద్యాలను ఇక్కడ పరిశీలించెదను. ఈ శతకములో అర్థాంతరన్యాసాలంకారము చక్కగా ప్రయోగించిరి. చమత్కారము మరియు వ్యంగ్యము ఈ శతకములో అద్భుతంగా ప్రయోగించారు. సీస పద్యములో కొనసాగిన ఈ శతకము ద్విపాద మకుటముగా కొనసాగింది. ఇందులో

చిత్ర చిత్ర ప్రభావ, దాక్షిణ్య భావ
హత విమత జీవ శ్రీకాకుళాంధ్ర దేవ

అను మకుటంతో శతక రచన వెలువడినది.

అచట లే వని కదా యరచేత జఱచే గ్రు ద్ధత
సభా స్తంభంబు దానవేంద్రు
డచట లే వని కదా యస్త్రరాజం బేసె
గురుసుతుం డుత్తరోదరమునందు
నచట లే వని కదా యతికోసి ననిచె పాండవు
లున్నవనికి గౌరవకులేంద్రు
డచట లే వని కదా యాత్మీయసభను ద్రౌ
పదివల్వ లూడ్చె సర్వధ్వజుండు
లేక యచ్చోటులను గల్గలేదె ముందు
కలవు కేవల మిచ్చోట గల్గు టరుదె,
చిత్ర చిత్ర ప్రభావ, దాక్షిణ్య భావ
హత విమత జీవ శ్రీకాకుళాంధ్ర దేవ
(9వ పద్యము )

రాక్షస రాజైన హిరణ్యకశకుడు శ్రీహరి ఎక్కడా లేడు అనే భ్రమతో స్తంభాన్ని పగులగొట్టి తన చావును తానే కోరి తెచ్చుకున్నాడు. అదేవిధంగా అభిమన్యుని భార్య ఉత్తర గర్భంలో బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి తన నాశనాన్ని తానే కొనితెచ్చుకున్నాడు అశ్వద్థామ. అరణ్యవాసంలో ఉన్న పాండవుల వద్దకు పరమకోపిష్టి అయిన దూర్వాసుడిని దుర్యోధనుడు పంపాడు. మరియు నీవు లేవని అనుకుని ద్రౌపదిని నిండు సభలో అవమానించాడు. కానీ ఈ అన్ని సమయాలలో కూడా నీ యొక్క మహిమలను చూపించావు. అదేవిధంగా మొదటి నుండి శ్రీకాకుళంలో కొలువైయున్న నీవు ఇక్కడే ఉండుట ఆశ్చర్యము కానే కాదు అని అంటారు.

వంచన గాదె దివ్యక్షేత్రపతులలో మంత్రార్ధ
కృత్యము ల్మాని యున్న?
నపకీర్తిగాదె లోకాలోకములయందు వత్సరోత్స
వములు వదలి యున్న?
నగుబాటు గాదె యవ్వనమతస్థజనులలో
నిజదాసకోటి మన్నింపకున్న?
బరిపాటి గాదె యల్పజ్ఞానమతులలో దేవతా
మహిమంబ్బుఁ దెలుపకున్న?
న్టఁటిదా నీప్రతిష్ఠ వర్ణించి చూడఁ బాడి దప్పిన
బలునిందపాలు గావె?
చిత్ర.......................................... ఆంధ్రదేవ
(15వ పద్యము)

ఈ పద్యంలో రచయిత శ్రీకాకుళాంధ్ర మహాదేవుని యొక్క ఆలయ వన్నె తగ్గడాన్ని చూసి చలించి ఇలా అంటారు ప్రతిరోజు నీకు మంత్ర తంత్రములతో జరిగే పూజలు నిలిచిపోతే ఇతర దైవముల ముందు నీకు అవమానం కాదా? ప్రతి సంవత్సరం ఆయా సందర్భాలలో, పండుగలలో జరిగే తిరునాళ్లు వేడుకలు, సేవలు సక్రమంగా జరగకపోతే అది మంచిదగునా ? నీ యొక్క పరమ భక్తులని సాధువులని కాపాడని యెడల పరమత భక్తులు నిన్ను ఎగతాళి చేస్తారు. సమయం వచ్చినప్పుడు మీ యొక్క మహిమలను ప్రదర్శించకపోతే నీయందు భక్తి లేని వారు నిన్ను నిందిస్తారు. అలాగే నిన్ను నమ్మిన వారు నీ మీద నమ్మకం కోల్పోతారు. అయినా నీ కీర్తి ఎప్పటిదో నీకు మాత్రం తెలియదా ? కావున ఆలయంలో మా చేత నిత్య సేవలు, ఉత్సవాలు చేయించుకోవడం నీ వంతే అని భగవంతుడికే బాధ్యతని గుర్తు చేస్తాడు కాసుల పురుషోత్తమ కవి. ఇలా చెప్పడం భగవంతుడిని మనసా వాచా కర్మణ వారికే చెల్లుతుంది. సామాన్యులతో కాదు.

తలను బించెపుదండ ధరియించవలె గాని మణి
కిరీటము బెట్ట మనుజపతివె?
గళమున వనమాలికలు పూనవలె గాని హారము
ల్వేయ దేశాధిపతివె?
కరమున మురళి చక్కగ బూనవలెగాని శాతాపి
బూనంగ క్షత్రియుడవె?

తనువు గోక్షీరవాసన గుప్పవలె గాని చందనం
బలద రాజవె తలంప?
నెల్లలోక మెఱింగిన గొల్లవాడ వేది కుల మింత
రాజస మేమి నీకు?
చిత్ర................................. ఆంధ్రదేవ.
(19 వ పద్యము)

ఈ పద్యంలో రచయిత యొక్క ఆక్రోషము ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. శ్రీకాకుళాంధ్ర దేవుని పరిపరి విధములుగా స్తుతిస్తూనే నిందించినట్టు కనబడుతోంది. దైవాన్ని ప్రశ్నిస్తూ నీవు కిరీటమును ఎందుకు ధరించావు? నెమలి పింఛములు సిగలో ధరించడం మరిచిపోయావా? కిరీటాన్ని ధరించడానికి నీవేమైనా మహారాజువా? మెడలో వనమాలను ధరించడానికి బదులుగా ముత్యాల హారాన్ని ధరించావు. నీవు ఏమైనా దేశాధినేతవా? ఒకవేళ కాకుంటే నీ చేతిలో పిల్లనగ్రోవి ఉండడానికి బదులుగా కత్తిని ధరించుటలో కల అర్థమేమిటి ? నీవు గొల్ల కులములో పుట్టితివి కదా ! అయితే నీవు ఆలమందలలోనే తిరగవలసింది కదా ? అలా తిరిగితే నీ శరీరము నుండి ఆవుపాల వాసన రావాలి గాని మంచి గంధపు వాసన ఎందుకు వచ్చుచున్నది ? అసలు నీ కులం ఎక్కడ ? ఎందుకు నీకు ఇంత గర్వం అని భగవంతుడిని తూలనాడటం పరమ భక్తులతో సాధ్యమవుతుంది గాని సామాన్యులతో సాధ్యం కాదు.

శ్రీమద్వికుంఠపురీ వరేశుడ వయ్యు, గొల్లెపల్లెల
నుండ గోరు టేమి?
యక్షీణలక్ష్మీ కటాక్షవీక్షుడ వయ్యు ద్రోవ లే
కింటింట దోచ నేమి
భూరి చతుర్దశ భువనావనుడ వయ్యు గడువేడ్క
దొఋల గాయ నేమి
సన్మునిదేవతా సంభావితుడ వయ్యు నాల
కాపరులతో నాడ నేమి?
గొప్పలో గొప్పవాడవు కొలదిలోన గొలదివాడవు
నిన్నెట్లు గొలువ వచ్చు?
చిత్ర...................................... దేవ !
(33వ పద్యము)

ఓ శ్రీకాకుళాంధ్ర దేవా ! సమస్తము లోకాలను ఏలే నీవు వైకుంఠ నగరానికి ఏకైక పాలకుడివి. అయితే అంత గొప్ప వాడవై ఉండి గొల్లె పల్లెలో ఎందుకు నివాసం ఉంటావు. లక్ష్మీ నీ చెంతనే ఉండి సమస్త సిరిసంపదలన్నీ నీ దగ్గరే ఉండగా, నీవు ఇల్లిల్లు తిరుగుతూ బీదవాని వలె పాలు వెన్న మొదలైనవి ఎందుకు దొంగతనం చేస్తావు ? 14 లోకాలని పోషించేవాడివి అటువంటి నీవు ప్రేమతోడ పాడియావులను కాచుకుంటావు. సమస్త ముని గణాలు మరియు దేవగణాలు నిన్ను ఎంతో భక్తితో కొలుస్తారు. మరేమో నీవు గొల్ల పిల్లలతో ఆటలాడు కుంటావు. నీవు గొప్పవారిలో కెల్లా గొప్పవాడివి కదా ! తక్కువ వారిలో అల్పమైన వాడివి కూడా. నీకు ఏమాత్రం కూడా కలిమిలేముల పట్ల భేదం లేదు. ఇటువంటి నిన్ను ఏ విధంగా సేవించాలో నాకు అర్థం కావడం లేదని భక్తితో పాటు సందేహాన్ని ప్రకటించాడు.

పట్టి గొల్లది రోట గట్ట నోపిననీకు రోసంబు లే
దన్న నీసు గలదె?
జారచోరాదిచేష్టల బ్రవర్తిల్లు నీ కపకీర్తి యన్న
భయంబు గలదె?
భార్యచే దన్నులు బడ్డవానికి నీకు లజ్జ లేదని
యన్న లాఘవంబె?
కుండుంటు లే దని కొసరి మెక్కిన నీకు హీనత
లెంచిన న్యూన మగునె?
కోరి దాసులు నిన్నెంత దూరుచున్న బంత
మున్నదె నీ కిసుమంత యైన?
చిత్ర................................................. దేవ !
(41వ పద్యము)

ఓ స్వామి ! నిన్ను అందరూ పాండవ పక్షపాతి అని అంటుంటారు. అదే నిజమైతే పాండవులు అన్ని కష్టాలు నష్టాలు పడటానికి గల కారణం ఏమిటి. పది లక్షల ఏనుగులకు నాయకుడైన గజరాజు నీకు పరమభక్తుడు అంటారు. కానీ ఆ గజరాజు ఎంతటి కష్టాలు భరించిందో ఎవరికి తెలియదు. నీ బాల్య స్నేహితుడైన సహాధ్యాయి కుచేలుడు ఎంతో పేదరికం అనుభవించేవాడు. ఎన్నో కష్టాలను భరించాడు. ప్రహ్లాదుడు కూడా పరమ భాగ

వతోత్తముడే కదా.పుట్టినరోజు నుండి నీకు పరమ భక్తుడు. కానీ అతడు ఎన్ని కష్టాలు పడ్డాడు? నిన్ను దయా సముద్రుడని కొలుస్తారు. కానీ నిన్ను నమ్మిన నీ భక్తుల యొక్క కష్టాలని దుఃఖాలని ఎప్పుడు తీర్చావు. ఇవన్నీ ఆలోచిస్తే దీని ద్వారా నీకు భక్తులన్న ప్రేమ లేదని తెలుస్తుంది అని భగవంతుడి ఉనికినే ప్రశ్నిస్తాడు. అలా ప్రశ్నిస్తూనే భగవంతుని స్మరిస్తూనే ఉంటాడు కాసుల పురుషోత్తమ కవి.

**ముగింపు :**

తెలుగు శతక సాహిత్యములో తనకంటూ ఒక ప్రత్యేక మైన ఒరవడిని సృష్టించుకొన్న కాసుల పురుషోత్తమ కవి పద్యాలను, ఆయన ఆర్తిని, ఆవేదనను చూసి చలించిన చల్లపల్లి జమిందార్ ఆలయ పునరుద్ధరణకు పూను కున్నాడు. ఆతరువాత ఆ ఆలయం నిత్య పూజలతో, నిత్యోత్సవాలతో అంగరంగ వైభవాన్ని పొందినట్టు చరిత్ర చెబుతుంది. స్వామీ ఉనికిని ప్రశ్నిస్తూనే, తనకు కావలసిన ఆలయ ఉద్ధరణను స్వామీ వారితోనే పునరుద్ధరించు కున్నారు. కాసుల పురుషోత్తమ కవి ఆంధ్ర నాయక శతకమే కాకుండా హంసలదీవి గోపాల శతకము,మానస బోధ శతకం, భక్త కల్పద్రుమ శతకము మరియు వేణుగోపాల శతకం మొదలైన రచనలు చేసి శతక సాహిత్యాన్ని పరిపుష్టం చేశారు. శతక కర్తలు భక్తినైనా, కోపాన్నైనా, సంతోషాన్నైనా, ఆర్తినైనా, ఆవేషాన్నైనా, సామాజిక సమస్యను అయినా సరే ప్రకటించడానికి శతక సాహిత్యమునె మార్గంగా ఎన్నుకున్నారు. ఈ విధంగా తెలుగు నాట శతక సాహిత్యము పూదోటగా దశ దిశలా పరిమళాలను వెదజల్లి తెలుగు జాతిని అలరించినది. నిత్య నూతనంగాశతకము వర్ధిల్లుతున్నది.

**ఆధార గ్రంథాలు :**


1. ఆంధ్రనాయక శతకము - కాసుల పురుషోత్తమ కవి.
2. ఆంధ్ర శతక సాహిత్యము - కే.గోపాల కృష్ణా రావు.


❖❖❖

Vol. 23 | Spl. Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study



# గోశిక నరహరి నవయుగ పద్మశాలి శతకం - సామాజిక దృక్పథం

- డా॥. యస్. అరుంధతి

తెలుగు లెక్చరర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్.

**ఉపోద్ఘాతం**

తెలుగు సాహిత్యంలో శతకాలకు విశిష్టమైన స్థానం ఉంది. శతకం అనేది కేవలం భక్తి లేదా నీతి బోధ మాత్రమే కాక, సమకాలీన సమాజ పరిస్థితులను ప్రతి బింబించే సాహిత్య రూపం కూడా. ఈ కోణంలో "నవయుగ పద్మశాలి శతకం" ఆధునిక సమాజ మార్పులను, పద్మశాలి వర్గ జీవన సమస్యలను, సామాజిక చైతన్యాన్ని ప్రతిఫలింపజేసిన విలువైన రచనగా నిలుస్తుంది. ఈ శతకం సంప్రదాయ పద్మశాలి జీవనాన్ని మాత్రమే కాక, మారుతున్న కాలంలో వారి స్థితిగతులను సామాజిక దృక్పథంతో పరిశీలిస్తుంది.

**శతక కవి పరిచయం**

బహుముఖ ప్రజ్ఞాశాలి, సుప్రసిద్ధ యక్షగానకవి, వాస్తు సంఖ్యాశాస్త్ర నిపుణులు, శతక కర్త శ్రీ గోశిక నరహరి నిజామాబాద్ జిల్లా బీర్కూరు మండలం, దుర్కి గ్రామంలో శ్రీ గోశిక భూమయ్య, రాధా రుక్మిణి బాయి దంపతులకు మూడవ సంతానంగా జన్మించారు. తన తండ్రియైన గోశిక భూమయ్య గారిని ఆదర్శంగా తీసుకొని 19వ ఏటనే సానంద విజయమనే చిరుతల నాటకాన్ని రచించారు. వీరు సోమలింగ శతకము, షిరిడి సాయి శతకము, శ్రీ వెంకటేశ్వర శతకము, నవయుగ పద్మశాలి శతకము, పురంధర విజయమనే యక్షగాన ప్రబంధాన్ని రచించారు. వీరు భీమన్న సాహితీ పీఠమును, తండ్రి పేరు మీదుగా గోశిక భూమన్న సాహితీ కళాపరిషత్, తల్లి పేరు మీదుగా రాధారుక్మిణి కళాక్షేత్రంలను స్థాపించి కవితా వికాసానికి తోడ్పాటును అందిస్తూ, ఎన్నో సాహిత్య కార్యక్రమాలను నిర్వహించారు.

**తెలుగు శతకాలపై పూర్వ పరిశోధనలు**

తెలుగు సాహిత్యంలో శతకాలకు విశిష్ట స్థానం ఉంది. ప్రజల భాషలో నీతి, భక్తి, సామాజిక భావాలను వ్యక్తపరిచిన సాహిత్య రూపంగా శతకాలు విస్తృతంగా ప్రాచుర్యాన్ని పొందాయి. ఈ శతకాలపై అనేక మంది పండితులు, విమర్శకులు, పరిశోధకులు వివిధ కోణాలలో అధ్యయనం చేశారు. అందువల్ల తెలుగు శతక సాహిత్యం పరిశోధనాపరంగా విశాలమైన వేదికగా మారింది.

**పూర్వ పరిశోధనలు**

1) కె. గోపాల కృష్ణారావు - ఆంధ్ర శతక సాహిత్య వికాసము 2) కట్టమంచి రామలింగారెడ్డి - వేమన తాత్విక దర్శనం. 3) ఆరుద్ర - వేమన వేదం మొదలైన పూర్వ పరిశోధనలు తెలుగు శతక సాహిత్యాన్ని వివిధ కోణాలలో విశ్లేషించినప్పటికీ, నవయుగ సామాజిక దృక్పథంతో సమగ్ర అధ్యయనం చేయాల్సిన అవసరం స్పష్టంగా కని

పిస్తుంది. వృత్తి ఆధారిత శతకాలపై ఇంకా విస్తృత పరిశోధనలకు అవకాశం ఉందని తెలుస్తుంది.

**శతకము ఉద్దేశ్యం**

**1) నవయుగ భావన**

"నవయుగం" అంటే మార్పు చెందిన సమాజం. ఈ మార్పుల మధ్య నిలిచిన ఈ శతకం పద్మశాలి సమాజాన్ని చిత్రిస్తుంది.

**2. ఆత్మగౌరవ భావన**

ఈ శతకంలో ముఖ్యమైన సామాజిక అంశం ఆత్మ గౌరవం. వృత్తి ఆధారంగా తక్కువగా చూడడం తప్పు మనిషిని గొప్పవాడిగా చేసేది జన్మ కాదు. కర్మ అనే భావన స్పష్టంగా వ్యక్తమవుతుంది. ఇది సమానత్వ భావనకు ప్రతీక.

**3. సామాజిక అసమానతల విమర్శ**

కుల వివక్ష, ఆర్థిక అసమానత, శ్రమకు గుర్తింపు లేకపోవడం, వంటి సామాజిక లోపాలను ప్రశ్నిస్తుంది. శ్రమజీవుల కష్టాన్ని సమాజం గుర్తించాలనే గాఢమైన ఆవేదన ఇందులో కనిపిస్తుంది.

**4. సంఘ చైతన్యం**

ఈ శతకం వ్యక్తిగత భావాలతో ఆగిపోదు. సమాజ మంతా కలసి ముందుకు నడవాలనే భావనను ప్రతి పాదిస్తుంది.

సంఘటిత శక్తి పరస్పర సహకారం, ఐక్యత వీటితోనే అభివృద్ధి సాధ్యమని శతకకర్త విశ్వసిస్తాడు.

**5. నైతిక విలువలు**

నవయుగ ప్రభావంతో భౌతికవాదం పెరుగుతున్న సందర్భంలో, ఈ శతకం నైతిక విలువలను గుర్తు చేస్తుంది.

**6. సామాజిక బాధ్యత**

స్వార్థం కంటే సమాజ హితం ముఖ్యమని,వృత్తి పోయినా గౌరవం పోకూడదు" అనే సామాజిక సందేశాన్ని ఇవ్వడం.

**7. వ్యక్తి ఎదుగుదల**

సమాజ అభివృద్ధితోనే పరిపూర్ణమవుతుందని చెబుతుంది. అందువల్ల ఇది సమకాలీన సామాజిక సాహిత్యంగా నిలుస్తుంది.

**8. పద్మశాలి వృత్తి, వంశ గౌరవాన్ని పెంచడం.**

**శతక లక్షణాలు**

1) శతేన శతకం ప్రోక్తమ్ శతకం అంటే నూరు లేదా 108 పద్యాలు ఉంటాయి.
2) మకుట నియమం ఉంటుంది.
3) సరళమైన భాష ఉంటుంది.
4) అల్పాక్షరాల్లో అనాల్పార్థ రచన.
5) బోధాత్మక స్వభావం.

పద్మశాలి శతకం ఒక కుల శతకంగా మాత్రమే కాకుండా శ్రమ సంస్కృతి శతకంగా గుర్తింపు పొందింది. వృత్తుల ఆధారంగా సమాజ నిర్మాణాన్ని అర్థం చేసు కోవడానికి ఈ శతకం చాలా ఉపయోగపడుతుంది. ఈ శతకం కేవలం పద్యాల సమాహారం కాదు. అది ఒక జీవన తత్వం. నేటి ఆధునిక సమాజంలో కూడా ఈ శతకం బోధించే విలువలు అత్యంత ప్రాసంగికమైనవి. పద్మశాలి కులవృత్తి అయిన నేత జీవితాన్ని, శ్రమను, గౌరవాన్ని ప్రతిబింబిస్తుంది. గ్రామీణ జీవనం, వృత్తి అనుభవం ఆధారంగా ఈ శతకం రూపుదిద్దుకుంది. పద్మశాలీయుల వంశ చరిత్రను పరమ పుణ్య శీలి పద్మశాలి అనే మకుటంతో 300 లకు పైగా పద్యాలతో ఎంతో హృద్యంగా రచించాడు. మార్కండేయ మహర్షి జననం మొదలుకొని వస్త్ర ఉత్పత్తి వరకు అద్భుతమైన వర్ణనలతో, కరుణ రసాత్మకంగా ఆటవెలది పద్యాలతో ఈ శతకం రచించారు. నరహరి గారి విలక్షణమైన అభివ్యక్తికి మచ్చుతునక లాంటి పద్యాలు ఎన్నో ఉన్నాయి. అందులో కొన్ని ఉదాహరిస్తాను.

శ్రీదనరగ రజతజీమూత నిలయమై
యున్న గణపతి నిను సన్నుతింతు
పద్మశాలి శతక పద్యమ్ములను వ్రాయు
బుద్ధి నివ్వు సిద్ధి బుద్ధినాథ! - 1పద్యం

ఈ శతకము మొదట శ్రీ కారంతో ప్రారంభ మవుతుంది.

కవి తన కథాత్మక శతక రచన సఫలమవ్వాలనే ఉద్దేశంతో గణపతిని ప్రార్థిస్తూ, బుద్ధి, జ్ఞానం, సృజనాత్మక శక్తిని ప్రసాదించమని వేడుకుంటున్నాడు.

చదువులకును తల్లి శారద నీ దయన్
శతక రచన జేయ సాహసించి
పద్మశాలి వంశ పావన చరితమ్ము
పలుకు చుంటినమ్మ ప్రణతి జేసి! - 2 పద్యం

కవి విద్యాదేవతైన శారదామాతను ప్రార్థిస్తూ తనకు శతక రచన చేయగల శక్తి, జ్ఞానం, అనుగ్రహం కలగాలని మరియు పద్మశాలి వంశ మహిమను సరిగ్గా వర్ణించగల సామర్థ్యం ఇవ్వమని వేడుకుంటున్నాడు.

అయ్యో యేమిసేతు అపరాధమైపోయె
నన్ను బ్రోవవయ్య నాగభూష
తప్పు జేసితింక దయచూడు మోదేవ!
శాపమెటుల దీరు శరణు శరణములు
పరమ పుణ్యశీలి పద్మశాలి! - 118 పద్యం

పై పద్యము పంచపాది. అంటే పద్యంలో ఐదు పాదాలు ఉంటాయి. ఈ శతకంలో చాలాచోట్ల ఐదు పాదాలతో కూడిన పద్యాలు ఉన్నాయి. యమధర్మరాజు తన దుఃఖానికి కారణం తెలియక ఆవేదన చెందుతూ, తాను చేసిన అపరాధాలను క్షమించమని శివుని ప్రార్థిస్తున్నాడు. పూర్తి వినయంతో దేవుని శరణు కోరుతున్నాడు.

శివుని శాపముననను చింతిల్లె యముడెంతో
రాక్షసుడిగ బుట్టె యాక్షణంబె
కాలువాసురుడయి కఠిన కృత్యములతో
సంచరించు చుండె సహజన్ము డొకడింక
పరమ పుణ్యశీలి పద్మశాలి! - 141 పద్యం

శివుని శాపం వల్ల యముడు కూడా రాక్షసుడిగా జన్మించాడు. ఆ క్షణమే అతడు కాలువాసురుడు అనే రాక్షసుడిగా పుట్టి, కఠినమైన క్రూర కార్యాలు చేస్తూ సంచరించాడు. అదే సమయంలో, మరోవైపు సహజంగా జన్మించిన ఒక మనిషి మాత్రం అత్యంత పుణ్యశీలుడై, ధర్మనిష్ఠుడై పద్మశాలిగా జన్మించాడు. జన్మ గొప్పదనం కులం వల్ల కాదు, చేసిన కర్మలు, పుణ్యఫలాల వల్ల వస్తుంది. దేవతైనా శాపం వల్ల రాక్షసుడవుతాడు, సాధారణ మనిషైనా పుణ్యంతో మహనీయుడవుతాడు. ఇది కర్మసిద్ధాంతాన్ని, మానవ విలువల గొప్పతనాన్ని తెలియజేస్తుంది.

ఇంద్రధనసు వంటి చంద్రకాంతుల వంటి
మిణుకు తారలెల్ల మెరసినట్లు
మగ్గమందు రూపు మరి దిద్దుకొనె బట్ట
పరమ పుణ్యశీలి పద్మశాలి! - 212 పద్యం

మగ్గంలో నేయబడే వస్త్రం ఇంద్రధనుస్సు, చంద్రుడు, తారల వంటి సహజ సౌందర్యాలను తలపించేలా అత్యంత ఆకర్షణీయంగా తయారవుతున్నదని కవి వర్ణిస్తున్నాడు.

పరగ లచ్చివిభుడు పత్తి బీజములిచ్చె
చెట్లు బెట్టు తొలగు పాట్లు, తెలుపు
దారములిక దొరుకు, దారిజూపితినని
పరమ పుణ్యశీలి పద్మశాలి! - 356 పద్యం

లక్ష్మీదేవికి స్వామియైన విష్ణువు కృపవల్ల పత్తి విత్తనాలు లభించాయి. అవి నాటిన తరువాత ఎన్నో కష్టాలు తొలగిపోయాయి. ఆ పత్తి నుండి తెల్లని దారాలు లభించాయి. ఆ దారాల ద్వారానే నాకు జీవన మార్గం కనిపించింది అని కవి చెబుతున్నాడు. అంటే ఈ వృత్తి మానవుడికి దేవుడు చూపిన జీవన మార్గం.

పద్మతంతువులతో పరగమొదటనీవు
వస్త్రనిర్మితమును వసుధ సేయ
పద్మశాలియులని ప్రఖ్యాతిజెందేరు
పరమ పుణ్యశీలి పద్మశాలి! - 357 పద్యం

తామర తంతువులతో వస్త్రనిర్మాణం ప్రారంభించిన కారణంగా ఈ వంశానికి "పద్మశాలి" అనే పేరు వచ్చి, వస్త్రవృత్తిలో వారు గొప్ప ఖ్యాతి సంపాదించారని కవి వివరించారు.

నాటి కాలమందు మేటి వస్త్రమునేసి
చాటినారు కీర్తి పాటవమ్ము
కాని నేటి దినము కష్టమ్ములాయెరా
పరమ పుణ్యశీలి పద్మశాలి! - 359 పద్యం

పూర్వకాలంలో పద్మశాలులు అత్యుత్తమమైన వస్త్రాలను నేసి, తమ నైపుణ్యంతో గొప్ప కీర్తి, ప్రతిష్ఠలను పొందారు. అయితే కాలం మారిన ఈ నేటి రోజుల్లో ఆ వృత్తి కష్టసాధ్యమై, జీవనం భారంగా మారిపోయిందని కవి వేదన వ్యక్తం చేస్తున్నాడు.

వనిత ఎదను కప్పి కనువిందుచేసెడి
చీరనేసినారు చిత్రకళల
మంచిబట్టనేసి మగవారికిచ్చిరి
పరమ పుణ్యశీలి పద్మశాలి! - 360 పద్యం

స్త్రీల సౌందర్యాన్ని మరింత మెరుగుపరచేలా, వారి ఎదను కప్పి కనులకు ఆనందాన్ని కలిగించే చీరలను పద్మశాలీలు నేశారు. అలాగే చిత్రకళలతో అలంకరించిన మంచి వస్త్రాలను నేసి పురుషులకు కూడా ధరించేందుకు అందించారు. అంటే, స్త్రీ-పురుషుల అవసరాలకు తగిన విధంగా అందమైన, నాణ్యమైన వస్త్రాలను తయారు చేసిన వారి నైపుణ్యాన్ని కవి ప్రశంసిస్తున్నాడు.

రాజులకు కవులకు రాజకీయులకును
పండితుల్ ప్రజలకు ప్రాజ్ఞులకును
ఇచ్చిరి వలువలను మెచ్చు శాలువలను
పరమ పుణ్యశీలి పద్మశాలి! - 361 పద్యం

రాజులు, కవులు, రాజకీయ నాయకులు, పండితులు, సామాన్య ప్రజలు, జ్ఞానులు - ఇలా అన్ని వర్గాలవారికీ పద్మశాలీలు మంచి వస్త్రాలు, గౌరవప్రదమైన శాలువలను తయారు చేసి అందించారు అని కవి స్పష్టంగా తెలియ జేస్తున్నాడు.

పట్టుపుట్టములిల పరిణయంబులకెల్ల
కళల రంగులిచ్చి కనకమోలె
సాలెపురుగుకంటె మేలైన కళలెన్నొ
పరమ పుణ్యశీలి పద్మశాలి! - 362 పద్యం

వివాహాది శుభకార్యాల కోసం పట్టుపుట్టాలతో తయారైన వస్త్రాలకు అనేక రకాల కళలు, రంగులు అద్ది మరింత అందంగా తయారు చేశారు. ఆ వస్త్రాలు బంగారంలా మెరుస్తూ, సాధారణ సాలెపురుగు నేసే గుడ్డ కంటే ఎంతో మెరుగైనవి, అత్యంత నైపుణ్యంతో రూపొంది నవని కవి ప్రశంసిస్తున్నాడు.

ఎర్రకోటపైన ఎగురుచున్నది గాదె
మూడు వర్ణములతొ మురియు జండ
దాని నేసితీవు చేనేత పనిరేడ
పరమ పుణ్యశీలి పద్మశాలి! - 363 పద్యం

ఎర్రకోటపై ఎగురుతున్నది సాధారణ జెండా కాదు. మూడు రంగులతో శోభిల్లుతూ మెరుస్తున్న ఆ త్రివర్ణ పతాకం నీవు నీ చేతులతో నేసిన చేనేత వస్త్రమే. అది దేశ గౌరవానికి చిహ్నమైన జాతీయ జెండా కూడా చేనేత కార్మికుని శ్రమతోనే రూపుదిద్దుకుంది. చేనేత పనివారి కష్టం, దేశభక్తి, గౌరవం ఈ పద్యంలో స్పష్టంగా వ్యక్త మవుతాయి.

పవరులూములొచ్చి ప్రాణముల్ లేకున్న
అధిగమించె నిన్ను ఆకలయ్యె
అప్పులెక్కువయ్యె ఆత్మహత్యలయ్యె
పరమ పుణ్యశీలి పద్మశాలి! - 365 పద్యం

విద్యుత్ యంత్రాలు వచ్చాక చేతివృత్తి విలువ తగ్గి పోయింది. దాంతో చేనేత కార్మికుల కు జీవనం కష్టమై, ఆదాయం లేక ప్రాణాలు ఉన్నా జీవించలేని స్థితి ఏర్పడింది. ఆకలి పెరిగింది, అప్పులు ఎక్కువయ్యాయి, ఆ బాధను తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడ్డారు అని కవి హృదయవేదనతో తెలియ జేస్తున్నాడు.

ఎన్ని బాధలైన ఎలమినోర్చు కొనుము
ముందు కాలమింక మురిపములదె
వేచియున్న కొలది వేలశుభములిచ్చు
పరమ పుణ్యశీలి పద్మశాలి! - 366 పద్యం

ఎన్ని కష్టాలు, బాధలు వచ్చినా ధైర్యంగా ఓర్పుతో భరించాలి. ప్రస్తుతం కాలం కష్టంగా ఉన్నప్పటికీ ముందు వచ్చే రోజులు ఆనందం, సంతోషంతో నిండివుంటాయి. సమయం మారితే వేలాది శుభాలు మన జీవితంలోకి వస్తాయని కవి ఆశాభావంతో పద్మశాలీయులను ప్రోత్స హిస్తున్నాడు.

ఈ శతకంలో ముఖ్యంగా నైమిశారణ్య వర్ణన, మృకండ మహా ఋషి సంతానం కోసం పడిన తపన, మార్కండేయ మహర్షి వారి జననం, వారి సంతానం నేత మగ్గంపై వస్త్రోత్పత్తిని ప్రారంభించి సమాజానికి అందిం చిన అద్భుతమైన ఘట్టాలెన్నో మనకు కనిపిస్తున్నాయి.

**ఉపసంహారం**

నవయుగ పద్మశాలి శతకం ప్రధానంగా పద్మశాలి కులానికి చెందిన చేనేత జీవితం, శ్రమ, వృత్తి గొప్పతనాన్ని వివరిస్తుంది. మానవ జీవితానికి ఆహారం ఎంత ముఖ్యమో, వస్త్రమూ అంతే ముఖ్యమని కవి పేర్కొంటాడు. అందువల్ల నేత వృత్తి సమాజానికి మూలాధారమని భావించబడుతుంది.

ఈ శతకంలోని సామాజిక సమస్యలు కుల వృత్తి కార్మిక సమస్యలు ఆధునిక జీవన సంఘర్షణలు ప్రతిఫలిస్తున్నాయి. ఈ శతకం ఒక వర్గ గాథ మాత్రమే కాదు. ఇది శ్రమజీవుల జీవన వాస్తవాన్ని, సమానత్వ భావనను, విద్య-చైతన్యాల అవసరాన్ని సామాజిక దృక్పథంతో ప్రతిబింబించిన సాహిత్య ప్రక్రియ. నవయుగ పద్మశాలి శతకం శ్రమజీవుల ఆత్మ గౌరవాన్ని, సామాజిక సమానత్వాన్ని, విద్యా చైతన్యాన్ని ప్రతిబింబించిన అమూల్య రత్నమని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు**


1. ఆంధ్ర శతక సాహిత్య వికాసము - కె గోపాలకృష్ణారావు
2. నవయుగ పద్మశాలి శతకం - గోశిక నరహరి
3. తెలుగు శతక సాహిత్యం - కొర్లపాటి శ్రీరామ్మూర్తి
4. నీతి శతకాల పరిశీలన - కేతవరపు రామకృష్ణ
5. వేమన తత్త్వ చింతన - కె. శివారెడ్డి
6. తెలుగు శతక సాహిత్య వికాసం - బూర్గుల రామకృష్ణారావు


❖❖❖

Vol. 23 | Spl. Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# పరిపూర్ణ గ్రామ చరితం - పాలెం వేంకటేశ శతకం



- డా॥. యస్. మహేందర్

తెలుగు సహాయాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), గజ్వేల్.

**వ్యాస సంగ్రహం**

తెలుగు సాహిత్యములోనాటి నుండి నేటి వరకు నిత్యనూతనంగా కొనసాగుతున్న సాహిత్య ప్రక్రియశతకం. వృషాధిప శతకం నుండి ఇప్పటి వరకు వేల సంఖ్యలో శతకాలు తెలుగుసాహిత్యములోవచ్చినాయి. శతకాలు ప్రధానంగా నీతిబోధను వ్యక్తిత్వవికాసాన్ని భక్తిని, ఆధ్యాత్మికతను బోధిస్తూ, ఆత్మాశ్రయ ధోరణిలో రాయబడే ప్రక్రియ. అట్లా బహుముఖీనతో ఎన్నో శతకాలు తెలుగులో వెలిసినాయి. అధ్యాపకుడిగా పనిచేస్తున్న శ్రీ గోవిందు గోవర్ధన్ పాలెం గ్రామాభివృద్ధిని, తోటపల్లి సుబ్బయ్య సేవను ఈ శతకములో వర్ణించినారు. ఒక వ్యక్తిసేవా నిరతిని, అంకితభావాన్ని తను పుట్టి పెరిగిన ఊరుని వర్ణిశీచనపాలెం వేంకటేశ శతకము ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.పాలెం వేంకటేశ శతకమును లోతుగా విశ్లేషణ చేసి చెప్పడమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశ్యం.

**కీలక పదాలు :** పాలెం, శతకం, సుబ్బయ్య, గ్రామ చరితం

**ఉపోద్ఘాతం**

వెయేళ్ళ సాహిత్య చరిత్ర కలిగిన తెలుగులో కొంచెం అటు ఇటుగా సమాంతరంగా సాగుతున్న సాహిత్య ప్రక్రియ శతకం. పాల్కురికి సోమనాథుడు రాసిన వృషాధిప శతకం నుండి నేటి వర్ధమాన కవులు దాకా నిత్య నూతనంగా దేదీప్యమానంగా వెలుగుతున్న సాహిత్య ప్రక్రియ శతకం. శతకాలు మొదటగా భక్తి ,ఆధ్యాత్మిక భావాలతో మొదలై నీతి, వ్యక్తిత్వ వికాసాలతో దినదిన ప్రవర్ధనమానమవుతూ అన్ని రూపాలలో అన్ని వాదాలలో ఒదిగిన ప్రక్రియ. ఆత్మాశ్రయం ఆత్మ కలిగిభౌతికంగా బహురుపాలుగా అవతారమెత్తిన ప్రక్రియ శతకం. శతకం తెలుగు తల్లి మెడలో ఒదిగిన పచ్చల హార పథకం.

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని దేవుని పాలెంగా ప్రసిద్ధికెక్కిన పాలెం ప్రస్తుతం నాగర్ కర్నూల్ జిల్లాకు సమీప గ్రామం. ఒక 50, 60 సంవత్సరాల క్రితం ఆ గ్రామం ఒక జిల్లా స్థాయి పట్టణానికి ఎన్ని హంగులు వసతులు ఉంటాయో ఆ విధంగా ఆ గ్రామానికి అన్ని రకాల హంగులు వసతులు కలవు. ఇంతకీ ఆ గ్రామం జిల్లా కాదు తాలూకా కాదు మండలం అంతకంటే కాదు. మామూలు గ్రామం. ఆ కాలములో ఆ గ్రామం ఎందుకంత అభివృద్ధి చెందింది అంటే అది రాజకీయ ప్రాబల్యం ఉన్న గ్రామం కానేకాదు దాని వెనుకున్న వారు మామూలు గ్రామ పురోహితుడు. అతడే తోటపల్లి సుబ్బయ్య. తదనంతర కాలం తోటపల్లి సుబ్బయ్య నే పాలెం సుబ్బయ్యగా ప్రఖ్యాతిగాంచారు. పాలెం గ్రామాన్ని, తోటపల్లి సుబ్బయ్యను వేరువేరుగా చూడలేం. ఆ నామానికి ఆ గ్రామానికి బంధం పెను వేసుకుంది.

**పూర్వ పరిశోధన :**

శతకం పైన మొట్టమొదటగా కె.వెంకటేశ్వర రావు పరిశోధన చేసినారు. తర్వాతి కాలంకాలంలో వ్యక్తగత శతకాలపైన పరిశోధనజరిగింది. ఉదాహరణకు వేమన, సుమతీ శతకం ఎన్. గోపి, మచ్చ హరిదాసు లాంటి వాళ్ళు లోతైన పరిశోధన చేసినారు. అటు తర్వాతి కాలములో ప్రాంతాల వారిగా శతకాల పరిశోధన జరిగింది. ఉదాహరణకు భీంపల్లి. శ్రీకాంత్ మహబూబ్ నగర్ జిల్లా శతక సాహిత్యం పైన పరిశోధన చేసినారు. ఈ శతకాని కంటే ముందే గూడెల్లి శీనయ్య ఆధునిక శతక సాహిత్యం-గ్రామీణ చిత్రణ అనే అంశం పైన జరిగింది కాని ఈ శతకం పైన ఇంతవరకు పరిశోధన రాలేదని నా అభిప్రాయము మాత్రమే.

**కవి పరిచయం :**

పాలెం గ్రామవాసిగా, ప్రాచ్య కళాశాల పూర్వ విద్యార్థిగా, అధ్యాపకుడిగా అతనికి ఆ ఊరితో బంధం పెనవేసుకుపోయింది. ఉన్న ఊరు కన్నతల్లి, జననీ జన్మభూమిశ్చ స్వర్గా దపీ గరీయాసి ఉన్నట్లు కన్నతల్లి లాంటి ఆ గ్రామం పైన మమకారం ఉంటుంది. పాలెం వేంకటేశ శతకం రాసి ఊరి రుణం తీర్చుకున్న కవి గోవిందు గోవర్ధన్ ధన్యుడు. ఇలాంటి అవకాశం అందరికీ రాదు కొందరికే వస్తుంది. పాలెం గ్రామ అభివృద్ధిని ఒక ప్రణాళిక బద్ధంగా సీసాలోకి ఎక్కించిన తీరు పద్ధతి చాలా అద్భుతంగా ఉంది. ఇలా ప్రతి ఊరు అభివృద్ధిని అక్షరీకరిస్తే ఎన్నో విషయాలు రానున్న భవిష్యత్ తరాలకు మూలధనంగా, ముడి సరుకుగా మన ఊరు - మన చరిత్రకు ఎంతగానో ఉపయోగపడుతుంది ఆ విధంగా పాలెం గ్రామ అభివృద్ధిని శతకం రూపంలో అక్షరీకరించి కొత్తపుంతకు ఆదర్శంగా నిలిచినారు శ్రీ గోవిందు గోవర్ధన్ గారు.

**మకుటం లేని మహారాజు**

తను పుట్టి పెరిగిన గ్రామం కోసం అహర్నిశలు కష్టపడి సమయాన్ని, సంపదను ధార పోసినధీరోదాత్తుడు. గుడిగట్టిస్తే పుణ్యం కోసం అంటారు. బడిగట్టిస్తే పేరు కోసం అంటారు. వైద్యం కల్పిస్తే ప్రజల మెప్పుకోసం అంటారు. ఇవన్ని ఏమీ ఆశించకుండానే ఆ గ్రామాన్ని అన్ని రంగాల అభివృద్ధి చేసినారంటే ఆయన నిస్వార్థ సేవను అర్థం చేసుకోవచ్చు. అందుకే ఆయన ఆ ఊరికే కాదు జిల్లా అంతటికీ మకుటం లేని మహారాజు. అందుకే పాలెం వెంకటేశ శతకం ద్విపాద మకుటంలో ఒక పాదం తన పేరుతోనే రెండవ పాదం పాలెం గ్రామం పేరుతో కలిసే విధంగా శతకం రాసిన గోవిందు గోవర్ధన్ యొక్క సూక్ష్మదృష్టిని ఈ సందర్భంగా అర్థం చేసుకోవచ్చు. ఘనత గాంచిన సుబ్బయ్య గ్రామ సేవ వినతి గావింతు పాలెం వేంకటేశా!

**గ్రామ చరితం :**

శతకాలు ప్రధానంగా నీతి బోధను వ్యక్తిత్వవికాసాన్ని భక్తిని, ఆధ్యాత్మికతను ఆత్మాశ్రయధోరణిలో రాయబడే ప్రక్రియ. కానీ ఈ శతకం గ్రామం మొదటి నుండి ఏ విధంగా అభివృద్ధి చెందికుంటూ వచ్చిందని కాలాను సారంగా ప్రతి ఘట్టాన్ని విపులంగా వివరించే విధంగా 128 పద్యాలలో గ్రామ చరిత్రను వివరించారు ఒక గ్రామ చరిత్రను ఒక శతకంగా మలచడం ఇక్కడ ఈ శతకం యొక్క ప్రత్యేకంగా చెప్పవచ్చు గుర్తింపు లేని మా కుగ్రామమునకు నాడు మెండుగా కొరతలు నిండి యుండే (పుట సంఖ్య 51) లాంటి దశ నుండిదేశ విదేశాల దృష్టి సారింపను విశ్వమంతటపల్లె వెలుగు జేసె(పుట సంఖ్య 55) దశ వరకు అభివృద్ధి చెందింది అంటే పాలెం సుబ్బయ్య కృషి అర్థం చేసుకోవచ్చు.

**పాలెం పల్లెను ప్రపంచ పటాన నిలుపుట:**

ఫిబ్రవరి 18, 1980వ సంవత్సరంలో సంపూర్ణ సూర్యగ్రహణం సందర్భంలో తిలకించడానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఖగోళ శాస్త్రవేత్తలకు వేదికయింది పాలెం గ్రామం. పాలెం గ్రామంలో ఖగోళ ప్రయోగశాల నుండి సంపూర్ణ సూర్యగ్రహణం తిలకించి సూర్యగోళములో ఉన్న రహస్యాలు పరిశోధించుటకు అమెరికా శాస్త్రవేత్తల బృందంపాలెం గ్రామనకు 40 రోజుల ముందే చేరు కున్నారు. ఆవిధంగా ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తలకు పాలెం కేంద్రం కావడం వలన వివిధ మాధ్యమాలల్లో పెరు కెక్కింది. ఆ నలభై రోజుల పాటు ఆ శాస్త్రవేత్తలకు

కావలసిన సకల వసతులను ఏర్పాటు చేసి ఎక్కడ లోటు లేకుండా సమర్థవంతంగా వారికి వసతులు ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో పాటు పాలెం సుబ్బయ్యను మెచ్చుకోవడం ఒక ఎత్తు అయితే అప్పటి అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ ప్రశంస పత్రాన్ని పంపడం మరొక ఎత్తు ఆ విధంగా సంపూర్ణ సూర్య గ్రహణం తిలకించడానికి అంతర్జాతీయ శాస్త్రవేత్తలు రావడముతో పాలెం గ్రామం ప్రపంచ పటాన ఒక మెరుపు మెరిసింది దీనికి వెన్ను దన్నుగా నిలిచినవారు పాలం సుబ్బయ్య అనే చెప్పవచ్చు. గ్రహణమున్ శోధింప ఖండాంతరము నుండి శాస్త్రజ్ఞులడుగిడ స్వాగతించే (పుట సంఖ్య 101)

**భారతదేశంలో ఐదవ గ్రామంగా ప్రసిద్ధి :**

60వ దశకంలో భారత ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధి శాఖ వారు సకల వసతులు గల సర్వతోముఖాభివృద్ధి చెందిన గ్రామాలను ఎంపిక చేసి ప్రక్రియలో దేశవ్యాప్తంగా ఐదవ గ్రామంగా గుర్తింపుపొందింది. పాలెం గ్రామం ఒక వెనుకబడిన కరువు జిల్లాలో మారుమూల గ్రామం. పాలెం దేశంలో ఐదవ గ్రామంగా (ఇప్పటి తరహాలో చెప్పాలంటే ఐదవ ర్యాంకుగా) 60 ఏళ్ల కిందటినే సాధించింది అంటే ఆ గ్రామానికి చరిత్ర ఎంతటిదో మనం ఈ సందర్భంగా అర్థం చేసుకోవచ్చు. ఆఊరికి అంత చేసిన తను కనీసం శిలాఫలకల మీద తన పేరును చేక్కించుకొని నిరాడంబర మహనీయుడు సుబ్బయ్య.

**ఆదర్శ భావాలు గల సుబ్బయ్య :**

భారతదేశీలో అంటరానితనం ఒక గొడ్డలిపెట్టుగా ఉన్న దానిని సుబ్బయ్య గారు హారిజనులను గుడిలోకి ప్రవేశింప చేసి తన ఉన్నత భావాలను విశాల దృక్పథాన్ని చాటినారు. అంతేకాకుండా వారి కోసం 60 పక్కా భవనాలను ఏర్పాటు చేసి, వారికి కావలసిన జీవన ఉపాధి కోసం కోళ్ల ఫారాలను నిర్మించి ఆ ఊరి జనాలలో తలలో నాలుక లాగా ఉండిపోయారు. మాటకఠినమైన మన సంతవెన్నయే ప్రజల వృద్ధిని కోరి పలుకుచుండె (పుట సంఖ్య 98) కుల భేధముల మాన్పి గుడిలోకి రప్పించి కనలేని దైవమున్ కానజేసే (పుట సంఖ్య 89)

**సుబ్బయ్య గూడెం:**

సుబ్బయ్య గూడెం పాలెం గ్రామానికి సమీపంలో ఉన్న ఆమ్లెట్ గ్రామం. ఈ గ్రామానికి పూర్వ నామం బిచ్చోనిపల్లి. (బిచ్చగాళ్ళు ఉండే పల్లె). ఆశ్రిత జాతివారు ఉండే చిన్న పల్లె. వారిదీన పరిస్థితిని చూసి వారి కోసం పక్కా గృహాలు నిర్మించినారు. వారి కోసం అంత వెచ్చించిన సుబ్బయ్యకు ప్రతిఫలంగా వారు బిచ్చోన్ని పల్లెకు ఆశ్రిత జాతులు ఆ ఊరిని సుబ్బయ్య గూడంగా పిలుచుకోవడం వారికి వీరి పైన ఉన్న ఆధారాభిమానాలు ఎంత ఉన్నాయో ఈ సందర్భంగా మనం గ్రహించవచ్చు. యాచించి బ్రతుకుచు నవమానముల నొంది కడలి సహృదయుని కంట బడిరి (పుట సంఖ్య 91)

**నిర్మాణాత్మక పనులు /వసతులు :**

మామూలు పాలెం గ్రామములో గుడులు, బడులు, విద్యార్థులకు, ఆచార్యులకు వసతిగృహాలు, వైద్య సౌకర్యాలు, బ్యాంకులు, మిల్లులు, పరిశ్రమలు ఉపాధి వసతులు, నూతనంగా వస్తున్నవస్తువులు మొదలగు వాటిని ఊరి ప్రజల కోసం ఏర్పాటు చేసి అభివృద్ధి పథాన నడిపించినారు. ఆ ఊరి ప్రజలకు కావలసిన అన్ని రకాల వసతులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను సమకూర్చి, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దిన ఆదర్శ వ్యక్తి పాలెం సుబ్బయ్య. కవి ప్రతి అభివృద్ధి పనిని శతకము నిండా అక్షరీకరించినారు.

**ప్రముఖుల సందర్శన :**

పాలెం గ్రామ అభివృద్ధిని చూడడానికి దేశ రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ, ఇందిరాగాంధీ, పి.వి. నీలం సంజీవ రెడ్డి, జలగం వెంగళరావు ఎన్టీ రామారావు లాంటి రాజకీయ నాయకులతో పాటు స్వచ్ఛంద సంస్థలు, పలుకుబడిగల వ్యక్తులు, ఆధ్యాత్మిక వ్యక్తులు లాంటి ఎందరో మహనీయులు ఆ గ్రామాన్ని సందర్శించినారు. పాలెం గ్రామం దేశానికి రోల్ మోడల్‌గా ఉందని సందర్శించిన ప్రతి వాళ్లు ప్రశంసించిన వెనుక సుబ్బయ్య గారి తపన ఆ గ్రామ అభివృద్ధిలో కనిపించిందని చెప్పవచ్చు.

**ముగింపు**

భారతదేశం మొదటి నుండి గ్రామీణ నేపథ్యం కలిగిన దేశం. గ్రామ స్వరాజ్యమే నిజమైన స్వరాజ్యం అని గాంధీ గారు పేర్కొన్నారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు నానుడి మనం వినే ఉంటాం. కాబట్టి ప్రతి గ్రామం పాలెం గ్రామం వలె అభివృద్ధి చెందినప్పుడు దేశం ప్రపంచవ్యాప్తంగా ఒక శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దబడుతుంది. ఇది ఇప్పుడు మనం చెప్పుకుంటున్నాం అన్నమాట కానీ ఒక 50-60 సంవత్సరాల క్రితమే పాలెం గ్రామం అంత ఉన్నత స్థితిలో అభివృద్ధి చెందిందంటే ఆ గ్రామ అభివృద్ధిలో పాలెం సుబ్బయ్య పాత్ర ఎంతగానో ఉందని ఈ సందర్భంగా చెప్పుకోక తప్పదు. ఒక తోటపల్లి సుబ్బయ్య పాలెం సుబ్బయ్యగా ప్రఖ్యాతిగాంచడానికి వారి నిర్విరామ నిస్వార్థ సేవను మన ఈ సందర్భంగా కొనియాడక తప్పదు. కాబట్టి గ్రామ చరిత్రను తన చరిత్రగా, తన జీవిత చరిత్రను గ్రామ చరిత్రగా విడమరిచి మనము చూడలేము. కాబట్టి ఆ గ్రామ అభివృద్ధికి తన శక్తిని, సంపదను, సమయాన్ని ధారపోసినా పాలం సుబ్బయ్య ఆ ఊరిలో జన్మించడం ఆ ఊరి గ్రామస్తులు చేసుకున్న అదృష్టంగా భావిస్తూ, ఇలాంటి పాలెం సుబ్బయ్యలు ప్రతి ఊరుకో ఒక్కరు ఉన్నచాలని తలపించే వ్యక్తిత్వం అతనిది. అంతటి మహనీయుని చరిత్రను ఆ గ్రామ చరిత్రను ప్రతి సందర్భాన్ని శతకంగా మలిచిన గోవర్ధన్ గోవిందు గారికి అభినందనలు తెలియజేస్తూ ముగిస్తున్నాను.

**సంప్రదించిన గ్రంథం :**

1. గోవర్ధన్ గోవిందు, పాలెం వేంకటేశ శతకం, పాలెం వెంకటేశ్వర ప్రచురణలు, 2017.

❖❖❖

Vol. 23 | Spl. Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# ఆరుద్ర వెలికి తీసిన “వేమన” వాదం



– డా॥. రావిరాల లక్ష్మీకాంతం

తెలుగు అధ్యాపకురాలు, పింగిళి కళాశాల (స్వయంప్రతిపత్తి), హనుమకొండ (వరంగల్), తెలంగాణ.

**వ్యాస సంగ్రహం :**

మన భారతదేశంలో అక్షరాస్యత తక్కువ అని కొందరు అంటారు కానీ అది ఏమాత్రం సరియైన వాక్యం కాదు. ఎందుకంటె అక్షరాస్యత అంటే కేవలం అక్షరాలు చదవడం రాయడం అని కాదు కదా. ఎవరైనా వారి వారి విద్యల్లో (అంటే పొట్టకూటికి (అని నిక్కచ్చిగా చెప్పొచ్చు) చేసే పనుల్లో వారంత ప్రావీణ్యులు మరొక్కరు ఉండరు.) ఎవరికి వారు వారు నేర్చుకున్న విద్యల్లో మంచి కౌశలం ఉన్నవారే భారతదేశంలో కనిపిస్తారు.అంతే కాక మన దేశంలో మౌకిక విద్య మహావేగంగా ప్రాచుర్యంలోకి వచ్చి ఉంది. మన లెక్కప్రకారం చదువుకోని వారికి కూడా మహాభారతం, రామాయణం, భగవద్గీత వంటి పుస్తకాలు కంఠతా వచ్చు. ఇక నీతి పద్యాలు, శతకాలు అంటే చిన్న పెద్ద తేడా లేకుండా అందరి నోట్లోనూ పద్యాలు నాను తుంటాయి. ఇక వారికి అక్షరాస్యత లేదు అని ఎలా అనగలం? అందుకనే నేను అక్షరాస్యత కాకుండా మన దేశంలో నూటికి 98 శాతం మందికి మౌకిక విద్యలన్నీ బాగా వచ్చు అని చెప్పగలం. దీనికి ఇంకొక కారణం కూడా ఉంది.

ఇప్పటిలాగా మెకాలే విద్యావిధానం ఆనాడు మనకు లేదు. ఎంతోమంది పండితులు, విద్యావంతులు విద్యార్థులకు విద్యను అందించేవారు. ఆ విద్యను అందించడంలో వారిలో ధనార్జన కన్నా విద్యాదానానికే ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. చిన్న కుగ్రామంలో కూడా ఒక పండితుడు ఉంటే అక్కడి ఆ గ్రామంలోని బాల బాలికులకు విద్యను నేర్పడంలో ముందుండేవారు. ఆ ఉపాధ్యాయులు వారికి మరో ఉపాధిలేకున్నా (వారు కేవలం ఉండడానికి ఇల్లు, తినడానికి తిండి ఆ గ్రామ పెద్దలు ఇచ్చినా వాటితో ఎంతో తృప్తిపొంది) పిల్లలకు విద్యాదానంలో ముందుండేవారు. దానివల్లనే ఆనాటి కాలంలో అక్షరాస్యత కన్నా మంచి మంచి నైపుణ్యం, వివేచన, దిట్టతనం, కౌశల్యం, చమత్కృతితో కూడిన చాతుర్యం వంటివి ఎక్కువ ఉండేవి. ఇప్పటి మెకాలే విద్యావిధానం కేవలం పుస్తక పాండిత్యం తప్ప లౌకిక జ్ఞానం కానీ ఇతర ఏవిధమైన జ్ఞానం కానీ విద్యార్థులకు ఉండడం లేదు. వారు వారు చదువుకున్న విద్యలో ప్రావీణ్యత తప్ప అతిచిన్న సమస్యను కూడా వారు పరిష్కరించడానికి నేర్పరితనం వారిలో లేదు అనడంలో అతిశయం ఏమాత్రం ఉండదు.

అటువంటి నేపథ్యం ఉన్న మనదేశంలో వేమన గురించి తెలియనివారు ఎవరూ ఉండరు. వేమన ఒక సంఘసంస్కర్తగాను, ఇక తాత్వికుడుగాను, భోగిగాను, యోగిగాను ప్రసిద్ధులు. కనుక వేమన దేశసంచారం చేసి ఆయన మనుష్యులతో మమేకం అయ్యారు. కనుకనే

వారి పద్యాలు కానీ వారి భావజాలం కానీ చాలామందికి (ఇంతకు పూర్వంకాలంలో) తెలుసు. దీనివల్లనే పేరులేని ఎందరో కవులు చాటు పద్యాలు అల్లి ప్రజా బాహుళ్యంలోకి తీసుకుని వచ్చానా వాటిల్లోని దినుసు వల్ల అవి వేమన పద్యాలుగానే పేరుతెచ్చుకున్నాయి. దీనివల్ల కూడా వేమన పద్యాల్లో ప్రక్షిప్తాలు అనేకం ఉన్నాయి.

ప్రజమనిషిగా వేమన ప్రసిద్ధి చెందినా, కాలం గడిచే కొద్ది వేమన వాదం, వేమన పద్యాలుగానీ నిలిచిపోయాయి కానీ, వేమన ఎప్పటివాడు, ఏమి చేసేవాడు, ఏది చదువు కొన్నవాడు, ఎక్కడివాడు అన్న సత్యాలకు ఆధారాలు లుప్తం అయిపోయాయి. కనుక పండితులకు వేమన గురించి విపులమై, కచ్చితమైన విషయాలను చెప్పడానికి అనేకవిధాలైన అవరోధాలు కలుగుతూ వచ్చాయి. అందుకే కట్టమంచి, రాళ్ళపల్లి, బ్రౌను,గోపి గార్లుఇంకా ఎంతో మంది పండితులు, కవులు కాలనిర్ణయకారులు ఎంతో శ్రమించి వారి వారికి దొరికిన ఆధారాలను బట్టి వేమన గురించి విషయాలను అక్షరబద్ధం చేశారు.

ఇంకా ఇంకా వేమన గురించి తెలుసుకోవాల్సిన విషయాలు నేటికీ ఉంటూనే ఉన్నాయి అంటే వేమన ఒక వ్యక్తిగా చేసిన కృషిని ఒక సంస్థగా మారి సమిష్టి కృషితో పరిశోధనలు చేసి ఆ కృషి ఫలాలను అందు కోవాల్సిన స్థితి నేటికీ ఉందనడంలో ఆశ్చర్యం లేదు. ఆ కృషి ఫలితమే వేమన కేవలం సంఘసంస్కర్త గానే కాదు ఒక అభ్యుదయ కవి, దిగంబర కవి, ప్రథమ విప్లవ కవిఅని అన్నారు. అంతే కాదు ఆదిమ శాస్త్రీయ సామ్యవాద బీజాలనూ, ఈనాటి నగ్సలైటు సిద్ధాంతాల వేళ్ళనూ నేను గుర్తించి నా 'వేమనవాదం' గ్రంథాన్ని వ్రాశాను...."[1] అన్నారు. అనాల్సి వచ్చింది.

కట్టమంచి వారు, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు, దిగవల్లి వెంకట శివరావుగారు, వంగూరి సుబ్బారావుగారు, ఇటువంటి వ్యక్తులేకాక విశ్వవిద్యాలయాలు, కేంద్ర సాహిత్య అకాడమీ, వంటి సంస్థలు కూడా వేమన పై అనేక పరిశోధనలు సాగించారు. ఏతా వాతా చూస్తే వేమనపై జరిగిన అనేక పరిశోధనలు ఉన్నాయి, బ్రౌను మొదటిసంకలనం ప్రచురణ 1829 కవితత్వ విచారం కట్టమంచి రామలింగారెడ్డి 1914లో పుస్తక రూపంలోను, వావిళ్ళ ప్రచురణలు ఉన్నా రాళ్ళపల్లి వారి ఉపన్యాసాలకు ఆరేళ్ళు ముందుగానే వేమన గారి జీవితచరిత్రను వంగూరి సుబ్బారావుగారు రాసి ప్రకటించారు. మరో రెండేళ్ళకు దిగవల్లి వెంకట శివరావుగారు 'పోతన వేమనలయుగం' మీద వ్యాసం వ్రాశారు. ఇవి అన్నీ కాక ఎంతోమంది వేమనపై చేసిన పరిశోధనలు పుంఖాను పుంఖాలుగా వచ్చాయి.

వేటూరి ప్రభాకర శాస్త్రిగారు, బండారు తమ్మయ్య గారు మల్లాది రామకృష్ణ శాస్త్రి వంటి పండితులు కూడా వేమన కాలకనిర్ణయం చేయడంలో పరిశ్రమించారు. ఇదమిద్ధంగా వేమన కాలనిర్ణయం ఇంతవరకు జరగలేదు అని అనడంకూడా కద్దు. ఆ క్రమంలోనే నేటికి కొన సాగుతున్న వేమన పరిశోధనల్లో ఆనాడు ఆరుద్ర గారు చెప్పిన వెలికి తీసిన నూతనాంశాలు నేడు ఒకపరి నెమరు వేసుకుందాం.

**ఉపోద్ఘాతం :**

ప్రజాకవి అయిన వేమన గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి, ఆతురత తెలుగువారికి ఉండడంలో ఆశ్చర్యం అంత ఉండదు. ఎందుకంటే దేశం కానీ దేశం నుంచి వచ్చిన బ్రౌను దొర గారే వేమన పద్యాలపై ఆసక్తితో అనేక పద్యాలను, ఆయన గురించి సమాచారాలను అక్షర బద్ధం చేయగా మన తెలుగు వాడు, మనవాడు అయిన వేమన గూర్చి తెలుసుకోవాలన్న ఉత్సుకత మన పండితులు ఉండడం సబబే కదా. అందుకే కట్టమంచి, అనంత కృష్ణశర్మ,వావిళ్ళ, వేటూరి, తమ్మయ్య, వేదం వారు ఇలా ఎంతోమంది ఉద్ధండులు శ్రమించినా ఇంకా ఇంకా తెలుసుకోవాల్సిన తేల్చాల్సిన విషయాలు ఉన్నాయన్న ఆరుద్ర గారు వేమన పై పరిశోధన చేసి ఉప న్యాసాలుఇచ్చే వారు. ఆ క్రమంలో ఒకసారి వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇచ్చిన ఉపన్యాసం విన్న శ్రీ తల్లం పుల్లన గుప్తగారు వేమనపై ఆరుద్ర గారు చేసిన పరిశోధనలు తెలుసుకుని ఆరుద్ర గారి దగ్గర ఉన్న ఇతర వేమన వ్యాసాల పరంపరను కలిపి ఒకే గ్రంథంగా ప్రచు రించాడానికి తోడ్పడ్డారని 'మనవేమన' పీఠికలో తెల్పారు.

మనిషి అన్నాక మంచి చెడు రెండూ ఉంటూనే ఉం టాయి. కొందరిలో మంచి ఎక్కువగా ఉంటే మరి కొందరిలో చెడు ఎక్కువగా ఉంటుంది. చెడు నడత ఉన్న వాళ్ళకు బలం తోడయితే వారిదే రాజ్యం వారి చుట్టుపక్కల వారిని నానా హింసలు పెట్టి వారు అనుకున్నదే వారు చేయడం కాక అందరిచేతా చేయిస్తుం టారు. అటువంటప్పుడు సమాజంలో అక్కడక్కడ రుగ్మతలు చోటుచేసుకుంటాయి. అన్యాయాలు, అక్రమాలు బలహీనుల హింస పెరిగిపోతుంటుంది. ఇటువంటివి చూసినపుడు సామాన్యుడు ఆ పరిస్థితి నుంచి తన్ను తాను రక్షించుకోవడానికి తప్పించు కుంటాడు. లేదా ఎదరించి తాను తన కుటుంబం రక్షింప చేసుకుంటారు.

కానీ కవులు ఆ పరిస్థితులు ఎంత దూరం వెళ్తాయి. వాటి వల్ల సమాజానికి ఎంత నష్టం కలుగుతుంది అన్న విషయాలను ఆలోచించి సమాజాన్ని ఆ దుర్భర పరిస్థితుల నుంచి బాగుచేయడానికి వారి కలాలను ఝుళిపిస్తారు. వారి ఆలోచనా ధోరణిని పద్యాల్లోనో, పదాల్లోనో, సంభాషణల్లోనో, ఉపన్యాసాల్లోనో, నాటికల ద్వారానో ఎలానో ఒకలా ప్రజలకు వారు చేస్తున్న తప్పులను ఎత్తిచూపుతూనే వాటినుంచి ఎలా బయట పడాలో నేర్పిస్తారు. అట్లానే హేతువాదులు, ప్రవక్తలు అయితే ఊరూరా తిరిగి దేశసంచారం చేసి ఎండవానకు తట్టుకుని నిలబడి ప్రజలకు మంచి మార్గాన్ని చూపి వారిని ఆ మార్గంలో నడిపించడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తారు.

కొన్నిసార్లు వారు మౌఖికంగా విన్న విషయాల్లోను ఒకరి నోటినుంచి మరొకరి అందుతూ కూడా అందులో అభూత కల్పనలు కూడా చోటుచేసుకుంటాయి. అవి నిజమని నమ్మే అమాయకులు కూడా ఉంటుంటారు. అటువంటి వాటిని కూడా కవులు, పండితుల్లాంటివారు వాటిల్లోని నిజాన్ని వేరుచేసి కల్పనలను దూరం చేస్తుంటారు. అటువంటి పరిస్థితులు ఒక్కోసారి అంతకుపూర్వం మంచి చేసిన వారి గురించి కూడా కొన్ని నిజాలుప్రచారం అయితే మరికొన్ని కల్పనలు ప్రచారంలో జోరు అందుకుంటాయి. వాటిల్లో నిజమేదో అబద్ధమేదో తెలుసుకోలేనంతగా అబద్దాలు రాజ్యమేలుతాయి. అదుగో అటువంటి వాటిల్లో సమాజాన్ని బాగుచేయాలన్న సంకల్పంతో దేశసంచారం చేసి తాను తెలుసుకున్న విషయాలను ప్రజాబాహుళ్యానికి విడమర్చి చెప్పి వారిలోని విభేదాలను, అజ్ఞానాన్ని, మూఢాచారాల వంటి వాటిని దూరం చేయడానికి కృషి చేసిన వేమన విషయంలోను ఆయన రచించిన పద్యాల విషయంలోను ఎన్నో ప్రక్షిప్తాలు చోటుచేసుకున్నాయి.

వేమన గురించి అందరికీ అన్నీ తెలియదు అనడంలో సంశయం లేదు. కానీ చాలామందికి వేమన గురించి చాలా విషయాలే తెలుసు అనడంలో సంశయం లేదు. పామరులు వారి వారి ప్రాంగణాల్లో వారి వాదనలు వినిపిస్తూ ఉంటే పండితులు, హేతువాదులు, దార్శ నికులు, కవులు, ప్రవక్తలు ఇలాంటి వారంతా వారు నమ్మిన సిద్ధాంతాన్ని వారు ప్రజల్లోకి వారి వారి మార్గాల్లో తీసుకుని వెళ్తుంటారు. వారు చూసిన ప్రపంచంలోని చెడును కడిగివేసి మంచి దారిలో పెట్టాలన్న తలంపుతో ఎన్నో విషయాలను ప్రజలకు అవగాహన చేస్తూంటారు.

**ఉదా** : రామాయణకాలంనాటి విషయాలు ఎలాగైతే మన భారతదేశంలోనే కాక ఇతర దేశాల్లోను అనవాళ్లు ఉన్నాయని అంటున్నారో అట్లానే వేమన విషయంలోను మన భారతదేశంలోనే అనేక మంది అనేక కాలాలను వేమన కాలం అని సూచిస్తుంటారు. ఆయన చేసిన మంచినే కాదు ఆయన చదువుకున్న విషయాల్లోను ఒక్కొక్కరు ఒక్కోలా చెప్తారు. కొందరు అసలే చదువు కోలేదు అంటే వేమన మంచి పండితుడు ఘనాపాఠి అనే వాళ్లు ఉన్నారు. వేమన మా ప్రాంతం వాడంటే మా ప్రాంతం వారు అనేవారు ఉన్నారు. అంతెందుకు కట్టమంచి రామలింగారెడ్డి గారు వారి కవితత్త్వ విచారంలో "వేమన గారికి పుస్తక జ్ఞానం ఇంచుమించు సున్న వ్యాకరణము, చందస్సు, అలంకార శాస్త్రము మొదలగు వానిలో నీతనికి శక్తి యెంత తక్కువో భక్తియు నంత తక్కువ"[2]

"వేమన సామాన్యముగ వ్రాత చదువులు చక్కగా వచ్చు వరకు కొన్నాళ్ళు బడిపంతులు బెత్తపు దెబ్బలు

తిని, తరువాత.... పురాణములందలి కథలలో సామాన్యముగ నందరు నెరుగని కథలనీతడెరిగినట్లు అనేక పద్యములు తెల్పును. "[3] అని శర్మ గారు అంటారు.

ఇలా కేవలం ఆయన చదువు విషయంలోనే కాదు ఆయన రచించిన పద్యాల విషయంలోను విభేదాలు ఉన్నాయి. కొందరు 'ఇది వేమన రచనే అని చెప్పడంమే కాదు చాటుపద్యాల్లో ఇది ఉంది అని కూడా అంటారు. లేదా మరొక కవి ఈ విషయాన్నే మరోలా చెప్పారంటారు.

**ఉదా :**

దాత కాని వాని తరచుగా వేడిన
వాడు దాతయగునె వసుధలోన
అవురు దర్భయౌనె యబ్దిలో ముంచిన
విశ్వదాభిరామ వినురవేమ

ఈ పద్యం వేమన గారిదని మనకు చిన్నప్పటినుంచీ తెలుసు. కానీ ఎందరో కవులు ఇదే విషయాన్ని వేమన గారి మార్గంలోనే రచించారు. అవి కూడా మంచి ప్రచారంలో ఉన్నవే. కాస్త పాఠభేదాలు ఉంటాయే కానీ విషయం మాత్రం ఇదే ఉంటుంది. అంటే వారిని అనుకరించి వేమన రాశాడా? లేదా వేమనను అనుకరించి వారు రాశారా అని ఆలోచించినపుడు వేమన కాలం మనకు అవసరం అవుతుంది. ఆ పద్యాల కాలనిర్ణయం కూడా అవసరమే అవుతుంది.

ఒక్క పద్యాల్లోనే కాదు విషయాన్ని విగడించినప్పుడు ఎన్నో సంగతులకు నిర్ణయం చేయాల్సి వస్తుంది. అప్పుడు కచ్చితమైన ఆధారలు కావాల్సి వస్తాయి. ఆ ఆధారాలనే ఎందరో పండితులు వారి వారి పరిశోధనలను బట్టి వారు నిగ్గు తేల్చామని ఎన్నో విషయాలు చెప్పారు. కాకపోతే ఆ నిగ్గుతేల్చబడిన వినయాల్లోనూ భేదాలు చోటు చేసుకున్నాయి. ఒకే విషయాన్ని చాలామంది చాలా రకాలుగా చెప్పారు.

**ఉదా :** వేమన గారు 1600-1752 మధ్య ఎప్పుడో ఉన్నట్లు సురవరం ప్రతాపరెడ్డిగారు అంటారు. బ్రౌను దొరగారు రాయించి పెట్టుకున్న సంపుటాల్లో వేమన గారు 1652లో జన్మించినట్టు 1725లో సిద్ధి పొందినట్టు నోటు చేసుకున్నారు.

ఇలా ఇంకొంతమంది వేర్వేరు కాలనిర్ణయాలు చేశారు. అటువంటి విషయాల్లో బండారు తమ్మయ్య గారు "మహాశయులారా! వేమన కాలనిర్ణయమునకు దగు మార్గము లన్నియు నయోమయములుగ నున్నవి. నా యభిప్రాయములు సనియైనవె యని నే చెప్పజాలను" అని స్పష్టంగా చెప్పారు. అంతటి పండితులే అట్లా అన్నారంటే ఎవరి పరిశోధన ప్రకారం వారు చెప్పె విషయం సమంజసమే అనిపిస్తుంది కదా. అందుకే వేమన జీవితచరిత్రలోను, ఆయన రచించిన పద్యాల్లోను ఎన్నో విభేదాలు ఉంటాయి. కొంతమంది ఎప్పుడైతే ఏముంది? ఆయన చెప్పిన మంచిని గ్రహించి ఆ త్రోవలో నడిస్తే చాలు అనుకుంటారు. ఇలా అనుకుంటే సమస్య ఉండదు. కానీ ఎవరు ఎప్పుడుచెప్పారు. నా వాళ్ళు చెప్పిందే నిజం వారు చెప్పింది కాదు అన్నప్పుడు సమస్య బయలుదేరుతుంది. ఇది పూర్వకవుల్లో సహజమే.

కనుకనే ఆరుద్ర కన్నా ముందు ఎంతోమంది వేమన గురించి చెప్పిన ఇంకా ఇంకా వేమన గురించి తెలుసుకోవాల్సిన విషయాలు ఉన్నాయని అవి ఇవి అని 'మన వేమన' అన్న ఉపన్యాసాల కూర్పులో ఆరుద్రగారు ఎన్నో నూతనాంశాలను చెప్పారు. వాటిగురించి కొద్ది పరిచయం ఈ వ్యాసంలో చేయడానికి ప్రయత్నిస్తాను.

**కీలకపదాలు :** నయోమయములు, మస్తిష్కం, లోకాయుతులు, చార్వాకం, నిజ నిర్ధారణ

**వేమన గూర్చి చెప్పిన నూతనాంశాలు :**

వేమన గారిని ఈకాలంనాటి వారు చూడలేరు. చూడరు కూడా మనకు ముందు తరం వారు కూడా అందరూ చూచి ఉండకపోవచ్చు. కానీ వేమన చిత్రాన్ని చూచిన వారు ఇది వేమనే అని చెప్పడానికి మనం వెనకాడము. ఎందుకంటె మన మస్తిష్కంలో వేమన దిగంబరుడుగా చిత్రితమై పోయి ఉంది. దీనికి కారణం అనేక వేమన పద్యాల్లో ఆయన చిత్రం దిగంబర చిత్రంగానే ఉంది. కానీ అసలు వేమన దిగంబరుడా అనే మీమాంస కూడా ప్రచారం లోఉంది. అందుకే ఆరుద్ర గారు వేమన చిత్రం పైన పరిశోధనలు చేసి ఇలా చెప్పారు.

వేమన గారు చూడని దర్శనం లేదు తొక్కని మార్గం లేదు అని గట్టిగా నమ్మడానికి తగినన్ని పద్యాలు ప్రతి విషయం మీద మనకు లభిస్తాయి. ఇందులో ఏ పద్యాలు వేమన చెప్పారో ఇప్పటికీ నిర్ణయించడానికి మనకు వీలు లేదన్నది ఆరుద్రగారి అభిప్రాయం అలానే దిగంబర విషయంలోను అంతే వేమన చెప్పిన పద్యం ప్రకారం వేమన దిగంబరుడే అనవచ్చా?

తల్లి గర్భమందు దా బుట్టినప్పుడు
మొదల బట్టలేదు తుదను లేదు
నడుమ బట్ట గట్ట నగుబాటు కాదొకో
విశ్వదాభిరామ వినురా వేమ

ఈ పద్యాన్ని బట్టి వేమన దిగంబరుడా అంటే కొన్ని చిత్రాల్లో గోచితో కూడా కనిపిస్తారు. దీనికి కారణం ఆరుద్ర గారు వేమనకు దిగంబరత్వానికి ముందు వారికి పుట్టగోచి మాత్రం ఉండేదని చెప్పవచ్చు. దానిని వారు విసర్జించారేమో

గోచి యూడెననుచు కోతిగనాడించి
వెర్రి యోగి నూరు వెడలమంద్రు
తనదు భార్యముందు తాగోచి తీయడా
విశ్వదాభిరామ వినుర వేమ [4]

... యోగి దిగంబరుడయినప్పుడు ఊరివాళ్ళు కోపంతో ఊరు వెళ్లగొట్టిన సందర్భంగా చెప్పిన పద్యంలాగా కనబడుతుంది అంటారు. కానీ వేమన గారి శిష్యుల పీఠాలు కడపలో నేడు చాలా ఉన్నాయి. ఆ శిష్యులకు పసుపుబట్టలూ, పాంకోళ్ళూ ఒక్క గుర్రాలు నేడు నిధిగా ఉంటాయి. వీరిని చూచిన వారు మరి గురువైన వేమన దిగంబరుడై శిష్యులకు మాత్రం పసుపు బట్టలు ఎందుకిచ్చి ఉంటారు అన్న సంశయాన్ని ఆరుద్ర గారు వెలిబుచ్చారు.

అందుకే ఆరుద్ర గారు "కొల్లాపురం అగ్రహారం నివాసి" పమ్మి త్యాగరాయశెట్టిగారు తమ శ్రీ రాజరాజేశ్వరీ నికేతన ముద్రాక్షర శాలలో 1901లో వేమన పద్య సంకలనం ఒకటి ప్రకటిస్తూ దానిలో వేమనగారి బొమ్మను కూడా ప్రచురించారు. ఇది 1908 నాటి కూర్పులో కూడా ఉంది. ఈ బొమ్మ ఒక సిపాయి ఇంట్లో ఉన్న రంగుల బొమ్మకు నకలు అని ప్రకాశకులు ప్రకటించారు. ఈ బొమ్మ ఇప్పుడు ప్రచారంలో ఉన్న ప్రసిద్ధ చిత్రానికి కొంచెం వేలువిడిచిన బంధువులాగా ఉంది.

.... 1913లో రాయవరం పూర్ణయాచారి గారు బందరు నుంచి 'వేమన సూక్తి రత్నాకరం' అనే పుస్తకంలో వేసిన వేమన బొమ్మ దిగంబర చిత్రం కాదు.

1916లో నెల్లూరు జిల్లా మైపాడు నివాసి కరూరు బంగారయ్య గారు "వేమనార్యుని పద్య పదశబ్దార్థము" అనే పుస్తకంలో వ్రాసి చెన్నపట్నం పాతచాకలి పేటలో ప్రకటించారు. ఇందులో అచ్చువేసిన వేమన గారి బొమ్మ కింద 'వెర్రి వేమన' అని రాశారు.

1922 లో శ్రీవంగూరు సుబ్బారావుగారు "వేమన (సంపూర్ణ జీవిత చరిత్రము - బోధనలు)" అని గ్రంథం ప్రచురించారు. ఇందులో 'తంజావూరు రాచనగరు చిత్రపటము నుంచి తీసినది" అని వివరించి వేమన గారి పటాన్ని ముద్రించారు. ఇది ఇప్పుడు ప్రచారంలో ఉన్న బొమ్మకు మాతృక.

1926లో తమిళంలో ప్రచురితమైన "వేమన పద్దియం" అనే గ్రంథంలో ఒక వేమన గారి బొమ్మ ఉంది. దీనికి ప్రచారంలోవున్నదానికి ఏమాత్రం పోలికలు లేవు. ఈ బొమ్మ సన్యాసి బొమ్మకూడా కాదు. జందెం ఉంది.

అయితే తంజావూరు సరస్వతీమహలు లోని దిగంబర వేమన బొమ్మ వేమన గారిదేనా అని కట్టమంచి రామ లింగారెడ్డి గారు అనుమానించారు.

ఆ తరువాత ఆరుద్ర గారు 1955లో సరస్వతీమహల్ పై రేడియో వారికి ఒక ప్రసంగ వ్యాసం రాసే సందర్భంలో తంజావూరు వెళ్ళాను చూడవలసినవన్నీ చూశాను. రాచనగరు సందర్శించడమే కాక ........... ఒక దిగంబర సన్యాసిది కూడా ఉన్నట్లు లీలగా మాత్రమే జ్ఞాపకం.

మహారాష్ట్ర రాజుల కాలంలో వేమన గారు తంజావూరులో పర్యటించారని చెప్పడానికి వారి పద్యాల్లో ఒక ఆధారం లేకపోలేదు కానీ రాచనగరుకూ వారికీ, వారి బొమ్మను వేయించి పెట్టుకొనేంత ప్రగాఢ సంబంధం ఉన్నట్టు చెప్పడానికి ఏ విధమైన ఆధారాలు లేవు. ....

సుబ్బరామ దీక్షితుల వారు సంగీత సంప్రదాయ ప్రదర్శిని 1901లో రాశారు. అప్పటికి 163 సంవత్సరాల కిందట అంటే క్రీస్తుశకం 1738 ప్రాంతాలు ఆకాలంలో ఒక దిగంబర సన్యాసి ఉండడం వారికి తంజావూరు రాచనగరుతో సంబంధం ఉండడం చూస్తే వారి చిత్ర పటమే కానీ వేమన గారి చిత్రపటానికి తంజావూరు రాచనగరితో సంబంధం ఉండడానికి ప్రస్తుతం అస్కారం కనబడలేదని చెప్పవచ్చు.

అని అసలు వేమన చిత్రం పైన తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా చెప్పడమే కాక దానికి ఆధారాలను ఆరుద్రగారు సూచించారు. పైగా ఈ విషయాన్ని భావిపరిశోధకులు తేల్చవచ్చు అనే అభిప్రాయానికి వచ్చారు.

సహేతుక విషయ నిర్ధారణ: వేమన గారిలో నిక్కచ్చి తనం, నిర్మొహమాటం, అన్ని విషయాల గురించి అవ గాహన, దేనినైనా కచ్చితంగా చెప్పడం, మూఢాచారాలను, గుడ్డి నమ్మకాలను కాలరాచడం వంటివి ఎలా వచ్చాయో ఎక్కడ నుంచి వచ్చాయో ఆరుద్ర గారు చాలా చక్కగా వివరించారు. ఇప్పుడున్న ధర్మాలు కానీ, గుడ్డిగా నమ్మే విషయాలను కానీ అందులో అర్థం లేనప్పుడు వాటిని వ్యతిరేకించడం అనేది కేవలం ఇప్పుడు పుట్టిన విషయం కాదు అది శ్రీకృష్ణ కాలంనుంచి ఉన్నదే అన్నవిషయాన్ని మహాభాగవతం ఆధారంగా విపులీకరించారు. కృష్ణుని కాలంలో కృష్ణుని తండ్రి నందాదులు ఇంద్రుడిని పూజించడం అనాది ఆచారంగా ఉండేది. దానిని చర్చించి దానివల్ల ప్రయోజనం ఏమీ లేదని అందరినీ ఒప్పించి కొండదేవుడిని పూజించాలని కృష్ణుడు చెప్పాడని, కేవలం చెప్పడమే కాక వారిని ఒప్పించి వారిచేత గోవర్ధన గిరిని పూజించాడని ఆరుద్రగారు చెప్తారు.

అట్లానే రామాయణ కాలంలోని కానీ ఇతర రాజుల కాలంలోని గానీ వేదం చదువుకున్నవారు, వేదాన్ని ఆదరించేవారు ఎలా ఉండేవారో ఆ విధంగానే చార్వాకులు ఉండే వారని అంటే వేదాన్ని వ్యతిరేకించే వారు, అనాది మూఢాచారాలను వ్యతిరేకించేవారు ఉండే వారని ఇహలోకంలో కాక పరలోకం గురించి యజ్ఞయాగాదులు చేసేవారు ఎక్కడ ఉన్నా వారిని వారు చేసే పనులను ఆక్షేపణలు చేసేవారు అంతటా ఉండే వారని వారు ఇతరులు చేసే పనిలో ఫలం ఎక్కడ ఉందో చూపించమని, అట్లా చూపించలేకపోతే అది అంత ప్రయోజనమున్న విషయం కాదని చెప్పేమతం చార్వక మతం అని అదే లోకాయతులు అన్న నామంతో ప్రచారం అయిందని అంటారు. అంతేకాక బ్రాహ్మణులల్లో కొంత మంది ఈ చార్వక మతాన్ని లోకయతాన్ని కూడా బోధించే వారని అందుకే బ్రాహ్మణుల్లో దశవిధ బ్రాహ్మణులు ఉన్నారని ఆరుద్ర గారు తేల్చారు.

అభ్యుదయ దృక్పథం ఉన్నవారు ఆనాడు ఈనాడు కూడా ఉండేవారని వారు నిస్సందేహంగా ప్రశ్నించేవారని, ఆ ప్రశ్నలకు సమాధానాలు రాకపోతేనే, గుడ్డిగా చేసే పనులను వ్యతిరేకించేవారని వేమన గ్రహించిన తరువాతనే ప్రజలను చైతన్య పరిచారని వేమన చెప్తారని ఆరుద్ర గారు సహేతుకమైన ఆధారాలతో చెప్పారు. ఒక్కోసారి చార్వక మతం గురించి తెలియనప్పుడు వేమన చెప్పిన నీతులు ఆ మతం గురించి తెలుసుకున్న తరువాత చెప్పిన పద్యాలు బేరీజు వేసి మరీ చెప్పారు. వేమన చార్వకమతం గురించి శైవాన్ని అభిమానించే రోజుల్లో చెప్పిన పద్యం ఇది

**ఉదా :**

చాలదయ్య యింక చార్వాక మతరీతి
శక్తి శైవ మనుచు జాలనమ్మి
సరణి మిగిలి చెడదె చండాల సేవ
విశ్వదాభిరామ వినుర వేమ (వే. సూ. ర 1500)

ఇలాంటిదే మరిక పద్యం

శాక్తమతము చేత జగతి లోపల మరి
శక్తి దైవ మనుచు యుక్తి లేక
శ్వపచ వంశ సేవ జక్కంగ సేతురు
విశ్వదాభిరామ వినురవేమ

(ఆకాడమీ ప్రతి -1034)

ఇంతేకాక ఇంకా వేమన ఇలా అంటారు

గుడులు దేవతలని గుర్తులు గావింత్రు
ముష్టిబాపలనుచు మూల్గనేల

మొప్పెలకును దారి జెప్పిన ప్రాజ్ఞత
విశ్వదాభిరామ వినురవేమ (వే.సూ. ర. 1281)

ప్రజల బిచ్చం మీద బతికే బాపనయ్యలు గుళ్ళనీ, దేవతలనీ గుర్తులుగా పెట్టారని సణిగితే లాభం లేదు. అజ్ఞానులకు దారి చూపడమే ప్రాజ్ఞత నోరులేనివాళ్ళకు చెప్పేది చెవినిల్లు కట్టుకొని చెప్పాలి" అంటారు..[5]

జాతీయాలు, సరళమైన పదాలు: పెద్ద పెద్ద పదాలను కూడా వేమన నైపుణ్యంతో జాతీయాలతోను, నానుడల తోనూ ప్రజలందరికీ అర్థవంతంగా చెప్తారన్న మాటను కూడా ఆరుద్ర గారు ఇలా చెప్తారు.

ధర్మచ్ఛద్మధూర్తులు, పరపంచన ప్రవణులు అని చార్వాకులు పేర్కొన్న వారిని వేమన గారు 'దొరకోట సన్యాసులు' అన్న జాతీయంలో చెప్తారన్నారు.

అంతేకాదు మణిభద్రుడు 'సర్వదర్శన సముచ్ఛయం' టీకలో వాడిన 'ముగ్ధజనులు' అనే మాటను ఇక్కడ బండవాండ్రు' అని వేమన గారు వాడారు. ముగ్ధము ... వివేకము లేనిది, మూఢము పొరపడినది అని అర్థాలు కూడా ఉన్నాయి. బండవాండ్రు అంటే అవివేకులు వీళ్ళను మొప్పెలు అనే జాను తెలుగు మాటతో వేమన పేర్కొన్నారు.[6]

బ్రతుకు తెరువు లేని బడుగులందరు పెద్ద/
యోగివరుల మంచు సాగిరాగ
బండవాండ్రు ముందు దండంబు లిడుదురు
/విశ్వదాభిరామ వినుర వేమ
(వే. సూ. ర 2773)

ఇలా జాను తెనుగు పదాలు వేమన పద్యాల్లో కోకొల్లలుగా కనిపిస్తాయి.

వేమన దేశం అంతా తిరిగి తిరిగి సమాజంలోని సమానత్వం ఎక్కడెక్కడ ఎందుకు లేదో కనుగొని దానికి కారణాలను కూడా కనుగొన్నారు. ఆయన భావపరిణామ క్రమంలో జాతిభేదాలు, మనుష్యుల మధ్య ఆర్థిక భేదాలు ఇలాంటి వేవీ ఉండకూడదని చెప్పారు. ఒక్కొసారి ఒక్కో పరిస్థితుల్లో ఒక్కొక్కరు పైకి కిందకు వెళ్తుంటారు కనుక ఎక్కడ భేదభావం ఉండకూడదని వేమన చెప్పారని ఆరుద్ర గారు కూడా అనేక సార్లు అనేక ఉదాహరణలతో చెప్పారు. సమాజంలో సమానత్వం రావాలంటే ముందు సహనం ఉండితీరాలన్నారని ఆరుద్ర అంటారు.

బహుళ కావ్యములను బరికింపగా వచ్చు /
బహుళ శబ్ద చయము బలుకవచ్చు
సహన మొుక్క టబ్బ చాల కష్టంబు రా /
విశ్వదాభిరామ వినుర వేమ (వే.సూ.ర.2716)

నీరు పల్లమెరుగు నిజము దేవుడెరుగు అంటే నిజం తెలుసుకోవడం చాలా కష్టమని నీతి చెప్పడం చాలా తేలిక యని చెప్పడానికి అనేక విషయాలను జోడించి వేమన ఉటంకించారు. అలాంటిదే ఇది

నీతి తెలియజెప్ప నిజముగ వేమన/ పాతకముల
నెల్ల పారబట్టి
లోతు తత్త్వమరసి లోకులకును జెప్పి/
విశ్వదాభిరామ వినురవేమ (వే.సూ.ర. 2262)

వేమన విశ్వకుటుంబీకులు అని అనుకున్నా సరే వేమన ఎక్కడవాడని, ఏకులం వాడని వారి పుట్టు పూర్వోత్తరాల గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి అటు పండితులకే కాదు పామరులకు కూడా ఉంటుందని అందుకే ఒకపద్యంలో వేమన ఇలా అన్నాడని చెప్తూ

ఊరు కొండవీడు ఉనికి పశ్చిమ వీధి/ మూగసేత
కెల్ల మొదటియిల్లు
యరసి చూడ చూడ నదిముక్తి మార్గమే /
విశ్వదాభిరామ వినుర వేమ (డి. 174 -వ 467)

ఈ పద్యంలో వేమన గారు కొండవీడుకు సంబంధిం చిన వారని, ఆ ఊళ్లో పశ్చిమ వీధి వారని భావిస్తే ... 1824లో బ్రౌను దొర గుర్తించారని ...అచ్చువేయించిన వాటిల్లో ఈ పద్యం చేర్చలేదని అందుకు కారణం కూడా ఆయన వివరించారని చెప్తారు.

ఆ తరువాత ప్రజాకవి వేమన అని డా. ఎన్.గోపి గారు...

ఊరు కొండవీడు నునికి పశ్చిమ వీధి /మూగ
చింతపల్లె మొదటియిల్లు
అరసిచూడ బయలు నదె ముక్తి శివుడయా /
విశ్వదాభిరామ వినుర వేమ (వే.సూ.ర.569)

"కొండవీటి పశ్చిమ వీధి లోని బయలు (మైదానం)లో శివాలయం ఉండి ఉంటుంది. ఆ దాపుననే వేమన నివసించె ఇల్లు ఇంటి చిరునామ వివరాలు చెప్పే పద్ధతి ఇది" అని చాటుతున్నారు అంటారు.[6]

కానీ, ఆరుద్ర గారు దీన్ని పరిగణనలోకి తీసుకోకుండా వేమన కేవలం ఇది మరో గూడార్థంలో చెప్పి ఉంటారు కానీ అది ఆయన చిరునామ కాదని తేట తెల్లం చేశారు. ఎలా అంటే ఒక కవి స్వస్థలాన్ని, అందులోను వేమన గారి వంటి చాటుకవి ఉనికిపట్టును నిర్ణయించేటప్పుడు కేవలం ఒక పద్యాన్ని పట్టుకుని ప్రాకులాడడం అంత సుమచితం కాదు వేమన గారు పద్యాలన్నింటిలోనూ వాడిన స్థలనామాలను పరిశీలిస్తే కొంత నయం అంటూ వేమన వాడిన స్థలనామాలు 33 కి పైగా ఉన్నాయంటారు.

ఇది అన్నింటిని ఆధారాలతో సహా పరిశీలించి చివరకు వేమన కొండవీడు ప్రాంతం కాదు కానీ వేమన ఆ గ్రామ నామం కేవలం కైలాసాన్ని ఉద్దేశించి వాడారని నిర్ధారించారు. అంతేకాదు

**ముగింపు :**

వేమన జీవిత చరిత్ర గురించి తెలుసుకోవడానికి కేవలం ఆయన పద్యాలను కొలమానాలుగా పెట్టుకుంటే సరిపోదని ప్రజాబాహుళ్యంలో ప్రచారమైన వాటిని చారిత్రక సత్యాలను కూడా తెలుసుకోవాలంటారు ఆరుద్ర గారు. "ఆనాటి సంఘంలో వేమన గారు ఏకులంలో పుట్టి పెరిగారో ఏ మతం అనుసరించారో ఎలాగా జ్ఞానవంతులై ఏటికెదురీదారో ఏ దురాచారాన్నయినా ఎలా ఎద్దేవా చేశారో చారిత్ర సాక్ష్యాలతో తెలుసుకోవచ్చు. అందుకే వేమన మతం, అభిమతం, సంసారం సన్యాసం అనే విషయాలు తెలుసుకొనడానికి నాటి 'సామాజిక జీవనం విశ్లేషణ విధానం' కొరకు ఆకరసేకరణ చేసి ఈ విషయాలు ఉపన్యాసానికి మీదు కట్టాను నిడివి మీద మనివి చేసుకుంటాను" అన్నారు.6 ఇలా వేమన గురించి ప్రచారం లో ఉండే విషయాలనైనా, పరిశోధకులు పరిశోధించిన విషయాన్నైనా ఆరుద్ర గారు కాల సంయమనం తోను ఎంతో ఒపికతోను సంశోధించి విషయ నిర్ధారణ చేశారు. అంతేకాక ఇంకా భావి పరిశోధకులు శోధించాల్సిన అవసరమూ ఉందని చెప్పారు.

అంతేకాక కేవలం వేమన గురించి విషయాలను సేకరిస్తూనే వేమన చెప్పిన సిద్ధాంతం ఎంతవరకు నేటి సమాజానికి ఉపయోగపడుతుందో తెలుపుతూ ఆయన సిద్ధాంతాన్ని నేడు కూడా ప్రజా బాహుళ్యంలోకి తీసుకుని వెళ్తే ఈనాటి రుగ్మతలు, నేటి ప్రచార మాధ్యమాలతో ఏర్పడుతున్న కొత్త కొత్త అవివేకం, పిచ్చివాదాలను ఇలాంటి వాటిని రూపుమాపవచ్చునేది నా అభిప్రాయం.

**పాదసూచికలు :**

1. మన వేమన పుట- 3 రచన ఆరుద్ర ప్రచురణ శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి ప్రథమ ముద్రణ 1985
2. కవితత్వ విచారముఉ - పుట -5 రచన కట్టమంచి రామలింగారెడ్డి, ముద్రణ 1973 ఆంధ్ర విశ్వకళా పరిషత్
3. అనంత రాగం - వ్యాసం వేమన - పుట -47 రచన రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, ముద్రణ, 1945
4. మన వేమన ఆరుద్ర ఆరుద్ర ప్రచురణ శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి, ప్రథమ ముద్రణ 1985
5. మన వేమన రచన ఆరుద్ర పుట 98 ఆరుద్ర ప్రచురణ శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి ప్రథమ ముద్రణ 1985, వే.సూ.ర = వేమన సూక్తి రత్నాకరం రచన : రాయవరపు పూర్ణయాచారి ముద్రణ 1913
6. ప్రజాకవి వేమన రచన : డా. ఎన్. గోపి పుట 117, మన వేమన రచన ఆరుద్ర : పుట 125 ఆరుద్ర ప్రచురణ శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి ప్రథమ ముద్రణ 1985

**ఉపయుక్త గ్రంథ సూచి :**


1. ఆంధ్రుల సాంఘిక చరిత్ర సురవరం ప్రతాపరెడ్డి
2. క్షేత్రయ్య పదాలు వావిళ్ల ప్రతి
3. దశావతార చరిత్రం ..................
4. మాండలిక వృత్తి పదకోశం
5. చాటు పద్యమణిమంజరి వేటూరి ప్రభాకర శాస్త్రి
6. ప్రజాకవి వేమన డా. ఎన్.గోపి.
7. రాళ్ళపల్లి - వేమన ..............
8. వేమన చరిత్ర బండారు తమ్మయ్య
9. సమగ్ర ఆంధ్ర సాహిత్యం ఆరుద్ర


❖❖❖

Vol. 23 | Spl. Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# శతక సాహిత్యంలో – భక్తి శతకాలలో వస్తు వైవిధ్యం



– డా॥. కే. పద్మారాణి
తెలుగు అధ్యాపకురాలు, ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల (ఉమెన్), మెదక్.

**వ్యాస సంగ్రహం :**

యధావాక్కుల అన్నమయ్య కలములో ఆవిర్భవించి, పాల్కురికి సోమనాథుడి చేతిలో మెరుగులు దిద్దబడి సుస్థిర రూపాన్ని పొందిన ప్రక్రియ శతకం. మనిషికి కలియుగంలో ఆయుష్షు నూరేళ్లు. శతకానికి 100 లేదా 108 పద్యాలు ఉండి ఒకే మకుటం కలిగి ఉండటం ప్రమాణంగా ఉంటుంది. ప్రబోధాత్మకవై మనిషి జీవితాన్ని ఉన్నత స్థితిలో నడిపించేందుకు శతక ప్రక్రియ తోడ్పడుతుంది. 12వ శతాబ్దం నుండి నేటి వరకు ఎందరో కవులు శతక రచనను చేస్తున్నారు. శతకం అనేక రకాలుగా వెలువడింది. ఆధ్యాత్మిక, నీతి, వైరాగ్య, శృంగార, దేశభక్తి, ఇష్టనాయక స్తుతి, వీటితోపాటు స్థల పురాణాల పైన క్షేత్ర మహత్యాల పైన శతకాలు విశేషంగా వచ్చాయి. వీటన్నిటిలో కవి కాలం అతని చుట్టూ ఉన్న సమాజం యొక్క పరిస్థితుల ప్రభావం మనకు కనిపిస్తుంది. ఒక్కో శతకంలో ఒక్కో వైవిధ్యభరితమైన అంశాలను మనం చూస్తుంటాం ఈ అంశాలన్నింటి గురించి చెప్పడం ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశం.

**కీలక పదాలు :** వైరాగ్యం, ఆత్మ ప్రబోధం, మకుటం, సమానత్వం, జ్ఞాని, సంఘసంస్కరణ

**ఉపోద్ఘాతము :**

శతకం మనిషి జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. శతక కవులు సమాజాన్ని నిశితంగా పరిశీలించి, వారి చుట్టూ జరుగుతున్న అంశాలను శతక ప్రక్రియలోవెలువరించారు. కొంతమంది కవులు తమకు తామే చెప్పుకుంటున్నట్టుగా ఆత్మాశ్రయ రీతిలో మకుటాన్ని ఏర్పాటు చేసుకున్నారు. భక్తి, వైరాగ్య, క్షేత్ర, శతకాలలో మాత్రం ఏ దైవాన్ని గురించో చెబుతున్నారు ఆ దైవం యొక్క పేరుని మకుటంగా చెప్పారు. "ప్రాచీన సంస్కృత శతకములందు మకుట నియమము కొన్నింట పాటింపబడినను అనంతర కారమున వెలువడిన శతకములందు ఈ నియమము సడలింపబడినది. తెలుగు శతక కవులు మాత్రము భక్తి శతకములందే కాక తదితరములందును మకుటమును నియతముగా పాటించినారు తెలుగు శతకములలో మకుటము వివిధ రీతుల నొంది నును సంబందిత మకుటముల సంఖ్యే అధికము." తెలుగు సాహిత్య సమీక్ష. (పుట సంఖ్య 546.)

శతక ప్రక్రియ కాలానుగుణంగా మారుతూ వచ్చింది. కొన్ని శతకాల్లో పదమకుటం కలిగి ఉంటే మరికొన్ని శతకాలు పాదమకుటాన్ని కలిగి ఉన్నాయి, ఇంకా కొందరు కవులు ద్విపాదమకుటంతో శతకాలను రాశారు. ఇలా రాయడానికి వారు ఎంచుకున్న ఛందస్సు ప్రధానంగా ఉండి ఉండవచ్చు. ఈ విధంగా శతక ప్రక్రియవస్తువు మీ భిన్న కోణాలలో చెప్పబడింది.

**అంశ వివరణ :**

"తెలుగులో ఉదాహరణాది దేశీ ప్రక్రియలను వీరశైవ మతం ప్రచారార్థము వ్రాసి పెట్టిన శివకవులే శతకములలో కూడా ప్రారంభించుట గమనింపదగిన విశేషము." శివ కవులు శతక ప్రక్రియను పెంచి పోషించారు. వీరు వీరశైవం మత ప్రచారం వస్తువుగా తీసుకొని శతకాన్ని రాశారు. యాదవ కుల అన్నమయ్య "సర్వేశ్వర శతకం", మల్లికార్జున పండితుడు" శివతత్వసారము శతకం, పాలకురికి సోమనాథుడి వృషాధిప శతకం - వీటన్నిటిలో శైవారాధన ప్రధానమైన వస్తువుగా కనిపిస్తుంది. భక్తి ప్రధానంగా శతక ప్రక్రియ మొట్టమొదటగా వెలువడింది. తర్వాతి కాలంలో వచ్చిన శతకాలలో కూడా దాదాపుగా భక్తి ప్రధాన వస్తువుగా కనిపిస్తుంది. తర్వాతి కాలంలో తిక్కన గారు, పోతన గారు రచించిన శతకాలలో వైష్ణవ భక్తిప్రధానంగా కనిపిస్తుంది. పోతన గారు రచించిన నారాయణ శతకంలో ప్రధానంగా వస్తువు భక్తితోపాటుగా ఆనాడు సమాజంలో నాయకుడి యొక్క ప్రభావాన్ని వైభవాన్ని గురించి అద్భుతంగా చెప్పాడని, దానికి వ్యాఖ్యానం రాసిన శ్రీమాన్ కే.వి. రాఘవాచార్యులు గారు నారాయణ శతక వ్యాఖ్యానంలో ఈ విధంగా తెలియ జేస్తారు.

> ధర సింహాసనమై, నభంబు గొడుగై తద్దేవతల్ భ్రుత్యులై,
> పరమామ్నాయముల్లెల్ల వంది గణమై బ్రహ్మాండ మాగారమై,
> సిరి భార్యమణియై, విరించి కొడుకై శ్రీగంగ సత్పుత్రి యై
> వరున న్నీ ఘనరాజసంబు నిజమై వర్ధిల్లు నారాయణా (అక్షరమాల, పుట సంఖ్య 213)

నాయకుడు వీధుల్లో నడిచి వస్తుంటే సాక్షాత్తు శ్రీమన్నా రాయణడే వస్తున్నట్లుగా ప్రజలుభావించే వారని, ఇలాంటి సంఘటనలు ఇప్పటికీ ఉత్సవాలలో కనిపిస్తూ ఉం టాయని తెలియజేశారు. ఇందులో భక్తి ప్రధాన వస్తువు అయినప్పటికీని, భగవంతుడు ప్రజల కోరికలను తీరు స్తాడు. అదేవిధంగా నాయకుడు ప్రజలకు అండదండగా ఉంటాడు అనే అంశాన్ని పోల్చి చెప్పడం ఇక్కడ విశేషంగా కనిపిస్తుంది. నాయకుడిలో నారాయణుడిని, నారా యణుడిలో నాయకుడిని చూసుకునే వైవిధ్యమైన అంశం ఈ పద్యం ద్వారా అవగతం అవుతుంది. భక్తి శతకాలలో శైవ, వైష్ణవ శతకాలు ప్రధానంగా వచ్చాయి. శైవ తత్వాన్ని, వైష్ణవ తత్వాన్ని గురించి ప్రబోధిస్తూ చెప్పారు. భగవంతుని పట్ల పూర్తి అంకిత భావం కలిగి ఉండి రాసినవి కొన్ని అయితే,భగవంతుని నిలదీస్తూ రాసినవి మరికొన్ని. శతకం అనుభూతిని, అనుభవాలని మేళవించిన వైవిధ్య భరితమైన ప్రక్రియ.

భక్త రామదాసు కంచర్ల గోపన్నశతకంలో భక్తితో పాటు, సమాజ స్థితిగతులను, ధిక్కార స్వరం, వ్యాజ స్తుతి ఇతర అంశాలను వస్తువుగా ఎంచుకొని రాసిన సందర్భం కనిపిస్తుంది. "దాశరథీ కరుణా పయోనిది" అనే మకుటంతో దాశరథి శతకం ఉంటుంది.

> ఎంతటి పుణ్యమో శబరి యెంగిలిగొంటివివింత గాదే నీ
> మంతనమెట్టిదో యుడుత మైనికరాగ్ర నఖాంకు రంబులన్
> సంతసమంద జేసితివి సత్కుల జన్మమదేమి లెక్కవే
> దాంతము గాదే నీ మహిమ దాశరథీ కరుణా పయోనిధీ .. (పుట సంఖ్య 98)

**దాశరథీ శతకం (పుట సంఖ్య 78)**

ఇందులో రామదాసు రాముడి యొక్క గుణాన్ని ప్రధాన వస్తువుగా చేసుకొని రచించాడు. శబరి ఎదురు చూపుల్లోని బాధ తొలగించడం, ఆపదలో ఉన్నప్పుడు సహాయం చేసిన వారిని మరిచిపోకూడదు అనే అంశాన్ని తెలియజేసే ఉడుత మేనిపై గీతలు నేటికీ తార్కాణాలుగా కనిపిస్తున్నాయి. మానవుడిగా ఉన్న రాముడు తను చేసిన పనుల వల్ల భగవంతుడు అయ్యాడు. ఈ శతకంలో రామ భక్తితో పాటు రాముడి గుణగణాలను కూడా ప్రస్తావిం చడం కనిపిస్తోంది.

భగవంతుని నిలదీస్తూ, ప్రశ్నిస్తూ, నిందలు వేస్తూ, పొగుడుతూ తదితర అంశాలను వస్తువులుగా తీసుకొని

శతకాన్ని రచించిన కవులున్నారు. ప్రధానంగా మనకు కాసుల పురుషోత్తమ కవి కనిపిస్తారు.

శ్రీకాకుళ ఆంధ్ర దేవుని యొక్క ఆలయం శిథిల మవుతుంటే దానిని బాగు చేసుకోవాలని, మనుషుల వల్ల కాదు అని, కేవలం నీవే భగవంతుడే తలుచుకొని చేయించుకోవాలని, ఆ ఆలయానికి పునర్వైభవం తీసుకు రావాలని ఆర్తితో ఆవేదనతో శతకాన్ని రచించాడు.

ఆలు నిర్వాహకురాలు భూదేవి యైఅఖిలభారకు
డను నాఖ్యా దేచ్చె
నిష్ట నంవన్నురా లిందిర భార్యయైం
కామితార్తుడనన్న ఘనతదెచ్చె
గమలగర్భుండు సృష్టికర్త తనూజుడై బహు
కుటుంబంకుడన్న బలిమి దెచ్చె
గలుష విధ్వంసిని గంగ కుమారి బతిత
పావనుడన్న ప్రతిభ దెచ్చె
ఆంధ్రుబిడ్డలు డెచ్చు ప్రఖ్యాతిలేవి మొదటి
నుండియు నీవు దామోదరుడివే
చిత్రచిత్ర ప్రభావ దాక్షిణ్య భావ హత విమత
జీవ శ్రీకాకుళాంధ్ర దేవ!

ఆంధ్ర నాయక శతకం (పుట సంఖ్య 15.)

ఇందులో ప్రధాన వస్తువునింద చేయడం, ఒకవైపు నీకు ఇన్ని పేర్లు ఉన్నాయి అని చెబుతూనే, కానీ నీకు ఇన్ని పేర్లు రావడానికి కారణం స్త్రీల యొక్క గొప్పతనమే కానీ నీది కాదు, నీ శక్తుల ద్వారానే గనక ఈ పేర్లు సంపాదించుకుని ఉంటే నీ గుడిని బాగు చేసుకోవడం ఒక లెక్క అంటూ సాక్షాత్తు భగవంతుని నిలదీస్తున్నట్టుగా ఈ శతకం కనిపిస్తుంది. వైవిధ్యమైన రీతిలో కవి ఈ శతకాన్ని రచించాడు.

### వాసా కృష్ణమూర్తి గారుభక్త జీవన శతకం

శతకంలో వస్తువు విభిన్నంగా కనిపిస్తుంది. భగ వంతుడు యొక్క లీలా విశేషాలను, అవతారాలను వర్ణిస్తూ చెబుతూనే, తాత్వికమైన భావనలను కూడా చెబుతాడు. యుగాలలో భగవంతుడు ఆయా రూపాల్లో ఆవిర్భవించినప్పుడు, ఆ పరమాత్మను చేరుకోవడానికి అనేక మంది ఋషులు యోగులు తపస్సులు చేసి ప్రసన్నం చేసుకున్నారు. సంసార సాగరంలో చిక్కుకున్న మానవుడు భగవంతుని చేరుకుని విధము చూపించమని ప్రార్థించే క్రమం ఈ శతకంలో కనిపిస్తుంది.భక్తి శతకమే అయినప్పటికిని ఇందులో వస్తువు తాత్విక నేపథ్యంతో కూడుకొని ఉంటుంది.

"యోగిని గాను నేను మరి
యోగ రహస్యమెఱుంగ నించు కన్
భోగమే కోరు నామనసు
భోగము యోగము నొక్క చోట సం
యోగమునందు నే తమము
నుజ్వల తేజము నొక్కాటవునే యీ
భోగము వీడి యోగమును
బొందగజేయుము భక్త జీవనా"

(పుట సంఖ్య 26)

### తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ

ఓ ఈశ్వరా! నిన్ను చేరుకోవాలని చాలా ఉంది కానీ, కోరికలని భోగములు నన్ను నీ వైపు ఆలోచించ కుండా చేస్తున్నవి వాటి నుండి నన్ను విముక్తిని చేయగలవు అంటూ కవి తాత్విక అంశాలను తెలియజేశారు.

నరసింహ శతకము గురించి తెలియని తెలుగు ప్రజలు ఉండరు. ఈ శతకంలో భక్తితో కూడిన వైరాగ్యం ప్రధాన వస్తువు. లోకానుభవం నుండివచ్చిన భావననే నరసింహ శతకం. శేషప్ప కవి గారు తన జీవితంలో గమనించిన అనుభవంలోకి వచ్చిన అంశాలను ప్రధాన వస్తువులుగా తీసుకొని ఈ శతకాన్ని రచించారు. మనం చేసే కర్మలను బట్టి వారి జీవనం ఉంటుంది. కర్మ ముగిసిన నాడు ఎవరైనా వెళ్ళిపోవాల్సిందే. సత్కర్మలు చేస్తే స్వర్గం, సంతోషం, చెడుకర్మలు చేస్తే నరకం బాధ కలుగుతాయి. ఇలాంటివి దుష్కర్మలో ఈ పద్యంలో కవి చక్కగా చెబుతారు.

పరుల ద్రవ్యము మీద భ్రాంతినొందిన వాడు
పరకాంతల నపేక్ష పడేడు వాడు
అర్థుల విత్తంబు లపహరించుడి వాడు
దాన మియ్యంగా వద్దనిడివాడు
సభలోపల నిలిచి చాడిలు చెప్పాడు

పక్షపు సాక్ష్యంబు పలుకువాడు
విష్ణుదాసుని చూసి వెక్కిరించడి వాడు
ధర్మసాదుల దిట్ట దలచువాడు
ప్రజల జంతువుల హింసించు పాత కుండు
కాళ్ళకింకర గదలచే నష్టమొందు
భూషణ వికాస శ్రీ ధర్మపురి నివాస!!

(పేజి నెంబర్ 61)

మనిషి మంచి చెడుల మధ్య తారతమ్య భావనలను తెలుసుకొని జీవనమును కొనసాగించాలని చెబుతాడు. అద్భుతమైన మానవ జన్మ పొందినందుకు సంతోష పడాలి. పదిమందికి ఉపయోగపడేలా మనిషి నడవడిక ఉండాలి. విచ్చలవిడితనాన్ని వదిలి, సన్మార్గంలో జీవనాన్ని కొనసాగించిన వాడికి ముక్తి లభిస్తుంది. వివేకం లేకుండా వెర్రిగా ప్రవర్తించిన వాడికి నరక బాధలు తప్పవు అంటూ సమాజాన్ని అప్రమత్తం చేస్తాడు.

**ముగింపు :**

ఈ విధంగా భక్తి శతకాలలో భక్తితో పాటు విభిన్నమైన వస్తువు వైవిధ్యం కనిపిస్తుంది. భక్తి శతకం అనగానే దేవుని స్తుతిస్తూ, నామాలను జపిస్తూ రాసిన ప్రక్రియ కాదు. భక్తి మనిషిని చెడు ఆలోచనలు చేయకుండా ఉంచే మార్గం. కొంత కష్టమే అయినప్పటికీ ఆచరిస్తే జీవితం ఆనందమయం అవుతుంది. పైన తీసుకున్న శతకాలలో కవులు భగవంతుని వేడుకోవడం, పొగడడం, ధర్మాన్ని పాటించడం ద్వారా మానవుడు దేవుడైన విధానం, సమాజంలో జరుగుతున్న పలు అంశాలు నిలదీస్తూ భగవంతుని సూటిగా ప్రశ్నించడంలాంటి వాటిని చూశాము. శతకం ఎప్పుడూ సమాజ శ్రేయస్సును, ఉన్నతిని పెంపొందిస్తుంది. విద్యార్థి దశ నుండే శతక ప్రక్రియ పట్ల ఆసక్తిని పెంపొందించుకున్నట్లయితే ఆ విద్యార్థి నడవడికలో సత్ప్రవర్తన కనిపిస్తోంది. ఈ మధ్య కాలంలో చాలామంది విద్యార్థులు గురువుల ప్రోత్సాహం వలన తమ చుట్టూ జరుగుతున్న అంశాలను శతక ప్రక్రియలోరాస్తున్నారు. వైవిధ్యమైన వస్తువుని ఎంచుకొని శతకాన్ని రాసినప్పుడు సమాజానికి ఆదర్శవంతంగా, మార్గదర్శకంగా నిలబడతారు. ఇప్పటికీ ఇన్ని శతకాలను చదువుతున్నామంటే అందులో ఉన్న వస్తువు చెప్పిన విధానం ప్రధానమైనది.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1. నరసింహ శతకము - శేషప్ప కవి. నిదునూరి గంగాధరం గారి పరిష్కృతము
2. భక్తజీవక శతకము - వాసాకృష్ణమూర్తి గారు ప్రచురణ తిరుమల తిరుపతి దేవస్థానం
3. దాశరథి శతకం - రామదాసు కంచర్ల గోపన్న
4. అక్షరమాల - ఆచార్య వెల్దండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం

❖❖❖

Vol. 23 | Spl. Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# వేమన శతక పద్యాలలో వ్యక్తిత్వ వికాసం – పరిశీలన



– డా॥. డి. లక్ష్మి నరసింహం
అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కాగజ్‌నగర్.

**పరిచయం :**

సాధారణంగా నూరు పద్యాలు గల రచనను శతకంగా పేర్కొంటారు. అయితే శతకంలో నూరు కంటే ఎక్కువ పద్యాలు సైతం ఉండవచ్చు. శతక ప్రక్రియ తెలుగు సాహిత్యంలో ఎంతో విశిష్టమైన ప్రక్రియగా మనకు కనిపిస్తుంది. ఎందుకంటే మానవ జీవితంతో ముడిపడ్డ చాలా అంశాలను శతక ప్రక్రియ స్పృశించింది. నీతి, ఆధ్యాత్మిక, వైరాగ్య, సామాజిక మొదలు అంశాలు మనకు ఆయా శతకాలలో కనిపిస్తాయి. క్రీస్తు శకం 12వ శతాబ్దం నుండి తెలుగులో శతక రచన మనకు కనిపిస్తున్నది. పాల్కురికి సోమనాథుడు రచించిన వృషాధిప శతకాన్ని తొలి తెలుగు శతకంగా ఎక్కువ మంది అంగీకరించారు.

**శతక లక్షణాలు :**

1) **పద్య సంఖ్యా నియమం** : సాధారణంగా శతకంలో నూట ఎనిమిది పద్యాలు లేదా అంతకంటే ఎక్కువ పద్యాలు ఉంటాయి.

2) **మకుట నియమం** : శతక పద్యాలలో ప్రతీ పాదం చివర సంబోధన రూపంలో గల సుమతీ, భాస్కరా మొదలైన వాటిని మకుటం అంటారు. ప్రతి పద్యం చివర మకుటం పునరావృతం అవుతుంది.

3) **ఛందో నియమం** : తెలుగు శతకాలలో మకుట నియమంతో పాటు ఛందో నియమం సైతం కలదు. చాలా వరకు ఒక శతకంలో ఒకే రకమైన ఛందస్సుతో కూడిన పద్యాలను మనం గమనించ వచ్చు. ఉదాహరణకు వేమన శతక పద్యాలు ఆట వెలది చందస్సులో ఉంటే సుమతి శతక పద్యాలలో కంద పద్యాలుంటాయి.

4) **ముక్తక నియమం** : శతక పద్యాలు ప్రతి పద్యం దానికదే విడివిడి భావాలను కలిగి ఉంటుంది. అనగా ఒక పద్యం మరో పద్యంతో సంబంధాన్ని కలిగి ఉండకపోవడమే ముక్తక లక్షణం.

ఈ విధంగా చూసినప్పుడు శతకాన్ని కొన్ని ప్రత్యేక లక్షణాలను కలిగిన ఒక సాహితీ ప్రక్రియగా మనం గమనించవచ్చు.

**వేమన శతక పద్యాలలో వ్యక్తిత్వ వికాసం - పరిశీలన**

తెలుగులో అనేక శతకాలు వెలువడినప్పటికి వాటిలో అత్యంత ప్రజాదరణ చూరగొన్న శతకం వేమన శతకం. వేమన శతకం ఆటవెలది ఛందస్సులో ఉండి "విశ్వదాభి రామ వినురవేమ" అనే మకుటాన్ని కలిగి ఉంది.

ముఖ్యంగా నీతి, వ్యక్తిత్వం, సామాజిక సంబంధ అంశాలు దాదాపు మనకు వేమన శతకంలో ప్రతిపద్యంలో కన్పిస్తాయి. ఇక వేమన శతకంలోని కొన్ని పద్యాలను

వ్యక్తిత్వ వికాసపు కోణంలో పరిశీలించడమే ఈ వ్యాసం యొక్క ముఖ్యమైన ఉద్దేశ్యం.

తెలుగు నేలపై విస్తృత ప్రచారం పొందిన వేమన శతకం లోని ఒక్క పద్యమైనా రాని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. 1829 లో సి.పి.బ్రౌన్ వేమన పద్యాలు సేకరించి ప్రచురించడంతో వేమన శతకం వెలుగులోకి వచ్చింది. వేమన శతకంలో వేల పద్యాలు ఉన్నప్పటికీ మచ్చుకు కొన్ని పద్యాలను వ్యక్తిత్వ వికాస కోణంలో ఇక్కడ పరిశీలించడం జరిగింది.

> "అనగనగా రాగ మతిశ యిల్లు చునుండు
> తినగా తినగా వేము తీయనుండు
> సాధనమున పనులు సమకూరు ధరలోన
> విశ్వదాభిరామ వెనురవేమ"

అనే పద్యంలో ఎంతో గొప్ప వ్యక్తిత్వ వికాసం దాగి ఉంది. ఏ పనినైనా ప్రతిరోజు నిష్టతో చేస్తుంటే దానిలో ప్రత్యేక నైపుణ్యం సాధించవచ్చుననే సందేశాన్ని ఈ పద్యం మనకు తెలియజేస్తుంది. ఇది నేటి విద్యార్థి లోకానికి ఉపయోగకరమైన పద్యముగా భావించవచ్చు.

మరో పద్యంలో "అనువు గాని చోట నధికుల మనరాదు" అంటూ మనకు పరిస్థితులు అనుకూలించ నప్పుడు మనం అనవసరపు గొప్పలకు పోరాదు అంటూ "కొండ అద్దమందు కొంచమై ఉండదా" అంటూ గొప్ప దృష్టాంతాన్ని వేమన మన ముందుంచుతాడు. మన వ్యక్తిత్వ వికాసంలో ఇలాంటి మౌలికాంశాలు విస్మరించ లేనివని చెప్పవచ్చు.

ఇక

> "అల్పుడెపుడు పలుకు నాడంబరముగాను
> సజ్జనుండు పలుకు చల్లగాను"

అనే పద్యంలో గొప్ప వ్యక్తిత్వం కలిగిన వాడు తక్కువగా, వియంగా మాట్లాడి విజయాలను సాధిస్తే అల్పబుద్ధి గలవాడు గొప్పలకు పోయి తిప్పలు పడటం సహజమనే నీతిని బోధిస్తాడు.

"కంచు మ్రోగినట్లు కనకంబు మ్రోగునా" అంటూ ఉదహరిస్తాడు. బంగారం లాంటి వ్యక్తిత్వం మనిషి పెంపొందించుకోవాలని వేమన ఈ పద్యంలో మనకు హితబోధ చేస్తాడు.

> "ఎంత చదువు చదివి ఎన్ని విన్నను గాని
> హీనుడవగుణంబు మానలేడు"

అంటూ చదవగానే సరిపోదు దానికి తగిన మంచి గుణం కలిగి ఉండాలని కానీ హీనుడు ఎంత ప్రతిభ ఉన్నప్పటికీ తన నీచ గుణాన్ని మాత్రం వదిలిపెట్టడు అంటూ మనకు తెలియజేస్తాడు.

> "ఓర్పు లేని భార్యయున్న పలంబేమి
> బుద్ధి లేని బిడ్డ పుట్టి యేమి
> సుద్గుణంబు లేని చదువది యేలరా"

అంటూ సంసారంలో భార్య సహనం కలిగి ఉండాలని లేదంటే ఆ సంసారం సజావుగా సాగదని చెబుతూ మంచి ప్రవర్తన లేని బిడ్డలు కలిగి ప్రయోజనం ఏమిటి అంటూ సూటిగా ప్రశ్నిస్తాడు. చదువు ఎంత ఉన్నప్పటికీ మంచి గుణం కలిగి ఉండటం ఆవశ్యకమని మనకు ప్రబోధిస్తాడు. ఎందుకంటే మనిషికి ఎంత విద్వత్తు ఉన్నప్పటికీ సత్ప్రవర్తన లేకపోతే అది నిరర్థకమనే గొప్ప సందేశాన్ని ఈ పద్యంలో వేమన మనకు తెలియజేస్తున్నాడు. మరో పద్యంలో వేమన ఇలా అంటాడు. "కోపమునకు ఘనత కొంచమై పోవును కోపమడచేనేని కోర్కె లీడేరు" అంటూ కోపం ఎంతటి పర్యవసనానికి దారితీస్తుందో తెలియజేస్తాడు. కోపాన్ని జయించిన వారే సమాజంలో గొప్ప స్థానానికి ఎదుగుతారనే సత్యాన్ని ఈ పద్యం మనకు తెలియజేస్తుంది. "చంపదగిన యట్టి శత్రువు తన చేత చిక్కెనేని కీడు చేయగరాదు" అంటు పగలు, ప్రతీకారాలతో రగిలిపోతున్న నేటి సమాజానికి సుతిమెత్తగా హితబోధ చేస్తూనే శత్రువుకైన హాని తలపెట్టరాదని చెబుతూ అవసరమైతే మేలు చేయమంటాడు. మన సమాజంలో నిరంతరం జరిగే గొడవలకు శత్రుత్వాలు పెంచుకోవడమే కారణమని ఈ పద్యంలో మనకు తెలియజేస్తాడు. "తల్లి దండ్రులందు దయలేని పుత్రుండు పుట్టనేమి వాడు గిట్టనేమి" అంటూ కుమారుడు తన తల్లిదండ్రుల పట్ల దయ, విధేయత కలిగి ఉండాలని లేదంట అలాంటి వారు ఉన్న ఒకటే లేకున్నా ఒకటే అంటూ నేటి

సమాజంలో జరుగుతున్న పరిణామాలను చక్కగా ఈ పద్యంలో వేమన వివరించాడు.

**మరో పద్యంలో**

భార్య మాటలు విని బంధువులను దూరం చేసుకోవద్దంటూ

"ఆలి మాటలు విని అన్న దమ్ములను బాసి
వేరే పోవు వాడు వెఱ్ఱి వాడు"

అంటూ నేడు చాలా కుటుంబాలలో జరుగుతున్న సంఘటనలకు మూల కారణాన్ని వెతికే ప్రయత్నం చేస్తాడు. వందల ఏళ్ల కిందట చెప్పినా ఈ విషయాలు నేటికి మన చుట్టూ జరుగుతుండటం మనం ఆలోచించాల్సిన విషయం. మరో చోట ఒక వ్యక్తి ఎంత జాగ్రత్తగా మాట్లాడాలో తెలియజేస్తూ

ఇనుము విరిగినేని ఇనుమారు
ముమ్మారు కాల్చి యతకవచ్చు కమ్మరీడు
మనసు విరిగినేని మరియతుకు నేర్చునా

అంటూ ఒక్కసారి ఎవరినైనా మాటల ద్వారా గాయ పరిస్తే దానిని సరిచేయలేమంటు గొప్ప సత్యాన్ని సోదాహరణంగా వివరిస్తాడు. కాబట్టి వ్యక్తిత్వ వికాసంలో సరైన విధంగా మాట్లాడటం కూడా ఒక ముఖ్యమైన అంశంగా చూడాలనే నీతిని ఈ పద్యం మనకు బోధిస్తుంది.

"కాని వాని తోడ కలిసి మెలుగుచున్న
కాని వాని వలనే కాంతురవని"

అనే పద్యంతో నీచునితో, దుష్టునితో తిరిగినప్పుడు లోకులు మంచివారిని కూడా నీచుని గానే పరిగణిస్తారు. ఎందుకంటే తాటి చెట్టు కింద కూర్చుని పాలు త్రాగినానంటే ఎవరు నమ్ముతారు అంటూ దుర్జన సాంగత్యం వలన వచ్చే చెడ్డ పేరును మంచి ఉదాహరణతో మన ముందు ఉంచుతాడు వేమన.

సజ్జన సాంగత్యం అనేది వ్యక్తిత్వ వికాసంలో అలవర్చుకోవలసిన ఒక మంచి లక్షణంగా ఈ పద్యం నుండి మనం నేర్చుకోవాలి.

**మరో పద్యంలో**

నీళ్లలోన మీను నెరమాంసమాశించి
గాలమందు చిక్కు కరణి భువిని!
ఆశ దగిలి నరుడు నారీతి చెడిపోవు"

అంటూ ఎరగా ఉంచిన మాంసపు ముక్కకు చేప ఆశపడి దాని జీవితాన్ని కోల్పోయినట్లు చిన్న చిన్న ఆనందాల కోసం ఆశపడి మనిషి సైతం జీవితాన్ని చేజేతుల నాశనం చేసుకుంటాడని ముక్తాయింపు ఇస్తాడు. ఎందుకంటే తాత్కాలిక సుఖాలకు, ప్రలోభాలకు లొంగి మనుషులు ఎంతటి కష్టాలను కొనితెచ్చుకుంటున్నారో వేమన ఎంతో చక్కగా ఈ పద్యంలో మనకు వివరిస్తాడు. ఇది నేటి విద్యార్థి లోకానికి ఎంతగానో పనికి వచ్చే పద్యం. ఎందుకంటే తాత్కాలిక ఆనందాల కోసం విద్యార్థులు వారి భావి జీవితాలను ఫణంగా పెట్టడం మనం గమనించవచ్చు. కాబట్టి వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకునే క్రమంలో ఇలాంటి తాత్కాలిక ఆశలకు ప్రలోభాలకు విద్యార్థులు లొంగరాదనే గొప్ప సందేశాన్ని ఈ పద్యం మనకు అందిస్తుంది.

**ముగింపు :**

ఈ విధంగా చూసినప్పుడు వేమన పద్యంలో గొప్ప వ్యక్తిత్వ వికాస అంశాలను మనం ప్రతి పద్యంలోనూ గమనించవచ్చు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. వేమన రాసిన ప్రతి పద్యం మన వ్యక్తిత్వాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలో మనల్ని మనం ఎలా తీర్చిదిద్దుకోవాలో ఉదాహరణలతో సహా మనకు వివరిస్తుంది. మన సమాజంలోని ప్రతి అంశాన్ని వేమన పద్యాలు మనకు వివరిస్తాయి. ఉన్నతమైన వ్యక్తిత్వం ఆదర్శనీయమైన ప్రవర్తన వేమన పద్యాలు చదవడం ద్వారా మనం పొందవచ్చునే సత్యాన్ని ఈ వ్యాసంలో తెలియజేయడం జరిగింది.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1) పి.రాజేశ్వర రావు : సుమతి , వేమన నీతి పద్యాలు
2) పి.వి.కె. ప్రసాద రావు: వేమన, సుమతి, భాస్కర, కృష్ణ శతకములు, 2014. 3) ద్వానా శాస్త్రి : తెలుగు సాహిత్య చరిత్ర

❖❖❖

Vol. 23 | Spl. Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# శతక సాహిత్యానికి మార్గదర్శి ధర్మపురి శేషప్ప కవి



- డా॥. వామనమూర్తి

తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్.

**పరిచయం :**

తెలుగు సాహిత్యములో వెలువడిన ఎన్నో ప్రక్రియలలో శతక సాహిత్యము ప్రముఖ స్థానాన్ని పొందినది. ఇందుకు గల కారణాలు శతక సాహిత్యము ఆత్మానుభూతిని కలిగి ఉండటము, సామాజిక జీవనానికి దగ్గరగా ఉండము ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఇటువంటి శతక సాహిత్యములో మణి కిరీటము అనదగినది ధర్మపురి శేషప్ప కవి రచించిన నారసింహ శతకము. ఈ శతకము వీరి తరువాత తరానికి ఒక దారిని ఏర్పరచింది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఎందరెందరో తెలుగు కవులకు శతక రచన పట్ల ఆసక్తిని కలిగించింది. నేటికిని కూడా వేలాది మంది కవులు శతక రచన చేయకుండా ఏ రచన చేయుటం లేదంటే నమ్మదగినదే. ఈ వ్యాసములో ధర్మపురి శేషప్ప విరచితమైన నారసింహ శతకములోని కొన్ని ప్రధాన అంశములను ప్రస్తావించెదను. భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను చక్కగా వ్యక్తీకరించారు.

**వివరణ :**

తెలుగు సాహిత్యంలో శైవముతో పాటు వైష్ణవము ప్రాధాన్యతను సంతరించుకున్నది. విష్ణుభక్తి ప్రధానంగా అనేక రచనలు వెలువడినవి. ఇందులో శతకముల సంఖ్య ఎక్కువ. ఒకప్పుడు శైవమంటూ, వైష్ణవము అంటూ రచనలు వచ్చినా అనంతర కాలంలో శివకేశవులకు అబేధము పాటించుట కనిపించినది. దశావతారాలలో ప్రతి అవతారానికి సంబంధించి శతకములు వచ్చినవి. ప్రతి అవతారాన్ని శతక రూపమున కీర్తించిన కవులు ఎందరో ఉన్నారు. పోతన నారాయణ శతకం మొదలు విష్ణు సంబంధిత శతకములు ఎన్నో ఉండగా, దశావతారాలలో నరసింహుని పైన అనేక శతకములు వచ్చినవి. నరసింహ శతకం, నరహరి శతకం, నృకేసరి శతకం, యదగిరీంద్ర శతకం వంటివి ఎన్నో కలవు. ఆంధ్రశతక వాఙ్మయములో భక్తి శతకాలు ఎంతో ప్రాధాన్యతను పొందినవి.

నరసింహస్వామి పై వెలువడిన శతకాలను పరిశీలించినప్పుడు ధర్మపురి శేషప్ప కవి రచించిన నరసింహ శతకం, నృకేసరి శతకం ఏంతో ఖ్యాతినిపొందినవి. ఈ శతక రచన కాలము నాటికి శేషప్ప కవికి భక్తి పరిపక్వ స్తితికి పరిణతి చెందినది. ఆయనలో భక్తి లౌకికానుభవం ఆధ్యాత్మిక చింతనాసక్తి వంటి గుణములు ఈతని రచనకు జీవము పోసినవి.

ధర్మపురి శేషప్ప కవి క్రీస్తుశకం 18 ప్రాంతంలో జీవించినట్లు తెలుస్తుంది. గోదావరి తీరమందలి క్షేత్రాలలో ధర్మపురి ప్రసిద్ధ క్షేత్రం. శేషప్ప మహా భక్తుడు నరసింహస్వామికి తన జీవితాన్ని అంకితం చేశాడు. నృకేసరి శతకం, నరసింహ శతకం ఈ రెండు శేషప్ప రచనలు శేషప్పకు

ప్రాచీన నీతి, భక్తి శతకాలతో పరిచయం మెండుగానున్నది. ఆధ్యాత్మిక చింతన దీనికి తోడయ్యింది. ఈ మూడు గుణాలు ఆయన పద్యాలకు జీవం పోశాయి. పద్యాలకు ధారాశుద్ధి అలవడింది. భాగవత భక్తిలో శేషప్ప కవి మైమరచి నరసింహ దివ్య నామ మంత్రము చేత దురితజాలములన్ని తోలవచ్చు అని రాయగలిగాడు.

ఈ శతక రచననాటికి కవి దీనావస్థను అనుభవించినట్లు పద్యాల వల్ల తెలియుచున్నది. ఉదర పోషణ కోసం ఎవరిని అభ్యర్థించనని, ఆ నరసింహుడే అన్నం పెట్టాలని స్తుతించాడు. పూర్వ శతకకవుల వ్యాజస్తుతి మార్గాన్ని ఈయన అనుసరించినాడు. వారి మార్గంలో భగవంతుడిని ప్రశ్నించడానికి ఉద్యమించిన సందర్భాలు ఈ శతకంలో కనిపిస్తాయి.

శ్రీ మనోహర సురార్చిత సింధు గంభీర
భక్తవత్సల కోటి భానుతేజ
కంజ నేత్రహిరణ్య కశ్యపాంతక శూర
సాధురక్షణ శంఖ చక్ర హస్త
ప్రహ్లాద వరద పాప ధ్వంస సర్వేశ
క్షీరసాగర శయన కృష్ణ వర్ణ
పక్షి వాహన నీల భ్రమరకుంతల జాల
పల్లవారుణ పాద పద్మయుగళ
చారు శ్రీ చందనాగురు చర్చితాంగ
కుంద కుద్మలదంత వైకుంఠ ధామ
భూషణ వికాస శ్రీధర్మపుర నివాస
దుష్ట సంహార నరసింహ దురితదూర

ఆభరణాల కాంతిచే ప్రకాశించువాడు. ధర్మపురంలో నివసించే వాడివి, కోటి సూర్యులంత వెలుగుతో ప్రకాశించెడు వాడివి. ఓ స్వామి నీ కళ్ళు పద్మాల్ని పోలినవి, నీ చేతుల్లో శంఖచక్రాలు ఉన్నాయి. నీవు హిరణ్య కశ్యపుడిని సంహరించి ప్రహ్లాదుడినిరక్షించావు. సదాసజ్జనులను కాపాడుతావు. ఎల్లప్పుడు పాలసముద్రంలో పవళిస్తావు. నీది నల్లని దేహ కాంతి, గరుత్మంతుడు నీకు వాహనం, నీ కురులు తుమ్మెదలాగా నల్లగా నిగనిగలాడుతాయి. అగరు వంటి పరిమళ ద్రవ్యాల చేత సుగంధం కలవాడివి వైకుంఠ నివాసివి. అని కవి నరసింహుని స్తుతిచేసినాడు.

ఆ తరువాత పద్యాలలో భక్తి వైరాగ్యాలకు సంబంధించి ఎన్నో విషయాలను ప్రస్తావించినాడు.

పద్మలోచన సీసపద్యముల్ నీమీద
చెప్ప బూనితినయ్య చిత్తగింపు
గణ యతిప్రాస లక్షణములు జాడను లేదు
పంచకావ్య శ్లోక పఠన లేదు
అమరకాండ త్రయంబరసి చూడగ లేదు
శాస్త్రీయ గ్రంథముల్ చదవలేదు
నీ కటాక్షంబున నే రచించింతి గాని
ప్రజ్ఞ నాయది గాదు ప్రస్తుతింప
తప్పు పడనేని సద్భక్తి తక్కువౌనే
చెరుకునకు వంకపోనేమి చెడునె తీపి
భూషణ వికాస శ్రీ ధర్మపుర నివాస
దుష్ట సంహార నరసింహ దురత దూర

నీ మీద సీస పద్యాలు చెప్పాలనుకున్నాను దయతో స్వీకరించు. ఛందోనియమాలు, గణ యతిప్రాసలు పాటించలేదు. అమరం, పంచ కావ్యాలు చదువలేదు. నీ దయ ఆసరాగా గ్రహించి, కృతి రచించితి అంతేగాని ఇందు నా తెలివితేటలు లేవు. చెరుకు వంకరగా పెరిగిన దాని తీపికి లోటు ఏమి లేని విధంగా నా భక్తికి లోపం ఏమీ లేదు.

నరసింహ నీదివ్య నామ మంత్రము చేత /
దురితజాలములెల్ల ద్రోలవచ్చు
నరసింహ ! నీ దివ్య నామ మంత్రము చేత /
బలువైనరోగముల్ పాపవచ్చు
నరసింహ ! నీ దివ్య నామమంత్రము చేత /
రిపు సంఘముల సంహరించవచ్చు
నరసింహ ! నీ దివ్య నామ మంత్రము చేత /
దండహస్తుని బంట్ల తరుమవచ్చు
భళిర ! నేనీ మహామంత్ర బలము చేత /
దివ్య వైకుంఠ పదవి సాధింపవచ్చు
భూషణ వికాన శ్రీ ధర్మపురి నివాస /
దుష్టసంహార నరసింహ దురితదూర !
స్వామి ! నీ పవిత్ర మంత్రాన్ని జపించుటతో
పాపాలన్నింటినీ పారద్రోలవచ్చు

కఠినమైన రోగాలను పోగొట్టవచ్చు, శత్రువులను సంహరించవచ్చు. నీ నామ మంత్ర జపము చేత యమ దూతలను తరిమి వేయవచ్చు అని, నీ నామ మంత్రము చేత వైకుంఠదామమును చేరవచ్చు అని, నామ మంత్రము యొక్క ప్రాధాన్యతని తెలియ జెప్పాడు.

పసరంబు వంజైన పసుల కాపరి తప్పు /
ప్రజలు దుర్జనులైన ప్రభుని తప్పు
భార్య గయ్యాలైనన ప్రాణనాథుని తప్పు /
తనయుండు దుష్టైన తండ్రి తప్పు
సైన్యం చెదిరిన సైన్యనాథుని తప్పు / కూతురు
చెడుగైన మాతతప్పు
అశ్వంబు చెడుగైన ఆరోహకుని తప్పు /
దంతిదుష్టైన మావంతు తప్పు
ఇట్టి తప్పులు లెరుంగక ఇచ్చవచ్చి /
నటుల మెలుగుదురిప్పుడీ అవనిజనులు
భూషణ వికాసశ్రీ ధర్మపుర నివాస /
దుష్ట సంహార ! నరసింహ ! దురితదూర

ఓ స్వామి పశువు చెడితే పసులకాపరి తప్పు, ప్రజల చెడితే రాజు గారిది తప్పు ఇల్లాలు చెడితే మగనిది తప్పు కొడుకుచెడితేతండ్రి తప్పు, సైన్యం చెడితే సైన్యాధికారి తప్పు, కూతురు చెడితే తల్లి తప్పు, గుర్రం చెడితే రౌతుతప్పు, ఏనుగు చెడితే మావటి తప్పు, ప్రజలు ఈ తప్పులు తామెరుగక ఇష్టానుసారంగా నడుస్తున్నారు. జనులు భాద్యతారహితంగా మెలుగుతున్నారుఅని భాద్యతలు గుర్తు చేశారు.

తల్లి గర్భం నుండి ధనము తేడెవ్వడు /
వెళ్లి పొయెటి నాడు వెంట రాదు...

అను పద్యములో మనిషి పుట్టుకతో ఏది సంపాదించుకొని రాడు. తాను ఎంత సంపాదించినా అనుభవించేది కొంత మాత్రమే, సంపాదించిన దానితో గర్వించడం తగదు. ఎంతటి లక్షాధికారి అయినా లవణమన్నమే తింటాడని ప్రబోధించాడు.

మాన్యంపులీయసమర్థుడు ఒక్కడు లేడు,
మాన్యముల్ చెరుప సమర్థులంత........

ఈ పద్యములో మాన్యాలు ఇవ్వడానికి సమర్థులు ఎవరూ లేరు, అందరూ చెరపడానికి సమర్థులుగా ఉంటారు, దుష్టులకు అధికారం ఇచ్చుట కూడని పనులుగా చెబుతాడు. ఎదుటి వారి తప్పులను అందరూ గుర్తిస్తారు తప్ప, తమ తప్పులను ఎవరూ గుర్తించరు అన్న విషయము విషదపరచినాడు.

అధిక విద్యావంతుల ప్రయోజకులైరి / పూర్ణ
శుంఠలు సభా పూజ్యులైరి

ఈ పద్యము నందు చదువుకున్న వారు అప్రయోజకులుగా, చదువు లేని వారు అందరి చేత గౌరవించ బడుట, సత్యవంతుల యొక్క మాట జన విరోధంగా కనిపించి, అబద్ధాలు మాట్లాడేవారు గొప్పగా చెలామణి అవుతున్నారని చెప్పాడు. ధర్మంగా మెదిలిన వారు దరిద్రాన్ని అనుభవించడం, లోభులు ధనవంతులు అవటం, పుణ్యవంతులు రోగ పీడితులు కావటం, దుష్టులు వర్ధిల్లటం, వంటివి జరుగుతున్నాయని నేటి సమాజ స్తితిని కళ్ళకు కట్టినట్టు చెప్పాడు.

అవనిలో గల యాత్రలన్నీ చేయవచ్చు......

ఈ పద్యము నందు మానవుడు భూమిపై ఉన్న యాత్రలన్నీ చేయవచ్చు, ముక్కు పట్టుకుని సంధ్యలు వార్చడం వేదాలకు అర్థంబు విడమర్చి చెప్పడం, ఎంతైనా ధనమును దానం ఈయడం అన్ని పనులు చేయవచ్చు కానీ మనసును ఒక చోట చేర్చడం మనిషి వలన కాదు, నీ పైన మనసు నిలపలేకపోతున్నాము, అని అంటాడు.

అతివిద్య నేర్చుట అన్న వస్త్రములకొరకె ..........

అన్న వస్త్రముల కొరకు చదువులు నేర్చుకోవడం, పాల కోసం పసుల పోషణ సంసార సుఖమునకు పెళ్లాడుట, గతుల కోసం సుతులను పోషించుట, శత్రుసముదాయానికి సైన్యాలను గూర్చుట, పుణ్యం కోసం దానం ఇచ్చుట, కడుపు కొరకు చదువుకొనుట, ముక్తి కొరకునీయందు భక్తి నిలుపుట మానవ సహజములని చెప్పినాడు.

అడవి పక్షులకు ఎవ్వడాహారమిచ్చెను..........

ఈ పద్యము నందు శేషప్ప అడవి పక్షులకు ఇప్పుడు

ఎవడు ఆహారం ఇచ్చెనని, మృగజాతులకు మేత ఎవరు పెట్టారని, జలచరములకు మేత ఎవడు పెడుతున్నాడని, చెట్లకు ఎవరు, నీరు పోస్తున్నారని, కడుపులోని శిశువులను ఎవరుపెంచుతున్నాడని, పాములకు విషం ఎవ్వరిచ్చిరని, పశువులకు పచ్చి గడ్డిని ఎవరు ఇచ్చారని, స్వామి నీవే అందరిని పోషించబూనితివి, నీవంటి దాత ఇంకెక్కడ కనపడని సృష్టి రహస్యాన్ని ప్రబోధించినాడు.

విద్యనేర్చెనంచు విఱ్ఱవీగగాలేదు..........

ఈ పద్యము నందు స్వామి చదువుకుంటినని విఱ్ఱవీగ లేదు. భాగ్యవంతుడనని పలుకలేదు, ద్రవ్య వంతుడనంచు గర్వపడలేదు, దానములు చేయలేదు, శౌర్యవంతుడనని సంతోషించను లేదుపుత్ర వంతుడనని పొంగలేదు, నలుగురికి మెప్పుగా నడవలేదు, ఓ నళినదళ నేత్ర నిన్ను నేను నమ్మినాను అని బ్రతుకు భారాన్ని స్వామి పై వేసినాడు.

వెర్రి వానికి ఏల వేదాక్షరంబులు..............

ఈ పద్యము నందు శేషప్ప కవి ఏల వేద అక్షరాలు మోటువానికి మంచి పాట లేల, పసుల కాపరికి పరతత్వ బోధలు ఏల, దిమ్మరులకు దైవ పూజ లేల, విటులకు విష్ణు కథలు ఏల, ద్రవ్యలోభికి దానగుణం, దొంగలకు మంచి స్నేహం, పాపాత్ములకు దయా దుఃఖాలు, చెడ్డవారికినీ మీద కోరికలు, ఇవన్నీ నీ లీలలు కాక మరి ఏమవుతాయి అని ప్రశ్నిస్తాడు.

వ్యాసుడు ఏ కులమందు వాసిగా జన్మించె..........

ఈ పద్యము నందు శేషప్ప కవి వ్యాసుడు ఏ కుల మందు వాసిగా జన్మించాడని, విదురుడు ఏ కులమందు వర్ధిల్లాడని, కర్ణుడు ఏ కులమునందుపుట్టాడని, వశిష్టుడు, వాల్మీకి శబరి ఏ కులము వారని, నీ దయగల వారికి జాతి, నీతులు లేవని ప్రబోధన చేశాడు.

మొదలైనటువంటి అనేక శతక పద్యాలలో శేషప్ప కవి సమాజంలోని మానవుల స్థితిగతులను, వాళ్ల మనోస్థితులను, మొదలైన అంశాలను స్పృశించి భక్తి రసాన్ని, తర్వాత వైరాగ్యాన్ని ప్రకటించాడు. శ్రీమహా విష్ణువుని సంబోధించడంలో కాఠిన్యం, కోపాన్ని, బెది రింపును ప్రకటించి భక్తి స్వతంత్రాన్ని ప్రకటించాడు.

**ముగింపు :**

తెలుగు శతక సాహిత్యములో అజరామరమైన నారసింహ శతకములోని భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను ధర్మపురి శేషప్ప కవి చిత్రించిన తీరు నభూతో న భవిష్యతి. భక్తిని, వైరాగ్యాన్ని, తాత్వికతను ఇంతకన్నా మరేకవి వ్యక్తిపరచలేరేమో. శతకము అంటే శేషప్ప, శేషప్ప అంటే శతకము అని రచయిత తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్నారని చెప్పవచ్చు. ఈ వ్యాసములో వీరి శతకములోని కొన్ని పద్య రత్నాలను ప్రస్తావించడం జరిగినది.

**ఆధార గ్రంథాలు :**

1. ఆంధ్ర శతక వాఙ్మయ వికాసము - డా. గోపాల కృష్ణా రావు
2. నారసింహ శతకము - ధర్మపురి శేషప్ప కవి.

❖❖❖

Vol. 23 | Spl. Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# వేమన పద్యాలు - మానవతా విలువలు



- డా॥. ఏ. వెంకట ప్రసాదు

సహాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పెబ్బేరు.

తెలుగు సాహిత్యంలో శాఖోపశాఖలుగా వికాస మొందిన కావ్య ప్రక్రియలలో శతకము ఒకటి. శతకాలు తెలుగు సాహిత్యము నందు 12వ శతాబ్దములో ఆవిర్భ వించాయి. తదుపరి శతకాలు శాఖోపశాఖలుగా పెరిగి స్వరూప స్వభావాల్లో ఎంతో మార్పును పొందాయి. శతకము తెలుగు సాహిత్యములో బహుముఖ వికాసము పొందింది. ఈ నాటికి ఎక్కడో ఒకచోట శతకాలు వెలు వడుతూనే ఉన్నాయి. తెలుగు లాక్షణికులలో విన్నకోట పెద్దన, అనంతామాత్యులు శతక ప్రక్రియను పేర్కొన్నారు.

"శతేనశతకం ప్రోక్తమ్" అనే నియమానుసారం శతకకర్తలు శతసంఖ్య గల శతకాలు రాశారు. వేమన ఈ సంఖ్యా నియమాన్ని పాటించలేదు. కాని తెలుగు శతకకర్తలంతా నూరు, నూటఎనిమిది, నూటపదహారు, అనే సంఖ్యా నియమాన్ని పాటించారు. శతకపద్యాల చివర ఒకే మకుటం ఉండటం శతక లక్షణం. తెలుగు శతకాలు ఏదో ఒక ఛందస్సుతో సాగుతాయి. తెలుగు శతకాలలో వృత్తనియమం పాటిస్తారు. వృత్తనియమం పాటించబడని శతకాలు తక్కువ. వేమన శతకాలు ఆటవెలదిలో, సుమతి శతకాలు కందపద్యాలలో, దాశరథీశతకం, భాస్కర శతకాలు చంపక, ఉత్పలమాలల్లో రాశారు.

శతకాలల్లోని పద్యాలు ముక్తకాలు. శతకాలు భావ ప్రధానంగా ఉంటాయి. కాబట్టి వీటిని భావగీతాలు అంటారు. శతకసాహిత్యాన్ని ద్విపద, గేయ, అన్యాపదేశ, అధిక్షేప, శ్లేష, అనుప్రాస శతకాలుగా వర్గీకరణ చేశారు. శతకాలలోని వస్తువు ననుసరించి భక్తిశతకాలు, నీతి శతకాలు, శృంగార వైరాగ్యశతకాలు, హాస్యశతకాలు, దేశభక్తి శతకాలు, రాజకీయశతకాలుగా విభజింపవచ్చు.

వేమన గారు ఒక మహా యోగి. మట్టిలో పుట్టి హిమోన్నత శిఖరాలు అందుకున్న మానవతామూర్తి. మనుషుల మధ్యన తిరుగుతూ మానవజీవిత సత్యాలను నిత్యము అన్వేషించి వాటిని తన అనుభవాలతో ఆట వెలదులలో అలవోకగా లోకానికి అందించాడు.

వేమనను గురించి ఆచార్య జి.వి.సుబ్రమణ్యంగారు "ఆయన సూక్తి ఆయన అంతర్వ్యక్తికి అద్దంపట్టిన అభివ్యక్తి, సాధకుడు, బోధకుడు, ద్రష్ట, స్రష్ట, మహాకవి" అని వివరించారు. "వేమన మహాకవి మాత్రమేకాదు, ప్రజాకవి, తిరుగుబాటు కవి, తాత్వికుడు, సత్యవాది, సంఘసంస్కరణాభిలాషి, దీనజన బాంధవుడు, సార్వజనీన మతస్తుడు, సరళ మానవతావాది" అని మరుపూరు కోదండరామిరెడ్డి గారు వ్యాఖ్యానించారు. జి.నాగయ్య గారు, "వేమన నమకాలపు సామాన్య జనుల ఆమోదమును పొంది ఆరాధింపబడినవాడు, ప్రజల భాషలో ప్రజలకొరకు వేదాంతమును చెప్పి తరువాతి సంస్కర్తలకు పురోగామి అయినాడని, తెలుగు కవితను

జానపదుల రసనాగ్రముపై నర్తింప జేసిన మహానుభావుడు వేమన" అని పేర్కొన్నారు. రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ "తనకు దెలిసిన వానిని నిర్భయముగా ప్రపంచమునకు బోధించు ధైర్యము, దానికి సాధనమై యిరుప్రక్కలందును మరుగు లేని మంచి పదనుగల చురకత్తి వంటి కవితాశక్తి, దానికి మెఱుగిచ్చునట్టి సంకేతదూషితము కాని ప్రపంచ వ్యవహారము లందలి సూక్ష్మదృష్టి, గాయపు మందు కత్తికే పూసికొనినట్లు తిట్టుచునే నవ్వించు హాస్యకుశలత, ఇవన్నియు వేమన్నను సృష్టి చేయునపుడు బ్రహ్మదేవుడుపయోగించిన మూల ద్రవ్యములు" అని పేర్కొన్నారు.

పాశ్చాత్య పండితులు వేమన గొప్పదనాన్ని ప్రపంచానికి చాటారు. క్రీ.శ., 1731లో ఫాదర్ లెగాన్ అనే ఫ్రెంచి మిషనరీ వేమన పద్యాల తాళప్రతి నొకదాన్ని పారిస్ గ్రంథాలయానికి పంపాదు. వేమనగారి కాలాన్ని పారిస్ ప్రతి ద్వారా లభించిన సాక్ష్యాధారాలతో శ్రీ ఆరుద్రగారు క్రీ.శ. 1627 - 1677 మధ్య కాలంగా నిర్ణయించారు, వేమన తన జీవితానుభవంతో అలవోకగా విసిరిన పద్యాలుగా వున్నవి దాదాపుగా 5000 గా వున్నప్పటికి అందులోని పునరుక్తులను, వేమన శైలికి భిన్నమైన వాటిని తొలగిస్తే సుమారు వేమనగారివి 1000 పద్యాల వరకు వుంటాయి. " విశ్వదాభిరామ వినుర వేమ" అనేది వేమన పద్యాలలోని మకుటం. దీని అర్థాన్ని ఒక్కొక్కరు ఒక్కో విధంగా వివరించిన రాళ్ళపల్లి వారు ఉన్నంతలో విశ్వమును ఇచ్చువాడు అనే అర్థమే కొంత మేలైనదని పేర్కొన్నారు. " విశ్వాన్ని ఇచ్చినవాడవైన - అంటే సృష్టికర్తకు ఇష్టుడైన ఓ వేమనా, విను" అనే అర్థమే సరియైనదిగా భావించవచ్చు.

వేమన పద్యాలలో మనకు వేమన వేదాంతం ఏమిటి అనే ప్రశ్నకు సమాధానం దొరకదు. వేమన అద్వైతి అని, వీరశైవుడని, లోకాయతుడని కొందరు ప్రకటిస్తే, మరి కొందరు నాస్తికుడని, మత వ్యతిరేకి అని అంటున్నారు. ఏది ఏమైనా వేమన పద్యాలలోని విశిష్టతను కొంత వివరిస్తాను.

వేమన 'అంబికా శివయోగి'కి శిష్యుడనని చెప్పుకున్నాడు. అలాగని శివభక్తుడు కాదు.

రాతిబసవని గని రంగుగా మ్రొక్కుచు
గునక బసవని జూచి గ్రుద్దు చుంద్రు
బసవ భక్తులెల్ల పాపులు తలపోయ
లింగమతములోన దొంగలుగా బుట్టి
ఒకరినొకరు నింద నొనరజేసి
తురకజాతి చేత ధూళియైపోదురు

అనే పద్యాలలో శైవ మతాన్ని ఆక్షేపించాడు.

తిరుపతికిని బోవ తురక దాసరిగాడు,
కాశికేగ పంది గజముగాదు,
కుక్క సింహమగునే గోదావరికి బోవ.

అంటూ వైష్ణవ మతాన్ని గూడ నిరసించాడు.

ఏ మతానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. ప్రతి మతంలో కూడ ఉన్న తప్పులను నిఖచ్చిగా ఎత్తి చూపాడు. కాబట్టి వేమన మానవతమే మతంగా గలవాడని చెప్పవచ్చు.

వేదవిద్యలెల్ల వేశ్యల వంటివి
భ్రమలబెట్టి తేట పడగనీవు

అంటూ వేద విద్యలను ఆక్షేపించాడు.

రాతిబొమ్మ కేల రంగైన వలువలు
గుళ్ళు గోపురములు కుంభములును
కూడు గుడ్డ దాను గోరునా దేవుడు

అని

శిలను ప్రతిమజేసి చాకటింటను బెట్టి
మొక్కవలదు వెర్రి మూఢులారా
యుల్లమందు బ్రహ్మముండుట దెలియరు

అంటూ విగ్రహారాధనను నిరసించాడు.

తీర్థయాత్ర కనుచు తిరుగబోయినవాడు
పామరుండు గాక భక్తుడగునె
తీర్థయాత్రచేత దివ్యుండు గాడయా

అంటూ తీర్థయాత్రలను, ఇంకా హిందూ మతములోని పెక్కు ఆచార వ్యవహారములను వేమన తిరస్కరించాడు. అలాగని వేమన మత విరోధి అనటానికి అవకాశం లేదు.

పసుల వన్నె వేరు పాలేక వర్ణమౌ
పుష్పజాతివేరు పూజ ఒకటి
దర్శనంబులు వేరు దైవంబ ఒక్కటి

అని సర్వమతాల సారాంశం ఒక్కటే అంటాడు.

వేమన "వీరశైవమునందు బుట్టి సంసార సుఖ దు:ఖములన్ని అనుభవించి రసవాద సంబంధమున్న శివయోగుల సహవాసముతో విరక్తుడై హఠయోగమును సాధించి, ఆ తరువాత రాజయోగియై, హరిహరాది సగుణోపాసన, బ్రహ్మ సాయుజ్య రూపమగు అద్వైతా నంద మనుభవించి జీవన్ముక్తుడైనాడ" ని రాళ్ళపల్లి వారు పేర్కొన్నారు.

**వేమన బోధనలు - నీతులు :**

వేమన తానెరిగిన నీతులను లోకినికి బోధించాడు.

చాకి కోకలుదికి చీకాకు పడ వేసి
మైల తీసి లెస్స మడిచినట్లు
బుద్ధి చెప్పువాడు గ్రుద్దిన మేలయా

అంటూ తాను చెప్పవలసిన నీతులను కొన్ని సార్లు కటువైన బాషలో, తీవ్రమైన భాషలో చెప్పాడు.

భూమిలోన బుట్టు భూభారమెల్లను
తనువులోన బుట్టు తత్వమెల్ల
శ్రమములోని బుట్టు సర్వంబు తానౌను

"ఉర్వికెల్ల నొక్క కంచము బెట్టి
పొత్తుగుడిపి కులము పొలియజేసి
తలను చెయ్యి బెట్టి తగనమ్మ జెప్పరా"

అనే బోధనలను నీతులను సమాజాభ్యుదయాన్ని ఆకాంక్షించాడు.

"కులము కన్న మిగుల గుణమే ప్రధానంబు "
"చంపదగిన యట్టి శత్రువు తన చేత
జిక్కెనేని కీడు సేయరాదు
పొసగు మేలు చేసి పొమ్మనుటే చాలు"

అంటూ ఉన్నతమైన మానవతా ధర్మాన్ని పేర్కొన్నాడు.

**సంఘ సంస్కరణ :**

సమకాలిక సంఘాన్ని వేమన తీవ్రంగా దుయ్య బట్టాడు. చెడును చీల్చి చెండాడాడు.

"ఎంత సేవ జేసి యే పాటు పడినను
రాచమూక నమ్మరాదు రన్న
పాముతోడి పొందు పదివేలకైనను"

అని పరిపాలకులను నిందించాడు. కుక్షింభరులై దుర్మార్గుల నాశ్రయించి కవితను అమ్ముకొనే కవులను హేళన చేస్తూ,

"తోటకూరకైన దొగ్గలి కైవను
తమిద కుడుముకైన తవుటికైన
కావ్యములను జెప్పు గండ్యాలు ఘనులైరి"

అంటాడు. హీనకులం వారిని ఎవరినీ చిన్న చూపు చూడవద్దని,

"మాలవాని నేల మరి మరి నిందింప
ఒడలనున్న మాంస మొకటిగాదె
వానిలోన వెలుగు వాని కులంబేది "

"మాట తిరుగువాడు మాలగాక" అని ప్రశ్నించి వర్ణ వ్యవస్థ పైనా, అస్పృశ్యతపైనా మొట్టమొదటగా పద్యాస్త్రా లను, సర్వమానవ సమానత్వాన్ని వేమన బోధించాడు.

**జీవిత సత్యాలు :**

వేమన గారు మానవ జీవన విధానాలలోని మంచి చెడులను పరీక్షించి మనకు తెలిసిన, తెలిసీ తెలియని జీవిత రహస్యాలను వివరించాడు. మత గ్రంధాలు చెప్పని, మహర్షులు, మతాధికారులు చెప్పలేని జీవిత సత్యాలను నిష్కర్షగా, స్పష్టంగా చెప్తాడు.

పుత్తడి గలవాని పుండు బాధైనను
వసుధలోన చాలవార్త కెక్కు
పేదవాని యింటి పెండ్లైన యెరుగరు

నేటి సామాజిక వ్యవస్థను ధన స్వామ్య వ్యవస్థను సైతం చూపే పద్యం ఇది.

ఉప్పుకప్పురంబు నొక్క పోలికనుండు
చూడ చూడ రుయుల జాడవేరు
పురుషులందు పుణ్యపురుషులు వేరయా

మానవులంతా పైకి ఒకలాగా వున్నప్పటికి వాళ్ళ ప్రవర్తన, స్వభావాలని బట్టే మంచివాడా చెడ్డవాడా అనేది అనేది బయటపడుతుంది,

అల్పుడెపుడు పల్కు నాడంబరముగాను
సజ్జనుండు పల్కు చల్లగాను
కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా

గొప్పలు చెప్పుకొన్నంత మాత్రాన గొప్పవాడవుతాడా. వినయం కలిగివుండాలి. మిడిసిపాటు ఎప్పటికైనా చేటు అంటూ వివరించాడు.

చెప్పులోని రాయి చెవిలోని జోరీగ
కంటిలోని నలుసు కాలి ముల్లు
ఇంటిలోని పోరు ఇంతింత కాదయా

అంటూ జీవితంలో ఎన్నో చిక్కులు, సమస్యలు, చిన్నవే అయినా చీకాకులు గొడవలు కలిగించి మన శ్శాంతి కరువవుతుందనే సత్యాన్ని చక్కగా వివరించాడు. ఇలాంటి జీవితధర్మాలు ఏన్నో చెప్పాడు.

**వేమన శైలి :**

వేమన తన పద్యాలలో ప్రజలలో గల వాడుక రూపాలను, మాండలికాలను తీసుకున్నాడు. అంగం, గురుడు, ఎంగిలి, నరుడు, ఎటుక, వెర్రి, పసిడి వంటి పదాలు, బొమ్మ గుడ్డు, కల్లపుడమి, బానిసకొడుకు, వాడవదినె వంటి దేశ్యపదాలను వుపయోగించాడు.

వేమన పద్యాలలో చక్కటి శిల్ప నైపుణ్యం కనిపిస్తుంది. వేమన పద్యాలు అన్ని ఆటవెలదులలో వున్నాయి. ఇందులో చివరి పాదం మకుటానికి పోయినా, మిగిలిన మూడు పాదాలలో లోకరీతిని, దానిని సమర్థిస్తూ ఒక దృష్టాంతమో, ఉపమానమో, నానుడో చాలా చక్కగా చెప్పాడు.

మేడిపండు చూడ మేలిమై యుండు
పొట్ట విప్పి చూడ పురుగులుండు
పిరికి వాని మదిని బింకమీలాగురా

అంటూ రెండు వైరుధ్యాలను చక్కటి దృష్టాంతంతో గొప్పగా చెప్పాడు. వేమన పద్యాలు ఉపమాలంకారాలు. "చిత్తశుద్ధి లేని శివ పూజలేలరా?" అనే ప్రశ్నార్థకాలతో పాఠకులకు దగ్గరవుతాడు. వ్యర్థపదాలు వాడినప్పటకి అవి శైలిలో కలిసి పోయేటట్టుగానే వుంటాయి. వేమన పద్యాలలోని పాదాలు ప్రజల వాడుకలో సామెత లయ్యాయి.

సంఘములోని లోపాలను సరిదిద్దటానికి వేమన తన కవిత్వాన్ని ఉపయోగించాడు.

"గాయపు మందు కత్తి కేపూసి కొట్టినట్లు తిట్లుచూనే నవ్వించు హాస్యకుశలత " వేమనలో కనిపిస్తుంది.

పాల సాగరమున బవ్వళించిన హరి
గొల్లపల్లె పాలు కోరనేల
ఎదుటి వారి ద్రవ్యమెల్ల వారికి తీపి

అని కవ్వించి నవ్వించే హాస్యం కూడ వేమనలో వుంది.

వేమన ఆంధ్రులలో సాటిలేని విశేషమైన లోకాను భవంతో, అద్భుతమైన ప్రతిభతో పలికిన పలుకులెల్ల పద్యాలై, ఆటవెలదులై, తెలుగువారి నాలుకలపై నాట్యమాడాయి.

**ఆధార గ్రంథాలు :**

1. వేమన పద్య రత్నాకరము - భాగవతుల సుబ్రహ్మణ్యం.
2. లోకకవి వేమనయోగి జీవితము - పద్యమంజరి - ప్రశంసలు - కళాప్రపూర్ణ మరుపూరు కోదండరామరెడ్డి.
3. తెలుగు సాహిత్య చరిత్ర - డాక్టర్ ద్వా.నా. శాస్త్రి

❖❖❖

Vol. 23 | Spl. Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# శతక సాహిత్యంలో పొడుపు కథలు



- ఎం. వేణుగోపాల్ శర్మ
తెలుగు సహాయాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్.

**ఉపోద్ఘాతం :**

శాఖోపశాఖలుగా విస్తరించిన తెలుగు సాహిత్యం ఒక్కొక్క ప్రక్రియలో ఒక్కొక్క ప్రత్యేకతను సంతరించుకొని ఆనాటినుండి నేటి తరం వరకు అందరినీ అలరించి వ్యక్తిత్వ వికాసానికి, మానసిక వికాసానికి దోహదం చేసింది. అటువంటి అనేక ప్రక్రియలలో ఒకటైన పొడుపు కథలు ఆనాటి బాలల మెదడుకు పదును పెట్టి జిజ్ఞాసను కలిగించింది. అటువంటి ప్రక్రియలలో ఒకటయిన పొడుపు కథల సాహిత్యం పైన వెలువడిన శతకాన్ని పరిశీలించెదను.

**పరిచయం :**

నిజామాబాద్ జిల్లాకు చెందిన డైట్ కళాశాలలో ఉపన్యాసకునిగా విధులు నిర్వహించిన తల్లావజ్జల మహేష్ బాబు గారు పొడుపు విడుపు అను శీర్షికతో పద్యశతకాన్ని వెలువరించారు. నిజంగా ఇది ఒక కొత్త ప్రయోగమే. ఎందుకనగా శతక సాహిత్యంలో భక్తి శతకాలు, నీతి శతకాలు, చారిత్రక శతకాలు, హాస్య శతకాలు, వైరాగ్య శతకాలు, సామాజిక శతకాలు ఇలా ఎన్నో ప్రక్రియలలో వెలువడినప్పటికిని పొడుపు కథల పైన వెలువడిన శతకాలు చాలా అరుదుగా కనబడతాయి. వృత్తిరీత్యా మహేష్ బాబు గారు తెలుగు ఉపన్యాసకులు కావడం, బాల్యం నుండి తెలుగు సాహిత్యం పట్ల ఆసక్తి కలిగి ఉండడం, తాను పాఠశాల స్థాయి విద్యను అభ్యసించేటప్పుడు పొడుపు కథల పట్ల విపరీతమైన ఆసక్తి ఉండడం వలన ఈ రచనకు దారి తీసింది. ఇలా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇప్పటివరకు వందకు పైగా శతకాలు వెలువడినప్పటికిని పొడుపు కథల పైన వెలువడిన పద్యశతకము వీరిదే మొదటిది. మళ్లీ ఇప్పటి వరకు ఈ దిశగా ఎవరూ ప్రయత్నం చేయలేదు. ఈ వ్యాసంలో పొడుపు విడుపు అను పద్య శతకములోని కొన్ని విశేషాలను చర్చించెదను.

**శతక లక్షణాలు :**

శతకంలోని పద్యాలన్నీ కూడా ఒకే చందస్సుకు చెందినవి ఉండాలి. మకుట నియమాన్ని పాటించాలి. నూరు నుంచి 108 పద్యాలు ఉండాలి. శతక నియమాలు.

**పొడుపు కథల లక్షణాలు :**

పొడుపు కథలలో సంక్షిప్తత, నిగూఢత, అపార్థద్యోతకత, కథాత్మకత, కథా రహితాత్మకత, ప్రతికాత్మకత, ఘటనా విశిష్టత, శబ్దతీక్షణత, లోకోక్తి రమణీయ కథ, లయాత్మకత, చమత్కారయుత, దృశ్యాత్మకత ధ్వన్యాత్మకత, అలంకారికత, సమస్యాత్మకత, సాంప్రదాయికత మరియు కవితాత్మకత అను 18 లక్షణాలు ఉంటాయని పూర్వ పరిశోధకులు పేర్కొన్నారు.

**పూర్వ పరిశోధనలు :**

విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి గారు పొడుపు కథలు అంశము పైన విస్తృతమైన పరిశోధన చేసి పీ.హెచ్.డి. సిద్ధాంత గ్రంథాన్ని వెలువరించారు వీరి పరిశోధనా గ్రంథమే ఈ అంశంలో ఈనాటికినీ ప్రామాణిక గ్రంథముగా నిలిచింది. ఎందరో పరిశోధకులకు పొడుపు కథల పట్ల చక్కని దిశానిర్దేశం చేసింది.

**ప్రయోజనాలు :**

పొడుపు కథల వలన లోకజ్ఞానం, వివిధ విషయాల పరిజ్ఞానం, ఆలోచనాశక్తి, జ్ఞాపకశక్తి, ధారణాశక్తి, వాచకశక్తి, సమన్వయశక్తి, ఏకాగ్రత, మానసిక వికాసం ఇలా ఎన్నో విధాలుగా విద్యార్థుల యొక్క సర్వతోముఖాభివృద్ధికి కీలకమైన భూమికనే పోషించేది. విద్యార్థుల అభ్యసనాభి వృద్ధిలో పఠనం అత్యంత కీలకమైనది. విద్యార్థులకి చదవటం పట్ల ఆసక్తిని కలిగించడానికి దోహదం కలిగించే అంశాలలో పొడుపు కథలు అత్యంత శక్తివంతమైనవి. ఒక ప్రశ్నకు ఆలోచింపచేసే జవాబే పొడుపు కథ అవుతుంది. ఇలా ఆలోచించడం వలన వారి మెదడుకు పదునుపెడుతూ ధారణాశక్తికి పదును పెడుతుంది. అంతేకాకుండా ఈ పొడుపు కథలలో పొడుపుకు ఉండే మరో లక్షణం ఆలోచించే వారిని తప్పుదోవ పట్టించే అవకాశం ఉండడం, మరియు సూత్రప్రాయమైన ముగింపు ఉండడం ప్రధానం. ఉపమానం ద్వారా ఉప మేయాన్ని చూడగలగడం, వాచ్యార్థం ద్వారా సూచించిన అంశాన్ని తెలుసుకోవడం విడుపుదనం. అంటే సమస్యను ఒకరు పొడిస్తే మరొకరు విడిపించాలి. ఈ పొడుపు కథలు చమత్కార యుక్తి కారణంగా గుడార్థ, ప్రశ్నోత్తర విధానంలో కనబడతాయి. మరొక ముఖ్యమైన లక్షణం ఏమిటంటే పొడుపు కథలని కేవలం చదువరులు మాత్రమే కాకుండా పామరులు కూడా సులువుగా చెప్ప గలుగుతారు. ఈ పొడుపు కథలకు అష్టకథ, ఒడ్డుకథ, చిక్కుముళ్ళు, చిట్కాలు, చిటుకులు, యక్ష ప్రశ్నలు విప్పే కథలు ఇలా ఎన్నో పేర్లు ఉన్నాయి. జానపదులలో అందరి చేత అలరింపబడిన ఈ పొడుపు కథలు భారతీయ అన్ని భాషలలోనూ కనిపిస్తాయి కొందరు పొడుపు కథలని పద్యంలోనూ. మరికొందరు గేయంలోను అందించినట్లు పరిశోధకులు తెలిపారు.

**పొడుపు కథలు వస్తువు :**

గృహ సంబంధమైన పొడుపుకథలు, భోజన సంబం ధాలు అయిన పొడుపు కథలు, ప్రాణ సంబంధాలు అయిన పొడుపుకథలు, వృత్తిసంబంధాల పొడుపుకథలు, శరీర సంబంధాలు అయిన పొడుపు కథలు, ప్రకృతి సంబంధాలు అయిన పొడుపుకథలు, ఆయా కాలాలలోని పరిపాలన వ్యవస్థ అవశేషాలు తెలిపేవి, ఇతర వస్తు సంబంధాలు అని 8 విధాలుగా ఆచార్య బియన్ రెడ్డి గారు తన పరిశోధనలో పేర్కొన్నారు ఈ 8 విభాగాలకు చెందిన పద్యాలను తల్లా వజ్జల మహేష్ బాబు గారు చక్కగా ఆవిష్కరించారు. మొదటి మూడు పాదాలలో వస్తు వర్ణన నాలుగవ పాదంలో ప్రశ్నా సూచకంగా ఆటవెలది వృత్తంలో శతకాన్ని వెలువరించారు.

> అడవిలోన బుట్టి హాయిగ పెంపొంది / కట్టు
> యగుచు నింటి కసవు జిమ్మ !
> నేల నాకి మూలనే నిలుచుండును / దీని భావ
> మరసి తెలుపు మోయి !! (2)

పద్యాన్ని గమనిస్తే అడవిలో పుట్టింది, అడవిలో పెరిగింది, మా ఇంటికి వచ్చింది, తైతక్కలాడింది అన్న పొడుపు కథ గుర్తుకొస్తుంది కదూ. ఇవే లక్షణాలు కలిగిన పొడుపు కథ శతక పద్యంలో ఇదే అర్థాన్ని ఇస్తుంది. అడవిలో పెరిగే చీపురు పుల్లలని కట్టలాగా తయారుచేసి ఇంట్లోని కసువుతొలగించి శుభ్రం చేస్తుంది. నేలనంత నాకి మూలనే నిలుచుంటుంది దీని భావమేమి. అని ప్రశ్నిస్తే దీని యొక్క సమాధానం చీపురు కట్ట అని అర్థం. చీపురు పుల్లలు అడవిలో పుట్టి పెరుగుతాయి. వాటిని తీసుకొచ్చి కత్తిరించి చీపురు కట్టలుగా తయారు చేస్తే ఇంట్లోని కసువు ఊడవడానికి ఉపయోగపడుతుంది. ఆ పిదప దానిని ఇంట్లోని ఒక మూలన పెట్టేస్తాము. ఇటువంటి పొడుపు కథలు తెలుగు జానపదులు నోటి నుండి అలవోకగా పలికిస్తుంటారు

> అన్ని చోట్ల నుండు హరిరూపమా ? కాదు! /
> వాసనలను మోయు వదలకుండ !

క్షణము నిలువ బ్రతుకు గలియులే తనలోన !
/ దీని భావ మరసి తెలుపు మోయి !! ( 5 )

విష్ణు పదానికి సర్వవ్యాపకుడు అని నిఘంటువు అర్థం. అంటే భగవంతుడు సర్వత్రా వ్యాపించి ఉన్నవాడు అని అర్థం. ఈ పద్యములో వస్తువు అన్నిచోట్లా ఉంటుంది, కాని హరి అంటే విష్ణువు కాదు, వాసనలను అన్ని చోట్లకూ వదలకుండా మోస్తుంది, ఒక్క క్షణము గనుక లేకపోతె బ్రతుకు ముగిసినట్లే. దీని అర్థము ఏమిటీ ? దీనియొక్క జవాబు గాలి. గాలి లేకపోతె మనిషి మనుగడ ఉంటుందా. ఉండదు కదా. ఇది విద్యార్థిని ఆలోచించేలా చేసి సమాధానమును రాబట్టడం వలన ధారణా శక్తి పెరిగే అవకాశముంటుందని పెద్దలంటారు.

అస్థి మాటలేదు మస్తకంబును లేదు ! /
కరములుండు వేళ్ళు కానరావు !
కాళ్ళు గలుగు వాని గలువ నరాకృతి / దీని
భావ మరసి తెలుపు మోయి !!( 8 )

ఈ పొడుపు పద్యములో అడిగేదిమిటంటే ఆస్తి మీద ఆశేలేదు, కనీసము తలకూడా లేదు, కాని చేతులు ఉంటాయి గాని వేళ్ళు కనబడవు. కాళ్ళు కూడా ఉంటాయి. దీనిని చూస్తె అచ్చం మనిషిని పోలినట్లుగానే ఉంటుంది. దీని అర్థం ఏమిటి. ఇటువంటి ప్రశ్నలు విద్యార్థులను ఆలోచింపజేసేవిగా ఉంటాయి. తలలేదు, చేతులు ఉంటాయి గాని, వెళ్ళు లేకపోవడమేమిటీ, కళ్ళు ఉంటాయి మొదలైన తార్కికమైన ప్రశ్నలు విద్యార్థుల మేధో వికాసమునకు పదును పెడతాయి. దీని జవాబు ఏమిటంటే చొక్కా, పాంటు.

ఆకసమున నూగు అరుదైన మేడలో / మధువు
లొలుకు గదులు, గదికి నొక్క
భటుడు, భటుని నోట పదునైన బల్లెంబు /
దీని భావ మరసి తెలుపు మోయి !! ( 9 )

ఆకాశములో అందమైన మేడలో ఊయల వలే ఊగుతూ నిర్మించుకున్న అందాల మేడ అది. దానికి మధువు లోలికే ఎన్నో గదులు ఉంటాయి. ప్రతీ గదికీ ఒక్కొక్క భటుడు కాపలాగా ఉంటాడు. ప్రతీ భటుని నోటిలో పదునైన ఆయుధము ఉంటుంది. జోలికే వెళితే మాత్రము అసలు ఊరుకోడు. దీని భావము ఏమిటే అని పొడిస్తే, విద్యార్థులకు చెప్పీ చెప్పక ఒక క్లూ ఇచ్చాడు రచయిత. అది మధువులోలికే గది అని. తెలివి గల విద్యార్థి అయితే కొంచం ఆలోచిస్తే సమాధానం దొరుకుతుంది. మధువు అనగా తేనే అని అర్థం. వెంటనే తేనె పట్టు అని తెలిసిపోతుంది.

జడలు విప్పి నిలుచు జఠధారి యనరాదు /
పాలుగారు పాడి పశువు గాదు !!
విస్తరిల్లు సతము విషవాయువా ? కాదు !! /
దీని భావ మరసి తెలుపు మోయి !! ( 43 )

ఈ పొడుపు పద్యములో జడలు పెద్దగా విప్పి ఠీవిగా నిలుచొని ఉంటుంది. కాని జడలు కట్టి ఉండటము వలన శివుడు అని అనుకోకూడదు. పాలు కారుతుంటాయి. కాని పాడి పశువు అసలు కాదు. చూస్తె అది ఉన్న చుట్టూ విస్తారంగా వ్యాపించి ఉంటుంది. ఏమిటీ అని ఆలోచిస్తే అది మఱ్ఱి చెట్టు అని తెలుస్తుంది. పొడుపు కథల వలన ఆలోచనా శక్తి పెరుగుతుంది.

దేహమెల్ల కనులు దేహాంతరమ్మున / నలుపు
తెలుపు ధనము కలసియుండు !
ముందు పళ్ళు లేక పొందలేమా సొమ్ము / దీని
భావ మరసి తెలుపుమోయి !! ( 50 )
వాయువేగ మెంత పాటిది ? విద్యుత్తు / వేగ
మెంత? దీని వేగమందు !!
క్షణములోన నఖిల జగములేలుచు వచ్చు / దీని
భావ మరిసి తెలుపు మోయి !! ( 96 )

పై పద్యములో దేహమంతా చూసే కనులతో నిండి ఉంటుంది. అలాగే రంగు చూస్తె నలుపు మరియు తెలుపు రంగులతో నిండి ఉంటుంది. దానిని ఆస్వాదించాలంటే మనుషులకు నోటిలో ముందు పళ్ళు అవసరము. అవి లేకుంటే దీనిని ఆస్వాదించలేము. ఏమయి ఉంటుందని ఆలోచిస్తే ముందు పళ్ళతో తినే వస్తువు ఏది అనే ఆలోచన వస్తుంది. చివరికి సీతాఫలము అని ఇట్టే తెలిసి పోతుంది. తరువాత పద్యములో అత్యత వేగముగా పరిగెత్తేది. దాని వేగం గాలికన్నా కూడా మించి

ఉంటుంది. విద్యుత్తు కన్నా వేగంగా పరుగెడుతుంది. క్షణములో ప్రపంచములోని ఏ దేశముకయినా అత్యంత వేగంగా చేరుకుంటుంది. ఇక్కడ పేర్కొన్న అన్నింటి కన్నా వేగంగా పరిగిడేది మనస్సు అని సమాధానము. అన్నింటికన్నా వేగంగా వెళ్ళేది మనస్సును మించినది లేదు.

**ముగింపు :**

ఇలా తెలుగు సాహిత్యములో విభిన్నమైన లక్షణములు కలిగిన పొడుపు కథలు తెలుగు నాట విద్యార్థులకు ఒకనాడు ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానము అందుబాటులో లేని కాలంలో ఇవి చక్కని జ్ఞానాన్ని అందించాయి. ఆలోచించే శక్తిని అందించాయి. కాలం మారింది. ప్రపంచీకరణలో సాంకేతిక జ్ఞానం పెరిగాక విద్యార్థులు సెల్ ఫోన్ చూస్తూ, కదలకుండా ఒకే చోట ఉంటూ, ఒంటరిగా సమాజానికి దూరంగా ఉంటూ అనేక మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానము అవసరమే కాని దానికి మనం బానిసలము అవడం దురదృష్టకరం. విద్యార్థుల మానసిక వికాసమునకు పొడుపు కథలు, సామెతలు, జాతీయాలు, పలుకు బడులు మొదలైనవి ప్రాథమిక స్థాయిలో నేర్పితే ఉత్తమ పౌరులు అవుతారు.

**ఆధార గ్రంథాలు :**


1. పొడుపు కథలు - ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డి
2. పొడుపు - విడుపు - తల్లావజాల మహేష్ బాబు


❖❖❖

Vol. 23 | Spl. Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study



# కుసుమ ధర్మన్న హరిజన శతకము - సామాజిక జీవన చిత్రణ

- డా॥. పేరాల జ్ఞానానందం
తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్.

**పరిచయం**

తెలుగు సాహిత్యంలో శతక సంప్రదాయానికి ప్రత్యేక స్థానం ఉంది. నన్నయ నుండి ఆధునిక కవుల దాకా అనేక శతకాలు రాయబడ్డాయి. కానీ కుసుమ ధర్మన్న గారి హరిజన శతకము మాత్రం సాహిత్య చరిత్రలో ప్రత్యేక మైలురాయిగా నిలిచింది. ఇది కేవలం కవితా రచన కాకుండా, ఒక సామాజిక పత్రం, దళిత వర్గాల కష్టాల పునర్వ్యాఖ్యానమే.

హరిజన శతకము సమాజంలోని అసమానతలను ప్రతి బింబిస్తూ, దళిత జీవన చిత్రణను సజీవంగా మలచింది. ఇది తెలుగు సాహిత్యంలో సామాజిక కవిత్వానికి శాశ్వత ప్రేరణగా నిలిచిన కృతి.

కుసుమ ధర్మన్న కవీంద్రునిహరిజన శతకం నేటికీ చిరస్మరణీయం. ఇందులోని ప్రతి పద్యం దళితుల ఆక్రందన, ఆవేదన వ్యక్తమవుతాయి. ఎందుకు మమ్మల్ని అస్పృశ్యులుగా చూస్తున్నారు? వెలివేస్తున్నారు? దూరం పెడుతున్నారు? ఏం పాపం చేసింది మా జాతి? అంటూ ప్రశ్నించిన తీరు ఆ కాలానికే కాదు ఈ కాలానికీ సరి పోతుంది.

కుసుమ ధర్మన్న కవి. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి వాస్తవ్యుడు. 1900 సంవత్సరంలో జన్మిం చాడు. 1921లో ఈ కవితా సంపుటిని ప్రచురించారు. మాకొద్దీ తెల్లదొరతనంఅంటూ గరిమెళ్ల సత్యనారాయణ రాసిన గేయానికి ప్రతిగా మాకొద్దీనల్లదొరతనంఅంటూ ధర్మన్న కవి రాసిన పదకవితకు తెలుగు నేలంతా ప్రతి ధ్వనించింది. నాడు విద్యావంతులైన దళితులనే కాదు, దళితేతర ప్రజాస్వామిక వాదుల్ని కూడా ఆలోచింప చేసింది. ప్రముఖ దళితరచయితలదృష్టిలో- ధర్మన్న కవి తొలి తెలుగు ప్రజా వాగ్గేయకారుడు. దళిత ఉద్యమ వైతాళికుడుగా మరికొందరు ఆయన్ను గురించి అభివర్ణిం చారు. కాని తెలుగు సాహిత్య చరిత్రలో ఆయన పేరు వినిపించదు. సాహిత్యరంగంలో సైతం వివక్ష ఉందన డానికిది నిదర్శనం. ఇంతటి గొప్ప కవి, సంఘసంస్కర్త, పోరాటయోధుడి గురించి తాజాగా వెలువడిన గ్రంథాలు అపార సమాచారాన్ని అందిస్తున్నాయి. వీటితో పాటు హరిజన శతకం, నిమ్నజాతుల విముక్తి తరంగిణి, మద్యపాన నిషేధం, అసుర పురాణం వంటి ప్రసిద్ధ గ్రంథా లను కూడా రాశారు. జయభేరి పత్రికకు సంపాదకులు కూడా. ఆనాడు తెలుగు గడ్డ మీద చదువుకొన్న అతి కొద్ది మంది దళితుల్లో ధర్మన్న కవి ఒకరు. చిన్నతనం నుండే తాను ఎదుర్కొన్న వివక్షతను, అనుభవించిన అవమానాలను స్వీయానుభవంతో వర్ణించి రచించిన పద్యాలు ఈ హరిజన శతకంలో ఉన్నాయి. అంబేద్కర్ భావజాలంతో ప్రభావితుడై, తెలుగు గడ్డ మీద ప్రచారం చేసిన తొలి మేథావి.

హరిజన శతకము అనేది కేవలం శతక కవిత రూపంలో

వచ్చిన గ్రంథం మాత్రమే కాదు. అది ఒక సామాజిక ప్రకటన. ఒక సాహిత్య ఉద్యమ స్వరం. ఒక మానవ విముక్తి గీతం. అణచివేయబడిన వర్గాల గౌరవాన్ని కవిత్వంలో ప్రతిష్టించిన తొలి ప్రయత్నాలలో ఇది ఒకటిగ చెప్పవచ్చు.

### హరిజన శతకం చారిత్రిక నేపథ్యం

గాంధీజీ స్ఫూర్తితో 1933లో దళితులను ప్రబోధించే లక్ష్యంతో కుసుమ ధర్మన్న "ఆలకింపుమయ్య హరిజ నుండ" అనే మకుటంతో ఆట వెలది పద్యాలతో ఈ శతకాన్ని రచించాడు. నాడు పంచములుగా, 1917లో ఆది ఆంధ్రగా, 1931లో హరిజనగా, 1936లో షెడ్యూల్డ్ కులం అని పిలిచారు. 1976లో దళిత వర్గం అనే పేరు ఖరారు అయింది.

కుసుమ ధర్మన్న రాసిన హరిజన శతకంలో ఆది కాలంలో ఈ భూమి పైన ఉన్న ప్రజలందరూ ఎలా ఉండేవారు ఈ పద్యంలో చక్కగా వివరించారు.

ఆది కాలమందు అవనిలో జనులెల్ల
అన్నదమ్ములవలె ఆశ వీడి
చీకు చింత లేక చిరజీవులైనయా
ఆలకింపవయ్య హరిజనుండ

కుసుమ ధర్మన్న ఈ శతకంలో ప్రధానంగా రెండు విషయాల గురించి చెప్పారు. పురాతన కాలంలో ప్రజలంతా కులమత బేధాలు లేకుండా అన్నదమ్ముల వలె ఐకమత్యంతో నిశ్చంతగా జీవించేవారు. స్వార్థపరులైన ప్రజలు, అంటరానితనము అనే విషయాన్ని ఉగ్గుపాలుతో రంగరించి పోసి, దళితుల్ని బానిసలుగా చేశారన్న విషయాన్ని మొదటిగా వర్ణించాడు. రెండవ అంశంగా దళితులంతా తమ హక్కుల కోసం పోరాడాలని, ఆ పోరాటంలో ప్రాణాలు పోయిన దాన్ని వీర స్వర్గంగా భావించాలని సాటి చెప్పడమే ఈ శతకం యొక్క ముఖ్య ఉద్దేశం.

### హరిజన శతకం – సామాజిక జీవన చిత్రణ

కుసుమ ధర్మన్న రచించిన హరిజన శతకం, దళితులపై ఉన్న అంటరానితనం, వివక్ష, అవమానాలను కళ్ళకు కట్టినట్టు చూపుతూ, వారి సామాజిక జీవన స్థితిగతులను, మనోభావాలను, ఆశలను ప్రతిబింబిస్తుంది; అంబేడ్కర్ భావజాలంతో ప్రభావితమై, జాతి విముక్తి, అభ్యున్నతి కోసం రాసిన తొలి దళిత సాహిత్య రచనల్లో ఇది ఒకటి, ఇది దళిత సమాజపు వాస్తవ పరిస్థితులను, వారి సంస్కృతీ, సంప్రదాయాలను, కష్టాలను, వారిలోని ఆకాంక్షలను వివరిస్తుంది. కుసుమ ధర్మన్న రచించిన హరిజన శతకము దళిత చైతన్యం, ఆత్మగౌరవ పోరాటానికి ప్రతీకగా నిలిచిన ఒక ముఖ్యమైన రచన, ఇది అంటరానితనంపై పోరాడుతూ దళితుల హక్కులను, గౌరవాన్ని చాటి చెప్పింది, వారిని జాగృతం చేయడమే కాకుండా, సమానత్వ సందేశాన్ని అందించింది, ఈ పుస్తకం కుసుమ ధర్మన్న రచనలలో ముఖ్యమైనది..

### సామాజిక స్థితిగతులు

హరిజన శతకము రచించబడిన కాలంలో భారత సమాజం కులవివక్షతో నిండిపోయి ఉండేది. గ్రామీణ ప్రాంతాల్లో దళితులు భూహీనులుగా జీవించేవారు. కర్మకారు లుగా, శ్రమజీవులుగా, ఇతరుల ఆధీనంలో ఉన్నారు. ఆర్థిక పీడనం, కుల ఆధిపత్యం, విద్యాహీనత, భూస్వామ్య వ్యవస్థలు - ఇవన్నీ కలిసి దళితుల జీవితాలను సంకెళ్లలో బంధించాయి.

ధర్మన్న గారు ఈ కఠిన వాస్తవాలను గాఢంగా గ్రహించి, తమ పద్యంలో ప్రతిబింబించారు. ఆయన మాటల్లో కేవలం బాధనే కాదు, ప్రతిఘటన కూడా ఉంది.

ఓ దళితుడా! నీకు కులం లేదా? స్థలము లేదా? నీకు గుణగణములులేవా? ధన బలములు లేవా? బ్రతుకు దారి లేదా? ఎందుకు ఊరు పేరు లేకుండా పడి ఉంటావు? అనే విషయాన్ని ధర్మన్న గారు ఈ పద్యంలో ఇలా అంటారు

కులము స్థలము లేదో?గుణగణంబులు లేవో?
ధనము బలము బ్రతుకు దారి లేదో ?
బానిసవయు పరువు బాసిపోయెదవేల
ఆలకింపుమయ్య - హరిజనుండ.

ఎందుకు నీవు ఊరు పేరు లేకుండా పడి ఉంటావు. నీవు హిందూ దేశ వాసవి. భరతమాత ముద్దుబిడ్డ అని కవిదళితుల్లో ఉన్న ఆత్మ న్యూనత భావాన్ని విడిచి చైతన్యంతో ముందుకు సాగాలని అంటారు.

పూర్వకాలంలో ప్రజలంతా మంచిగా ఉండేవారని వారికి హక్కులు ఆస్తులు పై అధికారాలు లేవని ఎవరి లోనూ మాయ లేదని ధర్మన్న తెలిపారు. అందుకే "హక్కు సత్వములను అధికారమును లేదు. మాయ బుద్ధి చూడమచ్చుకైనను లేదు" అని అంటారు.

దళితులు తమను తామే ఉద్ధరించుకోవాలని కవి ప్రబోధిస్తాడు. తాము వెనకబడి ఉండనవసరం లేదని, ఎవరికీ బానిసలుగా ఉండకుండా గౌరవంగా బ్రతకాలని కవి ఆకాంక్షిస్తాడు. అందుకే బానిసగా ఉండే గౌరవం పోగొట్టుకుంటావు ఎందుకు? అని దళితుల్ని ప్రశ్నిస్తాడు

**అణగారిన వర్గాల ఆత్మగౌరవం**

కవి హరిజనులను దయానియులగాచూపాడు. వారిని సమాజ నిర్మాణానికి పునాదిగా ప్రతిష్టిస్తాడు.

మానవ లోకము నరక కూపంగా మారింది. సుఖ శాంతులు పోయాయి. బ్రతుకు భారమైంది. భ్రాంతి దూరమయింది ఎంత కాలము ఈ అంటరానితనమనే పేరుతో బాధపడతావు అంటూ కుసుమ ధర్మన్న ఈ పద్యంలో ఇలా అంటాడు.

ఎవడనీవు ? యిట్టి, యిడుమల గుడువంగ
నెవరు కారణంబు? యేల వచ్చె ?
నెంతకాలము వెలి చింతచే గుందెదో ?
ఆలకింపుమయ్య - హరిజనుండ.

నీవు ఎవరు? నీవు ఇన్ని కష్టాలు పడటానికి కారకుడు ఎవరు? నీకు కష్టాలు ఎందుకు వచ్చాయి? ఎంత కాలము నీవు అంటరానితనంతో వెలివేయబడతావు. నీ హక్కులకై నీవు పోరాడు, ఈ హక్కుల పోరాటంలో ప్రాణాలు పోయినా సరేదాన్ని వీర స్వర్గంగా భావించాలని, ఆత్మాభి మానాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలనికుసుమ ధర్మన్న గారు దళితులకు ఈ హరిజన శతకము ద్వారా ప్రబోధం చేశాడు.

**హరిజన శతకం - శిల్పం**

శిల్పం అంటే కవితా సౌందర్యం, భావ శిల్పంతో కూడుకొని, దళిత సాహిత్యంలో ఒక ముఖ్యమైన రచనగా నిలిచింది. ఇది తెలుగు సాహిత్యంలో ఒక వినూత్నమైన శతకం. మకుటం అనే శతక సాంప్రదాయం ఉంది సరళమైన పద్య నిర్మాణం, అలంకారాల మితి, కరుణ, శాంత రసాలకు ప్రాధాన్యత ఉంది.ప్రతి పద్యంలో సంస్కరణ సందేశం ఉంది.

హరిజన శతకము భాషా సరళత, భావ గాఢత, సామాజిక నిబద్ధత అనే మూడు సమ్మేళనం. కవి వాక్య నిర్మాణం సులభం అయినప్పటికీ భావం లోతైనది. పౌరాణిక ప్రతీకలు, గ్రామీణ జీవిత చిత్రణ, సంభాషణా శైలులు దీనికి ప్రత్యేకతను తెచ్చాయి.

**ముగింపు**

హరిజన శతకము కేవలం బాధను కూర్చిన రచన కాదు. అది ఒక సామాజిక ప్రకటన. కవి దళితుడి హక్కును, గౌరవాన్ని, ఆత్మగౌరవాన్ని ముందుకు తెచ్చాడు. ఆయన కవిత్వంలో దళితుడు తలదించుకునే మనిషి కాదు - ప్రతిఘటించే వ్యక్తి.

"నీక హక్కులు ఎక్కడ? నీ కష్టాలెందుకు మాపై? ఈ ప్రశ్నల వెనుక ధర్మన్న గారి సామాజిక విప్లవ స్ఫూర్తి ఉంది."

కుసుమ ధర్మన్న గారి హరిజన శతకము ఒక సామాజిక సత్య పత్రం. ఇది కేవలం కవిత్వం కాదు, ఒక చరిత్ర - - దళితుల జీవన యథార్థ చరిత్ర. పీడితుల నిస్సహాయతను మాత్రమే కాకుండా, వారి ఆత్మగౌరవాన్ని కూడా ప్రతిబింబించినది.ఈ శతకము ద్వారా కవి మనకు చెప్పదలచినది స్పష్టంగా ఉంది.

సమాజం మారాలి, మనసులు మారాలి, సమానత్వమే నిజమైన ధర్మం.

**ఆధార గ్రంథాలు**

1. కుసుమ ధర్మన్న - హరిజన శతకం
2. గాంధీ మహాత్మా - హరిజన సేవా రచనలు
3. కట్టమంచి రామలింగారెడ్డి - సామాజిక విమర్శ వ్యాసాలు
4. దళిత సాహిత్య చరిత్ర - తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ
5. తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య నాగయ్య
6. డాక్టర్ పి జ్ఞానానందం - పంచమం దళిత జీవన చిత్రణ

❖

**Vol. 23 | Spl. Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253**

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# కాళహస్తీశ్వర శతకం - ఒక విశ్లేషణ



- డా॥. బకరం నర్సింహ

సహ ఆచార్యులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్ రంగారెడ్డి జిల్లా.

తెలుగు సాహిత్య ప్రక్రియలలో శతకం ఒక విశిష్ట సాహిత్య ప్రక్రియ. సంస్కృతం సాహిత్యం నుండి తెలుగునకు తెచ్చుకున్నదైనప్పటికీ తెలుగులో ఎన్నో విశిష్ట పోకడలు పోయి ప్రత్యేకతను సంతరించుకొన్నది. శతకం అంటే వంద, అనగా ఇందులో వంద పద్యాలుంటాయి. చాలాకాలం వరకు 'శతకాన్ని అనిబద్ధ, లఘు, సంఖ్యా మూలక, ఉపకావ్య ప్రక్రియలలో మాత్రమే చెప్పారు'. 'శతేన శతకం, ప్రోక్తమష్టోత్తర శతం పరమ్' అని అమృతా నంద యోగి తన అలంకార సంగ్రహంలో చెప్పిన దానిని బట్టి వంద పద్యాలుంటాయని, వాటిల్లో 108 పద్యాలతో కూడిన అష్టోత్తర శత పద్యాలు కలవి కూడా ఉన్నాయని దాని అర్థం. తెలుగు భాషలో శతకము మహాకావ్య ప్రక్రియతో పాటు చాలా విరివిగా ఆదరించబడి శాఖోప శాఖలుగా విస్తరిల్లింది. శతకానికి ఇతర ప్రక్రియల కున్నటువంటి అవకాశాలు లేవు. పురాణాల లాగా కథ ప్రధానమైనవి గావు. ప్రబంధాల వలె వర్ణనా ప్రధానమైనవి గావు. గేయ కృతులవలె సంగీత ప్రధానాలు కావు. శతకాలు ముక్తకాలు అంటే ఏ పద్యానికి ఆపద్యమే స్వతంత్రంగా ఉంటాయి. కానీ శతకంలో ఏక సూత్రత ఉంటుంది. కవి స్వీయానుభవాలను అందించటం ద్వారా ప్రజలకు నిత్యజీవితంలో ఎదురయ్యే ఎన్నో ప్రశ్నలకు సరైన సమాధానాలు దొరుకుతాయి.

తెలుగులో ప్రాచీనకాలం నుండి ఆధునిక కాలం వరకు శతకాలు అనేకం వచ్చాయి. ఇంకా వస్తూనే ఉన్నాయి. ఆధునిక కాలంలో కలం పట్టిన ప్రతి కవి ఒక్క శతకమైనా రాయడం చూస్తున్నాం. ఎక్కువ మంది కవుల మొదటి రచన శతకమే కావడం పరిపాటి.శతకాలలో అముద్రితాలు అనేకం. అలభ్యాలు కూడా ఉన్నాయి. 'సంస్కృత ప్రాకృత శతకములలోని సంఖ్యా నియమం, మకుట నియమం, ఛందోనియమం, రసనియమం, ఆత్మాశ్రయ కవితా ధర్మము అను లక్షణములు తెలుగు శతకములలో రూపు దిద్దినవని డాక్టర్ కె. గోపాల కృష్ణారావు గారు వివరించినారు. తెలుగు శతకకారులు వందకు తగ్గకుండా పద్యాలు రాసినప్పటికీ, గరిష్ట పరిమితిని కొందరు పాటించలేదని వేమన శతకాన్ని చూస్తే మనకు అర్థమవుతుంది. తెలుగు శతకాలలో ఏక పద, ఏక వాక్య, ద్వివాక్య మకుటాలున్నాయి. అలాగే శతకాలలోని వస్తువును ఆధారంగా చేసుకొని భక్తి శతకాలు, శృంగార శతకాలు, నీతి శతకాలు, హాస్య, వ్యంగ్య శతకాలు, వ్యాజస్తుతి శతకాలు మొదలైనవి ఉన్నాయి. ఈవిధంగా తెలుగు శతకాలలో అనేక విశిష్టత, వైవిధ్యం కనిపిస్తున్నాయి. ఈ శతకాలలోని పద్యాలు ఒకటైనా రాని తెలుగు వాడుండడని అంటే అతిశయోక్తి కాదు.

తెలుగులో ఎన్ని శతకాలు వచ్చినా, ఎందరు శతకాలు రాసినా, కాళహస్తీశ్వర శతకం ప్రత్యేకమైనది. కాళహస్తీశ్వర

శతకం ఛందస్సు పరంగా చూచినప్పుడు వృత్త పద్యాలలో రాయడం జరిగింది. ధూర్జటి పరమ శివభక్తుడు. 16వ శతాబ్దానికి చెందినవాడు. శ్రీకృష్ణదేవరాయల అష్టదిగ్గజ కవులలో ఒకడని ఎక్కువమంది పరిశోధకుల అభిప్రాయం. రాజాస్థానంలో ఉండి కూడా తన రచనలను రాజుకు అంకితం ఇవ్వకపోవడం గొప్ప అభ్యుదయం అని చెప్పవచ్చు. 'నీకుంగాని కవిత్వమెవ్వరికి నీనంచు మీదెత్తితిన్' అంటూ తన శివభక్తిని చాటుకున్నాడు. ఈశతకంలోని మకుటం శ్రీకాళహస్తీశ్వరా ఇది మూడు పదాల కలయిక శ్రీ అనగా సాలెపురుగు, కాళము అనగా సర్పము, హస్తి అనగా ఏనుగు అనే ఈమూడు శివభక్తుల కలయికచే ఏర్పడిన పట్టణము నందు వెలసి ఉన్న ఓ ఈశ్వరా అని అర్థము. జంతువులు శివుని పూజించి, మెప్పించి శివలోకం చేరాయి. మనిషి మాత్రం సంసారమనే చీకటిలో పడి పరమ శివుడిని గుర్తించలేకున్నాడని ధూర్జటి సులభమైన భాషలో, సరళమైన పదాలతో, అలంకారా లతో, అంత్యప్రాసలతో వివరించాడు.

ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకంలో ఎన్ని పద్యాలున్నా యని విచారిస్తే 'నాకు దొరికిన శ్రీకాళహస్తీశ్వర శతకం నాలుగైదింటిలోను గల పద్య సంఖ్యలు ఒకదానికొకటి నరివడకున్నవి. మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారం లోని యొకానొక త్రైవార్షిక గ్రంథపట్టికలో = No. 396గా సూచింపబడిన శ్రీకాళహస్తీశ్వర శతక మొకటి కలదు ఇందులో 128 పద్యములున్నవి. క్రీ.శ. 1901లో రాజమహేంద్రవరము 'కళావతి' పత్రిక ప్రచురణమున 108 పద్యములున్నవి. క్రీ.శ. 1925లో వావిళ్ల వారు వెలువరించిన భక్తిరస శతక సంపుటము 3వ దానిలో 116 పద్యములు గలవు. క్రీ.శ.1926లో ముద్రింపబడిన శ్రీకాశీనాథుని నాగేశ్వరరావు గారి శతకమంజరి లో 141 పద్యములొప్పుచున్నవి'[1] (శతక వాఙ్మయ సర్వస్వము పుట 93) అని 25 సంవత్సరాల వ్యవధిలో దాదాపు 33 పద్యములు కొత్తగా శతకంలో చేరినట్లు తెలుస్తున్నది.

స్వయంగా కవి అయిన శ్రీకృష్ణదేవరాయులు రాజసభలో ధూర్జటి భాషా పటిమను, పలుకుల మాధుర్యాన్ని పొగిడినట్లు ' స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కులకేల గల్గెనో యతులిత మాధురీ మహిమ' తెలుస్తున్నది. ధూర్జటి కవిగా నిన్ను కవితా రూపమున పూజిస్తానని కవితా రసములు అభిషేక జలములు, శబ్దములు మంత్రములు, పొగడ్తలే పూవులు, మంగళ వాద్యములు అని..

'జలకంబుల్ రసముల్ ప్రసూనములు వాచా బంధముల్ వాద్యము
ల్కల శబ్ద ధ్వనులంచితాంబర మలం కారంబు దీప్తుల్మెరుం
గులు నైవేద్యము మాధురీ మహిమగా గొల్తున్ని నున్ భక్తి రం
జిల దివ్యార్చన గూర్చి నేర్చిన క్రియన్ శ్రీకాళ హస్తీశ్వరా! (పద్యం 49)

శబ్ద ధ్వనులు మరియు అలంకారాలు మాధురీ మహిమ గల నైవేద్యములుగా నిన్ను పూజిస్తానని ప్రకటించాడు.

శివుని వర్ణించుటకు శబ్దాలంకారాలు మరియు అర్థా లంకారాలు సరిపోవని, విశేష వ్యాకరణాది సంజ్ఞలకు అలవికాదు మరి ఎలా వర్ణించాలంటూనే, సత్యమును వర్ణించుటకు కవిత్వము పనికిరాదంటూ

'ఏ లీలన్నుతియింప వచ్చునుపమో త్రేక్షా ధ్వని వ్యంగ్య శ
బ్దాలంకార విశేష భాషలకలభ్యంబైన నీ రూపముం
చాలుంజాలు గవిత్వమున్నిలుచునే సత్యంబు వర్ణించుచో
ఛీ లజ్జింపరు గాక మాదృశకవుల్ శ్రీకాళహస్తీశ్వరా (పద్యం 50)

ఉపమ, ఉత్ప్రేక్ష, వ్యంగ్యం, ధ్వని వంటి భాషా విశేషాలకు అలభ్యంబైన నీరూపమును వర్ణించడం సాధ్యం కాదని కవులు సిగ్గుపడాలని అంటాడు.

ధూర్జటి వైరాగ్యమును, భక్తిని ప్రకటించు పద్యము లలో అతని హృదయావేదన తెలుస్తుంది. ఈభూమిపై గల తాత్కాలిక సుఖాలకు విలువైన జీవితమును వ్యర్థపరుచుచున్నారని తెలుపుచూ..

భవకేళీ మదిరామదంబున మహా పాపాత్ముడై వీడు న
న్ను వివేకింపడటంచు నేను నరకార్ణోరాశిపాలైన బ
ట్టవు బాలుండొకచోట ఆటతమితోడ న్నూతంగూలంగ దం
డ్రి విచారింపక యుండునా కటకటా ! శ్రీకాళహస్తీశ్వరా! (పద్యం 5)

అంటూ పరమశివుడు ఒక తండ్రి పిల్లలను ఎలా కాపాడుతాడో అలాగే కాపాడాలని లేకుంటే నరకం పాలైపోతామని వివరిస్తాడు. మరోపద్యంలో

"ఆలుంబిడ్డలు తల్లిదండ్రులు ధనంబంచు న్మహా బంధనం బేలా నా మెడ గట్టినాడవు " అంటూ తల్లిదండ్రులు, భార్య, పిల్లలు, ధనం మొదలైన తన జీవితం నిండిపోయేలా చేశావని నిజమైన భక్తితో జీవించే అవకాశం లేకుండా చేశావని వాపోతాడు.

"నిను సేవింపగ నాపదలొడమనీ నిత్యోత్సవం బబ్బనీ, జనమాత్రుడననీ మహాభక్తుడననీ సంసారమోహంబు పైకొననీ అవి నాకు భూషణములు" అంటూ నిను సేవించడం ముఖ్యం. నీ సేవ కోసం ఎన్ని నిందలు అవమానాలు అయినా సహిస్తానని, అవమానాలను భూషణాలనడం అతని భక్తి ప్రపత్తిని తెలుపుతుంది.

ధూర్జటి అధికారాన్ని, రాజరికాన్ని, రాజులను, రాజమందిరాలను నిరసిస్తూ అవి ధనానికి, సుఖానికి, అణచివేతకు పీడనకు నిలయాలని, జీవుడు వాటినుండి బయటపడలేక మగ్గిపోతున్నాడని చెప్తూ..

'రాజుల్మత్తులు వారిసేవ నరకప్రాయంబు వారిచ్చు నం
భోజాక్షి చతురంతయాన తురగీ భూషాదులాత్మ వ్యథా
భీజంబులు తదపేక్ష చాలు'

అంటూ రాజులు అధికారమనే మత్తులో ఉంటారు. వారిని సేవించటం నరకంతో సమానమని, వారిచ్చే కానుకలు బహుమతులు ఆత్మ క్షోభను కలిగిస్తాయని, భగవంతున్ని తెలుసుకోనీయవని, వాటి పట్ల అపేక్ష చాలునంటాడు.

'రాజై దుష్కృతి చెందె చందురుడు రా రాజై కుబేరుండు దృ
గాజీవంబున గాంచె దు:ఖము, కురు క్ష్మాపాలుడా మాట నే
యాజింగూలె సమస్త రాజబంధువులతో నారాజ శబ్దంబు ఛీ,
ఛీ జన్మాంతరమందు నొల్లను జుమీ'

అంటూ రాజశబ్దాన్ని తీసుకొని రాజు ఎలా చరిత్రలో దోషిగా నిలబడవలసి వస్తుందో, ఎలా సమస్త బంధువులను కోల్పోవలసి వస్తుందో, సంపదను పోగొట్టుకోవలసి వస్తుందో వివిధ వ్యక్తులను తీసుకొని ఉదాహరణ పూర్వకంగా వివరిస్తాడు.

జంతువులైన సాలెపురుగు, పాము, ఏనుగు, ఆటవికుడైన తిన్నడు నీమహిమను తెలుసుకొని తమ జీవితాలను సార్థకం చేసుకున్నారని చెప్తూ

'ఏవేదంబు పటించె లూత, భుజగంబే శాస్త్రము ల్సాచె తా
నే విద్యాభ్యాసమొనర్చె గరి, చెంచే మంత్ర మూహించె బో
ధావిర్భావ నిదానముల్ చదువులయ్యా కావు' (పద్యం 13)

నిన్ను కొల్చిన సాలెపురుగు ఏవేదమును చదువలేదు. నిన్ను పూజించిన సర్పము ఏ శాస్త్రమును అభ్యసింపలేదు. నిన్ను భజించిన ఏనుగు ఏవిద్యనూ నేర్వలేదు. బోయవాడైన తిన్నడు ఏమంత్రమును నిన్ను అర్చించుటకై నేర్చుకొనలేదు. నీపూజ చేయువలెనను జ్ఞానము పొందుటకు సమస్త ప్రాణులకు ఏచదువులు అక్కరలేదు. నిష్కల్మశమైన, నిష్కపటమైన భక్తి అవసరమని చాటి చెప్పారు.

భగవంతుని చూడాలని, అతనితో మాట్లాడాలని, అతనికి తన బాధలని విన్నవించాలని భక్తులు అనేకులు. వారికి ఎదురయ్యే ప్రశ్న. దేవుడెలా ఉంటాడు? అతనిని గుర్తించడమెలా? నిన్ను ఎలా ధ్యానించాలి మనస్సులో అనే భక్తుల ప్రశ్నలకు ధూర్జటి..

'నిన్నే రూపముగా భజింతు మదిలో! నీరూపు మోకాలో! స్త్రీ
చన్నో కుంచమొ, మేక పెంటికయొ యీ సందేహముల్మాన్పి నా
కన్నార న్భవదీయ మూర్తి సగుణాకారంబుగా జూపవే'

అంటూ నీ మూర్తిని గుణ ఆకారాలతో చూపమని వేడుకుంటాడు.

'పున్నామ్నో నరకాత్త్రాయతె ఇతి పుత్ర' అని వేదోక్తి కలదు, అనగా పున్నామ నరకాన్ని తప్పించువాడు పుత్రుడు అని ఆ మాటకు అర్థం. అలాంటి పుత్ర సంతానం కోసం దంపతులు పడే ఆవేదనను నిరసిస్తూ ధూర్జటి ..

కొడుకుల్ పుట్టరటంచు నేడ్తురవివేకుల్ జీవన భ్రాంతులై
కొడుకుల్ పుట్టరే కౌరవేంద్రునకనేకుల్ వారిచే నేగతుల్
వడసెన్ పుత్రులు లేని యాశుకునకున్ వాటిల్లెనే దుర్గతుల్
చెడునే మోక్షపదంబపుత్రునకున్ శ్రీకాళహస్తీశ్వరా
(పద్యం 27)

అని ఆకాలంలోనే స్త్రీ పురుష తారతమ్యమును నిరసించాడు.

ఇక శ్రీకాళహస్తీశ్వర శతకంలోని తెలుగు పలుకుబడులు, జాతీయాలను పరిశీలిస్తే 16వ శతాబ్దం నాటి భాషా సౌందర్యం మనకు అవగతమవుతుంది.

ఆయురన్న ప్రయచ్ఛతి...
మేక మెడచన్ను..
అంతా సంశయమే...
అంతా మిథ్య తలంచి చూచిన...
ఆశాపాశంబుల గట్టు...
చీకాకు..
అరటి పండ్లు కొనితేకున్న నేనొల్ల..
కంకణము ముంజేగట్టితిన్..

ఇలా అనేకం ధారళంగా పద్యాలలో ప్రయోగించాడు. ఇలాంటి పదప్రయోగాల వలన పాఠకులకు విషయం సులభంగా అర్థమవుతుంది.

శ్రీకాళహస్తీశ్వర శతకంలో ఆయా సందర్భాలలో సామెతలను కూడా ప్రయోగించాడు. అవి ఇప్పటికి జన వ్యవహారంలో ఉన్నాయి.

గుమ్మడి కాయలోన నవగింజంత..
పిండెంతో యంతియ కానిప్పటి...
మంచినీళ్ళు గలవా చత్రాతిలో? వెలివాడ న్మరి బాపనిల్లు గలదా?
చిచ్చార చమురేల చల్లుకొనునో?

ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకంలో అలంకారాలను సందర్భానుసారం ప్రయోగించాడని చెప్పవచ్చు.

నీకన్న నాకెన్న లేరన్నల్దమ్ములు..
రోసిందేటిది రోతలేటివి..
పూసిందిటిది పూతలేటి..
మూసిందేటిది మూతలేటివి..
చేసిందేటిది చేతలేటివి..
....................
లేవో కానల కందమూల ఫలముల్
లేవో గుహల్తోయముల్
లేవో యేరుల వల్ల ...
.....
పవి పుష్పంబగు అగ్ని మంచగు నకూపారంబు భూమిస్థలం
బవు శత్రుండతి మిత్రుండౌ విషముది వ్యాహారమౌ...

ఇంకా అనేక అలంకారాలను ప్రయోగించాడు.

ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకంలో అనేక సందర్భాలలో తిక్కన, పాల్కురికి సోమన, పోతన పద్యాలను పోలిన పద్యాలు కనిపిస్తున్నాయి. భక్తుడు పరమ శివుడితో మాట్లాడుతున్నట్లుగా ఒడబాటు చేసుకున్నట్లుగా అనేక సందర్భాలలో పద్యాలను రాశాడు.

నీ నాయందొడబాటు మాట వినుమా ...
నా విన్నపమేలా గైకొనవయా ...

శ్రీ లెవ్వారికి గూడబెటెదవయా ...

అంటూ భగవంతుడిని తండ్రి వలె భావించి, ప్రాధేయపడినట్లుగా చెప్పాడు.

ఇలా ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకంలోని విషయాలను పరిశీలిస్తే ఇంకా ఎన్నో విషయాలు మనకు తెలుస్తాయి.

**ఉపయుక్త గ్రంథ సూచి :**


1. తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటము) డాక్టర్ జి. నాగయ్య, నవ్య పరిశోధక ప్రచురణలు తిరుపతి
2. శతక వాఙ్మయ సర్వస్వము (ప్రథమ సంపుటము) వేదం వేంకట రాయ శర్మ 1954


❖❖❖

Vol. 23 | Spl. Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study



# సుమతీ శతకము – సమకాలీన అధ్యయన ఆవశ్యకత

– డా॥. రాఘవేంద్రరావు

తెలుగు ఉపన్యాసకులు, ఎం.వి.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబూబ్ నగర్.

పరిణతి చెందిన మానవసమూహం సృజనాత్మకమైన, స్ఫూర్తివంతమైన సాహిత్యాన్ని నిర్మించుకుంటుంది. అట్టి సాహిత్యం మానవ జీవనపరిణామ క్రమానికి అద్దం లాంటిది. సమకాలీన సమాజంలోని మంచి-చెడులను ఎత్తిచూపుతూ, మనిషికి సరైన మార్గాన్ని చూపే శక్తి సాహిత్యానికి ఉంది. తెలుగు సాహిత్యం ఈ విషయంలో ఎంతో గొప్పసంపదను కలిగి ఉంది. పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు, ప్రబంధాలు, శతకాలు, నాటకాలు వంటి సాహిత్యప్రక్రియల ద్వారా మనపూర్వికులు మానవతావిలువలను మనకు అందించారు. ఈ క్రమంలో శతకాలు సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యే రీతిలో సందేశాన్ని అందిస్తున్నవి. ఈ కోవలో సుమతీ శతకము ఒక అపూర్వమైన నైతిక గ్రంథంగా నిలిచింది.

**వ్యాసోద్దేశం :**

శతక వాఙ్మయము తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానాన్ని పొందినది. శతకరచన భక్తిరస ప్రధానంగా ఆవిర్భవించింది అది క్రమంగా శాఖోపశాఖలుగా విస్తరిల్లింది. శృంగార, నీతి, వైరాగ్య, హాస్య శతకములతో పాటు వ్యాజ్యస్తుతి,అధిక్షేపము మొదలగు ధోరణులతో కూడిన శతకాలు కనబడతాయి. రస పోషణలో నవ రసాలను శతక కర్తలు పలికించారు. ప్రబంధాలు, కావ్యాలు, ఇతిహాసాలు పండిత రంజకాలు. కానీ శతకాలు పండిత, పామర రంజకాలు. ఇవి ధర్మశాస్త్రాలను పోలి ఉంటాయి. కాబట్టి ప్రభుసమ్మితాలని అంటారు. కానీ నిజంగా ఇవి మిత్రసమ్మితాలు. చాలావరకు కాంతా సమ్మితాలు కూడా. సాధారణంగా శతకాలలో ఏ పద్యానికి ఆ పద్యము స్వతంత్రమైనది. వీటికి కథా సూత్రం ఉండదు. ప్రతిపద్యంలోనూ ఏదో ఒక సామాజిక అంశం దాగి ఉంటుంది. కొన్నిసార్లు అది గూఢంగా కనపడవచ్చు. మరికొన్నిసార్లు ప్రస్ఫుటంగానూ ఉండవచ్చు. భక్తి, వైరాగ్య శతకాలు అనుభవజ్ఞులైనటువంటి పెద్ద వయసు వారికి నచ్చినా, నీతి శతకాలు అన్ని వయసుల వారికీ, అందరికీ నచ్చుతాయి. ఇటువంటి నీతి శతకాలను చిన్నప్పుడే నేర్చుకోవడం అనేది జీవితంలో భాగం కావాలి. వీటిని చిన్నతనంలోనే చదవడం, వల్లె వేయడం, అర్థం చేసుకోవడం వంటి వాటి వలన ఒక నైతిక జీవితాన్ని సాధించవచ్చు. నేటి విద్యార్థులు నైతిక విలువలు, సామాజిక సంబంధాల నిర్వహణలో వెనుకబడి ఉన్నారు. వారిని మానసిక, నైతిక, బౌద్ధిక ఆరోగ్యవంతులైన పౌరులుగా నిర్మించడానికి నీతి శతకాల అధ్యయనం అత్యవసరం. ఇప్పటి విద్యార్థి తరానికి వాటి ఆవశ్యకతను గురించి చర్చించడమే వ్యాసోద్దేశం. అందులో భాగంగా సుమతీ శతకాన్ని తీసుకొని ఈ వ్యాసాన్ని వ్రాయడం జరుగుతున్నది.

**శతక వాఙ్మయం :**

ఆరంభదశ సాహిత్యంలోని వివిధ రకాల ప్రక్రియలను

తెలుగు సాహిత్యం అందుకొన్నది. వీటిలో ఎన్నదగినది శతక సాహిత్యం. అన్ని సాహిత్య ప్రక్రియ వలెనే తెలుగు శతకమునకు పునాది సంస్కృతం సాహిత్యంలో కనబడుతుంది. వేద వాఙ్మయంలో దైవారాధన విశిష్ట మైనది. దైవాన్ని ఆరాధించే క్రమంలో విస్తృతమైన స్తుతులు, నామావళుల పఠనం ఉంటుంది. అష్టోత్తర స్తుతులు, సహస్రనామాలు ఇటువంటివే. అనగా నియ మిత సంఖ్యతో కూడిన శ్లోకాలు, నామాలు ఉండటం. అందులో 108 విశేషమైనది. జప క్రమంలో ధరించే మాలలు 108 సంఖ్యతో సంబంధాన్ని కలిగి ఉంటాయి. ఆ 108 ని అష్టోత్తర శతము అని అంటారు. అదే పద్ధతిని అనుసరించి తెలుగులో 108 సంఖ్యతో కూడిన పద్యముల రచన కొనసాగి ఉంటుంది. అందులో భక్తి భావనయే ఆలంబనగా ఉండి ఉంటుంది. అందుకు ప్రబల సాక్ష్యంగా తొలి శతకాలైన వృషాధిప, సర్వేశ్వర శతకాలని గుర్తించవచ్చు. అవి భక్తిరస ప్రధానమైనవి. దైవస్తుతి వీటిలో ప్రధానాంశం. స్తుతికి కథను జోడించకుండా కథలోని కొంత భాగాన్ని లేదా సామాజిక అంశాలను పద్యంలో పొందుపరుస్తూ ఏ పద్యానికి అది విడివిడిగా అర్థాన్ని ప్రతిపాదించే విధంగా పద్యరచన కొనసాగుతుంది. ఆ విధంగా తెలుగులో శతక రచన రూపుదిద్దుకున్నది. దీనికి ముందు మల్లికార్జున పండితారాధ్యుని శివతత్వ సారంలో మకుటప్రాయమైన పదాలు కనబడతాయి. శివతత్వసారము శతకారంభస్థితిలో ఉండినది.. దీని యందలి మకుటము పర్యాయపదములతో కూడి ఉం టుంది. మకుటము కొన్ని చోట్ల పద్యము చివర, మరికొన్ని చోట్ల పద్యము నడుమ కనబడుతుంది. అందుచేత శతక మకుట మప్పటికి స్థిరపడ లేదని అనుకోవచ్చు. ఆ కాలమునందును తరువాతను కూడ నూఱుకాని నూట యెనిమిదిగాని పద్యము లుండక, అంతకంటే ఎక్కువగా నున్నను దీనిని శతక మనియే పండితులును, ప్రజలును వాడుచుండిరి. కావున శతాధిక పద్యములున్నను, తక్కువగమయున్నను అట్టి చాటుకృతులను శతక వాఙ్మయమని సాధారణముగ చెప్పవచ్చును.

**శతక లక్షణములు :**

శతము అనగా వంద. శతకము అనగా వంద సంఖ్యతో కూడుకున్నదని అర్థం. అనగా నూరు లేదా అంతకంటే ఎక్కువ స్వతంత్ర పద్యాలు కలిగిన రచనను శతకములని సూత్రీకరించారు. భారతీయ వైదికసంప్రదాయంలో 108 కి విశిష్టమైన స్థానము కలదు కాబట్టి సాధారణంగా శతక పద్యాలు 108 తో కూడి ఉండును. ఇది శతకములకు ఉండే సాధారణ సంఖ్యానియమముగా గుర్తింపబడినది. శతకములయందు సాధారణముగా కవి తనయిష్ట దైవమును గాని, పోషకుడగు ప్రభువునుగాని, సంబోధించి చెప్పును. ఇవియే మకుటములని చెప్పబడుచున్నవి. సంస్కృతమునందును స్తుతులు, స్తవములు, మకుట సహితములు,శైవ స్తుతులలో 'శివోహం శివోహం' అను మకుటములు కనబడును. ఇట్లే ఋగ్వేదము. 1-17 లో పదిఋక్కుల చివరన ''మరుద్భిరన్న ఆగహి'' అని మకుటములున్నవి. మన శతకములలో ఈ మకుటము తప్పనిసరిగ కనబడుచుండును. లేనివి లెక్క కొకటి రెండుమాత్ర మున్నట్లున్నవి. ఈమకుటమును బట్టి శతకమునకు పేరు ఏర్పడును. శతకనామమే కాదు. శతకము వ్రాయ వలసిన వృత్తము కూడా ఈ మకుటముపై ఆధారపడి యుండును. ఈ విధముగా శతకములు మకుట, ఛందో నియమములతో కనబడు చున్నవి. ఇవి ఏ పద్యానికి ఆ పద్యం చాటువు వలె స్వతంత్ర అర్థమునిచ్చును. కాబట్టి వీటిని ముక్తకములని కూడా పేర్కొనవచ్చును.

**సుమతీ శతకము :**

సుమతీ శతకాన్ని రచించినది బద్దెన.పదమూడవ శతాబ్దికి చెందినవాడు. కాకతీయుల సామంత రాజు అని ప్రతీతి. నీతిశాస్త్ర ముక్తావళి ఇతని మరొక రచన. సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యేలా కంద పద్యాల్లో రాసిన ఈ సుమతీ శతకం పద్యాలు తరతరాలుగా పండితుల, పామరుల నోళ్ళలో నానుతున్నాయి. ఈ పద్యాలలోని పాదాలు చాలా తేలికగా గుర్తుంటాయి. అనేక సందర్భా లలో ఇందులోని పదాలను ఉదహరించడం జరుగు తుంది. సుమారు ఏడు వందల ఏళ్ళ క్రితం వ్రాయబడినా ఇది పాతకాలం కవిత్వమని అసలు అనిపించదు. పండితులకు మాత్రమయ్యే పరిమితమైన భాష కాదు.

అందుకే చదవడం రానివాళ్ళు కూడా సుమతీ శతకంలోని పద్యాలను చక్కగా ఉదహరించగలరు..పూర్తి పద్యం రానివారు కూడా ఒకటి రెండు పాదాలను చెప్పడం తరచు జరుగుతుంటుంది. తరతరాలుగా తల్లిదండ్రులు తమ పిల్లలకు, అధ్యాపకులు తమ విద్యార్థులకు అందిస్తూనే ఉన్నారు. నేటి సమాజంలో సుమతీ శతకం అధ్యయనం అత్యంత ఆవశ్యకమని చెప్పవచ్చు. ఈ శతకం మారుతున్న కాలానికి అనుగుణంగా ఎంతో విలువైన పాఠాలను నేర్పుతుంది.

**దీని ప్రాముఖ్యతకు ప్రధాన కారణాలు :**

**1. నైతిక విలువలు :**

నేటి యాంత్రిక జీవనంలో నైతిక విలువలు క్షీణిస్తున్నాయి. నైతిక విలువల పరిరక్షణకు కుటుంబమే పునాది. కౌటుంబిక సంబంధాలు సుదృఢంగా ఉంటే జీవనం నైతిక విలువలతో ఒప్పారుతుంది. సామజిక నీతినియమాలను కాపాడేది ఉత్తమ కుటుంబ జీవనమే. సుమతీ శతకంలో వీటిని ఉటంకిస్తున్న ఎన్నో పద్యాలను చూడవచ్చు. మచ్చుకు కొన్ని

ఇమ్ముగ చదువని నోరును / అమ్మా! యని
పిలిచి అన్న మడుగని నోరున్ / తమ్ముల
పిలువని నోరును

కుమ్మరి మను త్రవ్వినట్టి గుంటర సుమతీ. చక్కగా చదువుకోని నోరు, ప్రేమగా అమ్మా అన పిలువని నోరు, తమ్ములను ప్రేమతోపలకరించని నోరు ఉన్నా వ్యర్థమే. అది కుమ్మరి త్రవ్విన మట్టి గుంట లాంటిది

కులకాంత తోడ నెప్పుడు, కలహింపకు వట్టి
తప్పు, ఘటియింపకు మీ, కలకంఠి గంట కన్నీ
రొలికిన

సిరి ఇంట నుండ నొల్లదు సుమతీ. తన ఇల్లాలితో ఎప్పుడూ కొట్లాడరాదు. ఆమె కంటి నుండి కన్నీరొలికితే, సిరి ఇంటి నుంచి వెళ్ళిపోతుంది. కాబట్టి ఇల్లాలిని ప్రేమతో చూడాలి

తనవారు లేని చోటను / చనువించుక లేని
చోట జగడము చోటన్ / అనుమానమైన చోటను

మనుజునకు నిలువంగదగదు మహిలో సుమతీ. తన ఆత్మీయులు లేని చోట, ఎక్కడైనా కొట్లాటలు జరుగుతున్నచోట, తనకు అనుమానంగా అనిపించిన చోట మనిషి నిలవకూడదు. నిలిస్తే ప్రమాదమే.

పరానారీ సోదరుడై / పర ధనములకాసపడక,
పరులకు హితుడై / పరులు తను
పొగడనెగడియు
పరులలిగిన అలుగనతడు పరముడు సుమతీ.

పర స్త్రీలను తన అక్కాచెల్లెళ్లలాగా భావించాలి. ఇతరుల ధనములకు ఆశపడరాదు. ఇతరులకు వీలయినంత మేలు చేయాలి. తోటి వారి మెప్పును పొందాలి. ఇతరులు తనమీద అలిగితే తాను అలగకూడదు అటువంటి వాడే ఉత్తముడు. ఈ విధంగా అనేక పద్యాలలో కుటుంబ బాంధవ్యాల గురించి, సమాజంలో స్త్రీల పట్ల ప్రదర్శించవలసిన గౌరవ మర్యాదల తోటి వారితో మెలగవలసిన విధానం గురించి పలు విషయాలను పద్యాల ద్వారా వివరించడం జరిగింది.

**వ్యక్తిత్వ వికాసం :**

మాట మనిషికి ఉన్న అత్యంత శక్తివంతమైన ఆయుధం. మాటల వల్ల స్నేహాలు ఏర్పడతాయి, మాటల వల్లే శత్రుత్వాలు పుడతాయి. నేటి సమాజంలో, ముఖ్యంగా సోషల్ మీడియా ప్రభావంతో, అనాలోచిత మాటలు విస్తరిస్తున్నాయి.సుమతీ శతకము మితంగా మాట్లాడడం, హితంగా మాట్లాడడం ఎంత ముఖ్యమో చెబుతుంది. కఠినమైన మాటలు మన గౌరవాన్ని తగ్గిస్తాయని, మృదువైన మాటలు మనిషిని గొప్పవాడిగా చేస్తాయని ఇది బోధిస్తుంది. సామాజిక శాంతి కోసం ఈ బోధనలు అత్యంత అవసరం.

ఓర్పు, వినయం, వాక్చాతుర్యం,సమయస్ఫూర్తి వంటి లక్షణాలను అలవర్చుకోవడానికి ఈ పద్యాలు ప్రేరణనిస్తాయి. కోపాన్ని అదుపులో ఉంచుకోవడం,ఇతరుల మాటలను ప్రశాంతంగా వినడం, సందర్భోచితంగా ప్రవర్తించడం వలన వ్యక్తిత్వాన్ని గొప్పగా నిర్మించుకోవచ్చు.

ఎవ్వటికయ్యది ప్రసన్తత /
మప్పటికామాటలాడి అన్యుల మనముల్ /
నొప్పింపక తా నొవ్వక / తప్పించుకు తిరుగు
వాడే ధన్యుడు సుమతీ.

వాక్చాతుర్యం, సమయస్ఫూర్తి ఎలా ఉండాలో ఈ పద్యం చెప్పగా..

ఓర్పు, వినయము, శాంతము, స్నేహము, సహనము మొదలైన గుణాల గురించి ఈ క్రింది పద్యాలను చూడవచ్చు

వినదగునెవ్వరు చెప్పిన.. తన కోపమే తన
శత్రువు తన శాంతమె తనకురక్ష ..
కూరిమిగలదినములలో నేరము లెన్నడును
రావు, కమలములు నీట బాసిన.

వంటి పద్యాలు సమాజంలో మనము జీవించడానికి కావలసిన వ్యక్తిత్వ వికాస రీతులను చక్కగా వివరిస్తున్నవి.

**సజ్జన, దుర్జన సాంగత్యం :**

సమాజంలో మంచి వారు ఉంటారు, చెడ్డవారూ ఉంటారు.ఎవరితో స్నేహం చేయాలి, ఎవరికి దూరంగా ఉండాలి అనే విచక్షణను సుమతీ శతకం వివరిస్తుంది. చెడ్డ వారి సాంగత్యం మంచిది కాదు అది ముప్పును కలిగిస్తుంది

ఎప్పుడు తప్పులు వెదకెడు / అప్పురుషుని
కొలువకూడదది ఎట్లన్నన్
సప్పంబు పడగనీడను / కప్పవసించిన
విధంబు గదరా సుమతీ.

ఎల్లప్పుడు నీ తప్పులను వెతికేవాడు తనకు సన్నిహితుడైనా వాడితో స్నేహం చేయరాదు అది పాము పడగలో నివసించినట్లు అపాయకారిగా ఉంటుంది.

తలనుండు విషము పణికిని / వెలయంగా
తోకనుండు వృశ్చికమునకున్
తల తోక యనక నుండును / ఖలునకు
నిలువెల్ల విషమె గదరా సుమతీ.

పాముకు విషము పడగలో ఉంటుంది తేలుకు తోకలో ఉంటుంది కానీ దుర్మార్గునికి వొళ్ళంతా విషమే పై రెండు పద్యాలు దుర్మార్గునితో సన్నిహితంగా ఉండడం వలన కలిగే ముప్పునుతెలుపుతున్నాయి.

అలాగే సజ్జన సాంగత్యం వలన కలిగే మేలును గురించి చెప్పే కొన్ని పద్యాలు

ధీరులకు చేయు మేలది / సారంబగు నారికేళ
సలిలము భంగిన్
గౌరవమున మరి మీదట / భూరి సుఖా
వహమునగును భువిలో సుమతీ.

కొబ్బరి చెట్టుకు చక్కగా నీరు పోసి పెంచినచో అది ఫలించి తీయని నీటిని, కమ్మని కొబ్బరిని ఇచ్చును. ఆ రీతిగానే మంచివానికి ఉపకారము చేసిన తిరిగి ప్రత్యుపకారమును పొందుటయేకాక గౌరవమును, సౌఖ్యమును పొందగలము.

**సామాజిక అవగాహన :**

సమాజంలో ఉత్తమ గుణములు కలిగిన వాడు గౌరవింపబడతాడు. సత్ప్రవర్తన కలిగిన వాడు సమాజానికి ఆదర్శవంతుడు అవుతాడు. పదిమందికి ఆదర్శంగా నిలవాలి కానీ అభాసుపాలు కాకూడదు అందుకు సుమతి శతకంలోని పద్యాలు సూటిగా సందేశాన్నిస్తున్నాయి.

అప్పు కొని చేయు విభవమూ అనే పద్యం ద్వారా అప్పుచేసి వైభవంగా పండుగలను ఉత్సవాలను జరపకూడదని తద్వారా మనకు ఆర్థికంగాను ఇబ్బందులు కలుగుతాయని సూచిస్తుంది.

పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినప్పుడు పుట్టదు అనే పద్యం తండ్రికి కొడుకును చూసిన ఉత్సాహం, గర్వం కొడుకు ప్రయోజకుడు అయినప్పుడు మాత్రమే కలుగుతుందనీ, కాబట్టి కుటుంబానికి మరియు వంశానికి గౌరవాన్ని అందించాలంటే సద్గుణవంతుడైన కుమారుడు ఉండాలని చెబుతుంది. చెరుకుగడను నమిలినప్పుడు ముందు తీయగా ఉంటుంది. తర్వాత క్రమంగా తీపి తగ్గుతుంది. ఆ పిదప చప్పగా మారుతుంది.

అందువలన సమాజంలో కొందరితో స్నేహము నెమ్మదిగా మందగిస్తుంది అటువంటి వారితో స్నేహం చేయడం మంచిది కాదు.

ఎప్పుడు సంపదకలిగిన అప్పుడు బంధువులు వత్తురు అను మాట ద్వారా సంపద ఉన్నప్పుడే అంటే మనం ఆర్థికంగానూ, సామాజికంగానూ ఉత్తమ స్థాయిలో ఉన్నప్పుడే చుట్టాలందరూ వస్తారు. బంధుత్వాలు ప్రకటించుకుంటారు. సంపద లేనప్పుడు తమ వారే దూరపు బంధువులుగా చెప్పుకుంటారు. అనే సామాజిక అంశాన్ని సుమతి పద్యం ద్వారా చెప్పాడు. ఈ మాట మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అని మార్క్స్ చెప్పిన మాటకంటే వందల ఏళ్ల ముందే సుమతి శతకం చెబుతుంది. ఒక ఊరికి ఒకడే న్యాయం చెప్పేవాడు ఉండాలి. అలా కాక తగువులు తీర్చే వాళ్ళు ఎక్కువ మంది ఉంటే వాళ్లలో వారే పోట్లాడుకొని కార్యాన్ని చెడగొడతారు. ఓడలు బండ్లగును. బండ్లు ఓడలగును. ఆ విధంగా సంపదలు స్థిరముగా ఉండేవి కావు. దారిద్ర్యము , భాగ్యము ఒకదాని వెంట మరొకటి వస్తూం టాయి. అవసరానికి మించి అధికంగా సంపాదించడం అనవసర కష్టాన్ని మాత్రమే ఇస్తుంది. ఆ విధంగా సంపాదించిన సంపాదన తాను అనుభవించడు. ఇతరు లెవరో దానిని అనుభవిస్తారు. అనే విషయాన్ని చీమలు పెట్టిన పుట్టలు అనే పద్యం చెబుతుంది. సుమతీ శతకంలోని మానవ సంబంధాలు, సామాజిక కోణాలను పరిలించబూనుకుంటే అది పెద్ద గ్రంథమే అవుతుంది.

**భాషా నైపుణ్యం :**

తెలుగు భాషలోని తీయదనాన్ని, కంద పద్యం యొక్క సౌందర్యాన్ని భావితరాలకు అందించడానికి సుమతీ శతకం ఒక చక్కని వారధి. సరళమైన పదాలతో లోతైన అర్థాన్ని చెప్పడం దీని ప్రత్యేకత. అల్పాక్షరాలలో అనల్పార్థాన్ని సుమతి శతకం బోధిస్తుంది. చక్కని వ్యవహారిక పదాలతో సామాజిక సన్నిహిత ఉదా హరణలతో మనసును ఆకర్షిస్తుంది. ఇందులో సరళమైన భాషా పదాలు భాష పట్ల అభిమానాన్ని పెంపొందిస్తాయి. ఒకరకంగా ప్రాథమిక దశలో భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి సుమతీ శతకాన్ని ఒక సాధకంగా భావించవచ్చు. పద్యాలన్నీ తేలిక పదాలతో అల్లి ఉండడం, కంటి ముందు కనబడే వాటినే వస్తువుగా ఎన్నుకోవడం వలన శబ్దజాలం విస్తృతం కాగలదు. విద్యార్థులకు పదప్రయోగ రీతి తెలుస్తుంది. ప్రతిభా వంతులైన వారు పద్యాలల్లే అవకాశం ఉంది. ఎదుటి వారితో మాట్లాడేటప్పుడు సమయోచితంగా మాట్లాడే నైపుణ్యం అలవడుతుంది. అంతేకాక సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుతుంది.

**ఆచరణాత్మక జ్ఞానం :**

ఈ శతకం కేవలం సిద్ధాంతాలకు పరిమితం కాకుండా, నిత్య జీవితంలో ఎదురయ్యే ఆర్థిక, సామాజిక సమస్యలను ఎలా ఎదుర్కోవాలో నేర్పుతుంది. అప్పు చేయడం వల్ల కలిగే ఇబ్బందులు, ఆపదలో ఆదుకునే మిత్రుడి గొప్పతనం వంటివి నేటికీ వర్తిస్తాయి.

అడిగిన జీతం బియ్యని మిడిమేలపు దొరను గొలిచి మిడుకుట కంటెన్ అనే పద్యం ద్వారా దొరల పైన, ప్రభుత్వం మీద లేదా అధికారుల పైన ఆధారపడడం కంటే స్వశక్తిని నమ్ముకోవడం మంచిదనే సూచన కనబడుతుంది. ఇది ఈనాటి యువతరానికి అంకుర పరిశ్రమలను స్థాపించుకునే దిశగా సూచిస్తుందని అర్థం చేసుకోవచ్చు.

అప్పిచ్చువాడు వైద్యుడూ అనే పద్యం మనము నివసించడానికి ఎటువంటి ప్రదేశం యోగ్యమైనదో తెలుపుతుంది.

ఆ కొన్న కూడే అమృతము.. అనే పద్య పాదం ఆహారం సేవించడానికి ఆకలే ప్రధానము అనే విషయాన్ని సూచిస్తుంది.

కనకపు సింహాసనమున అనే పద్యం ద్వారా మనము ఎలాంటి నేతలను ఎన్నుకోవాలో గుర్తించవచ్చు.

అక్కరకు రాని చుట్టమౌ.. అనే పద్యం మనకు మన బంధువుల మరియు మనం కొలిచే దేవుని యొక్క యోగ్యతలను నిర్ణయిస్తుంది. ఇలాంటి అనేక పద్యాలు ప్రజా జీవితాన్ని అనేక కోణాలలో ఎత్తి చూపిస్తూ వాటిలో

విజ్ఞతను తెలుపుతూ భవిష్యత్తుకు బంగారు బాటలను ఏ విధంగా ఏర్పరుచుకోవాలో సూచిస్తూ ఉంటాయి. ఆ పద్యాలను ప్రాథమిక తరగతులలో బోధించడం కంటే ఉన్నత తరగతులలో బోధించడం వలన నవతరానికి మేలు కలుగుతుందనడంలో సందేహం లేదు.

పుస్తకాల్లో ఉండే చదువు కంటే లోక జ్ఞానం మిన్న అని బద్దెన నమ్మారు. దాన్ని ఉదాహరణలతో మన ముందుంచారు. సమాజాన్ని చిత్రిచారు. ఏ సమయంలో ఎలా ప్రవర్తించాలి, ఎవరితో ఎలా మాట్లాడాలి అనే మెళకువలు నేటి ఇంటర్వ్యూలు, గ్రూప్ డిస్కషన్లలో విద్యార్థులకు అవసరమైన 'సాఫ్ట్ స్కిల్స్' వంటివి.

**ముగింపు :**

సుమతీ శతకము ఒక కాలాతీత నైతిక గ్రంథం. ఇది మనకు అవసరమైన జీవన సత్యాలను అందిస్తుంది. నేటి సమాజంలో పెరుగుతున్న నైతిక విలువల క్షీణతకు, అసహనానికి, సామాజిక వివక్షతలకు ఇది సమర్థ వంతమైన పరిష్కార మార్గాన్ని చూపిస్తుంది.

వ్యక్తి తన జీవితంలో సుమతీ శతకంలోని బోధనలను అర్థం చేసుకుని ఆచరించినప్పుడు సమాజం సుసంస్కృతంగా మారుతుంది. అందుకే సుమతీ శతకము నేటి సమాజానికి అత్యంత అవసరమైన గ్రంథంగా నిలుస్తోంది. టెక్నాలజీ పెరుగుతున్నా మనిషి మనిషిగా జీవించాలంటే సుమతీ శతకం వంటి నీతి శాస్త్రాల అధ్యయనం విద్యార్థులకు మరియు యువతకు చాలా అవసరం. శతాబ్దాలు గడిచినా, సాంకేతిక ఎన్ని కొత్త పుంతలు తొక్కినా మనిషి స్వభావంలో మార్పు రాకూడదు. అందుకే బద్దెన చెప్పిన నీతులు నేటికీ, రేపటికీ సత్యాలే. పాఠశాలల్లో కేవలం మార్కుల కోసం కాకుండా, జీవితాన్ని గెలవడం కోసం సుమతీ శతకాన్ని ఒక ముఖ్య పాఠ్యాం శంగా బోధించాలి. ప్రతి ఇంటిలోనూ సుమతీ శతకం ఉండాలి, ప్రతి గుండెలోనూ ఆ నీతి ప్రతిధ్వనించాలి. అప్పుడే సమాజం "సుమతులు" ఉన్న సమాజంగా మారుతుంది. ఇది ప్రాథమిక తరగతులలోనేకాదు, ఉన్నత విద్యలో కూడా నైతిక విలువల నేపథ్యంతో అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది.

**ఆధార గ్రంథాలు :**

1. సుమతీ శతకము - శ్రీ సత్యనారాయణ బుక్ డిపో రాజమండ్రి
2. శతక వాఙ్మయసర్వస్వము - విద్వాన్ వేదం వెంకట కృష్ణ శర్మ
3. ఆంధ్ర శతక సాహిత్య వికాసము - ఆచార్య కే గోపాలకృష్ణ రావు

❖❖❖

Vol. 23 | Spl. Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# దాశరథి శతకము – భక్తితత్త్వం



– జి. రమేష్
తెలుగు అధ్యాపకులు, శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలెం, నాగర్ కర్నూల్ జిల్లా.

**పరిచయం :**

తెలుగు వాఙ్మయంలో శతకాలు అత్యధికంగా వచ్చాయి. ఇప్పటికి వస్తున్నాయి. వీనికి పూర్వమునందున్న సంస్కృత, ప్రాకృత భాషలలో శతకాలు తక్కువగా ఉన్నాయి. సంస్కృతంలో మయూరిని సూర్యశతకం, భర్తృహరి సుభాషితత్రిశతి, భల్లటుని భల్లటశతకం పేరుపొందినవి. వీనిలో మకుట నియమం లేదు.

శతకమనగా నూరు లేక నూట యెనిమిది పద్యాలకు పై సంఖ్యతో కూడిన గ్రంథం. ప్రతిపద్యం చివర ఏదో ఒకటి మకుటం ఉంటుంది. తెలుగులో అనేక శతకాలు నీతిని, భక్తిని జ్ఞాన, వైరాగ్య, మానవీయ, వ్యక్తిత్వ సంబంధ అంశాలను బోధించేవిగా ఉన్నాయి. ఇవి మానవాళి యుభ్యుదయానికై ఎంతో తోడ్పడతాయి. ఇవి ప్రాయికంగా భగవన్నుతి పూర్వకములైనవి. భగవంతుని అనుగ్రహప్రాప్తి కొరకు, కవితా సృజనాభ్యాసం కొరకు, పూర్వం కవులు శతకాలు రాశారట. ఈ శతకాలయందు నీతిబోధయే ప్రధానాంశం. నీతి మానవాళి మనుగడ కాధారమని నాటికవుల అభిప్రాయం. ఈ నీతీ కాక, భక్తి, జ్ఞానం, వైరాగ్యం, వ్యాజస్తుతి, తత్వాలను కూడా సులభంగా బోధించే శతకాలు కలవు.

తెలుగున శతక రచనకాద్యుడు శైవమతాచార్యుడైన మల్లికార్జున పండితారాధ్యుడు. ఇతడు 12వ శతాబ్దివాడు. ఇతడు శివతత్వసారం, శ్రీగిరిశతకాలు రాశాడు. కానీ ఇందులో శతక లక్షణాలు సమగ్రంగా లేకపోవడం వల్ల పాల్కురికి సోమనాథుడు రాసిన వృషాధిప శతకమే సర్వలక్షణ సమన్విత శతకంగా పరిఢవిల్లింది.

నీతితోపాటు భక్తితత్వంలో రాయబడిన శతకాలలో దాశరథి, శ్రీకాళహస్తీశ్వరా, నృసింహ, నారాయణ, భాస్కర...! మొదలైన శతకాలు వచ్చాయి. ఇందులో శివభక్తుల, విష్ణుభక్తుల, అమ్మవారి భక్తులకు సంబంధించినవి ఉంటాయి. ఏ కాలంలో ఎలాంటి శతకం రాసిన శతక లక్షణాలైన సంఖ్యానియమం, ఛందోనియమం, ముక్తకం, మకుటం అను లక్షణాలను అనుసరించవలసినదే.

**ప్రధాన అంశము :**

ఈ పరంపరలో వచ్చిన శతకం పరమ భక్తీతో కూడిన కంచర్ల గోపన్న చేత రాయబడిన దాశరథీ శతకం. ఈ కవి 17వ శతాబ్దానికి చెందిన వాడు. ఇందులో భక్తిభావాలు, రామునిపట్ల రామదాసుకు ఎలా ఉన్నాయో, భక్తితత్త్వ అంశాలను పరిశీలించడమైనది. గోపన్న కవి హృదయం పరమ పావన భరితుడైన రాముని ధ్యానంలో మునిగినది. అతని హృదయం సహృదయిమై కవేద్యం. శతకంలోని చంపకోత్పలమాల ఛందస్సు పద్య రసానుగతికి, రసాయనప్రాయ ప్రసూతి. శ్రీ విశిష్టాద్వైత

మత రహస్య దర్శనానికి కరదీపికలాంటిదిగా ఉన్నది. పోతన భాగవతంలో నవవిధభక్తి మార్గాలను ప్రస్తావించాడు. గోపన వెల్లివెరిసే రామభక్తి నెపంగా, చంపకోత్పల పూజాకుసుమాలు సమర్పించాడు. గోపనకు రాముని మీదనున్న భక్తితత్వం ఎలాంటిదో ఈ క్రింది విధంగా చూడవచ్చు.

కంచర్ల గోపన్న రాసిన దాశరథి శతకాన్ని శ్రీ అనే అక్షరంతో ప్రారంభం చేయడం జరిగింది. కావ్యారంభం శ్రీకారంతో చేయడం తెలుగు కవి సంప్రదాయం. ఇందులోని మొదటి పద్యం..

> "శ్రీ రఘురామ చారుతులసీదళదామ శమక్షమాది
> శృం
> గార గుణాభిరామ త్రిజగన్నుత శౌర్యరమాలలామ
> దు
> ర్వారకబంధరాక్షసవిరామ జగజ్జనకల్మషార్నవో
> త్తారకనామ భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ"
> (దాశరథి శతకం పద్యం - 01)

సంపత్ప్రదమైన రఘుమహారాజు జన్మించిన, ఇక్ష్వాకువంశంలో జన్మించి, భద్రాచలక్షేత్రంలో నివసించి ఉన్న దయాసముద్రుడవగు ఓ దశరథరామ, నీవు సుందరమైన తులసీదళమాలను ధరించినవాడవు. శాంతం, ఓర్పు అనే మనోహర గుణములు కలవాడవు. స్వర్గంమర్త్య పాతాళ లోకములలో పొగడబడిన పరాక్రమ లక్ష్మికి అలంకారమైనవాడవు. ఎదిరించడానికి సాధ్యం కాని కబంధుడనే దుష్టరాక్షసుని సంహరించినవాడవు. సముద్రమువంటి అపారమైన జనుల పాపాలను దాటింప జేసే సామర్థ్యం కలవాడవు. అని వివరించాడు..

దాశరథి శతకాన్ని రచించిన రామదాసుగా ప్రఖ్యాతిని పొందిన కంచర్ల గోపన్న తన శతకాన్ని శ్రీ అనే అక్షరంతో ప్రారంభించాడు. కావ్యప్రారంభం శ్రీకారంతో చేయడం తెలుగు కవి సంప్రదాయం. తెలుగు సాహిత్యంలో ఆదికవి నన్నయ తన భారతాన్ని శ్రీవాణి గిరిజాశ్చిరాయ.... అని ప్రారంభించాడు. నన్నయకు ధీటైన తిక్కన మాత్యుడు శ్రీయనగౌరీనాబరగు... అనే శ్రీకారాన్నే ప్రారంభంలో ఉపయోగించాడు. రామదాసుని భక్తితత్వం ఎలాంటిదో ఈ క్రింది పద్యంలో చూడవచ్చు. ఆయనలో భక్తి ఎలా వెల్లివిరిసిందో గమనించవచ్చు.

> "శ్రీ రఘువంశతోయధికి శీతమయూఖుడవైన నీ
> పవి
> త్రోరుపదాబ్జముల్ వికసితోత్పల చంపకవృత్త
> మాధురీ
> పూరితవాక్ప్రసూనములఁ బూజలొనర్చెద
> జిత్తగింపుమీ
> తరకనామ, భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ!"
> (దాశరథి శతకం పద్యం -11)

కంచర్ల గోపన్న కవికి ఇష్టదైవమైన శ్రీరాముని పాదాలను అర్చించవలెననే కోరిక కలిగింది. భక్తుడైన వానికి భగవంతుని సేవించే సహజమైన కోరిక ఇది. కానీ, ఏ అర్చామూర్తినోకాక, మనఃపలకంపై నివసించి ఉండిన శ్రీరామమూర్తిని అర్చించే కోరిక ఈ పద్యంలో కనిపిస్తుంది. అందుచేత లోకంలో భక్తులు, కలువలు, సంపెంగలు తీసుకొని వెళ్లి శ్రీరామ పాదాలను అర్చించినట్లుగానే ఉత్పలమాల, చంపకమాల పద్యాలతో ఆయన పాదాలను పూజిస్తామనే వాంఛకలిగింది. విచిత్రంగా ఈ పద్యాలలో పూవుల పేర్లే ఉన్నాయి. శార్దూల మత్తేభాలు అనే వృత్తాలు గ్రహించి ఉంటే వాటిని పుష్పాలతో ఉపమించే అవకాశం ఉండేది కాదు. కవి రామదాసు తన శతకాన్ని అర్చనావిధిగా రాస్తున్నాననే మాటను ఈ పద్యంలో సూచించి ఉన్నాడు. పూజల్లో వాక్పూజ కూడా ఒకటి. భక్తులు భగవంతుని గురించి చేసే రచనలు వాక్పూజలే. వాటిని గోపన్న గారు వాక్ప్రసూనములు అని ఉపమించడం ఇంపైన భావనను కలిగిస్తున్నది.

రామదాసు రామనామ మహాత్వాన్ని వ్యక్తం చేసిన తీరు అమోఘం. సంసారాన్ని తరింపచేయునట్టి నీ నామం, బడబాగ్ని సముద్రాన్ని పీల్చినట్లుగా భయంకరమైన పాపాలను తొలగిస్తుంది. అంటాడు.. అమృత ద్రవ వర్షం, అడవిలో ప్రజ్వలించే అగ్నిని చల్లార్చినట్లుగా సంసార బాధలను ఉపశమింపజేస్తుంది పదునైన గొడ్డలిధార, భయంకరమైన అడవిని నరికే విధంగా మితిమీరిన

దుర్మతాచారాలను, దుష్టుల నడవడిని నిర్మూలనం చేస్తుంది.

> "దారుణపాతకాప్తికి సదా బడబాగ్ని భవాకులార్తివి
> స్తారదవానలార్చికి సుధారసవృష్టి దురంతర దుర్మతా
> చార భయంకరాటవికి చండకఠోరకుటారధార నీ
> తారకనామమెన్నుకొన దాశరథీ కరుణాపయోనిధీ!"
> (దాశరథి శతకం పద్యం -14)

తారక శబ్దానికి ధరించేవాడు, తరింపచేసేవాడు అనే అర్థాలున్నాయి. శ్రీరాముడు భగవత్స్వరూపుడు కాబట్టి సంసారం, జన్మ అనే వాటిని సుఖంగా దాటిస్తాడు. కాబట్టి ఆయన తారకరాముడైనాడు. శ్రీరాముని పేరు తారకణ మామనుట కష్టాలతో కూడిన ఈ జన్మకు మోక్షం ప్రసాదిస్తాడు. అందుకే అతను తారకరాముడైనాడని చెప్పవచ్చు. రామనామ మంత్రాన్ని తను తెలిసికొనడమే గాక, ఇతరులు కూడ తెలిసికొండని, ముక్తి చెందుడని, రామదాసు భక్తితో శాసబోధించాడు. లోకంలో పాపాలు ప్రబలిపోయినప్పుడు, దుష్టులు విస్తరించినప్పుడు, భగవంతుడు అవతరించి వారిని నాశనం చేస్తాడుకదా. అందుకే "ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" అంటుంది గీతావాక్యం.

> "చక్కెరమాని వేము దినజాలినకైవడి, మానవా ధముల్
> పెక్కురు బక్కదైవముల వేమురు గొల్చెదరట్లకాదయా
> మ్రొక్కిన నీకు మ్రొక్కవలె మోక్షమొసంగిన నీవ యీవలెన్
> దక్కిన మాటలేమిటికి......."
> (దాశరథి శతకం పద్యం -14)

మానవులలో హీనులైనవారు శ్రీరాముడైన నిన్ను వదిలి, క్షుద్రదేవతలను అనేకులైన వారిని సేవిస్తారు. ఇది ఎట్లున్నదంటే తీయని రుచి కలిగిన చక్కెరను వదిలిపెట్టి చేదు పదార్థాలను తినునట్టిది అంటాడు శతక కవి. విశిష్టాద్వైత సంప్రదాయంలో విష్ణుమూర్తి తప్ప ఇతర దైవముతములు మోక్షమును ప్రసాదించలేరు అని చాలా చోట్ల చెప్పబడింది. కృష్ణ భగవానుడు కూడా భగవద్గీతలో ఇదే విషయాన్ని తన భక్తునికి ఆదేశించాడు.

> శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణం వ్రజ!
> అహం త్వాం సర్వపాపేభ్యోమోక్షయిష్యామి మా శుచ"

కంచర్ల గోపన్న ఈ చరమ శ్లోకాన్ని స్మరించు కొంటూనే ఈ పద్యం రాశాడనిపిస్తుంది.

మరికొన్ని పద్యాలలో భక్తితత్వం ఇలా కనిపిస్తుంది.

> "భండనభీముడార్తజనబాంధవుడుజ్వల బాణ తూణకో..." (పద్యం - 34)

> "ఖరకరవంశజా వినుమఖండిత భూతపిశాచ ఢాకినీ..." (పద్యం - 36)

> "జుర్రెద మీకథామృతము, జుర్రెద మీ పదాకంజ తోయమున్
> జుర్రెద రామనామమున జొబ్బిలుచున్న సుధారసంబు నే
> జుర్రెద జుర్రుజుర్రిగ రుచుల్ గనువారి పదంబు గూర్పవే..." (పద్యం - 37)

అని రాముని పై భక్తి గలిగి మానవుడు ఏమి చేయవలెనో ఈ శతక కర్త పాఠకులకు బోధించాడు.

> "ఘోరకృతాంతవీరభటకోటకి గుండెదిగుల్, దరిద్రతా..." (పద్యం - 38)

> "విన్నపమాలకించు రఘువీర, నహి ప్రతిలోక మందు నా..." (పద్యం - 39)

మొదలైన పద్యాలలో భక్తితత్వం నిండుగా కనిపిస్తుంది. ఈ పద్యాలే కాకుండా శతకంలో సంపూర్ణంగా భక్తిచింతన, భక్తి భావాలు మెండుగా ఉన్నాయి అని చెప్పవచ్చు.

> "వలదు పరాకు భక్తజనవత్సల, నీ చరితమ్ముగా వలదు పరాకు, నీ బిరుదు వజ్రమువంటిది కావకూరకే"

భక్తులపై దయ, ప్రేమ కలవాడా ఓ దాశరథరామా! శరణు వేడిన వారిని, ఆశ్రయించిన వారిని రక్షింతువని తెలిపే నీ నడవడి, నీ చరితం నిష్ఫలం కాకూడదు

అన్నాడు కవి. పరమాత్మునికి భక్తుడు తన దీన దశను నివేదించుకొనే విశేషం చెప్పబడింది. కవి ఆత్మాశ్రయ లక్షణంతో ఈ నివేదన చేస్తున్నాడు. యథార్థానికి ఇది కవి వేదన కాదు సమస్త జీవుల వేదనం. కాబట్టి భగవంతుని మీద భక్తి శ్రద్ధలు కలిగి ఉంటే మనిషి అన్ని సాధించగలడు. అందువలన ఆ మహానుభావుని సహాయం వలన దురితవార్ధిని భక్తుడు దాటగలడనే విశ్వాసాన్ని కవి వ్యక్తం చేశాడు. దీనికి అనేక ప్రమాణాలున్నాయి. ఇది భక్తి మార్గమే.

భగవానుడైన గీతాకారుడు తనకాశ్రితుడైన భక్తిని గురించి ఇలా చెప్పాడు.

శ్లో॥ "అపిచేత్సుదురాచారో భజతే మా మనన్యభక్
సాధురేవ స మంతవ్యః సమ్యక్ వ్యవసితో హి సః" (గీత - 9 - 30)

ఎటువంటి దురాచారపరుడైన అనన్యమైన భక్తితో నన్ను సేవిస్తే అతనిని సాధువుగాను వైష్ణవోత్తముని గాను భావిస్తాను అంటాడు.

ఎక్కడ తల్లిదండ్రి సుతులెక్కడివారు, కళత్ర బాంధవం.....

మొదలైన పద్యాలలో రామదాసు కంచర్ల గోపన్న అనన్య భక్తిని సంపూర్ణంగా నింపాడు. ఈ వ్యాసంలో మచ్చుకు కొన్ని మాత్రమే ప్రస్తావించడం జరిగింది.

**ముగింపు :**

ఈ విధంగా కంచర్ల గోపన్న పరమభక్త, భగవద్భక్తి తత్పరుడు. తనకు గల శ్రీరాముని మీద భక్తి సర్వజనుల మస్తికంలో భక్తి భావనను పెంచే లక్షణాలు కలిగి ఉన్నాయి. దాశరధీ శతకం నిండుగా భక్తితో కూడిన భావనలు ఇమిడియున్నాయి.

**ఆధార గ్రంథాలు :**

1. ఆంధ్ర శతక సాహిత్య వికాసము ; కే.గోపాల కృష్ణారావు
2. దాశరథి శతకము - కంచర్ల గోపన్న

❖❖❖

Vol. 23 | Spl. Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# శ్రీ వీరభద్ర శతకము - సమకాలీన అంశాలు



- బిట్టం ధనంజయ
తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బోధన్. జిల్లా: నిజామాబాద్.

**ఉపోద్ఘాతం :**

మహామహుల నీతి శతకాలు ఎన్నో ఉన్నాయి కదా. ఇంకా నీతి గురించి ఎందుకు అన్న సందేహం కలుగుట సహజం. కాని మంచి ఎన్నిసార్లు చెప్పినా, ఎవరు చెప్పినా చర్విత చర్వణం కాదు. సమాజంలో ఎప్పటికప్పుడు పెరిగిపోతున్న కుళ్ళును పెకిలించి వేయడానికి అవసరం కూడా. మంచి విషయాలను దర్శించే దృష్టి అందరికీ ఒకేరీతిగా ఉండదు కదా, అందులకే కొందరైనా సంస్కరించబడితే అంతకన్నా మించి శతక కర్తలకు కావలసిందేమిటి? ఎన్నెన్నో ఛందస్సులలో శతకాలు వ్రాయబడిన సామాన్యజనంలోకి తొందరగా వెళ్ళగలిగిన లక్షణం 'ఆటవెలది'కి ఎక్కువ. సుప్పని సత్యనారాయణ గారు గూడా అలతి అలతి పదాలకు అనువుగా ఉండే సులభంగా అర్థం చేసుకొనే వీలుండే 'ఆటవెలది' లోనే "వీరభద్ర! కోనపౌర రుద్ర!" అనే మకుటంతో ఈ శతకాన్ని వెలువరించారు'. పద్యమైనా, గేయమైన, వచన కవిత అయిన తనదైన ప్రత్యేక శైలితో ఆవిష్కరించడం సుప్పని సత్యనారాయణ గారి శైలి. సహజ జలపాతం లాంటి పదబంధాలను అల్లడం, పచ్చని అడవిలాంటి భావుకతను చల్లడం, వెచ్చని అనుభూతుల పల్లెతనాన్ని ప్రతి కవనంలో తృళ్ళడం 'సుసనా' చెల్లును. పల్లెలో పుట్టి పెరిగి, పల్లెగా జీవిస్తున్న సహజ పల్లెకవి సుప్పని. అతని కవిత్వంలో సహజ సౌందర్యమంతా పల్లె నుండి పట్టుకున్నదే. ఎక్కడో మారుమూల కొండలు గుట్టల నడుమ ఉండే కోనాపూర్ వీరి స్వస్థలం చిన్నప్పటినుండి భజనలు, కీర్తనలు, కందర్దాలు, కోలాటాలు, సరసోక్తులు, హరికథలు, బుర్ర కథలు, జానపద వివిధ కళారూపాలు దగ్గర నుండి చూసిన వాడే కాదు, చేసిన వాడు కూడా. అందుకే ఇతని పలుకులలో పల్లీయత గుబాళిస్తుంది. ప్రస్తుతానికి వస్తే సుప్పని గారి కలం నుండి జాలువారిన శ్రీ వీరభద్ర శతకం మన ముందుకు తీసుకువచ్చారు.

**విషయం విశ్లేషణ :**

తెలుగు సాహిత్యంలో శతకం ఒక ముఖ్యమైన కవితా ప్రక్రియ. వంద పద్యాలతో కూడిన కవితా సంకలనాన్ని శతకం అంటారు. ప్రతి పద్యంలో ఒకే మకుటం ఉండటం శతకాల ప్రత్యేక లక్షణం. శతకాలు ప్రజలకు సులభంగా అర్థమయ్యే భాషలో ఉండి, నైతిక విలువలు, భక్తి, నీతి, తాత్విక భావాలను బోధిస్తాయి.

తెలుగు సాహిత్యంలో పాల్కురికి సోమనాథుడు రచించిన 'వృషాధిప శతకం' మొదటి శతకంగా భావించబడుతుంది. తరువాత వేమన శతకం, సుమతి శతకం, భాస్కర శతకం వంటి అనేక శతకాలు ప్రసిద్ధి చెందాయి. శతకాలు ప్రజల దైనందిన జీవితానికి మార్గదర్శకంగా నిలిచాయి. అందుకే శతక పద్యం తెలుగు సాహిత్యంలో

విశిష్ట స్థానం పొందింది. ఉమ్మడి ఇందూరు జిల్లాలో శతక రచన సేద్యం విస్తారంగా కొనసాగుతున్నది.? లబ్ధ ప్రతిష్టులైన కవిశ్వరులే కాకుండా ఉదయమానులైన కవులు ఎందరో శతకాలు రాస్తున్నారు. వస్తు వైవిధ్యం, ఛందో వైవిద్యం, సంఖ్య వైవిధ్యం ప్రదర్శిస్తూ శతక రచనలతో ముందు సాగుతున్నారు. పద్యం హృద్యమని, అమరమని నినదిస్తున్నారు, నిరూపిస్తున్నారు. ఆ పరంపరలో కోనాపూర్ కోహినూరు వజ్రంగా పేరు గాంచిన శ్రీ సూప్పని సత్యనారాయణ గారు తన గ్రామం కోనా పూర్‌లో కొలువై ఉన్న శ్రీ వీరభద్రేశ్వరునికి అంకితమిస్తూ రచించినదే శ్రీ వీరభద్ర శతకం. భగవంతుని పట్ల అత్యంత భక్తి, ప్రపత్తులు కలిగి ఉన్న శ్రీ సుప్పిని సత్యనారాయణ గారు మహాశివరాత్రి పర్వదినం రోజు స్వామివారి సన్నిధిలో ఈ శతకాన్ని పూర్తి చేయడం మరో ప్రత్యేకత. "వీరభద్ర! కోనపౌర రుద్ర!" అనే మకుటంతో ఈ పద్యాలు కొనసాగించారు.

భర్తృహరి సుభాషిత త్రిశతిలోని నీతి, వైరాగ్య శతకాల్లో పదేసి విభాగాలున్నాయి. శృంగార శతకంలో ఐదు విభాగాలు ఉన్నాయి. బహుశా సుప్పని సత్యనారాయణ గారు ఆ పద్ధతిని అనుసరించినట్లు ఈ శతకం ఆరంభంలో తెలుస్తోంది. అందుకే కవి కూడా వారిని అనుసరించి తన శతకాన్ని 10 విభాగాలు వింగడించి, మొత్తం పది విభాగాల్లో మొత్తంగా దాదాపు 150 పద్యాలను రచించాడు.

మొదటి విభాగంలో తెలుగు భాషా ఔన్నత్యాన్ని, వైభవాన్ని వివరిస్తూ ఇతడొకచోట

> "తెలుగు భాషా మనకు తనువునిచ్చిన తల్లి
> తెలుగు భాష తెలివి తేట లిచ్చు
> తెలుగు వల్ల బ్రతుకు తేజమై వెలుగును
> వీరభద్ర! కోనపౌర రుద్ర!" (పద్యం సంఖ్య - 7)

అంటూ తెలుగు భాష మనకు తల్లి వంటిది. జీవితానికి ఆధారం. ఆ భాషే మనకు జ్ఞానం, వివేకం ఇస్తుంది. తెలుగు భాష వల్ల మన జీవితం కాంతిమంతంగా, తేజోవంతంగా మారుతుందని పేర్కొంటారు. తెలుగు భాష ప్రశస్థాన్ని మనం ఇక్కడ గమనిస్తాం. మరోచోట

> 'నిత్య సౌరభమ్ము నింపెను తెలుగిలన్'
> (పద్యం సంఖ్య - 4)

అనడంలో తెలుగు భాష మన జీవితాలను నిరంతరం సుగంధంలా, మధురంగా మారుస్తోంది.

**ఇంకో పద్యంలో**

> 'వాడి బెరుగు తెలుగు వాడి వలన'
> (పద్యం సంఖ్య - 12)

అనడం తెలుగు వాడి పట్ల, తెలుగు భాష పట్ల అతనికున్న 'వాడి' తెలుస్తున్నది. తెలుగు భాషపై తనకు తనకు గల మక్కువ గౌరవం ప్రతి పద్యంలో కనబడుతుంది.

రెండవ విభాగంలోని పద్య సంపదను చూసినప్పుడు మొదటి పద్యమే

> "వేద విద్యలకును వేదికై వెలుగుచూ
> సకల శాస్త్ర కళలు వికసితముగ
> విశ్వమంతా కీర్తి వెలుగు భరత ధాత్రి
> వీరభద్ర! కోనపౌర రుద్ర!" (పద్యం సంఖ్య - 16)

అంటూ వేదాలు, శాస్త్రాలు, కళలకు నిలయమైన భారతదేశం గొప్పదని, ప్రపంచవ్యాప్తంగా కీర్తిని గడించిన దేశం నా భారతదేశం అనే విషయాన్ని ఈ పద్యంలో సుందరంగా పేర్కొనడం గమనిస్తాం. మరోచోట

> "రత్నగర్భ పేర రాజిల్లు ఈధాత్రి"
> (పద్యం సంఖ్య - 27)

అంటూ భారతదేశపు ప్రాభవాన్ని, పౌరుషాన్ని చక్కనైన వర్ణనలు ఈ పద్యంలో గమనిస్తాం.

మూడో విభాగంలో అంశానికి తగ్గట్లుగానే 'పల్లెటూర్లు దేశానికి పట్టుకొమ్మలు' అనే నానుడి నిజమైనదిగా భావించిన కవి హృదయం నుండి ఒప్పొంగిన పద్య ధార ఈ పద్యాల్లో మనకు కనిపిస్తుంది.

> "కల్ల కపట మెపుడు యల్లమందుంచక
> మంచి మానవతల పెంచుపంచు
> కల్మషం బెరుగని కల్పతరువు పల్లె
> వీరభద్ర! కోనపౌర రుద్ర!" (పద్యం సంఖ్య - 31)

అంటూ కపటము మోసము అనే చెడు గుణాలు పల్లెల్లో పేరుకైన కానరావంటూ, మంచితనం,

మానవత్వము నిండిన స్థలమే పల్లెలంటారు. ఏ కపటము లేని కల్పవృక్షం నా పల్లె అంటూ పల్లె ప్రజలందరిని ఒకేలా ఆదరిస్తుంది, అడిగింది లేదనకుండా ఇస్తుందంటాడు. ఈ పద్యంలో పల్లెలలో కనబడే స్వచ్ఛమైన ప్రేమ, ఔదార్యం ఈ పద్యంలో కనబడుతుంది. మరోచోట

'లలిత కళల చేత విలసిల్లు నాపల్లె,
హస్త కళల సౌరు అలరు పల్లె"
(పద్యం సంఖ్య - 32)

అంటూ పల్లెల ప్రకృతి అందాలను, మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిభింబించే అంశాలు, గొప్పతనం ఈ పద్యంలో గమనిస్తాం.

నాలుగో విభాగంలో "మద్యపానం - భ్రూణ హత్యలు" అంశాన్ని పరిశీలించినప్పుడు మద్యపానం మనుషుల్ని ఏ విధంగా మత్తులో పడేసి వారి జీవితాలను నాశనం చేస్తుందో, ముఖ్యంగా యువత ఏ విధంగా ఈ మద్య పానానికి బానిస అవుతున్నారో అంశాల్ని ఈ విభాగంలో లోని పద్యాలలో కవి వేదనను గమనించవచ్చు.

"నేటి యువత ప్రగతి బాటపై కనునిల్పి
చేయు మంచి పనులు జేయ మరచి
మత్తు పొత్తు లోన చిత్తుగా తిరిగేరు
వీరభద్ర! కోనపౌర రుద్ర!" (పద్యం సంఖ్య - 48)

అంటూ నేటి యువత తమ భవిష్యత్తును గూర్చి, వారి ప్రగతిని గూర్చి దృష్టి పెట్టకుండా, చేయాల్సిన మంచి పనులను మరిచి, మత్తు అలవాట్లు మరియు చెడు స్నేహాల ప్రభావంలో దారి తప్పి తిరుగుతూ వారి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు అనే విషయాన్ని శబ్దాలం కారంలో గమ్మత్తుగా పేర్కొన్నారు.

ఇంకొక చోట 'భ్రూణ హత్యలు' అనే అంశాన్ని వస్తువులుగా స్వీకరించి

"ఆదిశక్తితాను ఆధారమే తాను,
జన్మనిచ్చి పెంచు జననితాను"
(పద్యం సంఖ్య - 56)

అంటూ సృష్టికి మూలం స్త్రీ. సృష్టికి ఆధారం స్త్రీ. స్త్రీలను గౌరవించే సంప్రదాయం మనది అంటూ స్త్రీల ఔన్నత్యాన్ని, గొప్పతానాన్ని కీర్తించినాడు. మరోచోట కొందరు స్త్రీలు తమ జన్మనిచ్చిన ఆడపిల్లలను మొగ్గ లోనే తుంచేస్తున్నారంటాడు. కొన్ని హృదయ విదారక సంఘటనలు పత్రికల్లో, వార్తల్లో చదువుతూ, చూస్తూ ఉంటాం. వీటిపై స్పందించినటువంటి కవి హృదయంలో ఉబికి వచ్చిన వేదన, ఆక్రోశం నుండి వచ్చిన పద సంపద ఈ పద్యంలో గమనిస్తాం.

"ముండ్ల పొదలు అనక మురికి కాల్వాల లోన
చెత్త బుట్టలల్ల శిశుల విడువ
చేతులెట్లు వచ్చు చెడిరి నేటి స్రీలు
వీరభద్ర! కోనపౌర రుద్ర!" (పద్యం సంఖ్య - 62)

ముండ్ల పొదలు, మురికి కాల్వలు, చెత్త బుట్టలు వంటి ప్రదేశాల్లో తమ శిశువులను వదిలివెళ్లే స్థితికి నేటి స్త్రీలు దిగజారిపోయారని కవి ఆవేదను గమనిస్తాం. నేటి సమాజంలో మాతృత్వ పవిత్రత నశించిపోతోందన్న బాధ, ఆవేదన ఈ పద్యంలో వ్యక్తమవుతోంది.

ఐదవ విభాగంలో "తల్లిదండ్రుల పట్ల పుత్ర వాత్సల్యం" అనే అంశంపై గల పద్యాలను పఠించినప్పుడు తల్లిదండ్రులంటే కవికి అపారమైన భక్తి ప్రపత్తులు కలవని ప్రతి పద్యంలో మనకు తెలుస్తుంది.

"అమ్మయన్న ఆర్తి అమ్మయన్న అవని
అమ్మ ఈ జగాన ఆది గురువు
నాన్న ఊపిరగుచు నడిపించు కుమరులన్
వీరభద్ర! కోనపౌర రుద్ర!" (పద్యం సంఖ్య - 72)

అంటూ "అమ్మ" అనే పిలుపు మన హృదయాల నుంచి పుట్టే ఆర్తియని, అదే భూమికి జీవం పోసే శక్తి అని కవి హృద్యంగా తెలియజేయడం గమనిస్తాం. ఈ జగత్తులో మొదటి గురువు అమ్మే; జీవన విలువలు, సంస్కారం ఆమె నుంచే నేర్చుకుంటాం. తండ్రి తన ఊపిరిలా ప్రేమతో పిల్లలను కాపాడుతూ, సరైన దారిలో నడిపిస్తాడు అని కవి తల్లిదండ్రుల యొక్క ఔన్నత్యం, విలువ, వారి ప్రాశస్త్యం సర్వాంగ సుందరంగా ఆత్రంగా వివరించడం గమనిస్తాం. కనుకనే

"తల్లిదండ్రులనగ తొల్లి దేవతలిలన్,

వార్నిమించువారు వసుధలేరు"

(పద్యం సంఖ్య - 64)

అంటూ ఢంకా భజాయించి తల్లిదండ్రులే మనకు మొదటి గురువులు తల్లిదండ్రులను ఆరాధిస్తే, సేవిస్తే ఆ పరమాత్మని ఆరాధించినటువంటి భాగ్యం కలుగుతుందని కవి పేర్కొనడం గమనిస్తాం.

ఆరో విభాగంలో "యువతరం కొత్త పోకడలు" అనే అంశంపై దాదాపుగా నేటి యువత భవిష్యత్తుపై భరోసా లేకుండా వింత పోకడలకు లోనైతు వారి జీవితాన్ని చిందరవందరగా మార్చుకుంటున్నారన్నది కవి భావన ఈ పద్యాల్లో కనబడుతుంది.

"నేటి యువత ప్రగతి బాటపై గురితప్పి
వయసు బెట్టు పోరు వరదలోన
మునిగి తేలు చుండ్రి ముందు జాగ్రత్తలేక
వీరభద్ర ! కోనపొర రుద్ర !"

(పద్యం సంఖ్య - 74)

అంటూ నేటి యువత తమ భవిష్యత్తు కోసం జాగ్రత్తగా అడుగు వేయకపోవడం వారి భవిష్యత్తుకు ప్రశ్నార్థకం అని ఈ పద్యం సూచిస్తోంది. మరో పద్యంలో

"చేతులారా బతుకు చేజార్చుకున్నంక
ఏమి చేయలేరు ఎవరు రారు"

( పద్యం సంఖ్య - 79)

అంటూ నేటి యువత చెడు మార్గంలో పడి చెడిపోతున్న వారి జీవితాలను గూర్చి కవి ఆవేదన వ్యక్తం చేయడం, సరైన మార్గంలో జీవనయానం చేయాలని ఉపదేశించడం ఈ పద్యంలో గమనిస్తాం.

ఏడవ విభాగంలో "స్త్రీ ప్రాతినిధ్యం - ప్రాధాన్యత" అనే అంశంలోని పద్యాలను పరిశీలించినప్పుడు

"దేహమందు సగము దేవికి చోటిచ్చి
తాను వెల సెనిలను తత్వ మెరుగు
స్త్రీని గౌరవించె శివుడు నీజనకుండు
వీరభద్ర ! కోనపొర రుద్ర !"

(పద్యం సంఖ్య - 86)

అంటూ దేవదేవుడైన శివుడే తన శరీరంలో అర్ధ భాగాన్ని పార్వతి దేవికి ఇవ్వడం స్త్రీ యొక్క ప్రాధాన్యతను తెలియజేస్తుంది. సమాజంలో పురుషులందరూ కూడా స్త్రీలకు సమ ప్రాధాన్యతను ఇవ్వాలని, స్త్రీల గౌరవాన్ని కాపాడాలని, స్త్రీ సృష్టికి మూలమని కవి తెలియజేయడం గమనిస్తాం. మరో పద్యంలో స్త్రీలు ముఖ్యంగా ఎదుర్కొంటున్న సమస్యలు వివరిస్తూ

"కామవాంఛగోరు కామాంధులిలలోన
వశము నొందలేని వనిత బ్రతుకు
అదరజేసి మించి హత్య జేయుదురిలన్
వీరభద్ర ! కోనపొర రుద్ర !"

(పద్యం సంఖ్య - 94)

అంటూ కామందుల వల్ల స్త్రీల జీవితానికి తీవ్రమైన హానికర పరిస్థితులు కలుగుతాయని, ఇలాంటి పరిస్థితులు వారి హత్యలకు దారితీస్తాయని ఈ విషయంపై సమాజం మరియు స్త్రీలు జాగ్రత్తపడాలని కవి జాగ్రత్తలను తెలియజేయడం గమనిస్తాం.

**ముగింపు :**

తల్లిదండ్రులని గౌరవించేవారు గురువులను, పెద్దలను, గ్రామాన్ని, దేశాన్ని, సమాజాన్ని గౌరవిస్తారన్న సూత్రాన్ని నమ్మిన కవిగా శ్రీ సుపిని సత్యనారాయణ గారు నిజాయితీగా, నిబద్ధతతో శతకాన్ని రచించారని అర్థమవుతున్నది. ప్రాచీన కాలం నుండి నేటి వరకు అనేకమైనటువంటి 'భక్తి శతకాలు' వచ్చిన ఈ శతకం ప్రత్యేకతను సంతరించుకుందని చెప్పడంలో అతిశయోక్తి లేషమానము లేదు. అదేవిధంగా పది విభాగాల్లోని అంశాలను దృశ్యమానంగా 'చిత్రాలు' మరో ప్రత్యేకత. ఈ శతకం ఆది నుండి ముగింపు వరకు ప్రతి పద్యం పాఠకులకు మంచి అనుభూతిని, ఆనందాన్ని, ఆలోచనలను కలిగిస్తాయి అనడంలో సందేహం లేదు. వీరి సాహిత్య రచనా కౌశలం ఇలాగే కొనసాగి మరెన్నో శతకాలు వీరి కలం నుండి జాలువారాలని 'మనసా వాచా కర్మణా త్రికరణ శుద్ధి'గా కోరుతూ, వారికి శ్రీ వీరభద్రుని కరుణ కటాక్షాలు సంవృద్దిగా ఉండాలని, వారి రచనలు తెలుగు సాహిత్యంలో స్థిరమై, పాఠక లోకాన్ని తరింపజేయాలని కోరుకుందాం.

**ఆధార గ్రంథాలు :**


1. శ్రీ వీరభద్ర శతకము, సుప్పని సత్యనారాయణ తెలుగు ఉపన్యాసకులు, అధ్యక్షులు భీమన్న సాహితీ పీఠం బాన్సువాడ, ముద్రణ: కర్షక్ ప్రింటర్స్, 40, APHP, O.U. రోడ్డు హైదరాబాద్. 500044.
3. సుప్పని శతకం, సుప్పని సత్యనారాయణ తెలుగు ఉపన్యాసకులు, అధ్యక్షులు భీమన్న సాహితీ పీఠం బాన్సువాడ, ముద్రణ: శ్రీ రాఘవేంద్ర ప్రింటర్స్, బాలాజీ నగర్, కాప్రా మేడ్చల్ జిల్లా.


❖❖❖

Vol. 23 | Spl. Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study



# దోరవేటి సాంబశివ శరణం శతకం - సామాజిక దృక్పథం

- డి. రాజు
తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, దౌల్తాబాద్.

## పరిచయం

తెలుగు సాహిత్యంలో శతకాలకు అత్యంత విశిష్టమైన స్థానం ఉంది. సామాన్య ప్రజలకు సులభంగా అర్థమయ్యే భాషలో జీవన సత్యాలను, భక్తిని, నీతిని బోధించడమే శతకాల ప్రధాన లక్ష్యం. అందుకే శతక సాహిత్యం ప్రజా సాహిత్యంగా విరాజిల్లు తుంది.శతకాలలో ఉపదేశాత్మక స్వభావం ఎక్కువగా కనిపిస్తుంది. మంచి చెడు, ధర్మ అధర్మాలు, జీవన విలువలు వంటి విషయాలను శతకాలు బోధిస్తాయి. అందుకే శతకాలు కేవలం సాహిత్య వినోదానికే కాకుండా జీవన మార్గదర్శకంగా కూడా నిలిచాయి.

## కవి పరిచయం

తన జన్మస్థలమైన ధారూరు (వికారాబాద్ జిల్లా) పూర్వనామమైన దోరవేటి కలం పేరుతో ప్రసిద్ధులైన ఉప్పరి చెన్నయ్య గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. కవి, రచయితగా మాత్రమే కాకుండా పాఠ్యపుస్తకాల రచయితగా, సినిమా గేయ,సంభాషణల రచయితగా, జానపద కళాకారుడిగా, నటుడు, దర్శకుడు, నాట్యాచార్యుడు, గాయకుడు, సంగీతజ్ఞుడిగా విస్తృతమైన సేవలందించారు. వేలాది మంది శిష్యులు ఆరాధించే ఉత్తమ ఉపాధ్యాయుడిగా, ఎంతో మంది యువతకు సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో మార్గదర్శక దీపంగా నిలిచారు. ఇటీవలి కాలంలో "అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక"ను స్థాపించి యువ కవులు, రచయితలకు నిరంతరం ప్రోత్సాహం అందిస్తున్నారు. తెలుగు విశ్వ విద్యాలయ ప్రతిభ, కీర్తి పురస్కారాలతో పాటు జిల్లా ఉత్తమ సాహితీవేత్త, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం వంటి అనేక గౌరవాలను పొందారు. గేయాలు, శతకాలు, కథలు, నవలలు, వ్యాసాలు, నాటకాలు అన్ని ప్రక్రియల్లో కలిపి యాభైకి పైగా రచనలు చేసిన విశిష్ట సాహితీవేత్త.

## శతక లక్షణాలు

నూరు పద్యాలు, ఒకే మకుటం, ఒకే ఛందస్సు, సరళమైన భాష, ఉపదేశాత్మక భావం వంటి లక్షణాలతో శతకాలు తెలుగు సాహిత్యానికి గొప్ప ఆభరణాలుగా నిలిచాయి. భక్తి, నీతి, తత్త్వబోధలను ప్రజల హృదయాల్లో నిలిపిన శతక సాహిత్యం ఎప్పటికీ చిరస్థాయిగా నిలుస్తుంది.

## శతక పరిధి

ఈ శతకం ముఖ్యంగా భక్తి నుంచి జీవన తత్త్వం వరకూ, వ్యక్తి నుంచి సమాజం వరకూ విస్తరించిన విశాల పరిధిని కలిగి ఉంది.

## శతక ప్రయోజనాలు

సాంబ శివ శరణం శతకం భక్తి, నీతి, జీవన తత్త్వాలను బోధించే గొప్ప శివభక్తి శతకం. దీనివల్ల కలిగే ముఖ్య ప్రయోజనాలు ఇవి:

1. శివభక్తి వికాసం : శివునిపై భక్తి, విశ్వాసం పెరుగుతుంది.
2. ఆధ్యాత్మిక జ్ఞానం : మోక్ష మార్గం వంటి తత్త్వాలపై అవగాహన కలుగుతుంది.
3. అహంకార నాశనం : గర్వం, మమకారం తగ్గి వినయం పెరుగుతుంది.
4. నైతిక విలువల బోధన : ధర్మం, సత్యం, నీతి పాటించాలనే ప్రేరణ లభిస్తుంది.
5. మనశ్శాంతి : భక్తి భావంతో మనసు ప్రశాంతంగా ఉంటుంది.
6. కష్టసమయ ధైర్యం : భగవంతుడిపై నమ్మకం వల్ల జీవిత సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే శక్తి వస్తుంది.
7. భాషా-సాహిత్య జ్ఞానం : తెలుగు పద్య సాహిత్యంపై అవగాహన పెరుగుతుంది.
8. ఆత్మోన్నతి : స్వార్థాన్ని విడిచిపెట్టి పరమార్థాన్ని గ్రహించే దిశగా మనిషిని నడిపిస్తుంది.

అందువల్ల సాంబ శివ శతకం మనకు భక్తి, జ్ఞానం, వినయం, వైర్యాగ్యం వంటి మహత్తర గుణాలను ప్రసాదిస్తుంది.

## సామాజిక దృక్పథం

తెలుగు శతక సాహిత్యంలో దోరవేటి రచించిన సాంబ శివ శరణం శతకంకు విశిష్టమైన స్థానం ఉంది. ఇది కేవలం శివభక్తిని మాత్రమే కాకుండా, ప్రస్తుత సమాజ పరిస్థితులను ప్రతిబింబించే సామాజిక దృక్పథాన్ని కూడా స్పష్టంగా చూపిస్తుంది. భక్తిని ఆధారంగా చేసుకుని సమాజంలోని దురాచారాలను విమర్శించడం ఈ శతకంలోని ముఖ్య లక్షణం.

దోరవేటి సమాజంలో ఉన్న అసమానతలు, అహంకారం, ధన మదం, కుల గర్వం వంటి సామాజిక లోపాలను తీవ్రంగా ఖండించాడు. మనిషి ఎంత ధనవంతుడైనా, ఎంత గొప్ప వంశానికి చెందినవాడైనా, చివరకు శివుని శరణు పొందకపోతే జీవితం వ్యర్థమేనని కవి అభిప్రాయపడతాడు. ఈ భావం ద్వారా సమాజంలో పెరుగుతున్న అహంభావాన్ని కవి ప్రశ్నించాడు.

సాంబశివ శరణం శతకంలో కులవ్యవస్థపై పరోక్ష విమర్శ కనిపిస్తుంది. కులం వల్ల గాని, వంశం వల్ల గాని మనిషికి గొప్పతనం రాదని, భక్తి మరియు సద్గుణాలే నిజమైన మహత్త్వమని కవి స్పష్టం చేస్తాడు. ఇది సమాజంలో సమానత్వ భావనను బలపరుస్తుంది.

అలాగే, కవి ధనాసక్తిని తీవ్రంగా వ్యతిరేకిస్తాడు. ధనం శాశ్వతం కాదని, అది మనిషిని అహంకారిగా, క్రూరుడిగా మారుస్తుందని చెబుతాడు. ధనానికి దాసుడైన వాడు మానవత్వాన్ని కోల్పోతాడని చెప్పడం ద్వారా సామాజిక విలువల పతనాన్ని కవి ఎత్తిచూపాడు.

సాంబశివ శరణం శతకంలో స్త్రీ, పురుష సంబంధాలపై కూడా ఒక నైతిక దృష్టి కనిపిస్తుంది. కామం, మోహం వలన మనిషి మార్గభ్రష్టుడవుతాడని, సంయమనం గల జీవితం శ్రేయస్కరమని కవి ఉపదేశిస్తాడు. ఇది సమాజంలో నైతిక విలువలను కాపాడే ప్రయత్నంగా భావించవచ్చు.

కవి దృష్టిలో నిజమైన భక్తుడు అంటే గుడుల్లో తిరిగేవాడు కాదు; దయ, క్షమ, వినయం వంటి గుణాలు కలిగినవాడే నిజమైన భక్తుడని భావిస్తాడు. ఈ భావన ద్వారా ఆచారాలకన్నా ఆచరణ ముఖ్యమని దోరవేటి సమాజానికి సందేశం ఇస్తాడు.

ఇంకా, సాంబ శివ శరణం శతకం ప్రజలను భయ భక్తులతో కాకుండా ఆత్మవిశ్వాసంతో జీవించాలి అని ప్రేరేపిస్తుంది. శివుడు అందరికీ సమానమని, పేద,పెద్ద అనే తేడా లేకుండా భక్తిని స్వీకరిస్తాడని చెప్పడం ద్వారా సామాజిక సమానత్వాన్ని ప్రతిపాదిస్తుంది.

మొత్తంగా చూస్తే, సాంబ శివ శరణం శతకం ఒక భక్తి గ్రంథమే అయినప్పటికీ, దాని లోతుల్లో బలమైన సామాజిక సంస్కరణ భావన దాగి ఉంది. దోరవేటి శివభక్తిని ఆయుధంగా చేసుకుని సమాజాన్ని సరిదిద్దే ప్రయత్నం చేశాడు. అందువల్ల సాంబ శివ శరణం శతకం భక్తి శతకంగా మాత్రమే కాకుండా, సామాజిక చైతన్యానికి మార్గదర్శకమైన కావ్యంగా నిలిచింది.

శివ శరణాగతిగా సాగిన ఈ శతకం లో ప్రతి పద్యం అమృత తుల్యము. పాల్కురికి సోమనాథుని మొదలుకొని ధూర్జటి దాక ఉన్న కవులనే కాదు. శైవ సాహిత్యానికి సంబంధించి రచనలు చేసిన ప్రతి ఒక్క కవిని ఈ శతకంలో స్మరించుకున్నాడు. ఆలంకారిక ఆభరణాలైన ఈ శతకంలోని పద్యాలను కొన్ని ఉదాహరిస్తాను.

ఉ. శ్రీకర సర్వమంగళ వశీకర ! శీతకరా ! హరా ! వరా !
శ్రీకరమైన భావనలు చిత్తమునందున నిండ దండిగా
శ్రీకరమూన్చి దీవెనలు చిప్పిలజేయగదప్ప, తప్ప; ర
త్నాకరమౌ దయాహృదయ ! సాంబశివా ! శరణంబు వేడెదన్ !

ఓ శ్రీకరుడా! సర్వమంగళాలను కలిగించేవాడా! అందరినీ వశపరచే కరుణాస్వరూపుడా! చంద్రునివంటి శీతల స్వభావమున్నవాడా! హరా! వరప్రదాతవా! నా హృదయమంతా పవిత్రమైన, శుభమైన భావాలతో నిండి పోయేలా చేసి, నాపై అపారమైన దీవెనలను కురిపించ మని కవి వేడుకుంటున్నాడు.

ఓ దయాసముద్రమైన సాంబశివుడా! నిన్నే శరణు కోరుతున్నాను. మొత్తం మీద ఇది శివుడిని భక్తిపూర్వకంగా స్తుతిస్తూ, కరుణ,మంగళ,శుభబుద్ధిని ప్రసాదించమని కవి ప్రార్థించే భావగీతం.

అంబ ! మదంబ ! సాంబశివ సార్ధతనూవిభవంబ! శ్రీనిరా
లంబ ! సరస్వతీ చతుర లక్ష్మి కదంబ ! ముదంబ! పాత్తమా
డంబరమయ్యి నా రచన డాయకనిల్చి గమింప జేయు మా
యంబ ! యటంచు మ్రొక్కుచును ! సాంబశివా! శరణంబు వేడెదన్!

ఓ అమ్మా! అహంకారాన్ని నశింపజేసే మహాశక్తివా! సాంబశివునితో ఏకమై ఉన్న పరమతత్త్వ స్వరూపిణీ! ఆధారములేని వారికీ ఆధారమై నిలిచే శ్రీనిరాలంబా! సరస్వతి, లక్ష్మి ఈ రెండింటి సమ్మిళితమైన మహాశక్తివా! ఓ ఆనందస్వరూపిణీ! కవి తన రచన.

నా రచన గొప్పగా ఆడంబరంగా కాకుండా, సత్యమూ సరసత కలిగినదిగా నిలిచి, ప్రజల హృదయాలకు చేరేలా దారిచూపుము అమ్మా అని ఈవిధంగా భక్తితో నమస్క రిస్తున్నాడు.

తన రచనకు అహంకారం లేకుండా శుద్ధత, జ్ఞానం, సరసత ప్రసాదించమని భక్తితో కవి పార్వతి మాతను కోరుతున్నాడు.

ఉ॥ కొంచెపు మానవాధములు కుంచమునే శివ లింగమన్న, నా
వంచన లెక్కసేయక నవారితరీతిగ పూజ చేయ నీ
వంచిత మూర్తివై వెలుగ నల్లన బల్లన గెల్చి నిల్చె నీ
యంతటి భక్తులన్ దలచి సాంబశివా ! శరణంబు వేడెదన్ ! 46 పద్యం

శివుడు రూపాన్ని కాదు. భక్తి భావాన్నే స్వీకరించే కరుణా మూర్తి అన్న తత్త్వాన్ని తెలిపుతుంది. మనుషుల అజ్ఞానం, లోపాలు ఉన్నా కూడా నిజమైన భక్తి ఉంటే శివుడు దానికే లోబడతాడు అనే గొప్ప భావాన్ని ఈ పద్యం వ్యక్తం చేస్తుంది.

ఉ॥. భక్తిని గేలిసేయగను పాల్పడినప్పుడు కన్నతండ్రినే
ముక్త మొనర్చి పెంటికను పుణ్యపు లింగమనంగ పూజలన్
యుక్తముగాగ జేసెనట నున్నత భక్తిని కాటకోట, డా
సక్తిని గొల్పెనట్టి కథ సాంబశివా ! శరణంబు వేడెదన్ ! 47 పద్యం

శుచిత్వం, లోకం చెప్పే నియమాలకన్నా భక్తి యొక్క శుద్ధభావమే శివుడిని ప్రసన్నుడిని చేస్తుంది అనే తత్త్వాన్ని తెలియజేస్తుంది. నిజమైన భక్తి ఉంటే అపవిత్రమని భావించే వస్తువులోనూ దైవత్వాన్ని దర్శించగల శక్తి కలుగు తుందని చెప్పే గొప్ప భక్తికి నిదర్శనం ఈ పద్యం.

ఉ॥ తల్లియె లేని దైవము గదా ! శివదేవుడటంచు నెంతయో
తల్లడమంది నీకు తను తల్లిగ మారెను బెజ్జమాంబ, యే

కల్లలెరుంగనట్టి మమకారము జూపిన ఆమె ప్రేమలో
చల్లగ సేదదీరు ఘన సాంబశివా ! శరణంబు వేడెదన్ ! 49పద్యం

తల్లి లేని దేవుడు ఎలా ఉంటాడు? అని అనుకుంటూ శివదేవుడికి తల్లి లేదనే విషయాన్ని తలచి ఎంతో కలత చెందిన భక్తునికి, బెజ్జమహాదేవి స్వయంగా తల్లిగా మారి అబద్ధం, మాయ ఏమాత్రం లేకుండా నిజమైన మాతృ మమకారంతో శివుడిపై అపారమైన ప్రేమను చూపింది. ఆ తల్లి ప్రేమ యొక్క చల్లని నీడలో శివుడే సేద తీరినట్లుగా అనిపించేంతగా ఆమె భక్తి మహిమ వెలు గొందింది. భక్తి దేవుణ్ని కూడా మానవ సంబంధాల్లోకి తీసుకొచ్చేంత పవిత్రమైనదని తెలియజేస్తుంది. భక్తుడి ప్రేమ ముందు దేవుడూ కుమారుడిగా మారతాడు. అమ్మ ప్రేమకు దేవతకైనా విశ్రాంతి లభిస్తుందనే హృదయస్పర్శి భావాన్ని ఈ పద్యం వ్యక్తం చేస్తుంది.

ఉ॥ గొప్పతనమ్ము నీదొ, గొడగూచిదొ నేనెరుగంగ లేను; ఓ
యప్ప ! అమాయకత్వమున కందిన కానుక యేమొగాని, ఆ
యొప్పులకుప్ప పాలనిడ నోరిమి తోడను ద్రావి, గుండెలో
చప్పున జేర్చుకొంటివట సాంబశివా! శరణంబు వేడెదన్! 51 పద్యం

భగవంతుడు కానుక యొక్క విలువను కాదు, భక్తుడి నిష్కల్మషమైన మనసును మాత్రమే చూస్తాడు. అందుకే చిన్న కానుకైనా, నిజమైన భక్తితో అర్పిస్తే దేవుడు దానిని హృదయంలో నిలుపుకుంటాడు అనడానికి గొప్ప నిదర్శనం గొడగూచి కథ.

ఉ॥ మూపున యంబరంబులను మోయుచు, జంగమ సేవ జేయుచున్
'పాపము భక్తిహీన జన వస్త్రముదాకుట' టన్న నీమమున్
చాకలి వృత్తిలో నెగడి నద్గురుడాయెను మాచయార్యు: డీ
శా కులభేద మెంచవని సాంబశివా ! శరణంబు వేడెదన్! 61 పద్యం

పద్యంలో మడివేలు మాచయ్యా చాకలి వృత్తిలో ఉన్నప్పటికీ జంగమ సేవ చేస్తూ, భక్తిలేని వారి వస్త్రాలను ఉతకకూడదనే నియమాన్ని పాటించి సద్గురువయ్యాడని చెప్పబడింది. దీనివల్ల కులం గానీ, వృత్తి గానీ మనిషి గొప్పతనానికి ప్రమాణం కాదని, భక్తియే నిజమైన విలువ అని కవి తెలియజేశాడు. ఇది కులభేదాన్ని అంగీకరించని శైవ తత్త్వాన్ని ప్రతిబింబిస్తుంది.

చ॥ బసవన మెచ్చుకొన్న శివభక్తుడు మా శివనాగు మయ్య యిం
పొసగెడిరీతి హస్తమును యొత్తిన క్షీరము గారెనంట! ఆ
బసవని శక్తియో ! పరమభక్తి నిదర్శనమో యెరుంగ, హే !
యసమ విలోచనా ! యనుచు సాంబశివా ! శరణంబు వేడెదన్! 68 పద్యం

అంత్య కులజుడుగా భావించే శివనాగుమయ్య పరమ శివభక్తుడు. బసవన హృదయం చూరగొన్న మహనీయుడు. అది భరించని బిజ్జలరాజు శివనాగుమయ్యతో పాటు బసవన్నను కూడా కోటలోనికి రానీయకుండా అవమానించినాడు. అప్పుడు శివభక్తుడైన శివనాగుమయ్య అరచేతి నుండి పాలను ధారగా ప్రవహింపజేసి, రాజును, అతని దుర్బోధకులనూ కనులు తెరుచుకునేటట్లు చేసినాడు. భక్తికి కులం మకిలం అంటదని ఆనాడే నిరూపించిన బసవన గొప్ప మహనీయుడు.

ఉ॥ నిండ భుజించలేము: కనునిండుగ నిద్రను పోవలేము: కూ
ర్చుండగలేము; హాయిగ పరుండగలేము; గమింపలేము; యెం
తుండిన నేమి భాగ్యము మహోగ్ర రుజమ్ములు క్రుంగజేసె, నో
యండజధారి కావుమని సాంబశివా! శరణంబు వేడెదన్! 80 పద్యం

తీవ్రమైన వ్యాధులు వచ్చినప్పుడు మనిషి నిండుగా భోజనం చేయలేడు, కళ్ల నిండా నిద్రపోలేడు, సరిగా కూర్చోలేడు, హాయిగా పడుకోలేడు, ఎక్కడికీ వెళ్లలేడు. ఎంత ధనం, ఎంత భాగ్యం ఉన్నా ఆరోగ్యం లేకపోతే అవన్నీ వ్యర్థమే అవుతాయి. అందుకే మనిషిని కుంగదీసే ఘోరమైన రోగాలు దరిచేరకుండా కాపాడమని దేవుణ్ణి ప్రార్థించాలని కవి తెలిపాడు.

చ॥ చిటికెడు బాధనోర్చము; వచింపగలేము పరప్రశస్తి: ఎ
ప్పటికిని మాకు మాత్రమే శుభమ్ములు గల్గుట గోరుకొందు, మీ
నటనల జీవితంబున ననంత సుఖంబు లభించు నెట్లు ? బా
సటగను నిల్చి నన్ నడుపు సాంబశివా ! శరణంబు వేడెదన్ ! 88పద్యం

మనుషులు చిన్నపాటి బాధకూడా సహించలేరు. ఇతరుల గొప్పతనాన్ని మెచ్చి మాట్లాడలేరు. ఎప్పటి కప్పుడు తమకే శుభాలు కలగాలని కోరుకుంటారు. ఇలాంటి స్వార్థభావంతో నిండిన ఈ జీవితంలో నిజమైన ఆనందం ఎలా లభిస్తుంది? అందుకే తనను సత్య మార్గంలో నిలబెట్టి, ధర్మపథంలో నడిపించమని కవి దేవుణ్ణి ప్రార్థిస్తున్నాడు.

ఉ॥ మంచికి చెడ్డకున్ నడుమ మారణహోమము సాగుచుండు, ని
ర్వంచన తోడ నన్యుల ప్రవర్ధన మెంచుచు జీవనంబు సా
గించుట పుణ్యమౌ, నెదను కీడు దలంచుట పాపమౌను, యీ
యంచిత బుద్ధి నన్ నిలుపు సాంబశివా ! శరణంబు వేడెదన్ ! 94 పద్యం

మనిషి జీవితంలో మంచి, చెడుల మధ్య ఎప్పుడూ పోరాటం జరుగుతూనే ఉంటుంది. మోసం లేకుండా, ఇతరుల అభివృద్ధిని మనస్ఫూర్తిగా కోరుకుంటూ జీవితం సాగించడం నిజమైన పుణ్యం. ఇతరుల కీడును ఆలో చించడం మాత్రం పాపం అవుతుంది. అందుకే కవి మంచిని మాత్రమే కోరుకునే ఈ పవిత్రమైన బుద్ధిలోనే తనను స్థిరంగా ఉంచమని దేవుణ్ణి వేడుకుంటున్నాడు.

చ॥ కరువు భయంకరమ్మయెను గ్రాసము లేకను రైతులెల్ల ఆ
దెరువును గోలుపోయి తమ ధేనువు లమ్మి కసాయి సంతలో
చెరువయి గుండె బాదుకొని చేతుల నెత్తి నమస్క రించి రో
హర హర వారి గావుమని సాంబశివా ! శరణంబు వేడెదన్ ! 97 పద్యం

భయంకరమైన కరువు ఏర్పడింది. తినడానికి గింజ కూడా లేక రైతులంతా తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. పోషించలేని పరిస్థితిలో తమ ప్రాణసమానమైన ఆవులను కూడా కసాయి సంతలో అమ్ముకోవాల్సి వచ్చింది. ఆ బాధతో గుండెలు పగిలిపోయి, నీవే దిక్కని చేతులు జోడించి కన్నీళ్లతో ప్రార్థిస్తున్నారని కవి ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విధంగా దోరవేటి చంపక ఉత్పలమాలలతో, శివ భక్తుల్ని తలచుకున్న తీరు చాలా అద్భుతమైనది. బెజ్జ మహాదేవి, భక్త సిరియాళుడు, బసవేశ్వరుడు, తెలుగు జొమ్మయ్య, మాది రాజయ్య, మడివేలు మాచయ్య, చిరు తొండడు, వైజవ్వ, శంకర దాసి, తేడరదాసయ్య షోడ్డల దేవు బాచయ్య, గొడగూచి మొదలైన శివశరణులైన భక్తుల నేపథ్యాలను హృద్యమైన పద్యాలతో దొరవేటి తన శివ భక్తి తత్వాన్ని చాటుకున్నాడు.

**పరిశోధన ఫలితాలు**

దోరవేటి శతకం పై చేసిన పరిశోధన ద్వారా లభించిన ముఖ్యమైన ఫలితాలు ఇవి

1. సమాజంలోని ఆచారాలు, కులవ్యవస్థ, ఆర్థిక పరిస్థితులు, మానవ ప్రవర్తనపై స్పష్టమైన సమాచారం లభిస్తుంది.
2. శైవ భక్తులకు నిత్య పారాయణకు ఉపకరించే శతకం.
3. కవుల ఆలోచనా విధానం, జీవిత అనుభవాలు, తాత్త్విక దృష్టి వెల్లడయ్యాయి.
4. శతకాలు మానవ జీవితానికి మార్గదర్శకంగా ఉన్నాయని పరిశోధనల ద్వారా నిరూపితమైంది.

5. శతకానికి ప్రత్యేక నిర్మాణం, ఛందస్సు, శైలీ లక్షణాలు నిర్ణయించబడ్డాయి.
6. శతకాలు పండితులకే కాక సామాన్య ప్రజలకూ చేరిన సాహిత్యంగా గుర్తించబడ్డాయి.

మొత్తంగా, ఈ శతకం తెలుగు సాహిత్యంలో జీవన మార్గదర్శక గ్రంథంగా ఉందనే సత్యాన్ని స్పష్టంగా నిరూపించింది.

**ముగింపు**

సాంబశివ శరణం శతకం భక్తి సాహిత్యంలో ఒక అపూర్వ గ్రంథంగా నిలుస్తుంది. ఇందులో కవి శివునిపై అచంచలమైన భక్తిని వ్యక్తపరిచాడు. అహంకారం, మమకారం, లోభం వంటి దోషాలను విడిచిపెట్టి శివభక్తి మార్గాన్ని అనుసరించాలనే సందేశాన్ని ఈ శతకం అందిస్తుంది.

ఈ శతకం ద్వారా మనకు భక్తి మాత్రమే కాకుండా నీతి, వైరాగ్యం, ఆత్మజ్ఞానం వంటి విలువలు కూడా లభిస్తాయి. అందువల్ల సాంబ శివ శరణం శతకం మానవుని అంతరంగాన్ని శుద్ధి చేసి, శివస్మరణతో జీవనాన్ని సార్థకం చేసుకునే మార్గాన్ని చూపించే శాశ్వత భక్తి గ్రంథంగా నిలుస్తుంది.

**ఆధార గ్రంథాలు**


1. వృషాధిప శతకం - పాల్కురికి సోమనాథుడు
2. సర్వేశ్వర శతకం - యధావాక్కుల అన్నమయ్య
3. శ్రీకాళహస్తీశ్వర శతకం - ధూర్జటి
4. ఆంధ్ర శతక సాహిత్య వికాసము - కె గోపాల కృష్ణారావు
5. సాంబశివశరణం శతకం - దోరవేటి


❖❖❖

Vol. 23 | Spl. Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study

# శతక సాహిత్యంలో - భక్తి శతకాలు



- నీరడి మాధవి
టి.జి.టి తెలుగు ఉపాధ్యాయురాలు.

**శతక పరిచయం :**

తెలుగు సాహిత్యం శాఖోపశాఖలుగా విస్తరించిన ఒక మహావృక్షం. అలాంటి తెలుగు సాహిత్యంలో పురాణం, ఉదాహరణ, ఇతిహాసం, ప్రబంధం, పదకవిత్వం లాంటి ఎన్నో ప్రాచీన ప్రక్రియలు అదేవిధంగా నాటకం, నవల, కథనికా, వ్యాసం, జీవితచరిత్ర, ముత్యాలసరాలు, గజల్, రూబాయిలు, ఖండ కావ్యాలు, మినీ కవిత్వం, హైకూలు, నానీలు లాంటి మరెన్నో ఆధునిక ప్రక్రియలు తెలుగు సాహిత్యంలో అనేకం వచ్చాయి. తెలుగు సాహిత్యంలో వచ్చిన అనేక సాహిత్య ప్రక్రియలలో "శతకం" విశిష్టమైనది మరియు ప్రత్యేకమైనది. తెలుగులో పన్నెండో శతాబ్దంలో శతకమావిర్భవించినది. ఈ ఎనిమిది వందల సంవత్స రములలో తెలుగు శతకం శాఖోపశాఖలుగా విస్తరిల్లి స్వరూపం లోనూ, స్వభావంలో ఎంతో మార్పు చెందింది. నేటికీ మన దేశంలో ఏ మూలనో ఒకచోట శతకం వెలు వడుతూనే ఉన్నది. తెలుగు సాహిత్యంలో అజరామరమై, ఆచంద్రతారార్కంగా దూసుకుపోతున్న పద్య ప్రక్రియల్లో శతకం మొదటి స్థానాన్ని ఆక్రమించింది. శతక పద్యాలు సమాజంలోని పోకడలను తెలుపుతాయి. వాటి ఆధారంగా విద్యార్థులలో నైతిక, ఆధ్యాత్మిక విలువలు పెంపొందింప జేసి, భావి జీవితానికి వెలుగులు నింపి ఉత్తమ పౌరులుగా తయారు చేస్తాయి.

**శతక సాహిత్యం - భక్తి శతకాలు :**

శతక సాహిత్యం అనేది అపారమైన జ్ఞానాన్ని, సంస్కృతి సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను నిక్షిప్తం చేసుకున్న ఒక అపూర్వ నిధి. పాలమూరు జిల్లాలో కూడా అపారమైన శతక సాహిత్యం వెలువడింది ఈ జిల్లాలో దాదాపు 200 మంది శతక కవులు ఉన్నట్లు అంచనా. అందులో పండిత పరిశోధకులు శ్రీ డా. కపిలవాయి లింగమూర్తి, శ్రీ వెలుదండ రామేశ్వరరావు, శ్రీ డా. వెలు దండ సత్యనారాయణ, శ్రీ కుంచకూరి బుచ్చిలింగం, శ్రీ ముత్యాల కృష్ణయ్య, శ్రీ కర్నాటి రఘురాములగౌడ్ లాంటివారు పదుల సంఖ్యలో శతకాలు రచించి ఈ సమాజానికి అందించారు. ఈ జిల్లాలో వెలువడిన శతకా లను భక్తి, నీతి, సామాజిక శతకాలని విభజించుకుని చూసినట్లయితే సామాజిక శతకాల తర్వాత భక్తి శతకాలు రెండవ స్థానంలో ఉంటాయి. ఈ శతక రచనకు నాటి సాంఘిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులతో పాటు స్వాతంత్ర్యోద్యమ పరిస్థి తులు కూడా పునాదులని చెప్పవచ్చు. ఈ జిల్లాలో వెలువడిన కొన్ని శతకాలలోని వస్తువులను విశ్లేషించుకుందాం.

శతకాలు భావ ప్రధానములు. భక్తి శతకాలు కవి ఆత్మానుభూతి ప్రధానములు. విమర్శకులు భావ గీత ములుగా పరిగణించినారు. శతకకవి తన దోషములు

మన్నించి ఆపదలు నివారించి తన్ను రక్షించ వలెనని భగవంతుని ప్రార్థించును. పురాణ యుగములో పాల్కురికి సోమన్న, అన్నమయ్య మొదలగు శతక కవులు శతక ప్రక్రియను సర్వాంత శోభిత మొనర్చిరి. భగవంతున్ని మనసా, వాచా, కర్మణా విశ్వసించి, ఆ మార్గంలో, ఆ విశ్వాసంలో ముందుకు సాగడాన్ని భక్తి అనొచ్చు. ఈ భక్తి అనేది ఒక్క భగవంతుని పట్లే గాకుండా, పెద్దల పట్ల, మహాత్ముల పట్ల ప్రదర్శించడం అనేది లోకంలో కని పిస్తుంది. ఆయా దైవాలను, దేవతలను, ప్రధానంగా చేసుకొని వివరించిన భక్తి సాహిత్యాన్ని శైవ సాహిత్యం, వైష్ణవ సాహిత్యం మొదలైన పేర్లతో అనుశీలనం చేయడం జరుగుతున్నది.

భారతీయ సనాతన ధర్మ (భక్తి) సంప్రదాయాలలో "శైవం" ప్రాచీనమైంది మరియు మొదటిది. తెలుగు సాహిత్యంలో "శైవ సాహిత్యం" తనదైన అస్తిత్వాన్ని, ప్రత్యేక ముద్రను సాధించుకున్నదిఋగ్వేదం మొదలుకొని నేటి కాలం రచనల వరకు ఈ శైవభక్తి ప్రబోధాత్మ కమైన రచనలు సాహిత్యంలో తమదైన స్థానాన్ని సంపాదించు కున్నవి.

**శైవ భక్తి శతకాలు :**

ఈ లోకంలో వసూలు చేయబడని పద్దులు, లెక్కలు ఎందుకు? తోడు (ఇల్లాలు) లేని ఇల్లెందుకు? ఆచరించని హద్దులెందుకు? గురువును తిరస్కరించెడి మనిషి యెందులకు? వర్తకజన సమూహముతో ఉండలేని ఎద్దులెందుకు? ఇతరుల నేరములను లెక్కించే క్రూరులెందుకు? నిన్ను మనసారా సేవించని మూర్ఖులెందుకు? అవి యన్నియు వ్యర్థము. కావున నేను మాత్రం నిన్ను సేవిస్తానయ్యా అంటూ కవి పోకూరి కాశీపతి గారు బోదిలవీడులో వెలసిన ధూర్జటికి విన్నవించుకున్నారు. ఈ విషయాన్ని జటప్రోలు సంస్థానంలో సాహితీ సేవలందించి కవిసింహ, కవిజటిలాఖ్య బిరుదాంకితులైన శ్రీ కాశీపత్యవధానులు తన ధూర్జటి శతకంలో ఎంతో హృద్యంగా తెలియజేశారు.

ఉ. గెల్వని పద్దులేలను? యొగిన్ సఖిలేని గృహంబు నేల? తా
నిల్వని హద్దులేల? గురునిన్ దిగనాడెడి మర్త్యుడేల? సా
తిల్వ యెద్దులేల? పరు నేరము లెంచెడి క్రూరుడేల? మిం
గొల్వని మొద్దు యేల? భువి గొల్చెద బోదిలవీటి ధూర్జటీ !

(పోకూరి కాశీపత్యవధాని - శ్రీ ధూర్జటి శతకము - పుట.42 - 18 ప)

తమ తమ సుఖాలను వదులుకొని మనల్ని పాలు, వెన్న, నుగ్గు పెట్టి లాలించి పాలించి పెంచిన తల్లి దండ్రులను పెరిగి పెద్దయ్యాక తల్లిదండ్రులను పట్టించుకోని మూర్ఖుల యొక్క తప్పులను పరిగణలోకి తీసుకోకుండా వారిలోని కాలుష్యాన్ని పారద్రోలి రక్షింపుము అని ఉప్పునుంతల మండలం పెద్దాపురం నివాసియైన కవి మొలగర రంగారావు గారు తన శ్రీ రాజరాజేశ్వర శతకంలో వేములవాడ రాజరాజేశ్వరుని వేడుకున్న తీరు అబ్బుర పరుస్తున్నది.

శా. పాలుంవెన్నయి నుగ్గుబెట్టు మివులన్ బాలించి లాలించి య
వ్వేళన్ బెంచిరి తల్లి దండ్రులట్లు గూర్మిన్ సోకులెల్లోర్చి యే
లీలన్ నేనిక సుందునందనుడు నోలిన్ దప్పులన్ బోక మ
త్కాలుష్యమ్ములదోలి బ్రోవుము అమోఘా! రాజరాజేశ్వరా!

(మొలగర రంగారావు - శ్రీ రాజరాజేశ్వర శతకం - పుట.11 -- 5)

కష్టాల కడలి నుండి నన్ను గట్టి ఎక్కించుటకు నాకు అన్నదమ్ములు కానీ భార్యా పిల్లలు కానీ ఆత్మ బంధువులు కానీ గురువులు కానీ ఆత్మీయులు కానీ నాకు ఎవరూ లేరు నన్ను ఎప్పుడు కష్టాల కడలి నుండి గట్టెక్కించి సుఖ సముద్రంలో తేలించవయ్య అంటూ ఆ పరమ శివుడిని కవి శ్రీ దరెగోని శ్రీశైలం గారు తన శ్రీ ఉప్పునూతుల కేదారేశ్వర శతకంలో వేడుకుంటున్న తీరు పాఠకులను ఆకర్షించి కన్నీళ్లు పెట్టించే విధంగా ఉన్నది.

సీ. నిన్ను నమ్మినయట్లు నేనమ్మ నొరులను
నీకంటె ఘనులిల నాకులేరు
అన్నదమ్ములు భార్య నాత్మబంధువులును
గురువులునింక నాదరువు లేరు ............
........... ఉప్పునూతుల పురవాస వ్యోమకేశ!
భవ్య కేదార లింగేశ భక్తపోష!
(దరెగోని శ్రీశైలం - శ్రీ ఉప్పునూతుల కేదారేశ్వర శతకం - పుట.8 -- 16)

"పరోపకారం ఇదం శరీరం" అన్నారు పెద్దలు. కష్టాలలో ఉన్నవారికి తోడుండి, వారిని ఓదార్చి, ఏ దారి లేని దీనులను ఆదుకుని వారికి బ్రతుకు తెరువు చూపించమని కవి శ్రీ కుంచకూరి బుచ్చిలింగం గారు తన శ్రీ గణనాథ శతకంలో వేడుకుంటున్న తీరును ఈ క్రింది పద్యంలో చూడవచ్చు.

కం. ఓదార్చువారు లేకను
ఆదుకునేవారు లేక అయ్యోతండ్రీ!
ఏదారి లేని బ్రతుకుల
కాదరువును జూప వేమయా గణనాథా !
(కుంచకూరి బుచ్చిలింగం - శ్రీ గణనాథ శతకము పుట. 31 -- 104. ప)

పరమశివుడిని పూజించుటకు మనకు మణులూ, మాణిక్యాలు అవసరం లేదని, మారేడు ఫలములు, మారేడు పత్రములు, పుష్పాలు నీరు మొదలగు వాటితో, అమితమైన భక్తితో పూజిస్తే ఆ పరమ శివుడు కరుణిస్తాడని కవి శ్రీ కర్నాటి భీమలింగం గౌడ్ గారు శ్రీశైల మల్లేశ్వర శతకంలో ఎంతో చక్కగా వివరించాడు.

మ. ఫలమున్ మారెడు, పత్ర, పుష్ప, జలమున్ భక్తుండు నర్పించగా
చలమున్ వీడుచు భక్తులన్ కలసి సంచారంబు గావింతువా
సులభంబేకద నుశీ జేరుటకఁ నీ స్తోత్రంబు మార్గంబునౌ
జెలువొప్పున్ కద, మానవాళికిదియేశ్రీశైల మల్లేశ్వరా.
(కర్నాటి భీమ లింగం గౌడ్ - శ్రీశైల మల్లేశ్వర శతకము - పుట. 9 - 42. ప)

ఈ భరతభూమిలో నేటికాలపు మానవులు తమ వేష భాషలను, విద్యలను విజ్ఞతలను వదిలేసి విందులు, వినోదాలు, పెండ్లి సందడులు మరియు విపరీతమైన కోరికలతో పాశ్చాత్య కోపడలను అలవ ర్చుకొని మన పూర్వీకులు మనకు అందించిన సంస్కృతీ సాంప్రదాయాలను మరియు సంస్కారాన్ని కోల్పోతున్నారని కవి కీ.శే. ఇమ్మడిజెట్టి చంద్రయ్య గారు తన శ్రీ చంద్రమౌళీశ్వర శతకంలో తన మనోవేదనను ఎంతో హృద్యంగా వెలిబుచ్చారు.

శా. అరుదౌ నేతలు వేషభాషలును విద్యల్ విజ్ఞతల్ గీములో
గిరముల్ విందులు పెండ్లి సందడులు కోర్కెల్ జూడ పాశ్చాత్యపున్
సరణింజిక్కుట చేత సాజమగు సంస్కారంబు గోల్పోయె నీ
భరతోర్వీ సతి యచ్యుతార్చిత పదాబ్జా చంద్ర మౌళీశ్వరా!
(ఇమ్మడిజెట్టి చంద్రయ్య - శ్రీ చంద్రమౌళీశ్వర శతకం -- పుట.62 - 73. ప)

**వైష్ణవ భక్తి శతకాలు :**

ఓ శ్రీరామచంద్ర ప్రభు నాకు నువ్వే తల్లివి, తండ్రివి ఈ ప్రపంచంలో నీకు సమానమైన వారు ఎవరూ లేరంటూ శ్రీరామచంద్రుని యొక్క గొప్పతనాన్ని వర్ణిస్తూ తనపై చల్లని కృపను కురిపించమంటూ శ్రీరామ చంద్రుడిని కవి శ్రీ వెలుదండ సత్యనారాయణ గారు తన లింగముధన విజయ రామ శతకంలో వేడుకుంటున్న తీరుశ్రీరామ చంద్ర మూర్తి యొక్క దివ్య శక్తిని కీర్తించిన ఈ క్రింది పద్యం కవిలోని కవిత్వ ధారకు సాక్షీ భూతంగా నిలుస్తుంది.

ఉ. తల్లివి! తండ్రివీ వని యెదన్ దలపోసితి సంతతంబు, నీ
యెల్ల జగంబులందుఁ గన నెవ్వరు నీకు సమానులౌదురే!
యుల్లమునన్ నినున్ దలఁచి యుత్పలమాలలు గూర్ప నెంచితిన్

జల్లని నీ కృపన్ గలము స్దఁగఁగని మెృక
రామభూవరా!

(సత్యనారాయణ వెలుదండ - లింగముధన
విజయరామ శతకము - పుట.11 -- 53. ప)

నేటి సమాజంలో చాలామంది మానవులు కష్టాలు కొని తెచ్చుకొనుట వారి యొక్క స్వయంకృత అపరాధమే నని అనగా మానవుని వినాశనానికి కోరికలే కారణమని, కోరికలను అదుపులో ఉంచుకున్న వాడు జీవితాన్ని జయిస్తాడని కవి శ్రీ కర్నాటి రఘురాములు గౌడ్ గారు రాసిన తన శ్రీరాఘవ శతకంలోని ఈ పద్యం ప్రతి మానవునికి అనుసరణీయమే.

ఉ. కామము చేత నాపదలు గల్గును సంపద
నాశనంబగున్
కామవిరక్తి కల్గగనె కల్గును సౌఖ్యము లెల్లవేళలన్
కామము లేక, మారుతియు కారణ జన్ముృడుగా
తరించెగా
కామము బద్ధ శత్రువయి కాలుని చెంతకు జేర్చు
రాఘవా!

(కర్నాటి రఘురాములు గౌడ్ -
శ్రీరాఘవ శతకం - పుట.16 - 37. ప)

కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుని యొక్క భయమును పోగొట్టడానికి శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీతను బోధించి అర్జునుడిని మేల్కొల్పిన విధంగా కార్యరంగంలో శూరులై కదిలే విధంగా నేటి నరులను తీర్చిదిద్దమంటున్నాడు కవి శ్రీ కుంచకూరి బుచ్చిలింగం గారు తన కృష్ణ శతకంలో

తే.గీ. గీత బోధించి మేల్కొల్పి భీతిమాన్పి
కార్యరంగాన శూరులై కదలు నటుల
నరుల దీర్చితి వన్న విన్నాణముగను
కాలమది నివ్వెరన్పొంది తూలకృష్ణ!

(కుంచకూరి బుచ్చిలింగం - కృష్ణ శతకం -
పుట.36 - 86. ప)

"హృదయ ఆవేదన" అనే శీర్షికలో ప్రస్తుతం మన దేశంలోని మానవుల యొక్క జీవన విధానాన్ని, అప్పుల బాధలను, మితిమీరిన ఆశలను, అవినీతిని, నేరాలు ఘోరాలను కవి శ్రీ కర్నాటి భీమలింగం గౌడు గారు తన శ్రీ మదురా కాశీయాత్ర శతకంలో వివరించిన తీరు, వారి మనోవేదనను పాఠకులు ఈ కింది పద్యంలో గమనించవచ్చు.

సీ. నరహంతకులునైరి నాదేశ మందున
దుర్మార్గులను ద్రుంచ దొరవునీవె
దాంపత్య సుఖములు ధ్వంసంబు లాయెను
అప్పుల తిప్పలు అదుపుదప్పె .............
............. నీటి మధురను జూచుచు న్నట్లు దోచె
మరల కన్పించు కృష్ణయ్య మమ్ముగాంచ.

(కర్నాటి భిమలింగం గౌడ్ - శ్రీ మదురా
కాశీయాత్ర శతకము - పుట.28 - 53. ప)

మానవులు తమ తమ మతాల పవిత్ర గ్రంథాలను పఠించకుండా, అందులోని విషయాలను నిజ జీవితంలో పాటించకుండా ఆయా మత గ్రంథాలను నిర్లక్ష్యం చేస్తున్నారని కవి కీ.శే. డా.కపిలవాయి లింగమూర్తి గారు తన తెల్లరాళ్ళపల్లి తిరుమలేశ శతకంలో తన ఆవేదనను ఈ కింది పద్యంలో వెలిబుచ్చాడు.

సీ. గీత బోధించెడు, రీతిగా నడవక
హిందువు నేనన్న, కందుగాదే
పిటకముల్బోధించు, విధులు పాటింపక
బౌద్ధుడననియున్న, పాటియగునె
అలకొరాను వచించు, నట్టులనడవక
మహమదీయుడనన్న, మాయగాదె
బౌబిలు జెప్పెడి, పద్ధతి విడిచియు
క్రైస్తవుండనటన్న, కల్లగాదే

తే.గీ. మతము మనుజునిహితమునే, కుతుక పడెను
గానియీనాడు దానిని, గాంతురెవరు
భక్తజన పోష తెలరాళ్ళ పల్లి వాస
దితిజ విద్వేష బుధతోష తిరుమలేశ

(కపిలవాయి లింగమూర్తి - తెల్లరాళ్ళపల్లి
తిరుమలేశ శతకము - పు.61 -- 6.ప)

బూరుగు చెట్టు పండ్లను తినడానికి ప్రయత్నం చేసి, విఫలమైన చిలుక వలె సారహీనమైన సంసార సౌఖ్యమును కోరుకొని, కష్టాలు పొంది, వాటిని భరించలేక నిన్ను వేడుకుంటున్నాను. స్వామి నీ భక్తుడనైన నా యొక్క

నేరములను లెక్కించకుండా నన్ను కరుణతో కాపాడమని కవి కీ.శే.ఇమ్మడి జెట్టి చంద్రయ్య గారు పాలెము వేంకటేశ్వర శతకంలో వెంకటేశ్వర స్వామిని వేడు కుంటున్నాడు.

ఉ. బూరుగు పండుగోరి శుకమున్ విఫలంబును జెందుభంగి నే
సారవిహీన సంసరణ సౌఖ్యముగోరి దురంత వేదనల్
గూరి భరింపలేక నుతకోవిద నిన్ శరణంబు వేడితిన్
వేరములెంచకన్ గరుణ నేలుము పాలెము వేంక టేశ్వరా!

(ఇమ్మడి జెట్టి చంద్రయ్య - వేంకటేశ్వర శతకం పాలెము - పు.10 -30.ప)

కవి కీ.శే. వెలుదండ రామేశ్వరరావు గారు తన శ్రీ శ్రీనివాస నివేదనము ఈ ప్రపంచంలో తృప్తి పొందని మానవుడు దీనాతి దీనుడని, లభించినది లేశమాత్రమైన దానితో సంతృప్తి పొందేవాడు భాగ్యవంతుడని అంటున్నాడు.

శా. తృప్తిని గాంచని మానవుండు జగతిన్ దీనాతిదీనుండె పో,
ప్రాప్తంబైనది లేశమాత్రమయినన్ బాగంచులో నెంచు సం
తృప్తాత్ముండతిభాగ్యవంతుడెపుడున్; దేవేశ దివ్యత్కృపన్
తృప్తాత్ముంబొనరించి కావుమికనన్ శ్రీ శ్రీనివాస ప్రభూ

(వెలుదండ రామేశ్వరరావు - శ్రీ శ్రీనివాస నివేదనము - పు.21 - 83.ప)

**ముగింపు :**

ఈ విధంగా శతకకవులు తమ శతకాలలో అనేక రకాల భక్తి మరియు సామాజిక ఇతివృత్తాలను స్వీకరించి ఆనాటి పరిస్థితులను ప్రజలకు తెలియ పరచి వారిని చైతన్య పరిచారు.

**ఆధార గ్రంథాలు :**


1. పోకూరి కాశీపత్యవధాని - శ్రీ ధూర్జటి శతకము
2. మొలగర రంగారావు - శ్రీ రాజరాజేశ్వర శతకం
3. దరెగోని శ్రీశైలం - శ్రీ ఉప్పునూతుల కేదారేశ్వర శతకం
4. కుంచకూరి బుచ్చిలింగం - శ్రీ గణనాథ శతకము
5. కర్నాటి భీమ లింగం గౌడ్ -- శ్రీశైల మల్లేశ్వర శతకము
6. ఇమ్మడిజెట్టి చంద్రయ్య - శ్రీ చంద్రమౌళీశ్వర శతకం
7. వెలుదండ సత్యనారాయణ - లింగముధన విజయరామ శతకము
8. కర్నాటి రఘురాములు గౌడ్ - శ్రీరాఘవ శతకం
9. కుంచకూరి బుచ్చిలింగం - కృష్ణ శతకం
10. కర్నాటి భిమలింగం గౌడ్ - శ్రీ మదురా కాశీయాత్ర శతకము
11. కపిలవాయి లింగమూర్తి - తెల్లరాళ్ళపల్లి తిరుమలేశ శతకము
12. ఇమ్మడి జెట్టి చంద్రయ్య - వేంకటేశ్వర శతకం పాలెము
13. వెలుదండ రామేశ్వరరావు - శ్రీ శ్రీనివాస నివేదనము


❖❖❖

Vol. 23 | Spl. Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study



# నాగర్ కర్నూల్ జిల్లా శతక సాహిత్యం - నీతి శతకాల పరిశీలన

- ఆవుల సైదులు

టి.జి.టి తెలుగు ఉపాధ్యాయురాలు.

**శతక పరిచయం :**

"శతేన శతకం ప్రోక్తం" అనగా శతకం అంటే నూరు లేదా అంతకంటే ఎక్కువ పద్యాల గల రచన. సాధారణంగా తెలుగు శతకాలలో 108 పద్యాలు ఉండడం పరిపాటిగా వస్తున్నది. తెలుగు సాహిత్యంలో అజరామరమై, ఆచంద్ర తారార్కంగా దూసుకుపోతున్న పద్య ప్రక్రియల్లో శతకం మొదటి స్థానాన్ని ఆక్రమించింది. శతక పద్యాలు సమాజంలోని పోకడలను తెలిపి విద్యార్థులలో నైతిక, ఆధ్యాత్మిక విలువలు పెంపొందింపజేసి, భావి జీవితానికి వెలుగులు నింపి ఉత్తమ పౌరులుగా తయారు చేస్తాయి. తెలుగు సాహిత్యం శాఖోపశాఖలుగా విస్తరించిన ఒక మహావృక్షం. అలాంటి తెలుగు సాహిత్యంలో పురాణం, ఉదాహరణ, ఇతిహాసం, ప్రబంధం, పదకవిత్వం లాంటి నాటకం, నవల, కథనికా, వ్యాసం, జీవితచరిత్ర, ముత్యాల సరాలు, గజల్, రూబాయిలు, ఖండకావ్యాలు, మినీ కవిత్వం, హైకూలు, నానీలు, పేరడీ లాంటి ప్రక్రియలు తెలుగు సాహిత్యంలో అనేకం వచ్చాయి. తెలుగు సాహిత్యంలో వచ్చిన అనేక సాహిత్య ప్రక్రియలలో "శతకం" విశిష్టమైనది మరియు ప్రత్యేక మైనది. తెలుగులో పన్నెండో శతాబ్దంలో శతకమా విర్భవించినది. ఈ ఎనిమిది వందల సంవత్సరములలో తెలుగు శతకం శాఖోపశాఖలుగా విస్తరిల్లి స్వరూపంలోనూ, స్వభావంలో ఎంతో మార్పు చెందింది. భారతీయ భాషలలో ఎందులోనూ శతక ప్రక్రియ తెలుగు భాషలో వలె బహు ముఖ వికాసం పొందలేదు. నేటికీ మన దేశంలో ఏ మూలనో ఒకచోట శతకం వెలువడుతూనే ఉన్నది.

నాగర్ కర్నూల్ జిల్లా పరిచయం : "సంస్థానాల జిల్లాగా, కరువు జిల్లాగా పేరొందిన మహబూబ్ నగర్ జిల్లాలో కవులకు కళాకారులకు, సాహితివేత్తలకు కొదవలేదు. ప్రాచీన చరిత్ర పుటల్లో ఈ జిల్లాకు ప్రత్యేకమైన స్థానం ఉంది. తెలంగాణ ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 2016 అక్టోబర్ 11 దసరా పండగ రోజున నాగర్ కర్నూల్ జిల్లాను ఏర్పాటు చేసింది. ఈ జిల్లాలో కవులకు, కళాకారులకు, సాహితీ వేత్తలకు కొదవలేదు. శతక సాహిత్యానికి ఈ జిల్లా ఒక పెట్టింది పేరు. శతక సాహిత్యానికి ఈ జిల్లా ఒక తల్లి లాంటిది. ఈ జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు రెండు వందల వరకు శతకాలు వచ్చినట్లు ఒక అంచనా. ఈ జిల్లాలో వచ్చిన శతక సాహిత్యం పైన ఇప్పటివరకు ఎలాంటి పరిశోధనలు జరగలేదు. నాగర్ కర్నూల్ జిల్లా శతక సాహిత్యం పైన లోతైన పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంది.

**నాగర్ కర్నూల్ జిల్లా శతకాలు నైతిక విలువల పరిశీలన**

పండిత పరిశోధకులు శ్రీ డా. కపిలవాయి లింగమూర్తి, శ్రీ వెలుదండ రామేశ్వరరావు, శ్రీ డా. వెలుదండ సత్యనారాయణ, శ్రీ కుంచకూరి బుచ్చిలింగం,

శ్రీ ముత్యాల కృష్ణయ్య, శ్రీ కర్నాటి రఘురాములు గౌడ్ లాంటి వారు పదుల సంఖ్యలో శతకాలు రచించి ఈ సమాజానికి అందించారు. శ్రీ ఇమ్మడిజెట్టి చంద్ర య్య శ్రీ దరేగొని శ్రీశైలం, శ్రీ కర్నాటి భీమలింగం గౌడ్, శ్రీ రాజరత్నం పెరుమాళ్ళు, శ్రీ పెంటమరాజు నరసింగ రావు, శ్రీ సంబరాజు రవిప్రకాష్, ఎం.డి. జహంగీర్, శ్రీ డా.గుడేలి శీనయ్య, శ్రీ డా.వేముల శేఖరయ్య, శ్రీ వేముల కోటయ్య, శ్రీ గోవిందు గోవర్ధన్, శ్రీ తమటం రేణుబాబు గౌడ్, శ్రీ నీరడి జైపాల్, శ్రీ బస్వోజు సుధాకరా చారి, శ్రీ గన్నోజు శ్రీనివాసాచారి, శ్రీ గుండోజు యాదగిరి లాంటి శతక కవులు ఈ జిల్లాలో దాదాపు 50 మంది ఉన్నట్లు, దాదాపు 200 శతకాలు వెలువడినట్లు అంచనా. శతక సాహిత్యం అనేది అపారమైన జ్ఞానాన్ని, సంస్కృతి సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను నిక్షిప్తం చేసుకున్న ఒక అపూర్వ నిధి. నాగర్ కర్నూల్ జిల్లాలో కూడా అపారమైన శతక సాహిత్యం వెలువడింది. ఈ జిల్లాలో వెలువడిన శతకాలను భక్తి నీతి సామాజిక శతకాలని విభజించుకుని చూసినట్లయితే సామాజిక శతకాలు మొదటి స్థానంలో ఉంటాయి. ఆ తర్వాత స్థానాలను నీతి, భక్తి శతకాలు ఆక్రమించాయి. ఈ శతక రచనకు నాటి సాంఘిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులతో పాటు స్వాతంత్ర్యోద్యమ పరిస్థితులు కూడా పునాదులని చెప్పవచ్చు. ఈ జిల్లాలో వెలువడిన కొన్ని నీతి శతకాలలోని కొన్ని అంశాలను ఇక్కడ ప్రస్తావించుకుందాం.

**ఆర్య శతకం (చిత్రపది) - కీ.శే. డా.కపిలవాయి లింగమూర్తి**

కీ.శే. డా.కపిలవాయి లింగమూర్తి గారు ఒక వినూత్న వస్తువును తీసుకొని చిత్రవిచిత్రమైన పదములను ఉపయోగించి పాఠకులకు విస్మయం, ఆనందం కలిగించే విధంగా అద్భుతంగా ఈ ఆర్య శతకం (చిత్రపది) రచించారు. "వికటకవి", "కిటికి" లాంటి పదాలను ఎటువైపు నుండి పలికిన అలాగే వస్తుంది. ఎలాంటి మార్పు ఉండదు. కానీ కొన్ని పదాలలో కొన్ని అక్షరాలను తారుమారు చేస్తే అర్థం మారిపోతుందనడానికి ఈ క్రింది పద్యం సజీవ సాక్ష్యం. ఇది కవి గారి ప్రతిభకు గీటురాయి.

కం. తలక్రిందుగనేబీలను
వెలిగించినయంత విద్య విద్యాయందున్
గలసారమెరుగ కుండిన
విలువేమిటి దానిచేత వినుమా యార్యా !
(లింగమూర్తి కపిలవాయి - ఆర్య శతకం - పు.15 - 21.ప)

తలక్రిందుగ - అనే భాషీయానికి తెలుగులో తారు మారు అనే రూఢిగూడ ఉంది.-బా.దీ అనేవి ఆంగ్లంలో మొదటి మరియు రెండక్షరాలు. ఈ రెండు అక్షరాలు తారుమారైనపుడు B.A.. అనే డిగ్రీ అవుతుంది. దీ-బా. చేస్తే ఈనాటి చదువు చాలావరకు పూర్తి అయినట్లే. విద్యార్థి కష్టపడి ఈ-బా.దీ. లను తారుమారు చేయవచ్చుగాని ఆ ఆంగ్ల విద్యలోని సారమేదో తెలిసికోలేకపోతే తాను దీ-బా. అయినా M.A. అయినా లాభం లేదనియే అర్థం.

ఈ సృష్టికి స్త్రీయే మూలం. "ఇంటికి దీపం ఇల్లాలు", "మాతృదేవోభవ" అను వాక్యాలు ఈ వాక్యాలకు బలాన్ని చేకూర్చుతున్నాయి. స్త్రీని ఆడది ఆడదేయని చులకనగా చూసే ప్రజలకి తన ఈ పద్యంతో సుతిమెత్తంగా చురక లంటించాడు కవి.

కం. ఆడుదియన చులకనగా
జూడకుమాద్యంతమరసి చూడజగతిలో
ఆడుదియె యాది యగుసుమి
వేడబములు కావు కావు వినుమా ఆర్యా!
- (పు.25 - 43.ప)

ఆద్యంతమరసి చూడన్ = తుదమొదలు విచారించి చూడగా అనగా లెస్సగా ఆలోచించగా మొదటి అక్షరం చివరి అక్షరం రెండుకలిసి చూడగా ఈ సృష్టి అంతా అమ్మనుండియే పుట్టింది కాబట్టి దీనికి దేవియే మూలం అని శంక రాచార్యుడు సౌందర్యలహరిలో చెప్పినాడు. దానికి తగినట్లు ఆడుది అనే పదంలో మొదలు తుద రెండు కలిపి చూడగా ఆదియని ఏర్పడి అది సృష్టికంతా స్త్రీయే మొదలు అనేదాన్ని తెలుపుతుంది. కాబట్టి ఎవరైనా స్త్రీని ఆడది ఆడదే అని చులకనగా చూడరాదు.

రావూరి దొరసామిశర్మ గారు ఈ శతకం ఉద్దేశించి "ఆర్య శతకం చిత్రపది యనుట సార్థకము. ప్రతిపద్య

చమత్కృతితో యియ్యది రమణీయము. ప్రాచీన చిత్ర కవిత సాధారణముగా శబ్దాశ్రయము. మీ చిత్ర పది అర్థాశ్రయము. కావున మీరచన అర్థచిత్ర కవితయని వక్కాణింపనగునని నా ఆశయము" అన్నారు. వి.వి.ఎల్ నరసింహారావు గారు ఈ శతకమును ఉద్దేశించి "శబ్ద చమత్కార భరితమైన ఈ శతకం శబ్ద బ్రహ్మ చమత్కారం రుచిచూపుతూ ధ్వని సంప్రదా యం ప్రవర్తించింది. నేటి కాలంలో ఇట్టి శతకం మీరొక్కరే వ్రాయగలరేమో!" అని అన్నారు. పై రెండు అభిప్రాయాలు ఈ శతకం యొక్క గొప్పతనానికి నిదర్శనం. ఈ శతకంలోని ప్రతి పద్యంలో అర్థ చమత్కృతి పాఠకులకు ఆశ్చర్యాన్ని ఆనందాన్ని కలిగిస్తుందని చెప్పటంలో అతిశక్తి లేదు. కంద పద్యాలలో రచన సాగిన ఈ శతకంలో మొత్తం 130 పద్యాలున్నాయి. ఈ శతకాన్ని మొదటిసారి 1978 లో, రెండవసారి 2001లో ముద్రించారు.

**సంబరాజు శతకము - సంబరాజు రవిప్రకాశ రావు**

"సంబరాజు మాట సద్దిమూట" అనేది ఈ శతకం యొక్క మకుటం. ఇందులో మొత్తం 108 ఆటవెలది పద్యాలున్నాయి. కవి ఈ శతకాన్ని 2007 లో ప్రకటించారు. మనిషి కర్తవ్యోన్ముఖంగా సాగడానికి అవసర మయ్యే నీతులతో పాటు, విద్య, వికాసం, వినయం సాధించ డానికి తోడ్పడే అంశాల్ని కూడా కవి ఈ శతకంలో ప్రస్తావించారు.

నవ్వు నాలుగు విధాల చేటు అనేది పాత మాట. కానీ నవ్వడం ఒక భోగం, నవ్వలేక పోవడం ఒక రోగం. మనిషి జీవితంలో నవ్వు ఒక భాగం. ఎల్లప్పుడూ సంతోషంగా నవ్వుతూ కాలం గడిపే వ్యక్తి ఎలాంటి రోగాలు లేకుండా బతుకుతాడు. నవ్వు నాలుగు విధాల మేలు అనేది నేటి మాట అంటు న్నాడు కవి సంబరాజు రవి ప్రకాశరావు గారు.

ఆ.వె. పసిడి మూట కన్న, పండు వెన్నెల కన్న
వెండి కొండ కన్న, వెలుగు కన్న
ముద్దు లొలుకు నవ్వు ముదమొన గూర్చును
సంబరాజు మాట సద్దిమూట
(రవిప్రకాశ రావు సంబరాజు - సంబరాజు శతకము - పు.15 - 19.ప)

"పసుల వన్నె వేరు పాలేక వర్ణమౌ" అన్న వేమన పద్య ప్రభావం ఈ కవిపై ఉన్నట్లు కనిపిస్తుంది. ఎన్ని సిరి సంపదలు ఉన్నా ఆరోగ్యమే అసలైన ఆస్తి అంటూ ఆరోగ్యమే మహాభాగ్యమనే విషయాన్ని ప్రజలందరూ గ్రహించాలంటున్నాడు కవి.

ఆ.వె. ధాన్యరాసికన్న, దాసి జనముకన్న
కన్న బిడ్డకన్న మిన్నయైన
అసలు సిసలు టాస్తి ఆరోగ్యమందురు
సంబరాజు మాట సద్దిమూట - (పు.31 - 99.ప)

ఈ శతకంలోని ప్రతి పద్యం వజ్ర సమానమని చెప్పాలి. సద్ది మూట లాంటి పద్యాలను అందించిన సంబరాజు గారు నిజంగా ధన్యజీవి. నిత్యం స్మరించి, ఆచరించటానికి అవసరమయ్యే "సూక్తిసుధ" ల వంటి పాదాలెన్నో ఈ శతకంలో 3 వ పాదాలలో కన్పిస్తాయి. మచ్చుకు కొన్ని.........

"శ్రద్ధ యొక్కటున్న చదువు సుకరమౌను" - (03. ప) "గురువు మాటనెపుడు గుర్తెర్గి నడువుము" - (14. ప)

"మంచి వాని చెలిమి మరువకు మెప్పుడు" - (21. ప) "బద్ధకమ్ము మనిషి బద్ధ శత్రువు కదా" - (34. ప)

"ఆచరించువాడె ఆదర్శవంతుడు" - (40. ప) "ఓర్పు నేర్పుయున్న ఓటమే లేకుండు" - (60. ప)

"శాంతి లేని బతుకు శాపంబు మనిషిక్" - (66. ప) "సమయపాలనున్న సరియౌను బతుకంత" -(74. ప)

ఈ శతకకర్త ఉపాధ్యాయుడు కనుక విద్య యొక్క ప్రాశస్త్యంతో శతకాన్ని ప్రారంభించటం సముచితంగా ఉంది. ఇందులో విద్య తరువాత ఏకమత్యం, కార్య తత్పరత, పరోపకారం, ఆత్మనిగ్రహం మొదలైన బాలుర యొక్క భావి జీవితానికుపయోగపడే విషయాలు సాధారణమైన శైలిలో సోదా హరణంగా కూర్చబడినవి సరళమైన భాషలో చక్కని నీతులను అందించిన శతకమిది.

**ముద్దు మాట శతకము - ముత్యాల కృష్ణయ్య**

కల్వకుర్తి వేమనగా ప్రసిద్ధి చెందిన ముత్యాల కృష్ణయ్య గారు రచించిన శతకమిది. ఆటవెలది పద్యాలలో రచన సాగిన ఈ శతకంలో మొత్తం 112 పద్యాలున్నాయి. ముదము తోడ వినుము ముద్దు మాట అనేది ఈ శతకం యొక్క మకుటం. కవి గారు ఈ శతకమును 2015 లో ప్రకటించారు.

"గురువు లేని విద్య గుడ్డి విద్య" అన్నారు పెద్దలు. గురువు అనేవాడు పాఠ్యపుస్తకాలలో లేని విష యాలను కూడా బోధించినప్పుడే విద్యార్థి సర్వతో ముఖాభివృద్ధిని సాధిస్తాడు. కాబట్టి ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు విద్యార్థులకు కేవలం పుస్తకాలలోని పాఠాలనే బోధించకుండా చదువులోని సారాన్ని నేర్పమంటున్నాడు కవి శ్రీ ముత్యాల కృష్ణయ్య గారు.

ఆ.వె. పాఠ్య పుస్తకాల పాఠంబు జెప్పిన
బాలు డెదుగ లేడు బడులలోన
చదువులోన వున్న సారంబు నేర్పుము
ముదము తోడ వినుము ముద్దు మాట
(కృష్ణయ్య ముత్యాల - ముద్దు మాట
శతకము - పు.01 - 02.ప)

విద్యార్థులకు మంచి గుణగణాలు నేర్పి, బ్రతుకు తెరువును చూపించి వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు నేడు సమాజంలో విలువ తగ్గిందనే విషయాన్ని కవి ఎంతో హృద్యంగా వర్ణించారు.

ఆ.వె. గుణము నేర్పు గురువు గుర్తింపు లేదాయే
బ్రతుకు నేర్పు గురువు పలుచ బడెను
మంచి గురువు విలువ మట్టిలో గలిపిరి
ముదముతోడ వినుము ముద్దుమాట -
(పు.04 - 20.ప)

గురువు, కులము, మత పిచ్చి, పదవి, ఆప్యాయతలు నశించుట, సజ్జనులు లాంటి మరెన్నో శీర్షికలతో కవి సమాజంలోని సామాజికాంశాలతో ఈ శతకాన్ని రచించారు.

**ముద్దుచెల్లి శతకం - రాజారత్నం పెరుమాళ్లు**

రాజారత్నం పెరుమాళ్లు గారు రచించిన శతకమిది. ఆటవెలది పద్యాలలో రచన సాగిన ఈ శత కంలో మొత్తం 107 పద్యాలున్నాయి. ముద్దుచెల్లి అనేది ఈ శతకం యొక్క మకుటం. ఈ శతకంలో అక్కడక్కడ మకుట నియమము పాటించలేదు. 1995 ప్రక టించిన ఈ శతకమును కవి తన నాన్నగారికి అంకితమిచ్చారు. ఈ శతకం ప్రారంభంలో పితామహుల సంస్మరణం పేరుతో ఆరు ఆటవెలది, ఒక సీస పద్యంలో తన తల్లిదండ్రుల గుణగణాలు కవి తెలిపాడు.

హైందవ సాంప్రదాయంలో ఆడపిల్లను మహాలక్ష్మిగా భావిస్తారు. ఇంట్లో ఆడపిల్ల ఉంటే సిరి సంపదలు కలుగుతాయని నమ్ముతారు. ఇంటికి దీపం ఇల్లాలు అనే సామెతను గుర్తు చేస్తూ ఈ ప్రపంచంలో ఆడపిల్లలే ఇంటి జ్యోతులంటున్నాడు.

ఆ.వె. ఇంటబుట్టిన మగబిడ్డ లెందరున్న
ఆడపిల్లలు లేకున్న యంధకార
బంధు రమ్ముగ నుండునే భవనమైన
ఇంతులే యింటి జ్యోతులు యిలను చెల్లి
(రాజారత్నం పెరుమాళ్లు - ముద్దుచెల్లి
శతకం - పు.01 - 02.ప)

నాణ్యమైన నగలు నాజూకు వస్త్రాల కంటే నాణ్యమైన గుణములు కలిగిన భర్త దొర కడం స్త్రీ యొక్క అదృష్టం అంటున్న కవి మనసును ఈ క్రింది పద్యంలో పరిశీలిద్దాం.

ఆ.వె. నాణ్యమైన నగలు నాజూకువస్త్రాల
కొరకు భర్తనెపుడు కోరబోకు
నగలకంటె గొప్ప నాణ్యమౌశీలుండు
పతిగదొరికెనంతె బాగుచెల్లి - (పు.11 - 60.ప)

ఈ పద్యరచనలో కవి "నగలు లేవటంచు వగజెందుటే గాని... వాస్తవమ్ము నార్ల వారి మాట" అనే పద్యాన్ని అనుకరించటంతో నార్ల వారి ప్రభావం ఈ కవి పై ఉన్నట్లు భావించవచ్చు.

**విశ్వబాల శతకం - రాజరత్నం పెరుమాళ్ళు**

రెవరెండ్ పంజుగుల రాజరత్నం పెరుమాళ్ళు గారు రచించిన శతకమిది. ఆటవెలది పద్యాలతో ప్రజల సాగిన ఈ శతకంలో మొత్తం 101 పద్యాలున్నాయి. "వినుత

వినయశీల విశ్వబాల'' అనేది శతకం యొక్క మకుటం. వనపట్ల సుబ్బయ్య గారి ఆర్థిక సహకారంతో కవి ఈ శతకమును 2017లో ప్రకటించారు. తల్లిదండ్రుల ఆజ్ఞలను పాటించి వారి కీర్తిని నిలిపే విశ్వబాలలకు ఈ శతకాన్ని అంకితం చేశారు.

అసాధ్యమైన పనులను కూడా సుసాధ్యం చేయవచ్చు కానీ విషపూరితమైన మనసు కలిగిన వ్యక్తుల తో కలిసి తిరగడం కష్టమంటున్నాడు కవి.

ఆ.వె. పుట్ట పైనికాళ్ళు బెట్టి నిల్వగవచ్చు
పలుగు రాళ్ళలోన పండవచ్చు
విషపు నరుని యెదుట విహరించ లేమురా!
వినుత వినయశీల విశ్వబాల!
(రాజరత్నం పెరుమాళ్ళు - విశ్వబాల శతకం
- పు.12 -- 22. ప)

తన సంతానానికే కాకుండా తన మనుమడు, ముని మనుమడు కూడా హాయిగా బతకగలిగేలా ఆస్తులు కూడ పెట్టాలనే కోరికనే సమాజంలో అవినీతి బాగా పెరిగి పోవటానికి ప్రధాన కారణం. అవినీతి బాగా పెరిగి పోవటానికి ఆస్తి కారణమమంటూ కవి చెప్పిన ఈ పద్యం మానవ సమాజాన్ని ఆలోచిం పజేసే విధంగా ఉన్నది.

ఆ.వె. ఆస్తి బెరిగె నేని యవసరాలు పెరుగు
అవసరాలు బెంచు నక్రమాలు
అక్రమాల చేత యవినీతి బెరుగురా!
వినుత వినయశీల విశ్వబాల! - (పు.26 - 93.ప)

**ముగింపు :**

ఈ విధంగా నాగర్ కర్నూల్ జిల్లా శతకకవులు తమ శతకాలలో నీతి శతకాలలో అనేక రకాల నైతిక విలువలకు సంబంధించిన ఇతివృత్తాలను, సామాజిక ఇతివృత్తాలను స్వీకరించి ఆనాటి పరిస్థితులను ప్రజలకు తెలియపరచి వారిని చైతన్యపరిచారు.

**ఆధార గ్రంథాలు :**


1. ఆర్య శతకం (చిత్రపది) - కీ.శే. డా. కపిలవాయి లింగమూర్తి
2. సంబరాజు శతకము - సంబరాజు రవిప్రకాశ రావు
3. ముద్దు మాట శతకము - ముత్యాల కృష్ణయ్య
4. ముద్దుచెల్లి శతకం - రాజారత్నం పెరుమాళ్లు
5. విశ్వబాల శతకం - రాజరత్నం పెరుమాళ్ళు


❖❖❖

Vol. 23 | Spl. Issue 01 | January 2026 | BHAVAVEENA | ISSN No. : 2456-4702 | RNI No. APTEL/2003/12253

RNI No. APTEL/2003/12253 | Reffered Journal & Peer Reviewed Journals | ISSN No. 2456-4702

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

# భాస్కర శతకం బోధనా సంబంధ దృష్టాంత నీతి



- ఎస్. పవిత్ర

పరిశోధక విద్యార్థి, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

**వ్యాస సంగ్రహం :**

''హితేన సహితం సాహిత్యం'' అన్న మాటకు సార్థకంగా సాహిత్యలో ప్రాచీనం నుండి ఆధునికం దాకా రచయితలు సమాజ శ్రేయస్సుకై హితాన్ని బోధిస్తూ నీతిని ఆనందాన్ని కలిగించుటకై ఆయా శతకాల పేరిట వైవిధ్య భరితమైన వస్తువులను గ్రహించి శతకాలను రచించారు. తెలుగు సాహిత్య క్షేత్రంలో పండిత పామరజన భేదం లేకుండా ప్రజలందరి నోట పలికించే సాహిత్య ప్రక్రియ శతక ప్రక్రియ. శతాబ్దాలుగా తెలుగు కవులు భక్తి, నీతి, జ్ఞాన వైరాగ్య భావాలకు సంబంధించి ఎన్నో శతకాలను రచించారు. ఇవి మానవులలోని మంచి చెడుల విచక్షణ జ్ఞానాన్ని కలిగిస్తూ ఆధ్యాత్మిక, నైతిక, సామాజిక విలువలను పెంపొందిస్తూ తద్వారా వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుంది. ఇలాంటి అమూల్యమైన విలువలతో కూడి దృష్టాంత నీతిని బోధించిన శతకాల్లో భాస్కర శతకం ఒకటి. ఇందులో దృష్టాంతాలతో నీతిని బోధించిన ప్రత్యేకతని తెలుసుకోవడం ప్రస్తుత వ్యాసం ముఖ్య ఉద్దేశం.

**కీలక పదాలు :**

భాస్కర శతకం, నీతి, నైతిక విలువలు, దృష్టాంత, ప్రక్రియ

**తెలుగులో నీతి శతకం :**

ప్రాచీనం మొదలుకొని నవీనం వరకు పాఠకుల హృదయాలను ఆకట్టుకుంటున్న ప్రక్రియ శతక ప్రక్రియ. ఆంధ్రవాఙ్మయంలో శాఖోపశాఖలుగా వికాసం పొందిన సాహిత్య ప్రక్రియలో శతకానికి ప్రత్యేక స్థానం కలదు. సంస్కృత ప్రక్రియలను అనుసరించి తెలుగులో 12వ శతాబ్దంలో శతకము ఆవిర్భవించింది. కవులు తమ నైపుణ్యంతో పాఠకుల బుద్ధి బలాన్ని మనోవికాసాన్ని పెంచడంతో పాటు సమాజాన్ని సన్మార్గంలో నడిపించడానికి కవులు ప్రత్యేకంగా నీతి శతకాల పేరుతో నైతిక విలువలతో కూడిన సందేశాన్ని అందించారు. వాటిలో వేమనశతకం, నీతిశాస్త్ర ముక్తావళి, సుమతి శతకం, కుమారిశతకం కుమార శతకాలు మొదలైనవి ఉన్నాయి. ఆ కోవలోకి చెందినదే భాస్కర శతకం. మానవీయ విలువలను కాపాడేది నీతి. నీతికి ప్రాముఖ్యతనిస్తూ తెలుగులో నీతి శతక కర్తలు నిజజీవితానికి మరియు సార్వకాలిక సర్వావస్థలకు సంబంధించి పరిస్థితులకు అనుగుణంగా వివిధ రంగాల్లో వచ్చిన మార్పులకు నైతిక విలువలు జోడించి నీతిని బోధించారు. ఇందులో భాగంగా భక్తి, గృహస్థ జీవితం, రాజకీయ ,సంఘ, వైయక్తిక, విద్యార్థి, సజ్జన, దుర్జన మొదలైన అంశాలనుప్రధానంగా చేసుకుని నీతిని బోధించారు. నీతి శతకాలు వస్తు ప్రాధాన్యాన్ని కలిగి ఉండి నీతిని హృదయానికి హత్తుకొనేవిధంగా సుబోధకంగా ఉపదేశించడం వల్ల అవి బహు ప్రాచుర్యం

పొందాయి. ఇవి సూక్తి ప్రధానాలై కంఠస్థం చెయ్యడానికి అనువుగా ఉంటూ ప్రతి ఒక్కరు ఈ పద్యాల్లోని నీతిని అనుభవ పూర్వకంగా గ్రహించడానికి తోడ్పడతాయి.

**శతక కర్త సంక్షిప్త పరిచయం :**

నీతిని బోధిస్తూ దృష్టాంతాలతో పద్య రచన చేసిన మారద వెంకయ్య 1550 - 1600 కాలానికి చెందినవారు. సూర్య భగవానుడి భక్తుడిగా సూర్యుడిని ఆరాధిస్తూ భాస్కరా! అని సంబోధిస్తూ భాస్కరా! మకుటం తో భాస్కర శతకాన్ని తెలుగు సాహిత్యంలో మొదటి దృష్టాంత శతకంగా రచించారు. వీరు భాస్కర శతకంలో చక్కని దుష్టాంతాలతో పురాణేతిహాస కథలతో ముడి పెట్టి చెప్పడం ద్వారా పాఠకులు విజ్ఞానాన్ని వినోదానే కాక మానసిక ఆనందాన్ని పొందేలా శతకాన్ని రూపొందించారు.

**భాస్కర శతకం దృష్టాంతాల సౌందర్యం :**

భాస్కర శతకం ప్రత్యేకత కవి ఒక నీతిని చెప్పి ఊరుకోకుండా దానికి తమ జీవితానుభవాలను దృష్టిలో పెట్టుకుని భూత భవిష్యత్ వర్తమానాలకు సంబంధించి త్రికాల జ్ఞాన సంపన్నుడై శతకం నందు పద్యం లో మొదటి సాగ భాగం విషయాని నీతిని చెప్పి రెండవ భాగం కొసరినటువంటి ఉదాహరణగా దృష్టాంతాలు ప్రయోగించి రచించాడు కవి.

> శ్రీగల భాగ్యశాలిఁగడ్నఁ జేరఁగ వత్తురు తారు దారె దూ
> రాగమన ప్రయాసమున కాదట నోర్చియునైన నిల్వను
> ద్యోగము చేసి; రత్ననిలయుండని కాదె సమస్తవాహినుల
> సాగరుజేరుటెల్ల మునిసన్నుత! మద్గురుమూర్తి! భాస్కరా! (1)

ఓ సూర్యభగవానుడా! సముద్రం విలువైన రత్నాలను కలిగి ఉన్న కారణంగా నదులన్నీ సముద్రంలో కలవటానికి ఉత్సాహం చూపుతాయి. అదేవిధంగా సామాన్య మానవులు తమకు కలిగిన నష్టాలనుంచి బయటపడటం కోసం ధనవంతుని ఆశ్రయిస్తారు. ఇది సృష్టిధర్మం. ఆపదలో ఉన్నప్పుడు ఆ ఆపదను తీర్చగలవానిని ఆశ్రయిస్తే ఉపయోగం ఉంటుంది. అలా కాక మరో ఆపదలో ఉన్నవారిని ఆశ్రయించటం వల్ల ప్రయోజనం ఉండదు. నదులన్నీ సముద్రంలోనే చేరటానికి కారణం సముద్రుడు రత్నాకరుడు కావటమే. అంటే ఎప్పుడైనా సరే మనకంటె అధికస్థాయిలో ఉన్నవారినే ఆశ్రయించాలి. విద్యలో సందేహాలు కలిగినప్పుడు పండితులను ఆశ్రయిస్తే సందేహనివృత్తి లభిస్తుంది. అంతేకాని చదువు రాని అజ్ఞానిని అడగటం వల్ల ఉపయోగం ఉండదని కవి రత్నాకరుడైన సముద్రాన్ని సంపదలు గల ధన వంతులను దృష్టాంతాలుగా ఈ పద్యంలో వివరించాడు.

> కట్టడ దప్పి తాము చెడుకార్యము చేయుచు నుండిరేని దో
> బుట్టిన వారినైన విడిపోవుట కార్యము; దౌర్మదాంధ్యనముం
> దొట్టిన రావణాసురునితో నెడబాసి విభీషణాఖ్యుడా
> పట్టున రాముజేరి చిరపట్టము గట్టుకొనండె భాస్కరా! (27)

చెడుపనులు చేయకూడని పనులు చేసేవాడు స్వయంగా సోదరుడే అయినప్పటికీ వానిని విడిచి పెట్టటం మంచిది. అలా చేయటం వలన తనకు మంచి జరుగుతుంది. ఈ పద్ధతిని అనుసరించే రావణుని సోదరుడయిన విభీషణుడు తన అన్నను విడిచి శ్రీరామునిచే శాశ్వతమైన లంకానగర ఆధిపత్యాన్ని పొందాడు. అరచేతిలోని ఐదు వేళ్లలో ఒక వేలు పాడైతే ఆ వేలిని తొలగించేయాలి. లేకపోతే చెయ్యి తీసేయవలసి వస్తుంది. అలాగే ఒక వంశంలో ఒకరు దుర్మార్గులైతే వారిని త్యజించాలని శాస్త్రం చెబుతోంది. అలా చేయకపోతే ఆ వంశానికే కళంకం ఏర్పడుతుంది. అందుకే చెడునివిడిచి పెట్టకపోవటం వల్ల కష్టాలు కలుగుతాయే కాని ఏ మాత్రం మేలు జరగదని కవి ఈ పద్యంలో వివరించాడు.

> పలుమఱు సజ్జనుండు ప్రియభాషలె పల్కు గఠోర వాక్యముల్
> పలుకడొకానొకప్పుడు నవి పల్కినన్ గీడును గాదు నిక్కమే;

చలువకు వచ్చి మేఘుడొక జాడను దా వడగండ్ల రాల్చినన్
శిలలగు నోటు వేగిరమె శీతలనీరము గాక భాస్కరా! (65)

మేఘాలు నీటిబిందువులను వానగా కురిపిస్తాయి. అయితే చల్లదనం కోసం అప్పుడప్పుడు వడగళ్లను కూడా కురిపించినా అవి వెంటనే చల్లని నీరుగా మారిపోతాయే గాని కఠిన శిలలా ఉండవు. అదే విధంగా మంచివాడు నిరంతరం మంచిమాటలనే పలుకుతాడు. ఒక్కోసారి సమయానుకూలంగా కఠినంగా పలుకుతాడు. అయితే ఆ మాటల వలన మేలు జరుగుతుందే కాని కీడు జరుగదు.

ఎడపక దుర్జనుండొరుల కెంతయున్ గీడొనరించు గాని యే
యెడలను మేలు సేయడొక యించుకయైనను; జీడపుర్వుదా
జెడ దిను నెంతెకాక పుడుసెండు జలంబిడి పెంచ నేర్చునే
పొడవగుచున్న పుష్పఫల భూరుహ మొక్కటినైన భాస్కరా! (20)

చెడు స్వభావం కలిగినవారు ఇతరులకు చెడు చేస్తారు గాని, ఎటువంటి పరిస్థితులలోనూ ఏ మాత్రం మంచి చేయరు. ఇటువంటివారి ప్రవర్తన చీడపురుగును పోలి ఉంటుంది. చీడపురుగు చెట్టుకు ఎటువంటి మేలు అంటే కనీసం పుడిసెడు నీరైనా పోయకపోగా పూలు, పండ్లతో నిండుగా ఉండి, చక్కగా పెరుగుతున్న చెట్లను పాడుచేస్తుంది.

తెలియని కార్యమెల్ల గడతేర్చుటకొక్క వివేకి జేకొనన్
వలయునటైన దిద్దకొనవచ్చు ప్రయోజన మాంద్యమేమియుం
గలుగదు ఫాలమందు దిలకంబిడునప్పుడు చేతనద్దమున్
గలిగిన జక్క జేసికొను గాదె నరుండది చూచి భాస్కరా! (52)

**భావం :**

మనుష్యులు నుదుటి మీద తిలకం పెట్టుకునేటప్పుడు చేతిలో అద్దం ఉంటే అందులో చూసుకుంటూ చక్కగా పద్ధతిగా పెట్టుకోవచ్చు. అదేవిధంగా ఏదైనా తనకు తెలియని పనిని చేయవలసివచ్చినప్పుడు ఆ పనిలో నేర్పరితనం ఉన్నవారి సహాయం తీసుకుంటే ఆపనిని తప్పులు లేకుండా ఆలస్యం కాకుండా పూర్తిచేసుకోవచ్చును. ఏదైనా విషయం తెలియకపోవటంలో దోషం లేదు. కాని తెలియకపోయిన దానిని గురించి ఇతరులను అడిగి తెలుసుకోకపోవటమే తప్పు. చేతిలో అద్దం ఉంటే తిలకం దిద్దుకోవటం ఎంత సులభమో అదే విధంగా తెలియని విషయాలను అడిగి తెలుసుకోవాలని కవి ఈ పద్యంలో వివరించాడు.

చదువది యెంత గల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణసంయుతులెవ్వరు మెచ్చ రెచ్చటం
బదనుగ మంచికూర నలపాకము చేసిననైన నందు నిం
పొదవెడు నుప్పు లేక రుచిపుట్టగ నేర్చునటయ్య భాస్కరా! (42)

ఒక మనిషి ఎంత విద్వాంసుడైనప్పటికీ విద్యలోని సారాన్ని కొద్దిగానైనా గ్రహించకపోతే అటువంటి విద్య ఎందుకూ పనికిరాదు. ఆ విద్యను పండితులైనవారెవ్వరూ మెచ్చుకోరు. నలమహారాజులాగ ఎంత బాగా వంట చేసినప్పటికీ అందులో ఉప్పు వేయకపోతే ఆ కూరకు రుచి కలగదు. చేసే పని సక్రమంగా ఉండాలి. అప్పుడే దానికి పండితులనుంచి మేధావుల నుంచి తగిన గుర్తింపు వస్తుంది. అంతేకాని పనిని మొక్కుబడిగా చేయటం వల్ల దానికి గుర్తింపు రాదు అని కవి ఈ పద్యంలో వివరించాడు.

అడిగనయట్టి యాచకుల ఆశలెరుంగక లోభ వర్తియై
కడపిన ధర్మదేవత ఒకానొకయప్పుడు నీదు వానికె
య్యెడల అదెట్లు పాలు తమకిచ్చునె యచ్చనుట నైన లేగలన్

కడువగ నీనిచో కెరలి గోవులు తన్నును గాక : భాస్కరా!

దూడలను తాగనియ్యకుండా మొత్తం పాలు తీసకోవాలని సిద్ధపడితే ఆవులు పాలియ్యవు సరే కదా తంతాయి. అలాగే ఏదో యిస్తాని ఆశతో వచ్చి చేయి చాచి అడిగే వారికి లోభితనముతో పొమ్మంటే ధర్మదేవత ఆ లోభికి ధనం ఎప్పుడూ రాకుండా చేస్తుంది. అడిగిన వారికి ఎంతో కొత యిస్తూ ఉంటే ధనం ఏదో విధంగా వస్తూ ఉంటుంది. కాబట్టి యాచించే వారిని చులకనగా చూచి 'లేదుపో' అని అనకూడదు. పెట్టే కొద్ది మనకు సంపద కలుగుతుందని అని కవి దాన నీతి గురించి వివరించారు.

అంగన నమ్మరాదు తన యంకెకు రాని మహాబలాఢ్యు వే
భంగుల మాయలొడ్డి చెఱుపం దల పెట్టు! వివేకియైన సా
రంగధరుం బదంబులు కరంబులు గోయఁగ జేసటఁ దొల్లి చి
త్రాంగి యనేకముల్ నుడువరాని కుయుక్తులు పన్ని భాస్కరా! [2]

ఈ పద్యంలో అంగనను నమ్మరాదని' శతక కర్త చిత్రాంగి గాథను దృష్టాంతముగా పేర్కొన్నాడు. 'చాళుక్య రాజు రాజరాజనరేంద్రుని భార్య చిత్రాంగీ ఆమె సవతి పుత్రుడగు సారంగధరుని ప్రేమించుట, సారంగధరుడామెను తిరస్కరించుట చిత్రాంగి మరొక కారణము చూపి సారంగధరుని కాలుచేతులు నరికించింది అనే గాథ ఒకటి తెలుగు దేశంలో బహుప్రచారము పొందింది. ఈ విధంగా చారిత్రక పౌరాణీతిహాసాలలోని దృష్టాంతాలను ప్రయోగించడం ద్వారా ఈ శతకం ప్రత్యేకతను సంతరించుకుని తొలి దృష్టాంతశతకంగా ప్రసిద్ధి పొందింది. చిత్రాంగి వలన సారంగధరుడు నిష్కారణంగా శిక్షను అనుభవించడం, దశరథుడు కైకేయి దుర్బోధవలన శ్రీరాముని అడవులకు పంపి మానసిక వ్యథతో మరణించడం మొదలైన చారిత్రక పౌరాణీతిహాసాలలోని సంఘటనలు సందర్భానుసారంగా చెప్పడం వలన దృష్టాంతాలు పాఠకులను ప్రత్యేకంగా ఆకట్టుకుంటుంది

**ముగింపు :**

మారద వెంకయ్య గ్రహించిన నీతులలో అధికంగా స్త్రీల చిత్త వృత్తి సజ్జన దుర్జన లక్షణాలు సిరి సంపదలు మానవుల మనసత్త్వములకు సంబంధించినవి. భర్తృహరి లాంటి ప్రాచీన కవులు కూడా ఈ విధానాన్నే అనుసరించారు. రాజుల లక్షణాలను వివరించి వారు ప్రజ్ఞావంతులై సత్పరిపాలకులై ఉండాలని రాజ్యరక్షణార్థమై నిరంతరం కృషిచేయడం శత్రువులను వేయి కన్నులతో కనిపెట్టుకోని ఉడడం మొదలగు రాజనీతులను ఉపదేశించిన మారద వెంకయ్య నీతిబోధలు సార్వకాలికమైన సత్యాలుగా గ్రహించాలి.భాస్కర శతకంలో విద్యా ప్రాముఖ్యత, దాతృత్వం సామాజిక విలువలు,ఆచరణాత్మకత, వ్యక్తిత్వ నిర్మాణం, సార్వజనీనతతో కూడిన అంశాలను ప్రధానంగా బోధిస్తుంది. ఈ నీతినైనా ఊరికే చెప్పకుండా మన కళ్ళముందు కనిపించే ప్రకృతి దృష్టాంతాలతో చెప్పడం వల్ల సామాన్యుడికి చేరువయ్యింది. ఇలా దృష్టాంతాలు ప్రయోగించి నీతిని బోధించడం వల్ల పాఠకులు కవి చెప్పదలచుకున్న విషయం సులభంగా గ్రహిస్తారు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. గోపాలకృష్ణారావు, కే.ఆంధ్ర శతక సాహిత్యం. హైదరాబాదు, ప్రతిభ ప్రింటర్స్,1976.
2. వెంకయ్య, మారద. భాస్కర శతకము. రాయలు అండ్ కో బుక్ సెల్లెర్స్, కడప 1954.
3. భాస్కర రావు, టి.చంద్రాలోకసమున్మేషనము. శ్రీపతి ప్రెస్, కాకినాడ, 1973.

❖❖❖

RNI No. APTEL/2003/12253

# సంపాదకుని పరిచయం



## ఎం. వేణుగోపాల శర్మ

జననం : 14 మార్చి 1968

తల్లిదండ్రులు : జయలక్ష్మి, హనుమండ్లు శర్మ

జీవన సహచరి : అనుపమ

కుమారులు : సుచిత్, తుషార్

విద్యాభ్యాసం

పాఠశాల విద్య : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
మహమ్మద్ నగర్, కామారెడ్డి జిల్లా.

స్నాతక విద్య : జీ.వీ.యస్. జూనియర్ కళాశాల, కామారెడ్డి.
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కామారెడ్డి.

స్నాతకోత్తర విద్య : ఉస్మానియా విశ్వవిద్యాలయం.

పరిశోధన : ఎం.ఫిల్ (అంశము - నిజామాబాద్ జిల్లా అవధాన సాహిత్యము)

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా శతక సాహిత్యము - సామాజిక అంశముల వ్యక్తీకరణ
భారతీయ ఇంజనీరింగ్ సైన్స్ & టెక్నాలజీ ఇన్నోవేషన్ విశ్వవిద్యాలయం, సత్యసాయి జిల్లా ఆంధ్ర ప్రదేశ్.